సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 18
సంచిక: 159
శనివారం 30-8-2025
SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే
నాకు అసలైన పండుగ రోజు'

20 YEARS BETTER THAN EVER

CYBERCITY BUILDERS & DEVELOPERS PVT. LTD.

cybercity.in

STONE RIDGE BY CYBERCITY

HITEC City - Green Hills Road



WHERE EVERY DAY IS RESORT LIVING

Crafted for those who seek balance, leisure, and togetherness – uniquely crafted amenities turn into extraordinary experiences everyday.

KEY HIGHLIGHTS

3/4 BHK
1650 TO 3805 SQ. FT.

6 Towers
(2 PREMIUM TOWERS)

25 & 27
FLOORS

66000
SQ. FT. CLUBHOUSE

PRICE STARTS FROM ₹1.36* CRORES

LAUNCH OFFER

INTEREST HOLIDAY ON


PRE EMI

TILL HANDOVER


Pay Just 10% to Book

*LIMITED PERIOD OFFER


*T&C Apply




MOON GARDEN
Lit by the moon, designed for peace




LOUNGE PODS
Calm, cozy corners for effortless pauses




NATURE'S CIRCLE LOUNGE
For an evening glow of warmth & bonding



LEARNING PAVILION
Where curiosity finds its calm



BOULDERS TRAIL
A winding path of adventure & calm



OUTDOOR LOUNGE
Enjoy the golden hours with skyline views

*Artistic Impression

Scan QR for Location

Site Address : Near HITEC City - Green Hills Road, Moosapet, Hyderabad - 500018

Corporate Office : Plot No. 55, 4th floor, Sathsurya Complex, Extended Jubilee Hills, Road No. 36, Madhapur, Hyderabad - 500033

info@cybercity.in | 8801 00 0033

IGBC | Lifetime Member CREDAI HYDERABAD | Member of NAREDCO TELANGANA | Architect Hafeez Contractor

TG RERA Reg No.: P02200009747 / P02200009748
GHMC Building Permit No.: 5273/GHMC/KPL/2025-BP


'ప్రజల జీవన ప్రమాణాలు ఇంకా మెరుగు పడాలి. అందుకు అధికారులు నిబద్ధత, పారదర్శకత, కార్యదీక్షతో పనిచేయాలి.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 159

శనివారం 30-8-2025



జీడీపీ జిగేల్

జూన్ త్రైమాసికంలో అంచనాలను మించి 7.8 శాతం వృద్ధి

- 13లో



హర్మన్‌ప్రీత్ 'హ్యాట్రిక్'

ఆసియా కప్ హాకీ టోర్నీ తొలి మ్యాచ్‌లో చైనాపై గెలిచిన భారత్

- 13లో

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



కలిసి నడుద్దాం.. బలపడదాం..

'జపాన్ టెక్నాలజీ – ఇండియన్ టాలెంట్.. విన్నింగ్ కాంబినేషన్' అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు.

- వివరాలు 6లో



రాహుల్ క్షమాపణ చెప్పాలి

కాంగ్రెస్ నేతలు మోదీ తల్లిని అవమానించారని, దీనిపై రాహుల్‌కి సిగ్గుంటే క్షమాపణ చెప్పాలని అమిత్ షా డిమాండ్ చేశారు.

- వివరాలు 6లో



ఇగో పెంచిన పగ

ట్రంప్ భారత్‌పై మితిమీరిన ప్రతీకార ధోరణి ప్రదర్శిస్తున్నారు. పాక్ విషయంలో భారత్ వైఖరిపై ప్రతీకార జ్వాలతో రగిలిపోతున్నారు.

- వివరాలు 6లో



అధ్యక్ష బాధ్యతలకు సిద్ధం: వాన్స్

అనుకోని పరిస్థితులు ఎదురైతే, అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధమని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తెలిపారు.

- వివరాలు 6లో

కాళేశ్వరమే 'ఎజెండా'!

నేటి నుంచి అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు

కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై చర్చకు కాంగ్రెస్ వ్యూహం

- జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికతో బీఆర్‌ఎస్‌పై దాడికి సన్నద్ధం
- అసెంబ్లీలో చర్చ ద్వారా విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం
- కమిషన్ విచారణపై పీపీటీకి చాన్స్ ఇవ్వాలంటున్న బీఆర్‌ఎస్
- నివేదికను అడ్డం పెట్టుకొని బురదజల్లే ప్రయత్నమంటూ ఆరోపణ
- సీబీఐ విచారణకు డిమాండ్ చేయనున్న బీజేపీ
- ఈ సమావేశాల్లోనే అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ ఎన్నిక
- నాలుగు రోజులపాటు సమావేశాలు జరిగే అవకాశం



సాక్షి, హైదరాబాద్

అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. సభలో వ్యవహరించాల్సిన తీరుపై అధికార కాంగ్రెస్‌తోపాటు ప్రతిపక్ష బీఆర్‌ఎస్, బీజేపీ వ్యూహ, ప్రతివ్యూహాలతో సిద్ధమయ్యాయి. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టడంపై ప్రభుత్వం ప్రధానంగా దృష్టి కేంద్రీకరించింది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, గత బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని విమర్శల దాడికి అధికార పార్టీ సిద్ధమవుతోంది. దీనిపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. మరోవైపు కాళేశ్వరం ప్రాజెక్టుపై అధికార పక్షం నుంచి ఎదురయ్యే విమర్శల దాడిని తిప్పికొట్టేందుకు బీఆర్‌ఎస్ కసరత్తు చేస్తోంది. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ (పీపీటీ) ద్వారా ప్రాజెక్టు గురించి పూర్తిగా వివరించేందుకు అవకాశం ఇవ్వాలని పట్టుబట్టనుందని తెలిసింది. ఇంకోవైపు కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతిపై విచారణను సీబీఐకి అప్పగించాలని బీజేపీ డిమాండ్ చేసే అవకాశముంది.

నాలుగు రోజులపాటు సమావేశాలు?

శనివారం నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ ఉభయ సభల సమావేశాలు నాలుగు రోజులపాటు కొనసాగే అవకాశమున్నట్లు సమాచారం. తొలిరోజు జూబ్లీహిల్స్ నియోజకవర్గ దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు సంతాపం తెలిపిన అనంతరం అసెంబ్లీ వాయిదా పడనుంది. అనంతరం శాసనసభ స్పీకర్ ప్రసాద్ కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అధ్యక్షతన వేర్వేరుగా బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) సమావేశాలు జరుగుతాయి. స్పీకర్ అధ్యక్షతన జరిగే బీఏసీ భేటీలో అసెంబ్లీ సమావేశాలు జరిగే తేదీలు, రోజువారీ ఎజెండాను ఖరారు చేయనున్నారు. పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై చర్చ, బీసీ రిజర్వేషన్లు,

మిగతా 10వ పేజీలో ▶

కాళేశ్వరం నివేదికపై మళ్లీ హైకోర్టుకు!

- మధ్యంతర అప్లికేషన్ దాఖలు చేసే యోచనలో బీఆర్‌ఎస్
- అసెంబ్లీలో కాళేశ్వరంపై చర్చకు కేసీఆర్ హాజరుపై సందిగ్ధం
- ఎర్రవల్లి నివాసంలో కేసీఆర్‌తో మాజీ మంత్రి హరీశ్‌రావు భేటీ
- సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం కేవియట్ పిటిషన్ వేసినట్లు సమాచారం

- వివరాలు 10లో

బైంసా మండలంలో నీటమునిగిన సోయా పంట



చేలన్నీ చెరువులే..

- వర్షాలు, వరదలతో 2.50 లక్షల ఎకరాల్లో పంట నష్టం
- వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా
- కామారెడ్డి, మెదక్, తదితర జిల్లాల్లో పంటల మునక
- పొలాల్లో ఇసుక మేటలు.. వ్యవసాయ మంత్రి తుమ్మల సమీక్ష
- అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశం

సాక్షి, హైదరాబాద్/సాక్షి, నెట్‌వర్క్: రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా దాదాపు 2.50 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ ప్రాథమికంగా అంచనా వేసింది. అత్యధికంగా కామారెడ్డి జిల్లాలో లక్ష ఎకరాల వరకు నష్టం వాటిల్లగా, మెదక్, నిజామాబాద్, భూపాలపల్లి, సిద్దిపేట, సంగారెడ్డి, మంచిర్యాల, పెద్దపల్లి, నల్లగొండ, సూర్యాపేట తదితర జిల్లాల్లో జరిగిన నష్టంపై ప్రాథమిక వివరాలను అధికారులు ఇప్పటికే ప్రభుత్వానికి పంపించారు.

కామారెడ్డి, మెదక్‌లో అపార నష్టం

క్షేత్రస్థాయి నుంచి అందిన సమాచారం ప్రకారం..ముఖ్యంగా కామారెడ్డి జిల్లాలో వేలాది ఎకరాల్లో పంటలు నీట మునగడం, ఇసుక మేటలు వేయడంతో రైతులకు కోలుకోలేని దెబ్బ తగిలింది. ఎల్లారెడ్డి నియోజక వర్గంలోని లింగంపేట, నాగిరెడ్డిపేట, గాంధారి, సదాశివనగర్, తాడ్వాయి, ఎల్లారెడ్డి, రామారెడ్డి మండలాల్లో పంటలు దెబ్బతిన్నాయి. అలాగే జుక్కల్ నియోజక వర్గంలోని పిట్లం, పెద్దకొడప్‌గల్, మహ్మద్ నగర్, నిజాంసాగర్, మద్నూర్, బిచ్కుంద, జుక్కల్ మండలాల్లో వందలాది ఎకరాల్లో పంటలు నాశనమయ్యాయి. ఇక కామారెడ్డి నియోజక వర్గంలోని కామారెడ్డి, భిక్కనూరు, బీబీపేట, దోమకొండ, మాచారెడ్డి, పాల్వంచ, రాజంపేట మండలాల్లో, అలాగే బాన్సువాడలో పంటలు నీట మునిగాయి. మెదక్ జిల్లాలో ఇసుక మేటలు వేసి పంట చేతికందకుండా పోయింది. భారీగా వరద నీరు చేరడంతో పంట చేనులు

మిగతా 2వ పేజీలో ▶

కోలుకోలేని దెబ్బ

వరదలతో కామారెడ్డి, మెదక్ జిల్లాలో భారీ నష్టం

- వివరాలు 2లో



వీకెండ్ ఓటీటీ

బోలెడన్ని ఓటీటీలు.. ఎన్నో వెబ్ సిరీస్‌లు, సినిమాలు.. ఈ వీకెండ్ ఏం చూడాలని డౌటా.. అయితే.. వీటిపై ఓ లుక్కేయండి..



మారీశన్

- ఫాహద్ ఫాజిల్, వడివేలు ప్రధాన పాత్రల్లో నటించిన తమిళ సినిమా 'మారీశన్'. సుధీష్ శంకర్ దర్శకత్వంలో థ్రిల్లర్ డ్రామాగా రూపొందింది. నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతూ, డిజిటల్ వ్యూయర్స్‌ని ఆకట్టుకుంటోంది.



సార్, మేడమ్

- విజయ్ సేతుపతి, నిత్యామీనన్ జంటగా నటించిన తమిళ చిత్రం 'తలైవన్-తలైవి'. తెలుగులో 'సార్ మేడమ్' పేరుతో విడుదలైంది. అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ అవుతోన్న ఈ మూవీ వీక్షకులను అలరిస్తోంది.



'మా'

- కాజోల్, ఇంద్రనీల్ సేన్ గుప్తా, రోనిత్‌రాయ్, ఖేరిన్ శర్మలు ప్రధాన పాత్రల్లో నటించిన హారర్ చిత్రం 'మా'. విశాల్ ఫ్యూరియా దర్శకత్వం వహించారు. ప్రస్తుతం ఈ హిందీ చిత్రం నెట్‌ఫ్లిక్స్ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో హిందీ భాషలో స్ట్రీమింగ్ అవుతోంది. హారర్ మూవీ అయినప్పటికీ ఎమోషనల్ స్టోరీ కావడంతో వీక్షకుల నుంచి మంచి స్పందన దక్కుతోంది.

నీటి మళ్లింపుపై ఏపీని నియంత్రించండి

- కృష్ణా జలాలను ఏపీ ఇతర బేసిన్లకు తరలిస్తోంది
- దానిని అడ్డుకొనేలా కేఆర్‌ఎంబీకి ఉత్తర్వులు ఇవ్వండి
- బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ఎదుట తెలంగాణ వాదన

- వివరాలు 3లో

ఒత్తిడి పెంచే వ్యూహం!

- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% కోటాపై సర్కారు దృష్టి
- అసెంబ్లీ ముందుకు పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లు?
- శాసనసభ ద్వారా బిల్లును గవర్నర్‌కు పంపే ప్రణాళిక

10లో

ఫేషియల్ రికగ్నిషన్ హాజరు..

- విద్యా సంస్థల్లో ఈ విధానాన్ని తప్పనిసరి చేయాలి..
- వృత్తి విద్యా కాలేజీలకు ఇది మరీ అవసరం
- విద్యార్థులతోపాటు అధ్యాపకులకూ ఇదే రూలు

ఒకే విభాగం కిందికి విద్యాసంస్థల్లోని నిర్మాణ పనులు	గ్రీన్ చానల్ ద్వారా మధ్యాహ్న భోజన బిల్లుల చెల్లింపు	విద్యాసంస్థల్లో క్రీడలకు ప్రాధాన్యమివ్వండి	విద్యాశాఖ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



విద్యాశాఖపై సమీక్షలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: విద్యా సంస్థల్లో ఫేషియల్ రికగ్నిషన్ హాజరు విధానాన్ని తప్పనిసరి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వృత్తి విద్యా కోర్సులు బోధించే కాలేజీల్లో విద్యార్థులు, బోధనా సిబ్బందికి ఇది అవసరమని తెలిపారు. హైదరాబాద్‌లోని ఐసీసీసీలో విద్యాశాఖపై సీఎం శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాఠశాలల నుంచి విశ్వవిద్యాలయాల వరకు మెరుగైన బోధన సాగాలని సూచించారు. ఫేషియల్ రికగ్నిషన్ హాజరు వల్ల విద్యార్థుల హాజరు శాతం మెరుగుపడుతుందని అన్నారు. విద్యాశాఖ పరిధిలో అదనపు గదులు, వంట గదులు, మరుగుదొడ్లు, ప్రహరీల నిర్మాణ పనులను వేర్వేరు విభాగాలు చేపట్టడం సరికాదని.. నిర్మాణాల నాణ్యత, పర్యవేక్షణ, నిధుల మంజూరు ఒకే విభాగం కింద ఉంటే జవాబుదారీతనం పెరుగుతుందని పేర్కొన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణాన్ని పర్యవేక్షిస్తున్న విద్య, సంక్షేమ వసతుల అభివృద్ధి సంస్థ పరిధిలో రాష్ట్రంలోని అన్ని విద్యా సంస్థల నిర్మాణాలు కొనసాగాలని ఆదేశించారు. ఈ సంస్థకు అవసరమైన ఇంజనీరింగ్, ఇతర సిబ్బందిని

మిగతా 3వ పేజీలో ▶



చేలో ఉండాల్సిన రైతు క్యూలో..

సాగు పనుల్లో తలమునకలై ఉండాల్సిన రైతులు.. బస్తాడు యూరియా కోసం రైతువేదికలు, పీఏసీఎస్‌ల వద్ద పడిగాపులు కాస్తున్నారు. మెదక్ జిల్లా గవ్వలపల్లి ఆగ్రోస్ కేంద్రానికియూరియా వచ్చిందని తెలుసుకున్న రైతులు శుక్రవారం ఉదయమే అక్కడకు చేరుకుని అరకిలోమీటరు మేర బారులుతీరారు.

కనెక్ట్.. యూకే

స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంతో తెలుగు రాష్ట్రాలకు అవకాశాలు

- ఫార్మా, టెక్నాలజీ రంగాల్లో తెలంగాణ ఇప్పటికే ముందుంది
- ఆర్ అండ్ డీ, ఇన్నోవేషన్, ఏఐలో కొత్త పెట్టుబడులొస్తాయి
- డిఫెన్స్, ఏరోస్పేస్, విద్య, టెక్నాలజీ రంగాలపై యూకే ఫోకస్
- ఏపీలో సీఫుడ్, టెక్స్‌టైల్స్, వ్యవసాయ ఉత్పత్తులకు ప్రాధాన్యం
- ప్రాసెస్డ్ ఫుడ్ రంగం కీలకం.. దీన్లో చాలా అవకాశాలొస్తాయి
- వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడిస్తేనే యూకే మార్కెట్లోకి
- ఇరుదేశాల్లోని సున్నిత రంగాలు దెబ్బతినకుండా తగిన జాగ్రత్తలు


'సాక్షి'తో యూకే డిప్యూటీ హైకమిషనర్ గారెత్ విన్ ఓవెన్

- వివరాలు 10లో





దీంట్లో కూడా ఈసీ పాత్ర ఉందంటారా!



పదిలో ఒకరే!

ఓపెన్ జెన్-ఏఐ నిపుణులకు భారీ కొరత

- 2026 నాటికి సరఫరా అంతరం 53%
- దీంతో భారీగా పెరుగుతున్న వేతనాలు
- సీనియర్ టెకీలకు ప్రీమియం జీతాలు!

- వివరాలు 14లో

ఆర్టీసీ ఆదాయానికి టి'కట్'

- టికెట్లు ఇవ్వకుండా చార్జీ డబ్బు స్వాహా చేస్తున్న ఎలక్ట్రిక్ బస్సుల డ్రైవర్లు
- అందినకాడికి దండుకునే పనిలో అద్దె బస్సుల డ్రైవర్లు
- ఉద్యోగం పోయినా పరవాలేదన్న ధీమాతో సొమ్ము స్వాహా
- పురుషులకూ జీరో టికెట్లిచ్చి దోపిడీ చేస్తున్న ఔట్‌సోర్సింగ్ కండక్టర్లు
- తనిఖీ బృందాల సంఖ్య పెంచిన ఆర్టీసీ



సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీలో అద్దె బస్సులు నిర్వహిస్తున్న ప్రైవేటు సంస్థల డ్రైవర్లు కొందరు సంస్థ ఆదాయానికి గండి కొడుతున్నారు. ప్రయాణికుల నుంచి టికెట్ల డబ్బు వసూలు చేసి, వారికి టికెట్లు ఇవ్వకుండా ఆ సొమ్మును జేబులో వేసుకుంటున్నారు. ఇలాంటి ఘటనలు ఇటీవల పెరుగుతుండటంతో ఏం చేయాలో పాలుపోక ఆర్టీసీ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. తనిఖీ బృందాలను పెంచి విస్తృతంగా చెక్ చేయిస్తున్నారు. రాష్ట్ర సరిహద్దు దాటాక కొందరు డ్రైవర్లు ఈ తరహా దందా చేస్తుండటంతో అంతర్‌రాష్ట్ర తనిఖీ బృందాలను కూడా రంగంలోకి దింపారు.

ఉద్యోగం.. పోతే పోతుంది

ఆర్టీసీలో ఇటీవల అద్దె బస్సుల సంఖ్య భారీగా పెరిగింది. ప్రైవేటు సంస్థల నుంచి బస్సులను అద్దెకు తీసుకుని కి.మీ.కు నిర్ధారిత మొత్తాన్ని చెల్లిస్తోంది. ఈ బస్సుల్లో డ్రైవర్లను బస్సు యజమానులే ఏర్పాటు చేసుకోవాలి. ప్రస్తుతం 35 శాతం బస్సులు ఇవే ఉన్నాయి. ఎలక్ట్రిక్ బస్సుల సంఖ్య కూడా పెరిగింది. కేంద్ర ప్రభుత్వం వీటికి రాయితీ ఇస్తూ టెండర్లు పిలిచి బస్సులు కేటాయిస్తోంది. ఆ టెండర్ దక్కించుకునే బడా సంస్థలు బస్సులను ఆర్టీసీకి అద్దెకిస్తున్నాయి. వీటి డ్రైవర్లు ఇప్పుడు ఆర్టీసీకి రావాల్సిన

మిగతా 3వ పేజీలో ▶

ఇటీవలి ఘటనలు కొన్ని..

- సూర్యాపేట నుంచి హైదరాబాద్‌కు వస్తున్న ఎలక్ట్రిక్ ఎక్స్‌ప్రెస్ బస్సును చెక్ చేయగా.. ముగ్గురు ప్రయాణికుల వద్ద టికెట్లు లేకపోవటంతో పట్టుకున్నారు. తమ నుంచి డ్రైవర్ డబ్బులు తీసుకుని టికెట్లు ఇవ్వలేదని వారు చెప్పారు. విచారణలో నిజమని తేలటంతో ఆ డ్రైవర్‌ను విధుల నుంచి తొలగించారు.
- హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్తున్న లహరి స్లీపర్ బస్సులో ఇద్దరు ప్రయాణికులకు టికెట్లు జారీ చేయకుండా డ్రైవర్ ఆ మొత్తాన్ని జేబులో వేసుకున్నాడు. తనిఖీలో పట్టుబడటంతో డ్రైవర్‌పై చర్యలు తీసుకున్నారు.
- నిజామాబాద్ నుంచి మెదక్ మీదుగా హైదరాబాద్ వస్తున్న ఎలక్ట్రిక్ బస్సును నర్సాపూర్ వద్ద తనిఖీ చేయగా టికెట్ లేని ప్రయాణికులు దొరికారు. తమ నుంచి డ్రైవర్ చార్జీ వసూలు చేసి టికెట్‌లు ఇవ్వలేదని వారు చెప్పారు. ఇతర ప్రయాణికులు కూడా అది నిజమేనని నిర్ధారించటంతో డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు.


నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలంలో మొక్కజొన్న పంటను ముంచిన గోదావరి వరద


కామారెడ్డి జిల్లా పెద్దవాగు ఉగ్రరూపంతో నాగారం వద్ద కొట్టుకుపోయిన కాసులకత్త వంతెన


పోచారం ప్రాజెక్టు అలుగు సపోర్ట్ వాల్‌పై ఇసుక బస్తాలను వేస్తున్న దృశ్యం


కామారెడ్డిలోని జీఆర్ కాలనీలో తడిసిముద్దయిన సామగ్రిని బయట ఉంచిన బాధితులు

చేలన్నీ చెరువులే..!

▶ మొదటి పేజీ తరువాయి

చెరువులను తలపిస్తున్నాయి. దీంతో అన్నదాతలు కన్నీరు మున్నీరవుతున్నారు. ప్రధానంగా వరి, పత్తి, చెరుకు పంటలకు నష్టం వాటిల్లింది. నార్సింగి జాతీయ రహదారి పక్కన ఉన్న గన్నేరు వాగుకు వరద పోటెత్తడంతో పొలాల్లో ఇసుక మేటలు ఏర్పడ్డాయి. దీంతో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. నిర్మల్ జిల్లా భైంసా మండలం సిరాల ప్రాజెక్టు అలుగు వరదతో సిరాల, దేగాం గ్రామాల్లో పత్తి, సోయా పంటలు నీటమునిగాయి. శ్రీరాంసాగర్ అవుట్ ఫ్లో వరద కారణంగా లక్ష్మణచాంద, ఖానాపూర్, దస్తురాబాద్ మండలాల్లో పంటలకు నష్టం వాటిల్లింది.

మండలాల వారీగా వివరాలు సేకరించండి: మంత్రి

శుక్రవారం అధికారులతో సమావేశమైన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మండలాల వారీగా జరిగిన నష్టం వివరాలను సేకరించి, సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ప్రస్తుతం వర్షాలు తగ్గుముఖం పట్టాయని, అధికారులు బృందాలుగా ఏర్పడి క్షేత్రస్థాయిలో పర్యటించి, పంటనష్టంపై సమగ్ర నివేదిక తయారుచేయాలని సూచించారు. ఈ సందర్భంగా వరద ప్రభావిత ప్రాంతాల జిల్లా కలెక్టర్లతో మాట్లాడారు. గోదావరి వరద ప్రవాహ ఉధృతి పెరగడంతో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడం జిల్లా కలెక్టర్లను అప్రమత్తం చేశారు. జిల్లాల్లోని రిజర్వాయర్లు, నీటి ప్రాజెక్టులపై ఆరా తీశారు. వరద ఉధృతితో వాగులు, కల్వర్టుల దగ్గర నీటి ప్రవాహ పెరిగే అవకాశం ఉందని, దిగువ ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని, అవసరమైతే లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. త్వరలో 21,325 మెట్రిక్ టన్నుల యూరియా రామగుండం ఎరువుల పరిశ్రమ (ఆర్‌ఎఫ్‌సీఎల్)లో యూరియా ఉత్పత్తి నిలిచి పోవడంతో ప్రత్యామ్నాయ ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తున్నాయని తుమ్మల తెలిపారు. రానున్న రెండురోజుల్లో రాష్ట్రానికి వివిధ కంపెనీల నుండి 21,325 మెట్రిక్ టన్నుల యూరియా రానుందని వెల్లడించారు. సెప్టెంబర్ మొదటి వారంలోగా ఐపీఎల్, సీఐఎల్ కంపెనీలు, దామ్ర, గంగవరం, కరాయికల్ పోర్టుల ద్వారా మరో 27,950 మెట్రిక్ టన్నుల యూరియా వస్తుందని చెప్పారు. ఇలావుండగా సెప్టెంబర్‌కు సంబంధించిన ఎరువుల కోటాను బకాయితో కలిపి వెంటనే విడుదల చేయాలని మరోసారి కేంద్ర ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డాకు ఆయన లేఖ రాశారు.


ఎల్లారెడ్డి మండలంలో అన్నాసాగర్ శివారులో పంట పొలంలో మేట వేసిన రాళ్లకుప్ప


నేలకొరిగిన చెరుకు పంటను సరిచేసుకుంటున్న ఈ రైతులది మెదక్ జిల్లా హవేళీఘనపురం మండలం దూప్‌సింగ్ తండా. గంగమ్మవాగు ఉధృతంగా ప్రవహించడంతో ఒక్క చెరుకే కాదు, వివిధ పంటలకు నష్టం వాటిల్లింది.

రూ.లక్ష, పెట్టుబడి నీటి పాలయ్యింది


నాకున్న ఎకరన్నరతో పాటు మరో నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకొని వరి పంట సాగు చేస్తున్నా. భారీ వర్షానికి పంట మొత్తం నీట మునిగింది. ప్రస్తుతం వర్షం తగ్గినా చేనులో వరద అలాగే ఉంది. రూ.లక్ష, పెట్టుబడి నీటి పాలయ్యింది. ప్రభుత్వం నష్ట పరిహారం అందించి ఆదుకోవాలి.

\- గుంటుక శంకర్, రైతు, వెల్దుర్తి, మెదక్ జిల్లా

కోలుకోలేని దెబ్బ!

కామారెడ్డి జిల్లాలో రూ.350 కోట్ల మేర నష్టం
- రోడ్ల పునర్నిర్మాణానికే రూ.50 కోట్లకు పైగా వ్యయం!
- పోచారం కట్ట పునరుద్ధరణకూ భారీగానే ఖర్చు
- మెదక్ జిల్లాలో రూ.18.60 కోట్ల నష్టం

సాక్షి ప్రతినిధులు/సాక్షి నెట్‌వర్క్: ఒక్కసారిగా వరుణుడు సృష్టించిన బీభత్సం కామారెడ్డి జిల్లాను వణికించింది. బుధ, గురువారాల్లో జిల్లాలో దంచికొట్టిన వానలతో అపార నష్టం వాటిల్లింది. జిల్లా వ్యాప్తంగా వరదలతో అన్ని విధాలుగా దాదాపు రూ.350 కోట్ల మేర నష్టం జరిగినట్టు తెలుస్తోంది. రోడ్లు కొట్టుకుపోయి, వంతెనలు దెబ్బతిని ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖలకు నష్టం వాటిల్లింది. పోచారం ప్రాజెక్టు దెబ్బతినడం, ఆపై 62 చెరువులు తెగిపోవడంతో నీటిపారుదల శాఖకు కూడా భారీ నష్టం జరిగింది. జిల్లాలో దాదాపు రూ.150 కోట్ల మేర పంట నష్టం వాటిల్లినట్లు అంచనా. ఇక భారీ వరదలతో జిల్లాలో పలు రోడ్లు విధ్వంసానికి గురయ్యాయి. 44వ నంబరు జాతీయ రహదారి పలు చోట్ల కోతకు గురయ్యింది. 375 డీ నంబరు గల జాతీయ రహదారిపై పోచారం ప్రాజెక్టు దిగువన వంతెన దెబ్బతినడంతో రాకపోకలు ఇప్పట్లో మొదలయ్యే పరిస్థితి లేదు. తాత్కాలిక మరమ్మతులు చేసినా, పూర్తి స్థాయిలో నిర్మాణం చేపట్టేందుకు రూ.60 కోట్ల మేర అవసరం అవుతాయని అంటున్నారు. జిల్లా మొత్తంగా 13 ఆర్‌అండ్‌బీ రోడ్లు దెబ్బతినడంతో వాటి పునర్నిర్మాణానికి రూ.35 కోట్లు అవసరం అవుతాయని అధికారులు అంచనా వేశారు. పంచాయతీరాజ్ రోడ్లకు రూ.20 కోట్ల మేర నష్టం వాటిల్లింది. పోచారం ప్రాజెక్టుకు వరద తాకిడి పెరిగి ప్రాజెక్టు కట్టకు కొంతమేర నష్టం జరిగింది. తాత్కాలికంగా మరమ్మతుల కోసం రూ.25 లక్షల వరకు ఖర్చవుతుండగా, దెబ్బతిన్నదాన్ని పునరుద్ధరించడానికి అంచనాలు వేయాల్సి ఉంది. దానికి రూ. కోట్లల్లోనే వ్యయం అవుతుందని నీటి పారుదల శాఖ అధికారులు అంటున్నారు. తెగిపోయిన 62 చెరువులను పూర్తి స్థాయిలో పునర్నిర్మించడానికి దాదాపు రూ.10 కోట్లు ఖర్చవుతాయని భావిస్తున్నారు. ఇక జిల్లాలో విద్యుత్తు శాఖకు రూ.5 కోట్ల మేర నష్టం వాటిల్లింది. 763 కరెంటు స్తంభాలు పడిపోగా, 147 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి.

ఇళ్లు గుల్ల..: జిల్లా కేంద్రంలోని జీఆర్ కాలనీ, హౌసింగ్‌బోర్డు కాలనీలలో 107 ఇళ్లల్లోకి వరద రావడంతో ఎలక్ట్రానిక్ పరికరాలు, ఫర్నిచర్, వంట పాత్రలు, తిండిగింజలు, బట్టలు మొత్తం నాశనమయ్యాయి. ఐదారు కార్లు కొట్టుకుపోగా, నీట మునగడంతో 15 కార్లు, 40 బైకులు దెబ్బతిన్నాయి. ఒక్కో ఇంట్లో కనీసం రూ.2 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. కొందరి ఇళ్లు వరద తాకిడికి దెబ్బతిన్నాయి. జిల్లాలో 487 ఇండ్లు పాక్షికంగా, 14 ఇండ్లు పూర్తిగా కూలిపోయాయి. అన్ని నష్టాలు లెక్కిస్తే రూ.10 కోట్ల మేర నష్టం జరిగినట్టు అంచనా.

మెదక్ జిల్లాలో రోడ్లు ధ్వంసం.. తెగిన చెరువులు

భారీ వర్షాలతో మెతుకుసీమకు అపారనష్టం జరిగింది. 77 కిలోమీటర్ల పొడవు పీఆర్, ఆర్‌అండ్‌బీ రోడ్లు ధ్వంసం కాగా, 92 చెరువులు, కుంటలు, కల్వర్టులు తెగిపోయాయి. వేలాది విద్యుత్ స్తంభాలు, వందలాది ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసమయ్యాయి. ఈ నాలుగు శాఖల పరిధిలో రూ.18.60 కోట్ల పైచిలుకు నష్టం జరిగినట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. జిల్లావ్యాప్తంగా 681 ఇళ్లు పాక్షికంగా దెబ్బతినగా, 4 ఇళ్లు నేలమట్టం అయినట్లు అధికారులు తెలిపారు.


భారీ వరదలకు దూప్‌సింగ్ తండాలో పూర్తిగా దెబ్బతిన్న ఇంటి వద్ద దిగాలుగా వృద్ధురాలు

దూప్‌సింగ్ తండా దుఃఖం

రెండు రోజులుగా వరద నీటిలో చిక్కుకుపోయిన మెదక్ జిల్లా దూప్‌సింగ్ తండా కన్నీరు పెడుతోంది. గంగమ్మ వాగు ఉప్పొంగడంతో వరద తాకిడికి గుడిసెలు నేలమట్టం కాగా, ఇళ్లలోకి బురద చేరి నివాసం ఉండలేని పరిస్థితి నెలకొంది. ఇళ్లల్లో బురద పేరుకుపోయిందని, తాము ఎక్కడ తలదాచుకోవాలంటూ తండా వాసులు కన్నీరు మున్నీరవుతున్నారు. ఇంట్లో ఉన్న బియ్యం వంటి నిత్యావసరాలు తడిచిపోవడంతో సరైన ఆహారం లేక ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం యశోద అనే మహిళ తడిచిపోయిన ఐదు క్వింటాళ్ల బియ్యాన్ని చూపిస్తూ విలపించింది. ఇంట్లో చేరిన బురదతో తాము ఎట్లా ఉండాలంటూ వనిత కంట నీరు పెట్టుకుంది.తన పూరి గుడిసె కూలిపోవడంతో బీమ్లీ అనే వృద్ధురాలు నిరాశ్రయురాలైంది. విద్యుత్ స్తంభాలు పూర్తిగా కూలిపోయి తండాలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. స్థానికులు శుక్రవారం కూడా చీకట్లోనే గడిపారు. ఈ తండాలో సుమారు 41 కుటుంబాలు నివసిస్తున్నాయి.

వెంటాడుతున్న వరద కష్టాలు

బాసర కాటేజీల్లోకి గోదావరి వరద
- ఇంకా జలదిగ్బంధంలోనే 765డీ జాతీయ రహదారి
- హైవే 44కు మరమ్మతులు షురూ

సాక్షి, నెట్‌వర్క్: నిర్మల్ జిల్లాలోని భైంసా డివిజన్‌లో శుక్రవారం భారీ వర్షం కురిసింది. మరోవైపు మహారాష్ట్ర నుంచి భారీగా వస్తున్న వరదతో గోదావరి ఉగ్రరూపం దాల్చింది. పోటెత్తిన వరద బాసర కాటేజీల్లోకి ప్రవేశించింది. వెంటనే పోలీసులు, అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఎస్పీ జానకీ షర్మిల స్వయంగా అక్కడికి చేరుకుని, పరిస్థితి సమీక్షించారు. విపత్తు నియంత్రణ సహాయక బృందాలతో కాటేజీల నిర్వాహకులు, సిబ్బందిని క్షేమంగా సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కాగా బాసర ఆలయ అర్చకులు గోదావరి శాంతించాలంటూ స్నానఘాట్ల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఇలావుండగా..భైంసా పట్టణంలోని గడ్డెన్నవాగు ప్రాజెక్టు ఐదుగేట్లు ఎత్తారు. సుద్దవాగు వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. మెదక్ జిల్లా రామాయంపేట పట్టణంలో ఇళ్లలోకి వచ్చిన నీటిని తోడేందుకు ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. మెదక్ పట్టణంలో షాపుల్లో చేరిన నీటిని మోటార్లతో తోడుతున్నారు. హైదరాబాద్ నుంచి మెదక్ -ఎల్లారెడ్డి-బాన్సువాడ మీదుగా నిజామాబాద్ జిల్లా కోటగిరి వరకు వెళ్లే 765డీ జాతీయ రహదారి ఇంకా జల దిగ్బంధంలోనే ఉంది. హైదరాబాద్-నాగ్‌పూర్ హైవే (44) కోతకు గురైన చోట్ల మరమ్మతు పనులు ప్రారంభమయ్యాయి. హవేళీఘనపురం మండలం గంగమ్మవాగులో గల్లంతైన యాదగౌడ్ అనే మరో వ్యక్తి మృతదేహం శుక్రవారం లభించింది. మరోవైపు రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం నర్మాలకు చెందిన పంపుకాడి నాగయ్య గల్లంతై మూడు రోజులైనా జాడ దొరకలేదు.


వరద తాకిడికి బాసరలో నీటమునిగిన కాటేజీలు

రైలు పట్టాల ధ్వంసానికి కబ్జాలే కారణం

భారీ వర్షాలతో రామేశ్వర్‌పల్లి-తలమడ్ల రైల్వేస్టేషన్‌ల మధ్య 528 మైలురాయి వద్ద 50 మీటర్ల పొడవున ట్రాక్ కింద మట్టి కొట్టుకపోయి పట్టాలు గాల్లో తేలడానికి చెరువు అలుగు కాలువ ఆక్రమణలే కారణమని తెలుస్తోంది.

గణపతి విగ్రహం కోసం వచ్చి చిక్కుకుపోయిన చిన్నారులు

కామారెడ్డి జిల్లా లింగంపల్లికలాన్ గ్రామానికి చెందిన సుమారు పది మంది చిన్నారులు బుధవారం గణపతి విగ్రహాన్ని కొనుగోలు చేసేందుకు మెదక్‌కు వచ్చారు. అయితే రెండు జిల్లాల మధ్య ప్రవహిస్తోన్న మంజీరా నది పోచారం డ్యామ్‌పై నుంచి ఉప్పొంగి ప్రవహించడంతో ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో వారంతా రెండు రోజులుగా మెదక్‌లోనే ఉండిపోయారు. దీంతో శుక్రవారం ఉదయం ఎస్డీఆర్ఎఫ్, ఆర్మీ బృందాలు రెస్క్యూ ఆపరేషన్‌తో వారిని ఎల్లారెడ్డి వైపు తరలించేందుకు యత్నించారు. అయితే వరద ఉధృతి ఎక్కువగా ఉండటంతో ప్రయత్నాన్ని విరమించుకున్నారు. చిన్నారులను మెదక్‌లోని పునరావాస శిబిరాలకు తరలించారు.

మేడిగడ్డలో సీడబ్ల్యూపీఆర్ఎస్ బృందం ఏడీసీపీ సర్వే


సర్వే చేస్తున్న సీడబ్ల్యూపీఆర్ఎస్ సైంటిస్టు నాగరాజు, ఇరిగేషన్ డీఈఈ సురేశ్

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి మేడిగడ్డ బ్యారేజీలో ఎన్డీఎస్ఏ సూచనల మేరకు ఏడీసీపీ (అకౌస్టిక్ డాప్లర్ కరంట్ ప్రొఫైలర్) పరీక్షలను పుణేకు చెందిన సీడబ్ల్యూపీఆర్ఎస్ సైంటిస్టు ఎం.నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. శుక్రవారం ఆ బృందం మేడిగడ్డ వద్ద బోటుకు ప్రత్యేక యంత్రాన్ని అమర్చి నీటి ప్రమాణ తీవ్రతను కొలిచారు. ప్రస్తుతం బ్యారేజీలో 9.71 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో తరలిపోతోంది. బ్యారేజీ పొడవునా ఎక్కడ ఎంతమేర నీటి ప్రమాణం ఉందని తెలుసుకున్నారు. నివేదికలను ఉన్నతాధికారులకు అందజేయనున్నారు. శని, ఆదివారాల్లో అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో కూడా పరీక్షలు చేపట్టనున్నారు. వారి వెంట డీఈఈ సురేశ్ ఉన్నారు.

ప్రజలు ఆపదలో ఉన్నప్పుడు హెలికాప్టర్లు ఉండవా?

- మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి


సాక్షి, హైదరాబాద్: సకాలంలో ప్రభుత్వం హెలికాప్టర్లు పంపకపోవడంతో రెండు మూడు కుటుంబాలు కొట్టుకుపోయాయని మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఆయన తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఒకతను నీళ్లలో కొట్టుకుపోతూ కరెంట్ పోల్ పట్టుకొని 7 గంటల వరకు ఉండి చివరికి నీళ్లలో కొట్టుకుపోయాడని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం, మంత్రులు తిరగడానికి హెలికాప్టర్లు ఉంటాయి తప్ప.. ప్రజలు ఆపదలో ఉన్నప్పుడు ఉండవా? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. భారీ వర్షాలతో లక్షల ఎకరాలు పంట నష్టపోయిందని, ఇంకా పంట పొలాల్లో నీళ్లు అలాగే ఉన్నాయన్నారు. వర్షాలు వస్తుంటే సీఎం మూసీ సుందరీకరణపై సమీక్షలు చేయడం ఏంటని సుభాష్ మండిపడ్డారు.

మసీదులు, దర్గాలకు ఉచిత విద్యుత్ అందించండి

- సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన మిలాదున్నబీ జులూస్ కమిటీ

సాక్షి, హైదరాబాద్: మిలాదున్నబీ పండుగను పురస్కరించుకుని సెప్టెంబర్ 14న రాష్ట్రవ్యాప్తంగా ప్రదర్శనలకు అనుమతించాలని మిలాదున్నబీ జులూస్ కమిటీ రాష్ట్రప్రభుత్వాన్ని కోరింది. ఈమేరకు కమిటీ సభ్యులు ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, ఎంఐఎం అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ అక్బరుద్దీన్ ఒవైసీ తదితరులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని శుక్రవారం కలిసి వినతిపత్రం అందించారు. అలాగే మిలాదున్నబీ సందర్భంగా పురాతన మసీదులు, దర్గాలను అలంకరించాలని, వాటికి ఉచిత్ విద్యుత్ సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు.

మరిన్ని రాష్ట్ర వార్తలు సాక్షి ప్లస్ (ఈ పేపర్)లో

రాష్ట్రాల ఆదాయానికి భరోసా ఇవ్వాలి

రేట్ల హేతుబద్ధీకరణతో తెలంగాణకు రూ.5,100 కోట్ల నష్టం
- సంప్రదింపుల సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క


సాక్షి, న్యూఢిల్లీ: జీఎస్టీ రేట్లను హేతుబద్ధీకరించే సమయంలో రాష్ట్రాల ఆదాయానికి భద్రత కల్పించాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న రేట్ల హేతుబద్ధీకరణకు మద్దతు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని, అయితే సంక్షేమ పథకాలపై ప్రతికూల ప్రభావం చూపే నష్టం గురించి ఆందోళన కలుగుతోందని తెలిపారు. రేట్ల హేతుబద్ధీకరణతో తెలంగాణకు రూ.5,100 కోట్ల నష్టం వాటిల్లే అవకాశం ఉందని చెప్పారు. శుక్రవారం ఢిల్లీలోని కర్ణాటక భవన్‌లో కర్ణాటక ప్రభుత్వం ఆధ్వర్యంలో జీఎస్టీ రేట్ల హేతుబద్ధీకరణపై వివిధ రాష్ట్రాల సంప్రదింపుల సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడారు. 'గత ఐదేళ్లలో జీఎస్టీ ద్వారా ఆదాయాలు గణనీయంగా పెరుగుతాయని అంచనా వేశారు. కానీ ఆశించినంతగా పెరగలేదు. తెలంగాణ వ్యాట్‌ను కొనసాగించి ఉంటే 2024-25 సంవత్సరానికి ఆదాయం రూ.69,373 కోట్లు ఉండేది. జీఎస్టీ ద్వారా రూ.42,443 కోట్ల ఆదాయమే వచ్చింది'అని వివరించారు.

80 శాతం సంక్షేమం కోసం కేటాయింపు

తెలంగాణ ఆదాయంలో 80 శాతం కంటే ఎక్కువ నిధులు సంక్షేమ పథకాల కోసం కేటాయిస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్రంలో విలాస వస్తువులపై సెస్ వాటా రాష్ట్రానికి వచ్చే జీఎస్టీలో 15 శాతం మాత్రమేనని చెప్పారు. తెలంగాణలో జీఎస్టీ, జీఎస్‌డీపీ నిష్పత్తి 2022-23లో 3.07 శాతం నుంచి 2024-25లో 2.58 శాతానికి తగ్గిందని, రేటు హేతుబద్ధీకరణ దీనిని మరింత తగ్గిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. పన్ను మినహాయింపు పేద, మధ్య తరగతి వర్గా లకు చేరేలా ఉండాలని భట్టి పేర్కొన్నారు. సమావేశం అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సెప్టెంబర్ 3న తమిళనాడు భవన్‌లో ఇదే అంశంపై బ్రేక్‌ఫాస్ట్ సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు.

భారీ వర్షాలతో అంగన్‌వాడీ కేంద్రాలు ఆగమాగం

- 9 జిల్లాల్లో 590 కేంద్రాలు దెబ్బతిన్నట్లు అధికారుల అంచనా
- దెబ్బతిన్న కేంద్రాల్లో తాత్కాలికంగా సేవలు నిలుపుదల
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని మంత్రి సీతక్క ఆదేశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు పలు అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు దెబ్బతిన్నాయి. 9 జిల్లాల పరిధిలో దాదాపు 590 అంగన్‌వాడీ కేంద్రాలు దెబ్బతిన్నట్లు రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. కేంద్రాల వారీగా పరిస్థితిని పరిశీలించి నివేదిక ఇవ్వాలని రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కమిషనరేట్ నుంచి ఉన్నతాధికారులు జిల్లా సంక్షేమాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటివరకు గుర్తించిన దెబ్బతిన్న 590 భవనాల్లో 440 భవనాలు శాశ్వత భవనాలు కాగా.. 150 అద్దె భవనాలు ఉన్నాయి. దెబ్బతిన్న భవనాల్లో ఎక్కువగా పైకప్పు లీకేజీ, గోడలకు పగుళ్లు, బేస్‌మెంట్ కుంగడం లాంటి సమస్యలు ఏర్పడ్డాయని క్షేత్రస్థాయి నుంచి అధికారుల కు నివేదికలు అందాయి. కాగా, దెబ్బతిన్న కేంద్రాల్లో సేవలను ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టాలని మహిళాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు.

మరమ్మతులకు రూ.17 కోట్లు అవసరం..

భారీ వర్షాలతో దెబ్బతిన్న అంగన్‌వాడీ కేంద్రాల మరమ్మతులపై అంచనాలు సిద్ధం చేయాలని ఉన్నతాధికారులు సూచించారు. దీంతో ఇప్పటివరకు 590 కేంద్రాల్లో మరమ్మతులు చేపట్టేందుకు రూ.17 కోట్లు అవసరమని జిల్లా సంక్షేమాధికారులు రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ కమిషనరేట్‌కు ప్రాథమిక నివేదికలు సమర్పించారు. భద్రాద్రి కొత్తగూడెం, నిర్మల్, కామారెడ్డి, గద్వాల్, హనుమకొండ, మెదక్, వనపర్తి, ఆసిఫాబాద్, ములుగు జిల్లాల్లో కురిసిన భారీ వర్షాలతో పెద్ద సంఖ్యలో అంగన్‌వాడీ కేంద్రాలు దెబ్బతిన్నాయి.

1,291 ప్రాంతాల్లో రహదారులు, కల్వర్టులు దెబ్బతిన్నాయి

పునరుద్ధరణకు రూ.374.71 కోట్లు అవసరమని అంచనా

సాక్షి, హైదరాబాద్: ఇటీవల కురిసిన వర్షాలు, వరదల కారణంగా... రాష్ట్రవ్యాప్తంగా 1,291 ప్రాంతాల్లో రహదారులు, కల్వర్టులు దెబ్బతిన్నట్లు పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు పీఆర్ అధికారులు నివేదించారు. మొత్తంగా గ్రామీణ రహదారుల పునరుద్ధరణకు రూ.374.71 కోట్లు అవసరమని ప్రాథమికంగా అంచనా వేశారు. దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టుల తాత్కాలిక మరమ్మతుల కోసం రూ.22.71 కోట్లు, శాశ్వత మరమ్మత్తుల కోసం రూ. 352 కోట్లు ఖర్చు అవుతుందని పేర్కొన్నారు. ఈ వర్షాలతో మొత్తం 22 గ్రామాలకు రాకపోకలు దెబ్బతినగా.. వాటిలో 14 గ్రామాలకు తాత్కాలికంగా రహదారులను పునరుద్ధరించినట్లు, మిగిలిన గ్రామాలకు పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నట్లు పీఆర్ ఇంజనీరింగ్ విభాగం ఈఎన్‌సీ ఎన్.అశోక్ తెలిపారు. శుక్రవారం భారీ వర్షాలతో దెబ్బతిన్న పంచాయతీరాజ్ రహదారులపై మంత్రి సీతక్క టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. వీలైనంత త్వరగా రహదారుల పునరుద్ధరణ పనులు చేపట్టాలని మంత్రి సీతక్క ఆదేశించారు. కాగా, అధిక వర్షాల పరిస్థితుల్లో ప్రజలకు వేగవంతమైన సహాయం అందించేందుకు హైదరాబాద్ పీఆర్ ఈఎన్సీ కార్యాలయంలో ఫ్లడ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు.

ముమ్మరంగా రెస్క్యూ ఆపరేషన్

1,646 మంది బాధితులను కాపాడాం: అగ్నిమాపకశాఖ డీజీ నాగిరెడ్డి


సాక్షి, హైదరాబాద్: గత 48 గంటలుగా భారీ వర్షాలు కురుస్తున్న కామారెడ్డి, మెదక్, నిజామాబాద్, నిర్మల్, సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల్లో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయని అగ్నిమాపకశాఖ డీజీ వై. నాగిరెడ్డి తెలిపారు. ఇలాంటి విపత్తు సమయంలో ప్రజలంతా రక్షణ బృందాలకు సహకరించాలని, అక్కడి సిబ్బంది సూచనలను పాటించాలని సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కామారెడ్డి పట్టణంలో వరద ముప్పు ప్రాంతాల్లో సహాయక చర్యలను స్వయంగా పరిశీలించిన నాగిరెడ్డి.. క్షేత్రస్థాయిలో సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. 'ఇప్పటివరకు మొత్తం 1,646 మంది బాధితులను 31 ప్రాంతాల్లో కాపాడాం. అగ్నిమాపక సిబ్బంది, ఉధృతమైన వరద నీటిని లెక్క చేయకుండా చీకటిలోనూ రక్షణ చర్యలు చేపట్టారు. నేను స్వయంగా జీఆర్ కాలనీ, హౌసింగ్ బోర్డ్ కాలనీ, ఇతర ప్రభావిత ప్రాంతాలను సందర్శించి చర్యలను పర్యవేక్షించాను' అని నాగిరెడ్డి పేర్కొన్నారు.

క్లుప్తంగా...

రూ.333.27 కోట్లతో ఎస్ఎల్‌బీసీ హైలెవల్ కెనాల్ లైనింగ్

టెండర్లు పిలిచిన అధికారులు

సాక్షి, హైదరాబాద్: పీఎమ్మార్ ఎస్ఎల్‌బీసీ (శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్)కి చెందిన హైలెవల్ కెనాల్‌ను సిమెంట్ కాంక్రీట్ లైనింగ్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన రూ.333.27 కోట్ల వ్యయంతో పనులు చేపట్టడానికి శుక్రవారం టెండర్లు పిలిచింది. ఇందులో భాగంగా హైలెవల్ కెనాల్ 23.500 కిలోమీటర్ల నుంచి 136.150 కిలోమీటర్ల దాకా సిమెంట్ కాంక్రీట్ లైనింగ్ చేయనున్నారు. రూ.333.27 కోట్లతో పనులు చేపట్టడానికి వీలుగా ఇటీవలే మంత్రివర్గం ఆమోదం కూడా తెలిపింది. దాంతో టెండర్ నోటిఫికేషన్ ఇచ్చారు.

తెలంగాణ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీగా మోహన్‌నాయక్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీగా రాష్ట్ర రహదారుల విభాగం చీఫ్ ఇంజనీర్ మోహన్‌నాయక్ పూర్తి అదనపు బాధ్యతలతో నియమితులయ్యారు. ఈమేరకు ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసింది.

విద్యలో సంస్కరణలకు ప్రత్యేక కమిటీ!

మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి నేతృత్వం?



సాక్షి, హైదరాబాద్: ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి నేతృత్వంలో విద్యా రంగ సంస్కరణలపై ప్రత్యేక కమిటీ వేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ విషయమై త్వరలో స్పష్టత రానుంది. ప్రైవేటు పాఠశాలల ఫీజుల నియంత్రణ, పాఠశాల విద్యలో నాణ్యత పెంపు, ఒత్తిడి తగ్గించే బోధన విధానాలను ఈ కమిటీ అధ్యయనం చేసే వీలుంది. విద్యాశాఖపై సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం అధికారులతో సమీక్షించారు. ఉన్నత విద్యపై సమీక్ష ముగిసిన తర్వాత బాలకిష్టారెడ్డి బయటకు వెళ్తుండగా.. 'అన్ని స్థాయిల విద్యా సమీక్షలోనూ మీరు ఉండాలి'అని సీఎం చెప్పినట్టు తెలిసింది. పాఠశాల ఫీజులపై నిపుణుల కమిటీని వేస్తామని సీఎం అన్నట్టు సమాచారం. ఇతర రాష్ట్రాల్లో ఫీజుల కట్టడికి అనుసరిస్తున్న పద్ధతులపై అధ్యయనానికి బాలకిష్టారెడ్డి నేతృత్వంలో కమిటీ వేయాలన్న అభిప్రాయం వ్యక్తం చేసినట్టు తెలిసింది.



మూసీ.. మాటేసి...


మూసీనదిలోకి భారీగా వరద వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో దిగువకు ప్రవహిస్తున్న ఆ నీటిలో చేపలను వేటాడేందుకు వివిధ రకాల జాతులకు చెందిన కొంగలు చేరాయి. చూపరులను ఆకర్షించిన ఈ దృశ్యాలను సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది.

– సాక్షిస్టాఫ్ ఫొటోగ్రాఫర్, సూర్యాపేట

నమ్మించి నట్టేట ముంచారు..

ఉచిత వీసాలతో దుబాయ్ పంపిస్తామని నిరుద్యోగులను మోసగించిన ఏజెంట్లు

- తర్వాత ఒక్కో నిరుద్యోగి వద్ద రూ.1.50 లక్షల వరకు వసూలు
- దుబాయ్ వెళ్లిన తరువాత డ్రైవింగ్ లైసెన్స్‌ల కోసం మళ్లీ వసూళ్లు
- ఇంటికి వద్దామంటే రూ.లక్ష చెల్లించాలని ఏజెన్సీ డిమాండ్



మోర్తాడ్(బాల్కొండ): దుబాయ్ వీధుల్లో వ్యాలెట్ పార్కింగ్ చేసే చోట పనులు కల్పించడానికి ఉచిత వీసాలు ఉన్నాయని నమ్మించిన ఏజెంట్లు.. వందలాది మంది నిరుద్యోగులను నట్టేట ముంచారు. నిరుద్యోగుల నుంచి భారీ మొత్తంలో వసూలు చేసి, దుబాయ్‌కి పంపిన తరువాత అక్కడ డ్రైవింగ్ లైసెన్స్‌ల కోసం మరోమారు ఏజెన్సీ నిర్వాహకులు సొమ్ములు వసూలు చేశారు. అయితే సరైన వేతనం లేకపోవడంతో ఇంటి బాట పట్టిన కార్మికులకు, పాస్‌పోర్టులు వాపసు ఇవ్వడానికి మరోసారి డబ్బులు డిమాండ్ చేసిన ఘటన తాజాగా వెలుగు చూసింది. జగిత్యాల, నిర్మల్‌లలో ఎలాంటి లైసెన్స్ లేని ఏజెన్సీలను నడుపుతున్న ఇద్దరు గల్ఫ్ ఏజెంట్లు దాదాపు 400 మంది వలస కార్మికులను రోడ్డున పడేశారు. వీరి మోసంపై నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలం అర్గుల్‌కు చెందిన సాయి, మాక్లూర్ మండలం ముత్యంపల్లికి చెందిన వినయ్, సిద్దిపేటకు చెందిన రాజశేఖర్ నాయక్‌లు తమ గోడును సామాజిక మాధ్యమాల ద్వారా వెల్లబోసుకున్నారు. తమలాగే వందలాది మంది వలస కార్మికులు దుబాయ్‌లోని వ్యాలెట్ పార్కింగ్ ఏజెన్సీ ద్వారా వీసాలు పొంది, సరైన వేతనం లేక తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారిని 'సాక్షి'పలకరించగా ఉచిత వీసాలు అని నమ్మించిన ఏజెంట్లు తమ పాస్‌పోర్టులు తీసుకుని, ఆ తరువాత డబ్బులు కట్టాలని డిమాండ్ చేయడంతో గత్యంతరం లేక రూ.1.50 లక్షల సొమ్ము చెల్లించామని వారు వెల్లడించారు. వ్యాలెట్ పార్కింగ్ చేయడం వల్ల టిప్‌లు వస్తాయని నమ్మించారని, దుబాయ్ వీధుల్లో గంటల తరబడి ఎండలో ఎంత పని చేసినా నెలకు మన కరెన్సీలో రూ.22,500 మాత్రమే జీతం లభిస్తుందని.. కంపెనీ ఎలాంటి వసతి, భోజనం సమకూర్చకపోవడంతో అన్ని ఖర్చు లుపోను నెలకు రూ.10 వేలు కూడా ఇంటికి పంపించలేకపోతున్నామని వలస కార్మికులు వాపోతున్నారు. తమకు యూఏఈ డ్రైవింగ్ లైసెన్స్ ఇప్పించడానికి డబ్బులు అదనంగా చెల్లించకపోతే తమ పేర్లపై బ్యాంకుల్లో రుణాలు తీసుకున్నారని వారు తెలిపారు. ఇంటికి రావడానికి పాస్‌పోర్టు అడిగితే మరో రూ.లక్ష చెల్లించాలని ఏజెన్సీ నిర్వాహకులు స్పష్టం చేయడంతో తమకు దిక్కుతోచడం లేదని చెబుతున్నారు. తమను నమ్మించి మోసం చేసిన ఏజెంట్లపై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

నీటి మళ్లింపుపై ఏపీని నియంత్రించండి

- కృష్ణా జలాలను ఏపీ ఇతర బేసిన్లకు తరలిస్తోంది... దానిని అడ్డుకొనేలా కేఆర్ఎంబీకి ఉత్తర్వులు ఇవ్వండి
- బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ఎదుట తెలంగాణ వాదన



సాక్షి, హైదరాబాద్: కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ (కేడబ్ల్యూడీటీ)–1, కేడబ్ల్యూడీటీ–2 ఎలాంటి కేటాయింపులు చేయకున్నా శ్రీశైలం ప్రాజెక్టు నుంచి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్, హంద్రీనీవా, ముచ్చుమర్రి, వెలిగొండ అవుట్‌లెట్‌ల ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృష్ణా జలాలను ఇతర బేసిన్ (నదీ పరీవాహక ప్రాంతం)లకు మళ్లిస్తోందని తెలంగాణ రాష్ట్రం అభ్యంతరం తెలిపింది. కేడబ్ల్యూడీటీ–1 అవార్డు నిబంధనలను ఉల్లంఘించి ఆ ప్రాజెక్టుల ద్వారా ఆంధ్రప్రదేశ్ ఎటువంటి నీటి మళ్లింపులు చేయకుండా నియంత్రించేలా కృష్ణా బోర్డు (కేఆర్ఎంబీ)కు మధ్యంతర ఆదేశాలు జారీ చేయాలని బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌ను కోరింది. పోలవరం కుడి కాల్వ ద్వారా కృష్ణా డెల్టాకు మళ్లిస్తున్న ఉన్న 80 టీఎంసీలకు గాను.. కృష్ణా జలాల్లో కర్ణాటక 21, మహారాష్ట్ర 14 టీఎంసీలను అదనంగా వాడుకుంటున్నాయని.. ఇదే తరహాలో నాగార్జునసాగర్ ఎగువన ఉమ్మడి రాష్ట్రానికి దక్కిన 45 టీఎంసీల కృష్ణా జలాలను తెలంగాణకే కేటాయించాలని విజ్ఞప్తి చేసింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య కృష్ణా జలాల పునః పంపిణీపై విచారణ జరుపుతున్న జస్టిస్ బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ఎదుట శుక్రవారం రెండో రోజు తెలంగాణ తరఫున సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ వాదనలు వినిపించారు.

11వ షెడ్యూల్‌లోని ప్రాజెక్టులు అనుమతి లేనివే..

కృష్ణా బేసిన్‌లో తీవ్రమైన నీటి ఎద్దడి ఉన్న సంవత్సరాల్లో కూడా కేడబ్ల్యూడీటీ–1 నీటి కేటాయింపులు లేనప్పటికీ తెలుగుగంగ ప్రాజెక్టు ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 40 టీఎంసీల వరకు కృష్ణా జలాలను ఇతర బేసిన్‌లకు మళ్లిస్తోందని గణాంకాలను తెలంగాణ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ ట్రిబ్యునల్‌కు వివరించారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం–2014లోని 11వ షెడ్యూల్‌లో ఉన్న ప్రాజెక్టులను అనుమతి ఉన్న ప్రాజెక్టులుగా గుర్తిస్తూ 2022, జూలైలో కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను తప్పుబట్టారు. కేడబ్ల్యూడీటీ–1, కేడబ్ల్యూడీటీ–2 కేటాయించకుండా మిగిలిన నీటిని ఉపయోగించుకునే స్వేచ్ఛను మాత్రమే ఉమ్మడి రాష్ట్రానికి ఇచ్చారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మిగులు జలాలు ఆధారంగా చేపట్టిన ప్రాజెక్టుల కింద 16.3 లక్షల ఎకరాల ఆయకట్టును ప్రతిపాదించి.. దాన్ని 26.3 లక్షల ఎకరాలకు పెంచిందని వివరించారు. కేడబ్ల్యూడీటీ–1 కేసీ కెనాల్‌కు 31.9 టీఎంసీలను కేటాయిస్తే.. ఏటా సగటున 55 టీఎంసీలను ఏపీ వినియోగిస్తోందని తెలిపారు. బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ విచారణను వచ్చే నెల 23–25కు వాయిదా వేసింది. తుది వాదనలను వినిపించడానికి మరో అవకాశం ఇవ్వాలని సీఎస్ వైద్యనాథన్ చేసిన విజ్ఞప్తికి ట్రిబ్యునల్ సానుకూలంగా స్పందించింది.

ఆర్టీసీ ఆదాయానికి టి'కట్'

మొదటి పేజీ తరువాయి

టికెట్ సొమ్మును భారీగా స్వాహా చేస్తున్నారు. ఆర్టీసీ డ్రైవర్ తరహాలో రెగ్యులర్ ఉద్యోగం కాకపోవటంతో.. ఉద్యోగం ఉంటే ఉంటుంది, పోతే పోతుందన్న పద్ధతి లో వ్యవహరిస్తున్నారు. రోజుకు ఐదారు టికెట్ల డబ్బు స్వాహా చేయటం ద్వారా నెలకు యజమాని ఇచ్చే జీతం కంటే ఎక్కువ మొత్తం సమకూర్చుకోవచ్చన్నది వారి ఆలోచన. ఎలక్ట్రిక్ బస్సులున్న అన్ని డిపోల్లో ఇలాంటి కేసులు వెలుగు చూస్తున్నాయి. దీంతో ఆర్టీసీ కూడా కఠిన చర్యలకు దిగింది. దొరికిన డ్రైవర్ ఎంత మొత్తం కాజేశాడో తేల్చి అంతకు పది రెట్ల మొత్తాన్ని ఆ డ్రైవర్‌ను నియమించిన సంస్థకు పెనాల్టీగా విధించి వసూలు చేస్తున్నారు. ఆ డ్రైవర్ ఆర్టీసీలో మళ్లీ ప నిచేయకుండా చర్యలు తీసుకుంటున్నారు. అయినా ఇలాంటి కేసులు ఆగకపోవటంతో వారి లైసెన్సులను రద్దు చేసేలా రవాణాశాఖతో ఆర్టీసీ సంప్రదిస్తోంది.

జీరో టికెట్ల దందా కూడా..: కొందరు ఔట్‌సోర్సింగ్ కండక్టర్లు జీరో టికెట్లతో మాయ చేస్తున్నారు. ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళకు ఉచిత ప్రయాణం కింద జీరో టికెట్లు జారీ చేస్తారు. కొందరు ఔట్‌సోర్సింగ్ కండక్టర్లు పురుష ప్రయాణికులకు కూడా జీరో టికెట్లు జారీచేస్తూ ఆ మొత్తాన్ని స్వాహా చేస్తున్నారు. జీరో టికెట్లకు సంబంధించి ఆర్టీసీకి డబ్బు జమ కట్టాల్సిన పని లేకపోవటంతో వారికి బాగా కలిసి వస్తోంది. ఇటీవల తనిఖీల్లో పురుషుల వద్ద జీరో టికెట్లు దొరికాయి. దీంతో ఈ బండారం వెలుగు చూసింది. గతంలో సొంత కండక్టర్లు కొందరు ఇలా చేయగా, వారిని ఏకంగా డిస్మిస్ చేయటమే కాకుండా, అప్పీల్ అవకాశం కూడా లేకుండా చేశారు. దీంతో మిగతావారు ఆ దందాకు దూరంగా ఉన్నారు. కానీ, ఇటీవల ఔట్‌సోర్సింగ్ కండక్టర్లలో కొందరు ఆ తరహాలో డబ్బు కాజేస్తున్నారు.

పార్టీ పరంగా రిజర్వేషన్ అంటే ఊరుకోం

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల



సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ పరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కేటాయిస్తామంటే ఊరుకునేదిలేదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన సచివాలయ మీడియా పాయింట్ వద్ద మీడియాతో మాట్లాడుతూ, పార్టీ పరంగా టికెట్లు ఇచ్చేదానికి అయితే 20 నెలలుగా స్థానిక సంస్థల ఎన్నికలను ఎందుకు ఆపారని ఆయన కాంగ్రెస్ పార్టీని ప్రశ్నించారు. మంత్రి మండలి మొత్తం రాష్ట్ర గవర్నర్‌ను కలసి బీసీ రిజర్వేషన్లపై ఒత్తిడి పెంచాలని డిమాండ్ చేశారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష పార్టీలు, బీసీ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేయాలని, ప్రధాని మోదీ సమయం ఇవ్వాలని కోరుతూ అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేయాలని కోరారు. బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు న్యాయపోరాటం ఇంకొక వైపు రాజకీయ పోరాటం చేయాలని అన్నారు. రిజర్వేషన్ల పెంపు చట్టబద్ధంగా సాధ్యం కాకపోతే, చివరి అవకాశంగా మాత్రమే పార్టీ పరంగా బీసీలకు టికెట్ల కేటాయింపుపై కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచించాలని పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్ల పెంపునకు సహకరించని రాజకీయ పార్టీలను గుర్తించి, వారిని రాజకీయంగా భూస్థాపితం చేస్తామని జాజుల హెచ్చరించారు.

ఫీజుల సంగతేం చేశారు?

- ఈ బ్లాక్ పీరియడ్‌కు ఫీజుల పెంపు సాధ్యమేనా?
- ఉన్నత విద్యా మండలిని ఆరా తీసిన సీఎం రేవంత్

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ ఫీజుల వ్యవహారాన్ని త్వరగా తేల్చాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. దీనిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్ని కాలేజీలున్నాయి? ఆ కాలేజీలకు ఫీజులు ఎలా ఉన్నాయి? మిగతా కాలేజీల్లో ఎలా ఉన్నాయి? వాటిల్లో ఉన్న మౌలిక సదుపాయాలేంటి? నాణ్యత ప్రమాణాలు ఏ కాలేజీలో ఎలా ఉన్నాయి? ఇలాంటి వివరాలతో నివేదిక ఇవ్వాలని అధికారులకు సూచించారు. విద్యాశాఖపై శుక్రవారం సమీక్షించిన సీఎం.. ఇంజనీరింగ్ ఫీజులపై ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డిని పలు వివరాలు అడిగారు. ఫీజుల పెంపు నాణ్యత ఆధారంగానే ఉండాలని స్పష్టంచేశారు. ఈ బ్లాక్ పీరియడ్‌లో (2025–28) ఇంజనీరింగ్ ఫీజుల పెంపు సాధ్యం కాదన్న సంకేతాలు ఇచ్చినట్టు తెలిసింది. ఫీజులను తిరిగి సమీక్షిస్తున్న తీరుపై కాలేజీల యాజమాన్యాలు ఏమంటున్నాయని సీఎం ప్రశ్నించినట్టు తెలిసింది. ఫీజులు ఎక్కువగా ఉన్న కాలేజీలు ఈ వ్యవహారాన్ని పరిశీలిస్తున్నాయని, ఆ కాలేజీల ఫీజులు తగ్గిస్తే న్యాయ పోరాటానికి సిద్ధమనే సంకేతాలిస్తున్నాయని సీఎంకు అధికారులు వివరించినట్టు సమాచారం. దీంతో బోధన, సౌకర్యాలు బాగున్న కాలేజీలకు ఫీజులు పెంచడంలో తప్పేంటి? అని సీఎం అన్నట్టు తెలిసింది. వీటినే ప్రామాణికంగా తీసుకుంటే చిన్న కాలేజీలకు అన్యాయం జరుగుతుందని అధికారులు సీఎంకు వివరించినట్టు సమాచారం.

సమన్వయం కొరవడిందా?: విద్యాశాఖ, సాంకేతిక విద్య, ఉన్నత విద్యా మండలి మధ్య సమన్వయం కొరవడిందన్న వార్తలపై సీఎం ఆరా తీసినట్టు తెలిసింది. సమస్య ఎక్కడుందో చెప్పాలని కోరడంతో, అధికారులు పరస్పరం ఫిర్యాదులు చేసుకునేందుకు సిద్ధమైనట్టు సమాచారం. ఈ నేపథ్యంలో దీనిపై విడివిడిగా మాట్లాడతానని సీఎం అన్నట్టు తెలిసింది.

ఫేషియల్ రికగ్నిషన్ హాజరు..

మొదటి పేజీ తరువాయి

ఇతర విభాగాల నుంచి వెంటనే డిప్యుటేషన్‌పై తీసుకోవాలని సూచించారు.

మధ్యాహ్న భోజన బిల్లులకు గ్రీన్ చానల్

మధ్యాహ్న భోజన బిల్లుల చెల్లింపును గ్రీన్ చానల్ ద్వారా చేపట్టాలని సీఎం సూచించారు. ఈ విషయంలో అలసత్వం చూపొద్దని స్పష్టంచేశారు. తెలంగాణలోని మహిళా కళాశాలలు, బాలికల పాఠశాలల్లో మరుగుదొడ్లు, ప్రహరీల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. కంటైనర్ కిచెన్లకు ప్రాధాన్యమివ్వాలని.. వాటిపై సోలార్ ప్యానెళ్లు అమర్చి అవసరమైన విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకోవచ్చని తెలిపారు. ప్రతి పాఠశాలలో క్రీడలకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. అవసరమైతే కాంట్రాక్ట్ పద్ధతిన వ్యాయామ ఉపాధ్యాయులను నియమించాలని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కింద పాఠశాలల్లో పారిశుద్ధ్య పనులకు సంబంధించిన బిల్లులు తక్షణమే విడుదల చేయా లని ఆదేశించారు. గురుకులాల్లోని బాలికలకు వివిధ అంశాలపై కౌన్సెలింగ్ ఇచ్చేందుకు మహిళా కౌన్సెలర్లను నియమించాలని సూచించారు.

విద్యపై ఖర్చు పెట్టుబడే

విద్యా రంగంపై పెడుతున్న ఖర్చును పెట్టుబడిగా చూస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టంచేశారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్స్ స్కూళ్లతో పాటు విద్యా రంగం అభివృద్ధికి తీసుకునే రుణాలు ఎఫ్ఆర్‌బీఎం పరిమితిలో లేకుండా చూడాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు విజ్ఞప్తి చేసినట్టు తెలిపారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతున్న వారిలో 90 శాతానికి పైగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలే ఉన్నారని, ఈ విషయాన్ని నిర్ధారించేందుకు గత పదేళ్లలో ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివిన వారి వివరాలతో నివేదిక రూపొందించాలని ఆదేశించారు. సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, సీఎం ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్ రెడ్డి, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణా, ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, పాఠశాల విద్యా శాఖ సంచాలకుడు నవీన్ నికోలస్ తదితరులు పాల్గొన్నారు.

రూ. 25 లక్షల చొప్పున 'సిగాచి' పరిహారం

మృతుల కుటుంబాలకు ఇప్పటి వరకు చెల్లించినట్లు హైకోర్టుకు సర్కార్ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచి ఇండస్ట్రీస్ లిమిటెడ్‌లో జూన్ 30న జరిగిన ఘోర పేలుడు ఘటనలో మృతుల కుటుంబాలకు ఇప్పటివరకు రూ.25 లక్షల చొప్పున చెల్లించినట్లు హైకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. అలాగే తీవ్రంగా గాయపడిన వారికి రూ. 10 లక్షలు, స్వల్పంగా గాయపడిన వారికి రూ.5 లక్షల చొప్పున అందించినట్లు పేర్కొంది. ఈ మేరకు పూర్తి వివరాలతో హైకోర్టులో కౌంటర్ దాఖలు చేసింది. దీనిపై తదుపరి వాదనలు వినిపించేందుకు సమయం కావాలని పిటిషనర్ తరఫు న్యాయవాది కోరడంతో సెప్టెంబర్ 17కు విచారణను వాయిదా వేసింది. సిగాచి దుర్ఘటనలోని 46మంది మృతుల కుటుంబాలతోపాటు 28 మంది క్షతగాత్రులు, 8 మంది ఆచూకీ గల్లంతైన వారికి పరిహారం చెల్లింపులో జాప్యం జరుగుతోందంటూ రిటైర్డ్ సైంటిస్ట్ కలపాల బాబురావు హైకోర్టులో దాఖలు చేసిన 'పిల్'పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఏకే సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం మరోసారి విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ప్రభుత్వం తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ తేరా రజనీకాంత్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ పరిహారం, కమిటీలు సహా దుర్ఘటనపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేశామన్నారు. ప్రభుత్వ కౌంటర్‌పై స్పందన తెలియజేసేందుకు సమయం కావాలని పిటిషనర్ తరఫు న్యాయవాది వసుధ నాగరాజ్ కోరడంతో ధర్మాసనం తదుపరి విచారణను సెప్టెంబర్ 17కు వాయిదా వేసింది.



భూ సర్వేకు వచ్చిన అధికారులను అడ్డుకొని రాస్తారోకో చేస్తున్న భూ నిర్వాసిత రైతులు

న్యాయమైన పరిహారం ఇవ్వకపోతే చావడానికైనా సిద్ధం

- భూ సర్వేను అడ్డుకున్న 'పేట–కొడంగల్' ఎత్తిపోతల రైతులు
- అధికారుల కాళ్లు పట్టుకొని వెనక్కు వెళ్లాలని వినతి



పురుగు మందు బాటిల్ చూపిస్తున్న రైతు

దామరగిద్ద: నారాయణపేట– కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భాగంగా తమ జీవనాధారమైన భూములను కోల్పోయేందుకు సిద్ధమయ్యామని, కానీ, న్యాయమైన పరిహారం ఇవ్వాలని కోరితే స్పష్టత ఇవ్వకుండా బలవంతపు భూ సేకరణ సర్వే చేపట్టడం ఏమిటని కాన్‌కుర్తి రైతులు నిలదీశారు. న్యాయం కోసం చావడానికై నా సిద్ధమేనని ప్రకటించారు. శుక్రవారం నారాయణపేట జిల్లా కాన్‌కుర్తి రెవెన్యూ పరిధిలో సర్వేకు వచ్చిన అధికారులను భూ నిర్వాసిత రైతులు అడ్డుకుని ఆందోళన చేపట్టారు. రిజర్వాయర్ కోసం ఆర్డీఓ సమక్షంలో పోలీసు బందోబస్తుతో రెవెన్యూ సిబ్బంది సర్వే చేపట్టేందుకు వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న రైతులు ఉదయం 7 గంటలకే వచ్చి అధికారులను అడ్డుకునేందుకు కాన్‌కుర్తి గ్రామం వెలుపల రాస్తారోకో చేపట్టారు. ప్రభుత్వం న్యాయమైన పరిహారం అందిస్తుందని సర్వేకు సహకరించాలని అధికారులు కోరగా రైతులు నిరాకరించారు. సమాచారం అందుకున్న అదనపు కలెక్టర్ శ్రీను అక్కడికి చేరుకొని రైతులకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా వినిపించుకోలేదు. పలువురు రైతులు అధికారుల కాళ్లు పట్టుకొని.. అక్కడినుంచి వెళ్లిపోవాలని వేడుకున్నారు. పోలీసులు తమను చెదరగొట్టేందుకు ప్రయత్నిస్తే పురుగు మందు తాగి చావడానికి సిద్ధమని పురుగు మందు బాటిళ్లను చూపించారు. అధికారులు ప్రభుత్వాన్ని ఒప్పించి న్యాయమైన పరిహారంపై అధికారిక ప్రకటన చేసే వరకు వెనక్కి తగ్గేది లేదని నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి తెగేసి చెప్పడంతో అధికారులు, పోలీసు సిబ్బంది వెనుదిరిగారు.

> ఈ అఖిల బ్రహ్మాండంలో గల జడ-చేతనా రూపమైన చరాచర జగత్తు సర్వమూ ఈశ్వర వ్యాప్తమై ఉన్నది.
> – ఈశావాస్యోపనిషత్తు

సాక్షి
శనివారం, 30 ఆగస్టు 2025

మిత్ర లాభం

అంతా సవ్యంగా ఉన్న రోజుల్లో భిన్న దేశాలతో దౌత్య సంబంధాలు సాఫీగా సాగిపోతాయి. కానీ సవాళ్లు ఎదురయ్యే కాలంలో వాటిని నిలబెట్టుకోవటం, కొత్త బంధాలు ఏర్పర్చుకోవటం సులభం కాదు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వైఖరి కారణంగా భారత్–అమెరికా సంబంధాల్లో ఏర్పడిన ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం జపాన్‌లో రెండు రోజుల పర్యటన ప్రారంభించారు. ఈ నెల 31న, ఆ మర్నాడూ చైనాలోని తియాన్‌జిన్‌లో జరగబోయే షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) శిఖరాగ్ర సదస్సులో కూడా ఆయన పాలుపంచుకుంటారు. జపాన్‌తో మనకు చిరకాల మైత్రి ఉంది. మన స్వాతంత్ర్యోద్యమంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఇండియన్ నేషనల్ ఆర్మీ (ఐఎన్ఏ)ని స్థాపించి పోరాడినప్పుడు అన్ని విధాలా చేయూతనందించింది జపానే. స్వాతంత్ర్యానంతరం ఆ బంధం మరింత బలపడింది. రెండో ప్రపంచ యుద్ధ పరిసమాప్తి అనంతరం లాంఛనంగా 1951 సెప్టెంబర్ 8న శాన్‌ఫ్రాన్సిస్కో శాంతి ఒప్పందం కుదిరినప్పుడు జపాన్‌కు పాక్షిక సార్వభౌమత్వం మాత్రమే ఇవ్వాలన్న నిబంధనను మన దేశం తీవ్రంగా వ్యతిరేకించి సంతకం చేసేందుకు నిరాకరించింది. అందుకు జపాన్ ఈనాటికీ మన పట్ల కృతజ్ఞతగా ఉంటుంది.

తొలిసారి 2014లో ఎన్డీయే సర్కారు ఏర్పడినప్పుడే మోదీ జపాన్‌ను సందర్శించారు. ఈ దశాబ్ద కాలంలో ఇరు దేశాల సంబంధాలూ మోదీ అన్నట్టు ఎన్నో రెట్లు పెరిగాయి. మన దేశంలో ప్రస్తుత జపాన్ పెట్టుబడుల విలువ 4,200 కోట్ల డాలర్లు. దేశంలోని ఢిల్లీ, ముంబై, కోల్‌కతా మెట్రో రైలు ప్రాజెక్టులు జపాన్ ఆర్థిక సహకారంతో సాకారమయ్యాయి. ఢిల్లీ–ముంబై పారిశ్రామిక వాడ, సెమీకండక్టర్లు తదితరాలపై జపాన్ ముద్ర బలంగా ఉంది. ముంబై–అహ్మదాబాద్ మధ్య సాకారం కానున్న బుల్లెట్ రైలు ప్రాజెక్టుకు అత్యాధునిక ఈ–10 రకం బుల్లెట్ రైలును అందించాలని జపాన్ నిర్ణయించింది. వచ్చే పదేళ్లలో మన దేశంలో జపాన్ పెట్టుబడుల్ని పది లక్షల కోట్ల యెన్‌ల(6,800 కోట్ల డాలర్ల) స్థాయికి తీసుకెళ్లాలని మోదీ, జపాన్ ప్రధాని షిగెరు ఇషిబా శిఖరాగ్ర సమావేశంలో నిర్ణయించటం, పెట్టుబడులతోపాటు నవీకరణ, పర్యావరణం, ఆరోగ్యం తది తరాల్లో కలిసి పనిచేయాలనుకోవటం... రాగల అయిదేళ్లలో భిన్న రంగాల నిపుణుల సేవలు పొందేందుకు పరస్పరం అయిదు లక్షల మందిని బదలాయించుకోవాలనుకోవటం భారత్, జపాన్‌ల మైత్రి పటిష్ఠతకు నిదర్శనం.

ఈ క్రమంలో సహజంగానే సవాళ్లుంటాయి. స్వేచ్ఛాయుత, శాంతియుత, సంపద్వంత ఇండో–పసిఫిక్ ఆవిర్భవించాలన్న నినాదం అమెరికా ఛత్రఛాయలో ఏర్పడింది. దక్షిణ చైనా సముద్ర ప్రాంత సరిహద్దుల విషయంలో చైనాతో జపాన్‌కు తగాదా లేకున్నా, దాని దూకుడు పెద్ద సమస్యగా మారింది. చైనా తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాల వల్ల జపాన్‌కు ఎగుమతుల సమస్య ఏర్పడుతోంది. చైనాను కట్టడి చేయాలన్న బృహత్తర పథకానికి ఈ వివాదం తోడ్పడుతుందని అమెరికా భావించి మనల్ని అందులో కీలక భాగస్వామిని చేసింది. సుంకాల వివాదంలో ఇది ఎటు పోతుందన్న ఆందోళన జపాన్‌కు సహజంగానే ఉంటుంది. అయితే తమ వైఖరి మారబోదని మోదీ చెప్పటం జపాన్‌కు ఊరటనిచ్చే అంశం.

ఇండో–పసిఫిక్ విషయంలో మన వైఖరి చైనాకు కంటగింపుగానే ఉండొచ్చు. జపాన్‌తో సంబంధాలు సుహృద్భావంతో ఉండగా, చైనాతో సంబంధాలు అందుకు భిన్నం. సుంకాల వివాదం నేపథ్యంలో భారత్ దగ్గరవుతుందన్న అంచనా చైనాకుంది. ఎస్‌సీవో శిఖరాగ్ర సదస్సుకు మోదీ వెళ్తారా వెళ్లరా అనే సంశయం మొదట్లో ఉన్నా... రష్యా చొరవతో అది సాధ్యపడుతోంది. ఇది సాన్నిహిత్యానికి దారి తీస్తుందా లేదా అన్నది చూడాలి. చైనా ఇప్పటికే ఎరువులు, అరుదైన ఖనిజాలు, సొరంగాల తవ్వకంలో తోడ్పడే యంత్ర సామగ్రి ఎగుమతులపై ఉన్న నిషేధాలు తొలగించటానికి సూత్రప్రాయంగా అంగీకరించింది. మోదీ చైనా పర్యటనలో ఈ విషయంలో మరింత స్పష్టత వస్తుంది. చైనాతో మన సంబంధాలు బలపడే సూచనలుండగా, ట్రంప్ సైతం చైనాతో సన్నిహితమై దక్షిణాసియాలో పలుకుబడి పెంచుకోవాలనుకుంటున్నారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో మన వ్యూహాత్మక ఆధిక్యతను నిలబెట్టుకుంటూ జపాన్, చైనాలతో సఖ్యత కుదుర్చుకోవటం దౌత్యపరంగా మనకు పెను సవాలే. మోదీ దీన్ని ఎలా ఛేదించగలరో చూడాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు భాద్రపద మాసం, **తిథి:** శు.సప్తమి రా.7.44 వరకు, తదుపరి అష్టమి, **నక్షత్రం:** విశాఖ ప.1.09 వరకు, తదుపరి అనూరాధ, **వర్జ్యం:** సా.5.35 నుండి 7.21 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.42 నుండి 7.27 వరకు, **అమృత ఘడియలు:** తె.4.10 నుండి 5.56 వరకు (తెల్లవారితే ఆదివారం).

సూర్యోదయం : 5.48
సూర్యాస్తమయం: 6.14
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

సోషల్ టాక్

ప్రోత్సాహం



మహిళల విద్య అత్యంత ముఖ్యమైనది. శ్రామిక శక్తిలో వారి భాగస్వామ్యం కూడా అంతే ముఖ్యం. ప్రతి బాలికా, ఆమె ఆర్థిక స్థితితో సంబంధం లేకుండా, నాణ్యమైన విద్యను పొందేలా మనం ప్రోత్సహించాలి.

– జస్టిస్ బి.వి. నాగరత్న, సుప్రీంకోర్టు న్యాయమూర్తి

మలుపులు



దారి మీద అవరోధం ఉన్నంత మాత్రాన మొత్తం దారే అవరోధం కాదు. నిరుత్సాహ పడకుండా ముందుకు సాగండి. మలుపులుండేది గమ్యాన్ని చేర్చటానికే కానీ, దారిని మూసేయటానికి కాదు!

– జనరల్ అనిల్ చౌహాన్, చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్

కృతజ్ఞతలు



పేదరికంలోని బాధలను అనుభవించటానికి నాకు అవకాశం ఇచ్చినందుకు దేవుడికి కృతజ్ఞతలు. ఆ కష్టాలు నా జీవితంలోని తర్వాతి సంవత్సరాలలో నా పాత్రలను మలిచాయి.

– నావల్ టాటా, పారిశ్రామికవేత్త

కరచాలనం



మానవుని మొదటి బాధ్యత తనకు తాను కరచాలనం చేసుకోవడం! అయినప్పటికీ నీకు ఏదైనా నచ్చకపోతే దాన్ని మార్చుకో. మార్చలేకపోతే నీ వైఖరి మార్చుకో! అదేమీ నువ్వు నీ చెయ్యిని విడవడం కాదు.

– హెన్రీ వింక్లర్, అమెరికన్ నిర్మాత

చేయూత



పాతవాళ్లు కొత్తవాళ్లకు చేయూతనివ్వాలి. నేను ఎదగటానికి కొందరు తమ భుజాలను ఇచ్చారు. నేను చేయవలసిందీ అదే! కొందరికి నా భుజాలను ఇవ్వటం!! అందుకు ఉన్న మార్గాలలో ఒకటి... వారికొక అవకాశం కల్పించటం!

– డేనియల్ డే కిమ్, హాలీవుడ్ నటుడు

అవసరం



ప్రపంచం మొత్తానికి అవసరం అయ్యేది చెయ్యండి. అది లోకల్‌గా కూడా అందుబాటులో ఉండేలా చూడండి. ముఖ్యంగా, మీరు దేనిని అమ్మగలరో దానిని ఉత్పత్తి చెయ్యండి. అంతేకానీ, మీకు ఏది చేయటం వచ్చో దానిని అమ్మటానికి చూడకండి!

– జేమ్స్ క్విన్సీ, 'కోకా కోలా' సీఈవో

హిమాలయాల పెను హెచ్చరిక



◆ హిమాలయాల్లోని వరుస ఉత్పాతాలన్నీ, రకరకాల ఆపదల రాకను సమగ్రంగా మదింపు చేసే వ్యవస్థ అవసరాన్ని చాటుతున్నాయి.

◆ ఆర్కిటిక్ ప్రాంతంలో శాశ్వత ఐసు గడ్డల గురించి విస్తృతమైన అధ్యయనాలు సాగాయి. హిందూ కుశ్ ప్రాంతంలో హిమ ఖండాలు కరగడంపై ఇటీవల మాత్రమే దృష్టి సారించారు.

ఉత్తరాఖండ్‌లోని ఉత్తర కాశీ జిల్లాలో ఆగస్టు 5న వరుణుడు విలయ తాండవం చేశాడు. ఈ తీవ్ర అవపాతం హర్షిల్ దగ్గరలోని ధరాలీ, హర్షిల్ లోని సైనిక స్థావరం వద్ద ఆకస్మిక వరదలను సృష్టించింది. భారీ వర్షంతోపాటు మేఘ విస్ఫోటనం చోటుచేసుకుందని చెబుతున్నారు. అతి స్వల్ప కాలంలో అపారమైన వృష్టిని మేఘ విస్ఫోటనం అంటున్నారు. ప్రస్తుత వర్షాకాలంలో ఈ రకమైన పరిణామం ఇదే మొదటిది కాదు. 'హిందూ కుశ్ హిమాలయ' (హెచ్‌కెహెచ్) ప్రాంతం ఇప్పటికే అనేక వైపరీత్యాలను చవి చూసింది. నేపాల్ లిమి కోనలోని టిల్ గ్రామంపై మే 15న వినాశకరమైన వరద విరుచుకుపడింది. తర్వాత, హిమానీ సరస్సు ఉన్న జలాశయ ఆనకట్ట తెగి రసువా–భోటేకోశీ నది ఆయకట్టును జూలై 8న వరద ముంచెత్తింది.

జమ్ము–కశ్మీర్ లోని కిస్త్వార్ జిల్లాలో ఆగస్టు 14న తీవ్ర ఆకస్మిక వరదలు బీభత్సం సృష్టించాయి. చినాబ్ నది ఆరగాణి పొడవునా మొత్తం గ్రామాలు వరద ముంపునకు గురయ్యాయి. వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. వంతెనలు, రోడ్లు, జల విద్యుదుత్పాదన కేంద్రాల విభాగాలు కొట్టుకుపోవడంతో అనేక మంది నిరాశ్రయులయ్యారు. వైష్ణోదేవి ఆలయానికి వెళ్ళే దారిలో , ఆగస్టు 26న వర్షాల ధాటికి కొండచరియలు విరిగిపడటంతో ఐదుగురు చనిపోయారు. అక్కడ కొండవాలు ప్రాంతాలు బలహీనంగా ఉన్నాయి. వాటికి తీవ్ర వృష్టి తోడవుతోంది. వరదలకు లోనుకాగల సానువుల్లో మౌలిక వసతుల అభివృద్ధి ప్రాజెక్టులు రూపుదిద్దుకుంటున్నాయి.

జల బాంబులు

ఈ దుర్ఘటనలన్నీ, రకరకాల ఆపదల రాకను సమగ్రంగా మదింపు చేసే (ఎంహెచ్‌ఆర్ఏ) వ్యవస్థ అవసరాన్ని మరోసారి చాటుతున్నాయి. అక్కడక్కడ విడి విడిగా ప్రమాదాలకు ఉన్న అవకాశాలనే కాకుండా , వాటి మధ్యన ఉండగల సంక్లిష్ట పరస్పర క్రియలను పరిశీలించేదిగా ఆ ప్రణాళిక ఉండాలి. అధిక వర్షపాతం కొండ చరియలు విరిగిపడటానికి, తదనంతరం, హిమానీ సరస్సులకు గండిపడటానికీ దారితీస్తోంది. నీరు గడ్డకట్టిన ప్రాంతాలు, హిమం కరుగుతున్నాయి. ఈ జల ప్రవాహాలన్నీ కలసి లోయల్లో అస్థిరతను మరింత ఉద్ధృతం చేస్తున్నాయి. హిందూ కుశ్ హిమానీ నదాలు ఆందోళనకరమైన వేగాలతో తగ్గుతున్నాయి. ఇవి కరుగుతున్న వేగం, హిందూ కుశ్ నదుల ప్రవాహ వేగాల గతులను మార్చేస్తోంది. ఇవి 'క్రయోస్పియర్ టైమ్ బాంబులు'గా తయారవుతున్నాయి.

సిక్కింలో 2023 అక్టోబర్ 3న సంభవించిన విపత్తు దీనికి ప్రత్యక్ష ఉదాహరణ. ఇది హిమానీ సరస్సుకు గండిపడటంతో వచ్చిన వరద బీభత్సమే కాదు. ఒక పరిణామం మరో పరిణామానికి పురిగొల్పే సంక్లిష్టమైన ఉపద్రవం. ఒక పెద్ద హిమఖండం దక్షిణ లోనక్ సరస్సులోకి వచ్చిపడటంతో ఆ గొలుసు కట్టు ప్రక్రియ మొదలైంది. హిందూ కుశ్‌లో ఉపేక్షిస్తూ వచ్చిన జల ఘనీభవన స్థానాల కీలక పాత్రను అది తేటతెల్లం చేసింది. ఆర్కిటిక్ ప్రాంతంలో శాశ్వత ఐసు గడ్డల గురించి విస్తృతమైన అధ్యయనాలు సాగాయి. హిందూ కుశ్ ప్రాంతంలో హిమ ఖండాలు కరగడంపై ఇటీవలి కాలంలో మాత్రమే దృష్టి సారించారు. హిమ ఖండాలు కరిగితే లోయలు అస్థిరమవుతాయి. అది కొండ చరియలు విరిగి పడటానికి కారణమవుతుంది.

భూకంపాలకు హెచ్చరించినట్టుగానే...

ఏయేటి కాయేడు, పర్వత ప్రాంతాల్లో పెరుగుతున్న సంక్లిష్ట ఉపద్రవాల ద్వారా ప్రకృతి మనకు తరచూ హెచ్చరికలు పంపుతోంది. ఈ పరిణామాలను ప్రభావితం చేయగలిగిన నమూనాలు లేకపోలేదు. కానీ, వాటి కచ్చితత్వం పూర్తిగా 'ఇన్ పుట్ డేటా క్వాలిటీ'పై ఆధారపడి ఉంటుంది. ప్రమాదాలను ముందే పసిగట్టి హెచ్చరికలు జారీ చేసేందుకు, ఆపదలను తగ్గించుకునే వ్యూహాల రూపకల్పనకు మనం ఎత్తయిన ప్రదేశాలలో క్షేత్రస్థాయి డేటా సమీకరణ చేపట్టాలి. అందుకు అత్యవసరంగా మరిన్ని నిధులను వెచ్చించవలసిన అవసరం ఉంది. గ్లేసియర్ ద్రవ్య రాశి సమతౌల్య కొలతలను నమోదు చేసుకోవాలి. వాతావరణ పరిశోధన శాఖ రికార్డులను పదిలపరచుకుని పరిస్థితులను బేరీజు వేసుకోవాలి. సరస్సుల పరిమాణాలను కచ్చితత్వంతో అంచనా వేసేందుకు సమగ్ర బాతీమెట్రిక్ సర్వేలు నిర్వహించుకోవాలి.

గ్లేసియర్ సంబంధిత వైపరీత్యాలు చెదురుమదురుగా ఉండటం అరుదు. అవి ఒకదానివెంట ఒకటి సంభవిస్తుంటాయి, సరిహద్దులకు అతీతమైనవిగా తరచూ ఉంటాయి. ఎక్కడ వైపరీత్యం సంభవించినా దాని చుట్టుపక్కల దేశాలన్నీ కష్టనష్టాలను అనుభవించక తప్పదు. కనుక, పటిష్ఠమైన ప్రాంతీయ సహకారం అనివార్యం.

ప్రజలు లేదా మౌలిక వసతులపై ప్రభావం చూపినప్పుడు ప్రమాదం సైతం పెను ఉపద్రవంగా మారుతుంది. కనుక, జనావాస ప్రాంతాల ప్రణాళికలు, మౌలిక వసతుల అభివృద్ధి శాస్త్రీయ విజ్ఞానంతో కూడుకున్నవై ఉండాలి. ముఖ్యంగా, ఎప్పుడు ఎలాంటి జలవాయు పరివర్తనాలు చోటుచేసుకుంటాయో తెలియని హిందూ కుశ్ పర్యావరణాలలో వాటి అవసరం మరింత ఉంది. వైజ్ఞానిక మదింపులను ఆధారం చేసుకున్న ఆచరణ యోగ్యమైన విధానాలను మనం తు.చ. తప్పకుండా అమలు చేయాలి. క్రయోస్పియర్ ప్రమాదకర మండలాల పటాన్ని తయారు చేయడం ఆ దిశగా వేసే ముఖ్యమైన అడుగు కావచ్చు. భూకంపాలు, కొండ చరియలు విరిగిపడటం సంభవించగల ప్రాంతాలను గుర్తించే పటం మాదిరిగానే దాన్నీ రూపొందించుకోవచ్చు. ఎత్తైన ప్రాంతాల్లోనూ, గడ్డ కట్టిన సరస్సులు ఉన్న చోట్ల ఎక్కడెక్కడ ఎలా అభివృద్ధి చేయవచ్చో ఆ మ్యాప్ మార్గం చూపుతుంది. ముఖ్యంగా ప్రవాహ దిగువ ప్రాంతాల్లో ప్రజలు ఉన్న చోట్ల, లేదా కీలకమైన మౌలిక వసతులు ఉన్నచోట ఎలా వ్యవహరించాలో తెలుస్తుంది.

చివరగా, హై–రిస్క్ మండలాల్లో ఆదిలోనే హెచ్చరించగల వ్యవస్థలను నియోగించుకోవాలి. శిక్షణ ఇవ్వడం, మాక్ డ్రిల్స్ నిర్వహించడం ద్వారా ప్రజలను సన్నద్ధులను చేసే కార్యక్రమాన్ని పటిష్ఠపరచుకోవాలి. కొద్ది నిమిషాల ముందు హెచ్చరించినా ప్రాణాలను కాపాడుకునేందుకు ఎంతో అవకాశం ఇచ్చినట్లు అవుతుంది.

– మహమ్మద్ ఫారూక్ ఆజమ్ । గ్లేసియాలజీ, హైడ్రాలజీ ప్రొఫెసర్, ఐఐటీ, ఇండోర్
– శాశ్వతా సన్యాల్ । ఇంటర్వెన్షన్ మేనేజర్, ఐసీఐఎంఓడీ
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

ఈ మైత్రి కలకాలం ఉంటుందా?

అభిప్రాయం



బి.టి. గోవిందరెడ్డి

కాలం కొత్త మార్పులను వెంట తీసుకొస్తుంది. దృఢమైన మిత్రదేశం అనుకున్న అమెరికా అర్థరహితమైన షరతులతో మన దేశంపై 50 శాతం సుంకాలు విధించింది. మరోపక్క శత్రు దేశమనుకున్న చైనా సన్నిహితమవుతోంది. ట్రంప్ చర్యలను 'ఆర్థిక దౌర్జన్యం'గా చైనా అభివర్ణించింది. ఇది వినడానికి బాగుంది. చైనా మనకు మద్దతుగా నిలిచిందుకు సంతోషించాలి. కానీ చైనాను విశ్వసించవచ్చా?

భారత–చైనాల మధ్య ఏర్పడుతున్న చెలిమి ఇద్దరికీ ప్రయోజనకరమైనది. ట్రంప్ రూపంలో ప్రపంచ వాణిజ్యంలో చెలరేగుతున్న పెను తుపానులో ఈ చెలిమి వికసించింది. కానీ దీర్ఘకాలం దీన్ని నిలబెట్టుకోవడానికి చేయవలసింది చాలా ఉంది. ఉభయ దేశాల వాణిజ్య పరిమాణం చాలా పెద్దది. కానీ అసమతుల్యమైనది. 2024–25లో మన దేశం 11,350 కోట్ల డాలర్ల (రూ. 9.54 లక్షల కోట్లు) విలువైన సరుకులను చైనా నుంచి దిగుమతి చేసుకుంది. కానీ ఇదే కాలంలో ఆ దేశానికి మన ఎగుమతులు కేవలం రూ. 1,430 కోట్ల డాలర్లు (రూ. 1.20 లక్షల కోట్లు) మాత్రమే. వాణిజ్యం కొనసాగుతున్నా చైనాతో ఇంకా మన సంబంధాలు పూర్తిగా మెరుగుపడలేదు. ఎల్ఏసీ సమస్య అలాగే ఉంది. అరుణాచల్ ప్రదేశ్‌లోని మన గ్రామాలకు కొత్త పేర్లు పెట్టడం చైనా విరమించుకుంటుందా, కొనసాగిస్తుందా అన్నది వెంటనే చెప్పలేం. టిబెట్‌లోని యార్లుంగ్ సాంగ్‌పో (బ్రహ్మపుత్ర) నదిపై అతి పెద్ద జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మాణానికి చైనా సన్నాహాలు చేసుకుంటోంది. నదీ ప్రవాహపు దిగువ భాగానికి దీనివల్ల సమస్యలు ఉత్పన్నం కావని ఆ దేశం చెబుతోంది. అయినా మన జాగ్రత్తలో మనం ఉండక తప్పదు.



◆ రష్యా అధ్యక్షుడు పుతిన్ చైనాను 'అవసరమైన భాగస్వామి'గా పరిగణిస్తున్నారు తప్ప, 'నమ్మకమైన మిత్రుడి'గా భావించటం లేదు. మనమూ ఈ తరహాలోనే ఆచితూచి అడుగేయాలి.

పాకిస్తాన్‌కు యుద్ధ విమానాలు, క్షిపణులు, యుద్ధ నౌకలు సరఫరా చేస్తోంది చైనా. జలాంతర్గాముల్ని అందించేందుకు సంసిద్ధంగా ఉంది. చైనా–పాకిస్తాన్ ఆర్థిక కారిడార్ (సీపీఈసీ) ఇంకా శైశవ దశలోనే ఉన్నా ఆ దిశగా అడుగులు పడుతున్నాయి. ఇక ఉగ్రవాదం విషయంలో అది ఎప్పుడూ పాకిస్తాన్ పక్షానే ఉంది. ఇవన్నీ భద్రతాపరంగా మనకు చైనాతో ఉన్న సమస్యలు.

చైనాతో గాఢమైన అనుబంధం ఉన్న రష్యా కూడా ఆ దేశంతో ఉన్న సంబంధాల విషయంలో ఎంతో జాగ్రత్తగా అడుగు వేస్తోంది. ఆ రెండు దేశాల మధ్యా వాణిజ్యం 24,000 కోట్ల డాలర్ల (రూ. 20.1 లక్షల కోట్లు)కు చేరుకుంది. అయినా రష్యా అధ్యక్షుడు పుతిన్ చైనాను 'అవసరమైన భాగస్వామి'గా మాత్రమే పరిగణిస్తున్నారు తప్ప 'నమ్మకమైన మిత్రుడి'గా భావించటం లేదు. మనమూ ఈ తరహాలోనే ఆచితూచి అడుగువేయాలి. భారత్–చైనా–రష్యా మైత్రి గురించి ఇప్పుడు ప్రపంచమంతా మాట్లాడుకుంటున్నది. 820 కోట్ల మంది ప్రజలున్న ఈ మూడు దేశాల సమష్టి ఆర్థిక శక్తి దాదాపు 54 లక్షల కోట్లు. అంటే ప్రపంచంలో మూడోవంతు ఉత్పాదకత ఈ మూడు దేశాల్లోనే ఉంది. ఈ మూడూ చేతులు కలిపితే సంప్రదాయ పాశ్చాత్య నియంత్రిత వాణిజ్యానికి పెను సవాలే!

సుంకాల విషయంలో మనకు మద్దతుగా అమెరికాను చైనా విమర్శించటం స్నేహపూర్వకమైనదనటంలో సందేహం లేదు. కానీ మన పట్ల సానుభూతి ఉండటం మాత్రమే సరిపోదు. ఇరుదేశాల మధ్యా వాణిజ్యంలో సమతూకం ఏర్పడేలా, పాకిస్తాన్‌కు విచ్చలవిడి ఆయుధ సరఫరాపై పునరాలోచించుకునేలా, నదీజలాల డేటాలో పారదర్శకంగా ఉండేలా చైనా చర్యలుంటే ఇరు దేశాల మైత్రి ఉన్నత శిఖరాలకు చేరుతుంది. ఆ దిశగా చైనా అడుగులు వేయాలి.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్టు

అలా రాష్ట్రపతి అయ్యారు!

ఇన్ బాక్స్

కొన్ని సందర్భాల్లో ప్రత్యర్థుల తొందరపాటు నిర్ణయాలు మనకు అనుకూలంగా మారతాయి. ఇందుకు మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ రాష్ట్రపతిగా ఎన్నికైన విధం ఒక ఉదాహరణ:

13వ భారత రాష్ట్రపతి ఎన్నికలు 2012 జూలై 19న జరుగనున్నాయి. తమ పార్టీ అభ్యర్థిగా ఎవరిని చేస్తే బాగుంటుందని సెక్రెటరీ అహ్మద్ పటేల్‌ను కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ అడిగారు. అందుకాయన సింపుల్‌గా మన్‌మోహన్ సింగ్‌ను రాష్ట్రపతిగా, 'ప్రణబ్ దా'ను ప్రధానిగా చెయ్యమని చెప్పారు. దానికి ఆమె ఏమీ స్పందించలేదు. విషయం తెలుసుకున్న ప్రణబ్ ముఖర్జీ చిరకాలంగా ఆశిస్తున్న ప్రధాని పదవి రాదని అర్థమై రాష్ట్రపతిగా పోటీ చేస్తానని సోనియాతో చెప్పినా ఫలితం లేక పోయింది. ఉప రాష్ట్రపతిగా ఉన్న మహమ్మద్ హమీద్ అన్సారీని బరిలో నిలపాలనేది సోనియా ఆలోచన. కానీ యూపీఏ కూటమిలో కొందరు దానికి సుముఖంగా లేరు. అప్పటి పరిస్థితుల్లో యూపీఏ అభ్యర్థి గట్టెక్కాలంటే (ఎలెక్టోరల్ కాలేజ్) మరో లక్ష క్రాస్ ఓట్లు ఎన్డీఏ క్యాంపు నుండి రాబట్టుకోవాలి. హమీద్ అన్సారీ, ప్రణబ్ ముఖర్జీలకు మద్దతు ఇవ్వబోనని తృణమూల్ కాంగ్రెస్ నాయకురాలు మమత బెనర్జీ తేల్చేశారు. తనకు నచ్చిన అభ్యర్థిని సమాజ్ వాదీ పార్టీ నాయకునితో చర్చించి తెలియచేస్తానని సోనియాకు మాటిచ్చారు. కానీ, రెండు రోజుల తర్వాత ఆమె ఎస్పీ నేత ములాయం సింగ్ యాదవ్‌తో కలిసి చేసిన పత్రికా ప్రకటనలో ఏపీజే కలాం, మన్మోహన్ సింగ్, సోమనాథ్ ఛటర్జీలలో ఒకరికి రాష్ట్రపతి పదవి కట్టబెడతామని డిక్లేర్ చేశారు.




రేపు ప్రణబ్ ముఖర్జీ వర్ధంతి

తనను పక్కన పెట్టి అలా ప్రకటించడంతో మరుసటి రోజు యూపీఏ అభ్యర్థిగా ప్రణబ్ పేరును అధికారికం చేశారు సోనియా. అదే రోజు సాయంత్రం మమతను సంప్రదించకుండానే ప్రణబ్‌కు మద్దతు పలికారు ములాయం. తన చాణక్యంతో కొందరు ఎన్డీఏ ఎంపీ, ఎమ్మెల్యేలనూ తనవైపు తిప్పుకొన్నారు ప్రణబ్ దాదా. చివరికి మమతా దీదీ కూడా ఆయనకు మద్దతు పలకాల్సి వచ్చింది. మమత తొందరపాటు చర్యతో సోనియా మనసు మారి ప్రణబ్‌కు అభ్యర్థిత్వం దక్కింది. 7.13 లక్షల (69 శాతం) ఓట్లతో రాష్ట్రపతి పీఠానికి ఎన్నికయ్యారు. ఇటువంటి ఆసక్తికరమైన విషయాలెన్నో ఆయన కుమార్తె శర్మిష్ఠా ముఖర్జీ రాసిన 'ప్రణబ్, మై ఫాదర్' పుస్తకంలో ఉన్నాయి.

– జిల్లా గోవర్ధన్ । మాజీ పీఎఫ్ కమిషనర్, ముంబై

డేటా పాయింట్



రామనామ స్మరణ

జ్యోతిర్మయం

అంతా ఆ భగవంతుడి దయే అనుకోవాలి. ప్రతిదీ మంచికే జరుగుతుంది. కాబట్టి భారమంతా అతనిదే అనుకుని బాధ్యతలను నిర్వర్తించుకుంటూ పోవాలి. అప్పుడు జ్ఞాని ప్రపంచాన్ని చూస్తాడు. అజ్ఞాని ప్రపంచాన్ని ద్వేషిస్తాడు. జ్ఞానికి నిద్ర, మేల్కొలుపు, నిద్రలో మేల్కొనే స్థితి, మేల్కొనే స్థితిలో నిద్ర... అన్నీ ఒకటే!

ఎవరైనా మొదట తనను తాను తెలుసుకోవాలి. తనను తాను సరిగ్గా క్రమపద్ధతిలో తెలుసుకోలేని వ్యక్తి ప్రపంచాన్ని తెలుసుకోవడం అసాధ్యం. కానీ అలాకాక అంతా తెలుసుకున్నానని అనుకుంటే, అది పునాది లేని గోడ లాంటిదే. దైవకృపను పూర్తి శరణాగతి ద్వారా పొందవచ్చు. శరణాగతి అనేది షరతులతో కూడుకున్నది కాకూడదు. ఆరాధన కేవలం మాటలు కాదు. అది హృదయం నుండి వచ్చి హృదయంలో కలిసిపోవాలి. దీనినే ఆరాధన అంటారు. ఇదే కృప.

ఆలోచనలు మనస్సు. ఆ ఆలోచనా రూపం ప్రపంచం. ప్రతి దానికీ కేంద్రం హృదయం. రామ అనే పదంలో, 'రా' అనే అక్షరం ఆత్మ రూపాన్ని సూచిస్తుంది. 'మ' అనే అక్షరం నేను అనే అహంకార రూపాన్ని సూచిస్తుంది. ఒకరు నిరంతరం సదా రామ... రామ... అని జపిస్తూ ఉంటే, 'మ' అనే అక్షరం 'రా' అక్షరంతో కలిసిపోయి అదృశ్యమవుతుంది. 'రా' రూపం మాత్రమే మిగిలి ఉంటుంది. ఈ స్థితి సంభవించినప్పుడు, ధ్యానం చేసే ప్రయత్నం కూడా ఆగిపోతుంది. నిజమైన స్థితి, శాశ్వత ధ్యానం మిగిలి ఉంటుంది. కనుక మంచి మార్గంలో నడుద్దాం.

– యామిజాల జగదీశ్


పాస్‌పుస్తకాలు, ఆధార్ జిరాక్స్ కాపీలను పీఏసీఎస్ వద్ద వరుసలో ఉంచి రాస్తారోకోకు వెళ్లిన రైతులు


నల్లగొండ జిల్లా పెద్దవూరలో రాస్తారోకో చేస్తున్న రైతులు

అదే వరుస.. అదే ప్రయాస

- రాష్ట్రవ్యాప్తంగా యూరియా కోసం అన్నదాతలకు తప్పని తిప్పలు
- గంటల తరబడి నిరీక్షణ.. పలుచోట్ల అధికారులతో వాగ్వాదం, ధర్నాలు

సాక్షి నెట్‌వర్క్: రాష్ట్రవ్యాప్తంగా యూరియా కోసం అన్నదాతల కష్టాలు కొనసాగుతున్నాయి. గంటల తరబడి క్యూలలో నిరీక్షించినా ఒక్క బస్తా యూరియా కూడా అందడం లేదంటూ పలు ప్రాంతాల్లో రైతులు శుక్రవారం పీఏసీఎస్ అధికారులతో వాగ్వాదానికి దిగారు. మరి కొన్ని చోట్ల రైతులు రోడ్డెక్కి ధర్నాలు, నిరసనలు చేపట్టారు.

- సరిపడా యూరియా అందించాలంటూ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని తొర్రూర్ ప్రధాన రహదారిపై ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సమీపంలో రైతులు రెండు గంటలపాటు రాస్తారోకో నిర్వహించారు. అనంతరం కార్యాలయంలోకి దూసుకెళ్లగా పోలీసులు బలవంతంగా బయటకు పంపించారు.
- మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్‌లో తెలిసిన వారికే యూరియా ఇస్తున్నారంటూ రైతులు అధికారులతో వాగ్వాదానికి దిగారు.
- నల్లగొండ జిల్లా పెద్దవూర మండల కేంద్రంలో పలు గ్రామాలకు చెందిన సుమారు 200 మంది రైతులు పీఏసీఎస్ కార్యాలయం వద్ద గంటల తరబడి నిరీక్షించినా అధికారులు తాళాలు తీయకపోవడంతో జడ్చర్ల–కోదాడ జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. అదే రహదారిపై వెళ్తున్న తెలంగాణ రైతు కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి, సభ్యులు భూమి సునీల్, భవానిలు రాస్తారోకోలో చిక్కుకున్నారు. కోదండరెడ్డి రైతుల సమస్యను అడిగి తెలుసుకొని కలెక్టర్‌తో మాట్లాడించి యూరియా కొరత లేకుండా చూస్తానని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.
- వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం ఏబీ తండా గ్రామ శివారు ఉట్టి తండాకు చెందిన రైతు భూక్య బాలు తాను వేసిన 6 ఎకరాల పత్తి పంటకు యూరియా దొరకట్లేదన్న మనోవేదనతో 20 గుంటల్లోని పత్తిచేనును పీకేశాడు. 2, 3 రోజుల్లో యూరియా లభించకపోతే మిగిలిన పత్తి పంటను పీకేస్తానని చెప్పాడు.
- నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతలలోని పీఏసీఎస్ గోదాం ఎదుట రైతులు యూరియా కోసం క్యూ కట్టగా నిల్వ ఉన్న 150 బస్తాలను ఒక్కో రైతుకు రెండేసి బస్తాల చొప్పున పంపిణీ చేయడంతో చాలా మంది నిరాశతో వెనుదిరిగారు.
- మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం గవ్వలపల్లిలో రైతులు యూరియా టోకెన్ల కోసం సుమారు అర కిలో మీటర్ వరకు క్యూలో గంటల కొద్దీ నిలబడ్డారు.
- జోగుళాంబ గద్వాల జిల్లాలోని గట్టు మండలంలోని పీఏసీఎస్ వద్దకు రైతులు భారీగా తరలిరావడం వల్ల గందరగోళం తలెత్తడంతో పోలీసు బందోబస్తు మధ్య యూరియా బస్తాలను పంపిణీ చేశారు.
- వనపర్తి జిల్లాలోని ఆత్మకూర్, అమరచింత, పాన్‌గల్ లోనూ పోలీసు బందోబస్తు మధ్య యూరియా సరఫరా చేయాల్సి వచ్చింది.


మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో యూరియా ఇవ్వడం లేదని అధికారిపై మహిళా రైతుల ఆగ్రహం


మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేట పీఏసీఎస్ కేంద్రం వద్ద యూరియా కోసం ఎదురుచూస్తున్న రైతులు

రూ. 100 కోట్ల 'మెటా ఫండ్' స్కాంపై తొలి కేసు

- ఓ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో నమోదు చేసిన కరీంనగర్ పోలీసులు
- సూత్రధారుల్లో ఒకరు థాయ్‌లాండ్ పరారీ, విజయవాడలో తలదాచుకున్న ఇద్దరు పాత్రధారులు
- మెటా ఫండ్ మోసాలపై గతంలోనే 'సాక్షి' వరుస కథనాలు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: క్రిప్టో కరెన్సీ పేరిట జరిగిన సుమారు రూ. 100 కోట్ల మెటా ఫండ్ యాప్ స్కాంపై కరీంనగర్ పోలీసులు తొలి కేసు నమోదు చేశారు. రోజుకు రూ. 6 లక్షల వరకు సంపాదించొచ్చని ఆశచూపి శ్రీరామ టింబర్ డిపో యజమాని దాసరి రమేశ్, దాసరి రాజు అనే వ్యక్తులు తన నుంచి రూ. 54 లక్షలకుపైగా వసూలు చేశారని ఆరోపిస్తూ కశ్మీర్ గడ్డకు చెందిన పుప్పాల శ్రీకర్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుతో జూలై 17న కేసు నమోదు చేశారు. అయినప్పటికీ ఈ విషయాన్ని ఇప్పటివరకు గోప్యంగా ఉంచారు. తాజాగా ఈ కేసు దర్యాప్తు సీసీఎస్‌కు బదిలీ కావడంతో విషయం వెలుగులోకి వచ్చింది. వాస్తవానికి 'మెటా ఫండ్ మోసాలపై జూలై 11 నుంచే 'సాక్షి' వరుస కథనాలు ప్రచురిస్తూ వచ్చింది. ఈ కేసును సీసీఎస్‌కు అప్పగించినా దర్యాప్తును తానే పర్యవేక్షిస్తున్నానని సీపీ గౌస్ ఆలం 'సాక్షి'కి తెలిపారు.

నిందితులంతా స్థానికులే..: కరీంనగర్‌కు చెందిన సతీశ్, ప్రకాశ్ అనే వ్యక్తులు హైదరాబాద్ నుంచి లోకేశ్ అనే వ్యక్తిని మెటా ఫండ్ యజమానిగా చూపుతూ పలువురు ఔత్సాహిక పెట్టుబడిదారులతో గతంలో సమావేశమయ్యారు. క్రిప్టో ట్రేడింగ్‌లో పెట్టుబడి పెడితే భారీ లాభాలు వస్తాయని.. తమకు రోజుకు రూ. 5–6 లక్షలు ఖాతాలో పడుతున్నాయని నమ్మబలికారు. నిందితుల మాటలు నమ్మిన వారంతా భారీగా పెట్టుబడి పెట్టారు. వారికి దాసరి రాజు అనే స్కాం పాత్రధారి బాధితుల సెల్‌ఫోన్లలో మెటా యాప్ ఐడీలు క్రియేట్ చేసి ఇచ్చేవాడు. యాప్‌లో చూపే డాలర్లు పెట్టుబడిదారులు ఆర్జించిన సొమ్ముకు సమానమని నమ్మించాడు. ఇలా ఒక్క కరీంనగర్‌లోనే రూ. 30 కోట్ల వరకు ఈ ముఠా కొల్లగొట్టిందని.. జగిత్యాల, సిరిసిల్లతోపాటు ఇతర ప్రాంతాల నుంచి నిందితులు సుమారు రూ. 100 కోట్లు కాజేశారని బాధితులు ఆరోపిస్తున్నారు. లోకేశ్ తమను మోసగించి థాయ్ లాండ్‌పరారయ్యాడని సతీశ్, ప్రకాశ్‌లు బాధితులకు చెబుతుండగా వారు నమ్మట్లేదు. కేసు గురించి తెలుసుకున్న రమేశ్, రాజు విజయవాడకు పారిపోయారు.

రైతులకు యూరియా కష్టాలు రావొద్దు

- పీఏసీఎస్‌ల ద్వారా మాత్రమే పంపిణీ చేయండి: పొంగులేటి

కూసుమంచి: యూరియా కోసం రైతులు ఇబ్బంది పడకుండా చూడాలని, పాలేరు నియోజకవర్గంలో పీఏసీఎస్‌ల ద్వారా మాత్రమే యూరియా సరఫరా జరిగేలా తీసుకోవాలని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలో వివిధ అభివృద్ధి పనులకు శుక్రవారం శంకుస్థాపన చేసిన మంత్రి.. గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కిట్లు పంపిణీ చేశారు. అనంతరం కలెక్టర్ అనుదీప్‌తో కలిసి కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో వ్యవసాయాధికారులతో యూరియా సరఫరాపై సమీక్షించారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి ఆశించిన మేర యూరియా సరఫరా కావడం లేదని పొంగులేటి తెలిపారు. అయినప్పటికీ అందుబాటులో ఉన్న నిల్వలనే రైతులకు సక్రమంగా సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వారంలో జిల్లాకు 1,600 మెట్రిక్ టన్నుల యూరియా రానుందని.. అది సక్రమంగా రైతులకు అందేలా చూడాలని సూచించారు. ఎవరైనా అవకతవకలకు పాల్పడితే వేటుతప్పదని మంత్రి హెచ్చరించారు.


కాటమయ్య రక్షణ కిట్‌తో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

సీఎం రేవంత్‌పై ఈడీకి బీఆర్‌ఎస్ నేత క్రిశాంక్ ఫిర్యాదు

సాక్షి, న్యూఢిల్లీ: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీఆర్‌ఎస్ అధికార ప్రతినిధి మన్నె క్రిశాంక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కి ఫిర్యాదు చేశారు. సీఎం రేవంత్ బావమరిదికి చెందిన 'శోధ కన్‌స్ట్రక్షన్స్', 'కేఎల్‌ఎస్‌ఆర్ ఇన్‌ఫ్రాటెక్ కంపెనీ'లకు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కాంట్రాక్టులు దోచిపెట్టిందని విమర్శించారు. ఈ కంపెనీలకు, సీఎంకు మధ్య ఆర్థిక లావాదేవీలు ఉన్నాయని ఆరోపించారు. అందుకే ఈ కంపెనీలతో పాటు సీఎం రేవంత్‌పై విచారణ జరిపించాలని ఆయన ఈడీకి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం ఢిల్లీలోని ఈడీ కార్యాలయంలో క్రిశాంక్.. తన వద్ద ఉన్న ఆధారాలను అధికారులకు అందచేశారు. తర్వాత క్రిశాంక్ మీడియాతో మాట్లాడుతూ.. '2022లో కేవలం రూ. 7,13,113 లక్షల ఆర్థిక లావాదేవీలు ఉన్న రేవంత్ రెడ్డి బావమరిది శోధ కన్‌స్ట్రక్షన్స్‌కు అమృత్ టెండర్లు, సింగరేణి మైనింగ్ కాంట్రాక్టు, డిండి ఇరిగేషన్ కాంట్రాక్టు ఇవ్వడంపై విచారణ చేపట్టాలని ఫిర్యాదు చేశాను' అని పేర్కొన్నారు. రేవంత్ అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులకే శోధ కంపెనీకి రూ.1,137 కోట్ల అమృత్ కాంట్రాక్ట్, రూ.115 కోట్ల సింగరేణి మైనింగ్ కాంట్రాక్ట్, రూ.365 కోట్ల డిండి కాంట్రాక్ట్‌లను అప్పగించడంలో ఉన్న లోగుట్టు ఏమిటనేది సమాధానం చెప్పాలన్నారు. ఇక కేఎల్‌ఎస్‌ఆర్ ఇన్‌ఫ్రా టెక్ కంపెనీకి రేవంత్ ప్రభుత్వం రూ.168 కోట్ల మిషన్ భగీరథ కాంట్రాక్ట్, రూ.191 కోట్ల పలేరు రిజర్వాయర్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్, రూ.319 కోట్ల రాజీవ్ గాంధీ లిఫ్ట్ ఇరిగేషన్ పథకం కాంట్రాక్ట్‌లను అప్పగించిందని ఆరోపించారు.

చేప పిల్లల టెండర్లకు నేడు చివరి తేదీ

- ఇప్పటివరకు ఒక్క టెండరు కూడా దాఖలు చేయని కాంట్రాక్టర్లు
- గత టెండర్లపై విచారణ జరుగుతోందంటున్న మంత్రి వాకిటి శ్రీహరి



సాక్షి, హైదరాబాద్: ఉచిత చేప పిల్లల సరఫరా కోసం మత్స్యశాఖ ఆహ్వానించిన టెండర్లకు ఒక్క కాంట్రాక్టర్ కూడా ముందుకురాలేదని తెలిసింది. ఆగస్టు 30లోగా టెండర్లు పూర్తి చేసి సెప్టెంబర్ మొదటి వారం నుంచి చేపలు వదలాలని ఆశించిన మత్స్యశాఖ ఆశలపై కాంట్రాక్టర్లు నీళ్లు చల్లారు. 2025–26 కాలానికి 33 జిల్లాల్లో 26,326 నీటి వనరుల్లో రూ. 93.62 కోట్ల వ్యయంతో 84.62 కోట్ల చేపలు వదలాలని మత్స్యశాఖ భావించింది. దీనిపై ఇటీవల ఆ శాఖ మంత్రి వాకిటి శ్రీహరి టెండర్లపై ప్రకటించారు. అయితే మంత్రి ప్రకటించి 20 రోజులకుపైగా కావొస్తున్నా ఒక్కటంటే ఒక్క టెండర్ కూడా దాఖలు చేయలేదు. రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలతో చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు నిండి ఉన్నా... జలాశయాలు మాత్రం వట్టిపోయి ఉన్నాయి. మొత్తంగా ఈ టెండర్లు ఖరారు అయ్యేదెప్పుడో... చేపపిల్లలు వదిలేదెప్పుడో చూడాలి మరి. అయితే టెండర్లు ముందస్తుగా పిలువకపోవడం ఒక కారణం అయితే.. గత బకాయిలు రూ. 80 కోట్ల వరకు ఉన్నవి చెల్లించాలని కాంట్రాక్టర్లు డిమాండ్ చేయడం మరో కారణం. పాత బకాయిలు చెల్లించాలని ఇటీవల మత్స్యశాఖ కార్యాలయం ముందు చేప రైతులు అర్ధనగ్న ప్రదర్శన కూడా చేశారు. అయితే మత్స్యశాఖ మాత్రం గత బకాయిలపై విజిలెన్స్ విచారణ జరుగుతుందని, విచారణ తర్వాతే బకాయిలు చెల్లిస్తామని చెప్పడం విశేషం.

బాలికల వసతిగృహంలో ఏసీబీ అధికారుల తనిఖీ


వసతిగృహంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏసీబీ డీఎస్పీ జగదీశ్‌చందర్

రామన్నపేట: యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహంలో శుక్రవారం ఏసీబీ అధికారులు తనిఖీ నిర్వహించారు. ఏసీబీ నల్లగొండ డీఎస్పీ ఎం.జగదీశ్‌చందర్ నేతృత్వంలో ఫుడ్‌సేఫ్టీ, తూనికలు కొలతలు, శానిటేషన్, ఆడిట్ డిపార్ట్‌మెంట్ అధికారులు ఉదయం 6 గంటలకు వసతిగృహానికి చేరుకున్నారు. మోత్కూరులో ఉన్న వసతిగృహం ఇన్‌చార్జి అధికారికి సమాచారం అందించారు. రికార్డులను, వస్తు నిల్వలను, పరిసరాలను పరిశీలించారు. అల్పాహారం ఇచ్చే సమయంలో 40 మంది విద్యార్థులకు తొమ్మిది మంది మాత్రమే ఉన్నట్లు గమనించారు. పండుగ సెలవులకు వెళ్లిన విద్యార్థులు తిరిగి రాలేదని వాచ్‌విమెన్ యాదమ్మ చెప్పింది. పాలు, కూరగాయలు సరఫరా చేసే వారిని పిలిపించి వివరాలు తీసుకున్నారు. తనిఖీల అనంతరం జగదీశ్‌చందర్ విలేకరులతో మాట్లాడారు. హాస్టల్ నిర్వహణలో నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణలోపం ఉందని, రికార్డులు, పారిశుధ్యం నిర్వహణ సక్రమంగా లేదని, వంటకు నాసిరకం వస్తువులను వాడుతున్నారని తెలిపారు. బియ్యం తదితర నిల్వలు రికార్డులకు అనుగుణంగా ఉన్నాయని చెప్పారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు.

గుడ్ల టెండర్‌కు హైకోర్టు అనుమతి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీలు, ప్రభుత్వ విద్యా సంస్థలకు గుడ్ల సరఫరా కోసం ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన టెండర్లకు హైకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ టెండర్లను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను కొట్టివేసింది. పిటిషన్ వేసి.. టెండర్ల ప్రక్రియ సజావుగా సాగకుండా అడ్డుకునే ప్రయత్నం చేసినందుకు పిటిషనర్‌కు రూ.లక్ష జరిమానా విధించింది. మధ్యాహ్న భోజన పథకం మినహా.. అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు అన్ని రకాల గురుకులాలు, కేజీబీవీలు, వసతి గృహాలకు కలిపి టెండర్లు నిర్వహించుకోవాలని ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ ఏడాది సెప్టెంబర్ ఒకటి నుంచి వచ్చే ఏడాది ఆగస్టు 31 వరకు గుడ్లు సరఫరా చేయాల్సి ఉంటుంది. అయితే షరతులకు అంగీకారం తెలపని ఎంఏ పౌల్ట్రీ అండ్ ఫీడ్‌కు అనుకూలంగా టెండర్ ఖరారు చేయడాన్ని సవాల్ చేస్తూ రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంకు చెందిన సిరి ఫామ్స్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ నగేశ్ భీమపాక శుక్రవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఈ నెల 12న పిటిషనర్ సమర్పించిన అభ్యంతరాలను పట్టించుకోకుండా హైదరాబాద్ కలెక్టర్ టెండర్ ఖరారు చేయడం చట్టవిరుద్ధమన్నారు. టెండర్ ప్రక్రియను నిలుపుదల చేస్తూ ఆదేశాలివ్వాలని విజ్ఞప్తి చేశారు. అయితే అన్ని నిబంధనల మేరకే టెండర్ దాఖలు చేశామని అనధికారిక ప్రతివాది తరఫు న్యాయవాది పేర్కొన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. పిటిషన్‌ను కొట్టివేశారు. టెండర్ల ప్రక్రియను అడ్డుకునే ప్రయత్నం చేసినందుకు రూ.లక్ష జరిమానా చెల్లించాలని పిటిషనర్‌ను ఆదేశించారు.

కల్యాణలక్ష్మి పథకానికి కాంగ్రెస్ ప్రభుత్వం తూట్లు

- 'ఎక్స్' వేదికగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత విమర్శలు




సాక్షి, హైదరాబాద్: కేసీఆర్ హయాంలో తీసుకొచ్చిన కల్యాణలక్ష్మి పథకానికి కాంగ్రెస్ ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. 'కల్యాణ కానుక.. ఎప్పుడందేనో' అని సాక్షిలో ప్రచురితమైన కథనంపై శుక్రవారం 'ఎక్స్' వేదికగా కవిత స్పందించారు. నెలల తరబడి కల్యాణలక్ష్మి దరఖాస్తులు పరిశీలించకుండా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. తహసీల్దార్ కార్యాలయాల్లోనే ఏకంగా 61 వేలకుపైగా ఉన్నాయని, అర్హత నిర్ధారణ స్థాయిలో 21 వేలకుపైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడించారు. ఎన్నికలకు ముందు పేదలు, ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మిలో రూ.లక్షతో పాటు తులం బంగారం ఇస్తామని హామీలిచ్చి.. గద్దెనెక్కిన తర్వాత వాటిని పూర్తిగా విస్మరించిందని కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. దరఖాస్తులు కూడా పరిశీలించకుండా క్రమేణా కల్యాణలక్ష్మిని కనుమరుగు చేసే కుట్రకు ప్రభుత్వం తెరతీసిందని ఆరోపించారు.

130 ఎకరాల్లో కోస్టల్ రోడ్ గార్డెన్ అభివృద్ధి

సాక్షి, హైదరాబాద్: ముంబైకర్ల కోసం రిలయన్స్ ఫౌండేషన్ 130 ఎకరాల్లో విస్తరించి ఉన్న కోస్టల్ రోడ్ గార్డెన్స్‌ను అభివృద్ధి చేసే బాధ్యతను తీసుకున్నట్టు రిలయన్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, చైర్మన్ నీతా అంబానీ తెలిపారు. అలాగే ముంబై నడిబొడ్డున 2 వేల పడకలతో మెడికల్ సిటీని ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు. ఇది కేవలం ఆస్పత్రి మాత్రమే కాదని ఏఐ పవర్డ్ డయాగ్నొస్టిక్, అత్యాధునిక వైద్య సాంకేతికతను కలిగి ఉంటుందని పేర్కొన్నారు.

కాళేశ్వరంపై చర్చిస్తామంటే వణుకుతున్నారు


ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



సాక్షి, హైదరాబాద్: 'కాళేశ్వరం ప్రాజెక్టును కట్టింది బీఆర్‌ఎస్ హయాంలోనే. అది కూలిపోయిందీ బీఆర్‌ఎస్ హయాంలోనే. ప్రాజెక్టు కట్టేటప్పుడు దానికి కర్త, కర్మ, క్రియ.. అన్నీ తానేనని కేసీఆర్ చెప్పుకున్నారు. అసెంబ్లీలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చి మరీ గొప్పలకు పోయారు. మేడిగడ్డ ప్రాజెక్టు కుంగిపోవడంతో తెలంగాణ ప్రతిష్ట గంగలో కలిసింది. ఈ ప్రాజెక్టులో జరిగిన అక్రమాలపై పీసీఘోష్ ఇచ్చిన నివేదికపై అసెంబ్లీలో చర్చ జరిగితే తమ బండారం బయటపడుతుందని బీఆర్‌ఎస్‌లో వణుకు ప్రారంభమైంది' అని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. కాళేశ్వరంపై అసెంబ్లీలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తామని బీఆర్‌ఎస్ అడుగుతోందని, అసలు వాళ్ల పార్టీ ఆఫీసు తెలంగాణ భవన్‌లో ఇచ్చిన ప్రజెంటేషన్‌ను ఎవరు పట్టించుకున్నారని ఎద్దేవా చేశారు. కమిషన్ నివేదికను ప్రజల ముందుంచేందుకే అసెంబ్లీలో చర్చకు పెడుతున్నామని శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చెప్పారు. ఈ ప్రాజెక్టు కట్టిన ఇంజనీర్ల దగ్గరే వందల కోట్లు దొరుకుతున్నాయని, ఇప్పటికే కేసీఆర్ బండారం బట్టబయలైందని, ప్రజలు అన్ని విషయాలను గ్రహిస్తున్నారని అన్నారు. బీఆర్‌ఎస్ ఏం చెప్పదల్చుకుందో అసెంబ్లీలో చెప్పుకునే అవకాశం కల్పిస్తామని శ్రీనివాస్ వెల్లడించారు.

కాంగ్రెస్ బీసీలను మోసం చేసింది

- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: కామారెడ్డి డిక్లరేషన్ పేరిట ఓట్లు వేయించుకున్న కాంగ్రెస్ పార్టీ బీసీలను మోసగిస్తోందని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. కేవలం ఇద్దరు ఎంపీలతో కేసీఆర్ తెలంగాణ సాధించారని, కాంగ్రెస్, బీజేపీకి 311 మంది ఎంపీలు ఉన్నా బీసీ రిజర్వేషన్ల బిల్లు పార్లమెంటులో ఎందుకు పాస్ కావడం లేదని ప్రశ్నించారు. కేంద్రం పరిశీలనకు గవర్నర్ పంపిన ఆర్డినెన్స్‌పై స్పష్టత లేదని, జీవో పేరిట కాంగ్రెస్ కొత్త డ్రామా మొదలు పెట్టిందన్నారు. తెలంగాణ భవన్‌లో శ్రీనివాస్‌గౌడ్ శుక్రవారం మీడియాతో మాట్లాడారు. జీవో తెస్తే ప్రతిపక్షాలు కోర్టుకు వెళ్తాయనే ప్రచారాన్ని ప్రభుత్వం ప్రారంభించిందని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు బీఆర్‌ఎస్ వ్యతిరేకం కాదన్నారు. బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించిన తర్వాతే స్థానిక సంస్థలు జరపాలని శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. తమిళనాడు తరహాలో తెలంగాణలోనూ భూస్థాపితం అవుతుందనే భయంతో కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌ను ప్రకటించిందని ఎమ్మెల్సీ ఎల్.రమణ విమర్శించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలుపై శ్వేతపత్రం ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఖిలావరంగల్ తహసీల్దార్ ఆస్తులు రూ.5 కోట్లపైనే

- కార్యాలయంతోపాటు వివిధ ప్రాంతాల్లో ఏసీబీ దాడులు


నాగేశ్వర్‌రావు

సాక్షి, వరంగల్/వరంగల్‌క్రైం/చింతకాని: ఖిలా వరంగల్ తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావుపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదైంది. ఆయన పనిచేస్తున్న వరంగల్ నగరంలోని ఖిలా వరంగల్ తహసీల్దార్ కార్యాలయం, హనుమకొండలోని చైతన్యపురి నివాసంతోపాటు, ఖమ్మం జిల్లాలోని ఆయన స్వగ్రామం చింతకాని మండలం తిరుమలాపురం, చింతకాని మండలం అనంతసాగర్‌లోని కోళ్ల ఫారంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు శుక్రవారం దాడులు చేశారు. ఈ సందర్భంగా రూ.1,15,00,000 విలువ చేసే ఇంటి ఆస్తులు, రూ.1,42,98,500 విలువ చేసే 17 ఎకరాల 10 గుంటల వ్యవసాయ భూమి పత్రాలు, రూ.23,84,700 విలువచేసే 70 తులాల బంగారు ఆభరణాలు, రూ.92,000 విలువ చేసే 1,791 గ్రాముల వెండి ఆభరణాలు, రూ.34,78,000 విలువ చేసే రెండు కార్లు, ఒక ద్విచక్ర వాహనం, 3,28,195 విలువ చేసే 23 రిస్ట్ వాచ్‌లు, రూ.16,43,803 విలువ చేసే ఇంట్లోని ఏడు వస్తువులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మొత్తం విలువ రూ.5,02,25,198 ఉంటుందని ఏసీబీ అధికారులు తేల్చారు. మిగతా ఆస్తుల విలువపై కూడా విచారణ జరుగుతోందని, ఇప్పటివరకు లభించిన ఆస్తుల చిట్టా లెక్క ప్రభుత్వ విలువ ప్రకారమేనని, దీని విలువ బహిరంగ మార్కెట్‌లో ఎక్కువగా ఉంటుందని అధికారులు తెలిపారు. బండి నాగేశ్వర్‌రావును ఏసీబీ స్పెషల్ జడ్జి ముందు హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

ఏసీబీకి చిక్కిన కార్యదర్శి.. గ్రామస్తుల సంబరాలు

- కరీంనగర్ జిల్లా చల్లూరులో సంఘటన

వీణవంక(హుజూరాబాద్): కరీంనగర్ జిల్లా వీణవంక మండలం చల్లూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి కుంభం నాగరాజు రూ.20 వేలు లంచం తీసుకుంటూ శుక్రవారం ఏసీబీకి చిక్కాడు. దీంతో గ్రామస్తులు సంబరాలు చేసుకున్నారు. ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఓ కుటుంబం ఇంటినంబర్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంది. తర్వాత తమ పనికోసం పంచాయతీ కార్యదర్శి నాగరాజును సంప్రదించింది. అయితే నాగరాజు నెల రోజులుగా వారు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా స్పందించకుండా, రూ.20 వేలు ఇస్తేనే ఇంటి నంబర్ మంజూరు చేస్తానని చెప్పాడు. దీంతో బాధితులు ఏసీబీని ఆశ్రయించారు. ఈ క్రమంలో పంచాయతీ కార్యాలయంలో వారు కార్యదర్శికి రూ.20 వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

టపాసులు పేల్చి సంబరాలు

జీపీ కార్యదర్శి నాగరాజును ఏసీబీ అధికారులు పట్టుకున్నారనే విషయం తెలియడంతో గ్రామస్తులు పెద్దఎత్తున జీపీ వద్దకు చేరుకున్నారు. డీఎస్పీ విజయ్‌కుమార్.. నాగరాజు అరెస్టు వివరాలు వెల్లడిస్తుండగానే గ్రామస్తులు చప్పట్లతో అవినీతి అధికారి పీడ పోయిందని నినాదాలు చేశారు. అనంతరం టపాసులు పేల్చి, మిఠాయిలు పంచుకున్నారు. నాగరాజు అంతకు ముందు లంచాలకోసం పలువురిని వేధించాడని వారు తెలిపారు.



టపాసులు పేల్చి సంబరాలు జరుపుకుంటున్న గ్రామస్తులు. చిత్రంలో నాగరాజు

కలిసి నడుద్దాం..బలపడదాం!

భారత్‌-జపాన్‌ సంబంధాల్లో సువర్ణ అధ్యాయానికి శ్రీకారం

- కీలక రంగాల్లో పరస్పర సహకారం కోసం పదేళ్ల రోడ్‌మ్యాప్‌ సిద్ధం
- 'జపాన్‌ టెక్నాలజీ, ఇండియన్‌ టాలెంట్‌ విన్నింగ్‌ కాంబినేషన్‌'
- చంద్రయాన్‌–5 మిషన్‌లో జపాన్‌ భాగస్వామ్యం
- ప్రధాని మోదీ స్పష్టీకరణ
- జపాన్‌ ప్రధాని షిగెరుతో భేటీ
- పదేళ్లలో భారత్‌లో రూ. 6 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టనున్న జపాన్‌


ప్రధాని మోదీతో షిగెరు

టోక్యో: భారత్‌–జపాన్‌ మధ్య ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యంలో నూతన, సువర్ణ అధ్యాయానికి శ్రీకారం చుట్టినట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానం, రక్షణ సహా వివిధ కీలక రంగాల్లో పరస్పర సహకారం కోసం పదేళ్ల రోడ్‌మ్యాప్‌ సిద్ధం చేసినట్లు వెల్లడించారు. జపాన్‌తో ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలోపేతం చేసుకోవడమే లక్ష్యంగా రెండు రోజుల పర్యటన నిమిత్తం ప్రధాని మోదీ శుక్రవారం ఉదయం జపాన్‌కు చేరుకున్నారు. రాజధాని టోక్యోలో ఆయనకు ఘన స్వాగతం లభించింది. అదృష్టానికి, శుభానికి సంకేతంగా భావించే జపాన్‌ సంప్రదాయ దారూమా బొమ్మను బౌద్ధ మత గురువులు బహూకరించారు. అనంతరం జపాన్‌ ప్రధానమంత్రి షిగెరు ఇషిబాతో మోదీ సమావేశమయ్యారు. భారత్‌–జపాన్‌ సంబంధాలపై విస్తృతంగా చర్చించారు. సెమీకండక్టర్ల నుంచి అరుదైన ఖనిజాల సరఫరా దాకా.. కీలక రంగాల్లో సహకారంపై అభిప్రాయాలు పంచుకున్నారు. మానవ వనరుల అభివృద్ధి, సాంస్కృతిక సంబంధాలపైనా చర్చ జరిగింది. సుస్థిర ఇంధన కార్యక్రమం, బ్యాటరీ సరఫరా వ్యవస్థ భాగస్వామ్యం, ఆర్థిక భద్రత–సహకార కార్యక్రమాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఇరువురు నేతలు ఉమ్మడిగా మీడియా సమావేశంలో మాట్లాడారు. 'జపాన్‌ టెక్నాలజీ, ఇండియన్‌ టాలెంట్‌ విన్నింగ్‌ కాంబినేషన్‌' అని మోదీ ఉద్ఘాటించారు. రెండూ పూర్తిస్థాయిలో ఒక్కటైతే ఇక తిరుగుండదని తేల్చి చెప్పారు. భౌగోళిక రాజకీయాల పరంగా సవాళ్లు ఎదురవుతున్న నేపథ్యంలో భారత్‌, జపాన్‌ కలిసికట్టుగా పనిచేయాలని, ఒక దేశం బలాన్ని మరో ఉదేశం ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు. ప్రపంచ శాంతి, స్థిరత్వానికి భారత్‌–జపాన్‌ భాగస్వామ్యం అత్యంత కీలకమని తెలియజేశారు. ఉగ్రవాదం, సైబర్‌ సెక్యూరిటీకి సంబంధించి రెండు దేశాలు సమానమైన సవాళ్లు ఎదుర్కొంటున్నాయని చెప్పారు.

13 ఎంఓయూలపై సంతకాలు

ప్రపంచాన్ని మెరుగ్గా తీర్చిదిద్దడంలో ప్రజాస్వామ్య దేశాల పాత్ర సహజంగానే అధికంగా ఉంటుందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. ఆ దిశగానే భారత్‌, జపాన్‌ కలిసి ప్రయాణం సాగిస్తున్నాయని తెలిపారు. ఇరు దేశాల మధ్య బలీయ బంధానికి.. పెట్టుబడులు, నవీన ఆవిష్కరణలు, ఆర్థిక భద్రత, పర్యావరణ పరిరక్షణ, అత్యాధునిక సాంకేతికత, ఆరోగ్యం, రవాణా, ప్రజల మధ్య పరస్పర సంబంధాలు, ప్రభుత్వం నడుమ భాగస్వామ్యమే ప్రాతిపదిక అని వివరించారు. అత్యాధునిక టెక్నాలజీలో భాగస్వామ్యానికి తాము అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు వెల్లడించారు. డిజిటల్‌ భాగస్వామ్యం 2.0, కృత్రిమ మేధ(ఏఐ) సహకార కార్యక్రమంపై సంప్రదింపులు జరుగుతున్నాయని స్పష్టంచేశారు. భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న చంద్రయాన్‌–5 మిషన్‌లో జపాన్‌ సైతం పాలుపంచుకోనుందని ప్రకటించారు. జపాన్‌ ప్రధాని ఇషిబా మాట్లాడుతూ.. తదుపరి తరం సవాళ్లను సమర్థంగా ఎదుర్కోవాలంటే భారత్‌–జపాన్‌ సహకరించుకోవాల్సిందేనని స్పష్టంచేశారు. మోదీ–ఇషిబా భేటీ సందర్భంగా భారత్‌–జపాన్‌లు 13 అవగాహనా ఒప్పందాల (ఎంఓయూ)పై సంతకాలు చేశాయి. రాబోయే పదేళ్లలో భారత్‌లో జపాన్‌ 10 ట్రిలియన్‌ యెన్‌లు (రూ.6 లక్షల కోట్లు) పెట్టుబడిగా పెట్టాలని లక్ష్యంగా నిర్దేశించారు. రక్షణ, నూతన ఆవిష్కరణల రంగాల్లో సహకారాన్ని బలోపేతం చేసుకోవాలని ఇరుదేశాలు నిర్ణయానికొచ్చాయి.

భారత్‌, చైనా ఒక్కటైతేనే..

ప్రపంచ ఆర్థిక క్రమం(ఆర్డర్‌)లో స్థిరత్వం తీసుకురావాలంటే రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలైన భారత్‌, చైనా తప్పనిసరిగా కలిసి పనిచేయాలని ప్రధాని మోదీ వెల్లడించారు. ప్రపంచ శాంతి, స్థిరత్వం, సౌభాగ్యం కోసం ఆసియాలో దిగ్గజ దేశాలైన భారత్‌, చైనా మధ్య స్నేహ సంబంధాలు బలపడాల్సిందేనని పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ ట్రంప్‌ సాగిస్తున్న టారిఫ్‌ల యుద్ధాన్ని పరోక్షంగా ప్రస్తావించారు. ఇలాంటి పరిస్థితుల్లో భారత్‌–చైనాలు ఒక్కటైతే ఇరుదేశాలతోపాటు ప్రపంచ దేశాలకు సైతం మేలు జరుగుతుందని చెప్పారు. జపాన్‌ పత్రిక యోమియురి షిమ్‌బన్‌కు ప్రధాని మోదీ శుక్రవారం ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. భారత్‌–చైనా సంబంధాల ఆవశ్యకతను వివరించారు.

పెట్టుబడులకు స్వర్గధామం

పారిశ్రామికవేత్తలకు మోదీ పిలుపు

భారతదేశం అంతర్జాతీయ పెట్టుబడులకు స్వర్గధామంగా మారిందని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. రాజకీయ, ఆర్థిక స్థిరత్వం, పరిపాలన–ప్రభుత్వ విధానాల్లో పారదర్శకత దేశాన్ని పెట్టుబడులకు ఆకర్షణీయమైన గమ్యస్థానంగా మార్చాయని అన్నారు. ఈ అవకాశం ఉపయోగించుకోవాలని పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ శుక్రవారం జపాన్‌ రాజధాని టోక్యోలో భారత్‌–జపాన్‌ సంయుక్త ఆర్థిక సదస్సులో ప్రసంగించారు. జపాన్‌ కంపెనీలు ఇండియాలో 40 బిలియన్‌ డాలర్ల పెట్టుబడులు పెట్టాయని గుర్తుచేశారు.

మోదీకి జపాన్‌ కానుకగా ఇచ్చింది
మన బోధిధర్మ ప్రతిమే


మోదీకి దారూమా ప్రతిమను అందజేస్తున్న షోరింజన్‌ ఆలయ ప్రధాన పూజారి

జపాన్‌ పర్యటనలో అక్కడి ప్రఖ్యాత షోరిన్‌జాన్‌ దారూమేజీ ఆలయ సందర్శన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ కానుకగా అందుకున్న దారూమా ప్రతిమ అందరి దృష్టినీ తెగ ఆకర్షిస్తోంది. చివరికి ఇంటర్నెట్లో కూడా అదే ట్రెండింగ్‌గా మారింది. జపాన్‌ చరిత్ర, సంస్కృతులతో దారూమాది విడదీయలేని బంధం! జపనీస్‌ భాషలో దారూమ అంటే బోధిధర్మ అని అర్థం. ఇక జీ అంటే ఆలయం. బోధిధర్ముడు జెన్‌ బౌద్ధ స్థాపకుడు. రాజధాని టోక్యోకు ఉత్తరాన టకసాకిలో ఉన్న షోరిన్‌జాన్‌ దారూమేజీ ఆలయం శతాబ్దాలుగా భక్తులు, పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తూ వస్తోంది. ప్రస్తుత రూపంలోని దారూమా ప్రతిమను రూపొందించింది ఆలయపు తొమ్మిదో పీఠాధిపతి అయిన టొగకు. కొంతకాలంలోనే దారూమా జపనీయుల ఇంటింటి బొమ్మగా మారి పోయింది. నేటికీ ఏటా దారుమా ప్రతిమోత్సవాన్ని షోరిన్‌జాన్‌లో ఘనంగా జరుపుతారు. అలాంటి ప్రతిమను మోదీకి బహూకరించడం ద్వారా భారత్‌కు జపాన్‌ శుభాకాంక్షలతో పాటు ఆ ధ్యాత్మిక ఆశీస్సులు కూడా అందించిందని భావిస్తున్నారు. జపాన్‌లో మామూలు కుటుంబాలతో పాటు రాజకీయ నాయకులు మొదలుకుని వ్యాపారవేత్తల దాకా ఆశలకు, ప్రగతికి ప్రతీకగా ఇళ్లు, కార్యాలయాల్లో దారూమా ప్రతిమను ఉంచుకోవడం పరిపాటి.

బోధిధర్ముడు మనవాడే!

జెన్‌ బౌద్ధ స్థాపకుడైన బోధిధర్ముడు భారతీయుడేనని, అందునా దాక్షిణాత్యుడని, క్రీస్తుపూర్వం ఐదో శతాబ్దికి చెందినవాడని చెబుతారు. తమిళనాడులోని పల్లవ రాజు మూడో కుమారుడైన బోధి. దర్మ సన్యాసం స్వీకరించి జెన్‌ బౌద్ధాన్ని చైనాకు తీసుకెళ్లాడు. అంతేకాదు, మార్షల్‌ ఆర్ట్స్‌లోనూ ఆయన సాటిలేని మేటి. ఆ పోరాట కళను చైనాకు పరిచయం చేసింది కూడా బోధిధర్ముడే. అందుకే చైనీయులు ఆయనను దామో పేరిట దైవంతో సమానంగా కొలుచు కున్నారు. మూలికా వైద్యంలోనూ బోధిధర్ముడు సిద్ధుడు. ఆ విద్యను చైనీయులకు ప్రసాదించింది కూడా ఆయనేనని మనవాళ్లు నమ్ముతారు. ఆ సిద్ధవైద్య కళ శాశ్వతంగా తమకే సొంతం కావాలనే దురాశతో చివరికి దారుమాను విషమిచ్చి అంతం చేశారంటారు. ఈ ఇతివృత్తంతో సూర్య హీరోగా కొన్నేళ్ల క్రితం వచ్చిన సెవెన్త్‌ సెన్స్‌ సినిమా ఘనవిజయం సాధించింది.

ఎటు తిప్పినా పైకే!


చూసేందుకు చిన్నదే అయినా, దారూమా ప్రతిమ తాలూకు ప్రత్యేకతలు అన్నీ ఇన్నీ కావు...

- తెరుచుకుని ఉండే కన్ను, తిరుగులేని బ్యాలెన్స్‌ దీని ప్రధాన ఆకర్షణలు.
- ఇది గుండ్రంగా, లోపలంతా బోలుగా, కళ్లు చెదిరే రంగులతో కూడి ఉంటుంది.
- భారీదనం కారణంగా దారూమాను ఎటువైపు పడేలా తట్టినా వెంటనే పైకి లేస్తుంటుంది.
- 'ఏడుసార్లు కింద పడ్డా, ఎనిమిదోసారి కూడా పట్టు వీడకుండా పైకి లేవాల్సిందే'నన్న ప్రఖ్యాత జపనీస్‌ సామెతకు ఇది ప్రతీకగా నిలుస్తుంది.
- లక్ష్యాలు నిర్దేశించుకోవడానికి, అహరహం శ్రమించి కలలను నిజం చేసుకోవడానికి దారూమా ప్రతిమను చిహ్నంగా భావిస్తారు.

- సాక్షి, నేషనల్‌ డెస్క్‌

ఇగో పెంచిన
పగ

- మితిమీరిన ట్రంపరితనం!
- పాక్‌తో మధ్యవర్తిత్వానికి నసేమిరా అంటోందని భారత్‌పై ఆగ్రహం
- 'నోబెల్‌'కు గండి కొడుతోందని అక్కసు
- తాజా నివేదికలో అమెరికా ఆర్థిక సేవల సంస్థ జెఫ్రీస్‌ ధ్వజం



" రెండోసారి అమెరికా గద్దెనెక్కింది మొదలు, అన్ని దేశాలతోనూ గిల్లికజ్జాలతో తంపులమారిగా, ప్రపంచానికే పెను బెడదగా తయారయ్యారు ట్రంప్‌. మరీ ముఖ్యంగా భారత్‌ మీదనైతే మితిమీరిన ప్రతీకార ధోరణి ప్రదర్శిస్తున్నారు. పాకిస్తాన్‌తో సంధి కుదిర్చే యత్నాలను నిర్ద్వంద్వంగా తిరస్కరించిందన్న కోపంతో ప్రతీకార జ్వాలతో రగిలిపోతున్నారు. అందుకోసం ఏకంగా తాను అగ్రరాజ్యానికి అధ్యక్షుడిని అన్న వాస్తవాన్ని కూడా పక్కన పెట్టారు. అహంకార (ఇగో) ధోరణితో వ్యవహరిస్తున్నారు. అమెరికాకు అతి ముఖ్యమైన మిత్ర రాజ్యాల్లో ఏ దేశంపైనా లేనివిధంగా భారత్‌పై తాజాగా ఏకంగా 50 శాతం సుంకాలు విధించడం వ్యక్తిగత కసి తీర్చుకునే ప్రయత్నాల్లో భాగమే. **- అమెరికా ఆర్థిక సేవల సంస్థ జెఫ్రీస్‌**

న్యూఢిల్లీ/వాషింగ్టన్‌: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ ట్రంప్‌కు ఆ దేశానికే చెందిన ప్రఖ్యాత ఆర్థిక సేవల సంస్థ జెఫ్రీస్‌ పలుగురాళ్లతో నలుగు పెట్టింది. భారత్‌ విషయంలో కొద్ది నెలలుగా ఆయన ప్రదర్శిస్తూ వస్తున్న కురచ బుద్ధిని తీవ్రస్థాయిలో తూర్పారబట్టింది. ''ఆపరేషన్‌ సిందూర్‌ అనంతరం పాకిస్తాన్‌తో తలెత్తిన యుద్ధ పరిస్థితులను చల్లబరిచేందుకు మధ్యవర్తిత్వం చేస్తానంటే నసేమిరా అంటూ భారత్‌ తిరస్కరించడాన్ని ట్రంప్‌ నేటికీ జీర్ణించుకోలేకపోతున్నారు. బతిమాలినా, బెదిరించినా, చివరికి పదేపదే బ్లాక్‌మెయిలింగ్‌కు దిగినా మోదీ సర్కారు దిగి రాలేదని, తనకు అణుమాత్రం కూడా అవకాశం ఇవ్వలేదని ఆయనలో కడుపుమంట నానాటికీ పెరిగిపోతోంది. ఇరుదేశాల మధ్య చిరకాలంగా అపరిష్కృతంగా ఉన్న కశ్మీర్‌ సమస్యను పరిష్కరించి, తనను తాను శాంతిదూతగా చిత్రించుకుని చిరకాల స్వప్నమైన నోబెల్‌ శాంతి బహుమానం సాధించాలన్న కలలకు అడ్డంగా గండి కొడుతోందన్న ఆగ్రహం పూర్తిస్థాయిలో కట్టలు తెంచుకుంటోంది. ప్రస్తుతం అంతర్జాతీయ వేదికపై భారత్‌ ఎంత ప్రముఖ దేశంగా వెలిగిపోతోందో తెలిసి కూడా ట్రంప్‌ ప్రదర్శిస్తున్న ప్రతీకార వైఖరి ఇరుదేశాల నడుమ పూడ్చలేనంతటి అగాధానికి దారి తీస్తోంది. అధ్యక్ష స్థానంలో ఉన్న నాయకుని వ్యక్తిగత ఇగో భారత్‌, అమెరికా ద్వైపాక్షిక బంధానికే పెను ముప్పుగా పరిణమిస్తోంది''అంటూ తాజా నివేదికలో నిర్మొహమాటంగా కడిగిపారేసింది.

భారత్‌ 'తగ్గేదేలే'!

ఆపరేషన్‌ సిందూర్‌ తదనంతర పరిణామాల నేపథ్యంలో, తక్షణం కాల్పుల విరమణకు ఒప్పుకోకుంటే భారీగా సుంకాలు బాదుతానంటూ బెదిరించి భారత్‌, పాక్‌ నడుమ అణుయుద్ధాన్ని ఆపానంటూ ట్రంప్‌ కొద్ది నెలలుగా పదేపదే గొప్పలకు పోతుండటం, ఆ వ్యాఖ్యలను మోదీ సర్కారు ఎప్పటికప్పుడు నిర్ద్వంద్వంగా ఖండిస్తూ వస్తుండటం తెలిసిందే. పాక్‌ పూర్తిగా కాళ్ల బేరానికి వచ్చి, స్వయానా మిలిటరీ ఆపరేషన్స్‌ డైరెక్టర్‌ జనరల్‌ స్థాయి అధికారి పదేపదే ప్రాధేయపడ్డ కారణంగానే ఆ దేశంతో కాల్పుల విరమణకు అంగీకరించినట్టు కేంద్రం విస్పష్టంగా ప్రకటించింది కూడా. అలాగే కశ్మీర్‌ విషయంలో కూడా మధ్యవర్తిత్వానికి ట్రంప్‌ ఎంతగానో ఉబలాటపడ్డారు. తన సమక్షంలో చర్చలు జరపండంటూ భారత్‌, పాక్‌కు పదేపదే బాహాటంగా పిలుపులు కూడా ఇచ్చారు. ఈ విషయంలో మూడో శక్తి ప్రమేయాన్ని ఎన్నటికీ, ఏ విధంగానూ అంగీకరించేది లేదని భారత్‌ స్పష్టం చేసింది. అందుకు ఒళ్లు మండి ట్రంప్‌ సుంకాలు బాదుతున్నా 'తగ్గేదే లే'దంటోంది.

మన 'సాగు'పైనా గురి!

వ్యవసాయ రంగంలో అమెరికా జోక్యానికి మోదీ సర్కారు నసేమిరా అంటుండటం ట్రంప్‌కు కొరుకుడు పడని మరో విషయమని జెఫ్రీస్‌ నివేదిక తేల్చింది. భారత వ్యవసాయ, పాడి మార్కెట్లలో పూర్తిస్థాయిలో కాలు పెట్టాలని అగ్ర రాజ్యం చాలాకాలంగా ఉవ్విళ్లూరుతోంది. ఆ ఆకాంక్షలకు కేంద్రం శాశ్వతంగా తలుపులు మూసేసింది. దీనిపై కూడా ట్రంప్‌ అగ్గి మీద గుగ్గిలంగా ఉన్నట్టు జెఫ్రీస్‌ వెల్లడించింది. అమెరికాతో భారత్‌ స్వేచ్ఛా వాణిజ్య చర్చలు మార్చి నుంచీ నానుతుండటం వెనక ఇది కూడా ఒక ప్రధాన కారణమని విశ్లేషకులు కూడా భావిస్తున్నారు. ''రైతులు, కూలీలు కలిపి భారత్‌లో 25 కోట్ల మందికి వ్యవసాయమే జీవనాధారం! భారత శ్రామిక శక్తిలో ఇది ఏకంగా దాదాపు 40 శాతం !!''అని జెఫ్రీస్‌ నివేదిక చెప్పుకొచ్చింది.

- సాక్షి, నేషనల్‌ డెస్క్‌

నోరుపారేసుకున్న మహువా

- చొరబాట్లను అడ్డుకోలేకపోతున్నందుకు అమిత్‌ షా తల నరికెయ్యాలని వ్యాఖ్యలు
- సర్వత్రా విమర్శలు




కోల్‌కతా: సంచలనాలకు మారుపేరైన తృణమూల్‌ కాంగ్రెస్‌ పార్టీ ఎంపీ మహువా మొయిత్రా మరో వివాదానికి తెరతీశారు. దేశంలోకి యథేచ్ఛగా కొనసాగుతున్న అక్రమ చొరబాట్లను కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌ షా అడ్డుకోలేకపోతున్నారని, అందుకు శిక్షగా ఆయన తల నరికేయాలని తేల్చిచెప్పారు. శుక్రవారం పశ్చిమ బెంగాల్‌లోని నాడియా జిల్లాలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పొరుగుదేశం బంగ్లాదేశ్‌ నుంచి ఇండియాలోకి చొరబాట్లు జరుగుతున్నాయని చెప్పారు. సరిహద్దుల్లో రక్షణ భద్రత కేంద్ర హోంశాఖ మంత్రిగా పదవిలో ఉన్న అమిత్‌ షాదేనని పేర్కొన్నారు. బంగ్లాదేశ్‌ పౌరుల రాకను అడ్డుకొనే సత్తా లేని అమిత్‌ షా ఆ నెపాన్ని పశ్చిమ బెంగాల్‌ ప్రభుత్వంపై వేసి చేతులు దులుపుకుంటున్నారని మండిపడ్డారు. చొరబాటుదార్లు వస్తున్నారంటూ తరచుగా గొంతు చించుకుంటున్న ఆయనకు వారిని అడ్డుకొనే బాధ్యత లేదా? అని ప్రశ్నించారు. అక్రమ వలసల కారణంగా దేశంలో జనాభా స్థితిగతుల్లో మార్పులు వస్తున్నాయంటూ ఆగస్టు 15న స్వాతంత్య్రం దినోత్సవ ప్రసంగంలో ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారని, ఆ సమయంలో అక్కడే ఉన్న అమిత్‌ షా చప్పట్లు కొడుతూ చిరునవ్వులు చిందిస్తూ కూర్చున్నారని గుర్తుచేశారు. దేశ సరిహద్దులను రక్షించేవారు లేకపోతే పొరుగుదేశాల నుంచి జనం వస్తూనే ఉంటారని, మన తల్లులు, అక్కాచెల్లెమ్మలపై కన్నేస్తారని, మన భూములు ఆక్రమించుకుంటారని పేర్కొన్నారు. సరిహద్దులను కాపాడలేకపోవడంతో చొరబాట్లను ఆపలేనందుకు అమిత్‌ షా తల నరికి టేబుల్‌పై పెట్టాలని మహువా మొయిత్రా పేర్కొన్నారు. బంగ్లాదేశ్‌తో సంబంధాలు క్షీణించడానికి నరేంద్ర మోదీ ప్రభుత్వమే కారణమని అన్నారు. గతంలో మన మిత్రదేశంగా ఉన్న బంగ్లాదేశ్‌ ఇప్పుడు శత్రుదేశంగా మారిపోయిందని చెప్పారు.

మొయిత్రాది తాలిబన్‌ మైండ్‌సెట్‌: బీజేపీ

టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా వ్యాఖ్యలపై బీజేపీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. అమిత్‌ షాపై ఆమె చేసిన విమర్శల వీడియో సోషల్‌ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. దీనిపై బీజేపీ నేతలు స్పందించారు. మొయిత్రాది తాలిబన్‌ మైండ్‌సెట్‌, తాలిబన్‌ కల్చర్‌ అని ధ్వజమెత్తారు. ఆమెపై కొత్వాలీ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మొయిత్రా జిహాదీ ఉగ్రవాదుల తరహాలో మాట్లాడారని బీజేపీ అధికార ప్రతనిధి షెహజాద్‌ పూనవాలా ఆరోపించారు. మొయిత్రా వ్యాఖ్యలను ఎంఐఎం అధినేత, హైదరాబాద్‌ ఎంపీ అసదుద్దీన్‌ ఒవైసీ ఖండించారు. రాజకీయంగా ఎదిరించాలి తప్ప హింసను ప్రేరేపించేలా మాట్లాడడం సరైంది కాదని చెప్పారు. ప్రభుత్వ విధానాలపై నిలదీయడంలో తప్పులేదన్నారు. వ్యక్తిగతంగా మాటల దాడి చేయొద్దని సూచించారు. ఎవరైనా సరే వివాదాస్పద వ్యాఖ్యలకు దూరంగా ఉండాలని స్పష్టంచేశారు.

రాహుల్‌ క్షమాపణ చెప్పాలి

- ప్రధాని మోదీ తల్లిని కాంగ్రెస్‌ నేతలు అవమానించారు
- కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌ షా ఆగ్రహం



గౌహతి: చొరబాటుదార్ల కారణంగా అస్సాంలో జనాభా స్థితిగతుల్లో మార్పులు వస్తున్నాయని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌ షా ఆందోళన వ్యక్తం చేశారు. చొరబాటు సమస్యను అధ్యయనం చేయడానికి ప్రధాని మోదీ డెమొగ్రఫీ మిషన్‌ను ప్రకటించారని తెలిపారు. చొరబాటుదార్ల నుంచి దేశానికి విముక్తి కల్పిస్తామంటూ హామీ ఇచ్చామని, అది కచ్చితంగా నిలబెట్టుకుంటామని తేల్చిచెప్పారు. అమిత్‌ షా శుక్రవారం అస్సాంలో పర్యటించారు. అస్సాం తొలి కాంగ్రెసేతర ముఖ్యమంత్రి గోలాప్‌ బొర్బోరా శత జయంతి వేడుకల్లో ప్రసంగించారు. ఏ ఒక్క చొరబాటుదారుడు మన దేశంలో ఉండడానికి వీల్లేదని స్పష్టంచేశారు. విదేశీయుల అక్రమంగా వచ్చి మన దగ్గర తిష్టవేస్తే సహించాలా? అని ప్రశ్నించారు. చొరబాటుదారులందరినీ బయటకు పంపించక తప్పదని అన్నారు. తప్పులు లేని ఓటర్ల జాబితాను రూపొందించడానికే ఎన్నికల సంఘం ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్‌ఐఆర్‌)ను చేపట్టిందని, దానిపై రాద్ధాంతం ఎందుకు చేస్తున్నారని ప్రతిపక్షాలపై అమిత్‌ షా ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలు ఓటర్‌ అధికార్‌ యాత్ర ముసుగులో చొరబాటుదార్ల బచావో యాత్ర చేస్తున్నాయని నిప్పులు చెరిగారు. ఏ దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకైనా ఓటర్ల జాబితా గుండెకాయ లాంటిదని స్పష్టం చేశారు. బిహార్‌లో కాంగ్రెస్‌ నేత రాహుల్‌ గాంధీ నిర్వహిస్తున్న ఓటర్‌ అధికార్‌ యాత్ర సందర్భంగా ఆ పార్టీ నాయకులు ప్రధాని మోదీ తల్లిని అవమానించారని అమిత్‌ షా దుయ్యబట్టారు. రాహుల్‌ గాంధీకి నిజంగా సిగ్గుంటే తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్‌ చేశారు.

పాకిస్తాన్‌కు వెళ్లొచ్చే నేతలు అస్సాంను పాలించాలా?

తరచుగా పాకిస్తాన్‌కు వెళ్లొచ్చే నాయకులు అస్సాంను పరిపాలిస్తామంటే ప్రజలు ఎట్టిపరిస్థితుల్లోనూ అంగీకరించబోరని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌ షా తేల్చిచెప్పారు. అస్సాం కాంగ్రెస్‌ అధ్యక్షుడు గౌరవ్‌ గొగోయ్‌కి పాకిస్తాన్‌తో సంబంధాలు ఉన్నాయని పరోక్షంగా మండిపడ్డారు. వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. రాజధాని గౌహతితో పంచాయతీ ప్రతినిధుల ర్యాలీలో మాట్లాడారు. ప్రతిపక్ష నేతలు చొరబాటుదార్లకు, ఆక్రమణదార్లకు మద్దతిస్తున్నారని ఆరోపించారు. అలాంటి వారిని ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. చొరబాటుదార్లు అస్సాంలో వేలాది ఎకరాల భూమిని ఆక్రమించారని, వారిని వెళ్లగొట్టేందుకు బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తుండగా, కాంగ్రెస్‌ నాయకులు అడ్డుకుంటున్నారని ధ్వజమెత్తారు. 1.29 లక్షల ఎకరాల భూమిని ప్రభుత్వం ఆక్రమణదార్ల చెర నుంచి విడిపించిందని గుర్తుచేశారు. అస్సాంలో ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ అద్భుతమైన పరిపాలన అందిస్తున్నారని ప్రశంసించారు. ఆయన నాయకత్వంలో బీజేపీ మళ్లీ విజయం సాధిస్తుందని చెప్పారు.

అధ్యక్ష బాధ్యతలకు సిద్ధం: వాన్స్‌



వాషింగ్టన్‌: అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఏదైనా భయంకరమైన విషాదం జరిగితే అమెరికా కమాండర్‌–ఇన్‌–చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించడానికి తాను సిద్ధంగా ఉన్నానని తెలిపారు. అయితే.. ట్రంప్‌ తన నాలుగు సంవత్సరాల పదవీకాలాన్ని పూర్తి చేసేంత ఆరోగ్యంగా ఉన్నారని ఆయన స్పష్టంచేశారు. అధ్యక్షుడు డొనాల్డ్‌ ట్రంప్‌ ఆరోగ్యంపై ఇటీవల వస్తున్న ఊహాగానాల నేపథ్యంలో ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వాన్స్‌ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఇంటర్వ్యూలో వాన్స్‌ మాట్లాడుతూ.. జనవరిలో మొదటిసారి ఓవల్‌ ఆఫీసులో అడుగు పెట్టిన సందర్భాన్ని గుర్తు చేసుకున్నారు. 'ఆ గొప్పతనం, అద్భుతమైన చరిత్ర చూసి ముగ్ధుడినయ్యాను. అది నిజంగా అద్భుతమైన అనుభవం. అది శీతాకాలం. కర్టెన్లు మూసి ఉండటంతో చాలా చీకటిగా కనిపించింది. ప్రపంచ నాయకుడు పనిచేసే ప్రదేశం ఇలాగే ఉండకూడదు. అది కొంచెం వెలుగుతో, ఉత్సాహంగా ఉండాలనుకున్నా. ఆ తరువాత అధ్యక్షుడు చేసిన మార్పులు నాకు చాలా నచ్చాయి. వైట్‌హౌస్‌ను పునరుద్ధరించడంలో ట్రంప్‌ విలక్షణమైన శైలి నాకు బాగా నచ్చింది' అని ప్రశంసించారు. అనంతరం 79 ఏళ్ల ట్రంప్‌ ఆరోగ్యం గురించి ఆందోళనలను ప్రస్తావించగా.. 'ఆయన మంచి ఆరోగ్యంతో ఉన్నారు. ఆయనకు అద్భుతమైన శక్తి ఉంది. ఆయనతో పనిచేస్తున్నవారు చాలామంది ఆయనకంటే చిన్న వయసువాళ్లే. అయినా వారందరికంటే చివరిగా నిద్రపోయేది, మొదటగా నిద్ర లేచేది ట్రంపే. ఆయన మిగిలిన పదవీకాలాన్ని విజయవంతంగా పూర్తి చేస్తారన్న నమ్మకం నాకుంది. అమెరికన్‌ ప్రజలకోసం ఆయన ఇంకా ఎన్నో గొప్ప పనులు చేస్తారు' అని వాన్స్‌ వ్యాఖ్యానించారు. పెద్ద విషాదం ఏదైనా జరిగి, అనుకోని పరిస్థితులు ఎదురైతే, అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నానని వాన్స్‌ స్పష్టం చేశారు. దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యుంగ్‌తో జరిగిన సమావేశంలో ట్రంప్‌ చేతికి పెద్ద గాయం కనిపించడంతో ఆయన ఆరోగ్యంపై ఆందోళనలు తలెత్తాయి. 78 సంవత్సరాల ఏడు నెలల వయసులో ఈ ఏడాది జనవరిలో ట్రంప్‌ ప్రమాణ స్వీకారం చేశారు. అమెరికా చరిత్రలో ట్రంప్‌ అత్యంత పెద్ద వయస్కుడైన అధ్యక్షుడాయన. అంతకుముందు అధ్యక్షుడు జో బైడెన్‌ 2021లో పదవీ బాధ్యతలు స్వీకరించినప్పుడు ఆయన వయసు 78 సంవత్సరాల రెండు నెలలు. ఇక, ఈ నెల ప్రారంభంలో ట్రంప్‌ మాట్లాడుతూ వాన్స్‌ను తన మేక్‌ అమెరికా గ్రేట్‌ అగైన్‌ ఉద్యమానికి వారసుడిగా చెప్పుకొచ్చారు. కానీ వాన్స్‌ మాత్రం 2028 అధ్యక్ష ఎన్నికల ప్రణాళికల గురించి ఊహాగానాలను తోసిపుచ్చుతూనే ఉన్నారు.

డిసెంబర్‌లో భారత్‌కు పుతిన్‌

మాస్కో: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్‌ పుతిన్‌ డిసెంబర్‌లో భారత్‌ పర్యటనలో పర్యటించనున్నారు. అధ్యక్ష భవనం క్రెమ్లిన్‌ ప్రతినిధి యూరి ఉషకోవ్‌ శుక్రవారం ఈ విషయం వెల్లడించారు. ఈ పర్యటనకు సంబంధించిన సన్నద్ధతపై సోమవారం ప్రధాని మోదీతో చైనాలోని టియాంజిన్‌లో జరిగే భేటీ సందర్భంగా చర్చిస్తారన్నారు. ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం రెండు దేశాల మధ్య బంధాన్ని మరింత దృఢతరం చేసిందన్నారు. ఈ బంధానికి ఈ ఏడాదితో 15 ఏళ్లు నిండుతాయని యూరి ఉషకోవ్‌ గుర్తు చేశారు.

హ్యారిస్‌కు భద్రత తొలగింపు

వాషింగ్టన్‌: భారత సంతతికి చెందిన అమెరికా మాజీ ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్‌కు గత బైడెన్‌ ప్రభుత్వం కల్పించిన సీక్రెట్‌ సర్వీస్‌ రక్షణను అధ్యక్షుడు ట్రంప్‌ తొలగించారు. ఈ విషయాన్ని వైట్‌ హౌస్‌ అధికారి ఒకరు శుక్రవారం వెల్లడించారు. ఈ రకమైన భద్రత మాజీ అధ్యక్షులందరికీ జీవితకాలం కొనసాగుతుంది. అయితే, బైడెన్‌ పదవి నుంచి దిగిపోతూ కమలా హ్యారిస్‌కు 18 నెలల పాటు సీక్రెట్‌ సర్వీస్‌ భద్రత కల్పించే ఉత్తర్వులపై చడీచప్పుడూ కాకుండా సంతకం చేసినట్లు అధ్యక్షుడు ట్రంప్‌ ఆరోపిస్తున్నారు.

థాయ్‌ ప్రధాని షినవత్రా డిస్మిస్‌



బ్యాంకాక్‌: నైతిక ఉల్లంఘనకు పాల్పడిన ఆరోపణలపై సస్పెండయిన థాయ్‌లాండ్‌ ప్రధానమంత్రి పెటొంగ్‌టర్న్‌ షినవత్రా(39)ను రాజ్యాంగ న్యాయస్థానం ఆ పదవి నుంచి తొలగిస్తూ తీర్పు వెలువరించింది. కోట్లకు పడగలెత్తిన షినవత్రాల కుటుంబ రాజకీయాలకు గట్టి ఎదురుదెబ్బ మాత్రమే కాదు, దేశం మరోసారి రాజకీయ సంక్షోభంలో చిక్కుకునేందుకు ఈ పరిణామం దారి తీయనుందని పరిశీలకులు అంటున్నారు. అత్యంత పిన్న వయస్కురాలైన ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన షినవత్రా ఏడాది కాలం మాత్రమే అధికారంలో ఉన్నారు. కాంబోడియాతో తలెత్తిన సరిహద్దు వివాదం నేపథ్యంలో జూన్‌లో ఆ దేశ మాజీ నేత హున్‌ సెన్‌తో జరిపిన ఫోన్‌ సంభాషణ బయటకు పొక్కడం తీవ్ర సంచలనం రేపింది. షినవత్రా క్షమాపణ చెప్పినా వివాదం సద్దుమణగలేదు. విచారణ జరిపిన రాజ్యాంగ న్యాయస్థానం ఆమెను సస్పెండ్‌ చేసింది. దీంతో, ఆమె వైదొలగి ఉపప్రధానికి ఫుమ్‌తమ్‌కు బాధ్యతలు అప్పగించారు. ఈ వ్యవహారంపై దర్యాప్తు జరిపిన రాజ్యాంగ న్యాయస్థానం తాజాగా ఆమెను బర్తరఫ్‌ చేస్తూ శుక్రవారం చేస్తూ ఆదేశాలిచ్చింది. హున్‌ సెన్‌ను అంకుల్‌ అని సంబోధించడం, థాయ్‌ ఆర్మీ కమాండర్లను తప్పుబడుతూ చేసిన వ్యాఖ్యలపై న్యాయస్థానం అభ్యంతరం తెలిపింది. కాంబోడియా నేతతో జరిపిన సంభాషణ పెటొంగ్‌టర్న్‌ విశ్వసనీయతపై అనుమానాలొచ్చేలా ఉందని, ఆమె హోదాకు సరైంది కాదని తీర్పులో పేర్కొంది. ఆమె తీరు థాయ్‌లాండ్‌ కంటే కాంబోడియాకే అనుకూలంగా ఉన్నట్లుగా కనిపిస్తోందని వ్యాఖ్యానించింది. కాగా, థాయ్‌లాండ్‌లో గత 17 ఏళ్లలో రాజ్యాంగ కోర్టు వేటేసిన ఐదో ప్రధాని షినవత్రా కావడం గమనార్హం. పెటొంగ్‌టర్న్‌ షినవత్రా తండ్రి సీనియర్‌ నేత థక్సిన్‌ షినవత్రా సైతం గతంలో ప్రధాని పదవిని కోల్పోయిన వారే. తాజా పరిణామంతో షినవత్రాకు చెందిన ఫ్యు థాయ్‌ పార్టీ ప్రస్తుత సంకీర్ణ ప్రభుత్వాన్ని నిలబెట్టుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోంది. సంప్రదాయవాదులు, పలుకుబడి కలిగిన రాచరిక అనుకూల సైనిక నేతలతో ఎన్నికైన ప్రభుత్వాలు గట్టి సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యే వరకు ఉప ప్రధాని ఫుమ్‌తమ్‌, ఆయన కేబినెట్‌ తాత్కాలికంగా బాధ్యతలు నిర్వహిస్తారు. అయితే, ఇందుకు నిర్దిష్ట కాలపరిమితి లేకపోవడం గమనార్హం. ప్రధానమంత్రి పదవికి ఫ్యు థాయ్‌ పార్టీకి చెందిన 77 ఏళ్ల ఛయ్‌కసెమ్‌ నితిసిరితోపాటు ఇతర పార్టీలకు చెందిన ఐదుగురు అర్హులని చెబుతున్నారు. అన్ని పార్టీలు కూడా తమ సొంత రాజకీయ అవసరాల కోసం యత్నిస్తుండటంతో ప్రభుత్వం ఏర్పాటు అంత సులువుగా అయ్యే పని కాదన్నది విశ్లేషకుల మాట.

2 వంతెనల్ని పేల్చేసిన ఉక్రెయిన్‌


కీవ్‌: రష్యా ఆర్మీ దాచిన మందు గుండు సామగ్రిని ఉపయోగించుకుని రష్యాలోనే ఉన్న రెండు వంతెనలను ఉక్రెయిన్‌ ఆర్మీ పేల్చేసింది. సరిహద్దులకు సమీపంలో బెల్గొరోడ్‌లో ఉన్న ఈ రెండు వంతెనల మీదుగానే రష్యా ఆర్మీ సరఫరాలు కొనసాగుతుంటాయని ఉక్రెయిన్‌ ఆర్మీ తెలిపింది. ఒక వేళ తాము అకస్మాత్తుగా దాడి చేస్తే వంతెనల్ని పేల్చేసేందుకు రష్యా ఆర్మీ ముందు జాగ్రత్తగా మందుగుండును వంతెనల కింద ఉంచిందని వివరించింది. అయితే, ఆ బ్రిడ్జిల వద్ద అనుమానాస్పద కదలికలను తాము గుర్తించామని తెలిపింది. ఫైబర్‌ ఆప్టిక్స్‌ను బిగించిన డ్రోన్‌ను అక్కడికి పంపించి మందుగుండు ఉన్న విషయం ధ్రువీకరించుకున్నట్లు ఉక్రెయిన్‌కు చెందిన 58వ సెపరేట్‌ మోటారైజ్డ్‌ ఇన్‌ఫాంట్రీ బ్రిగేడ్‌ తెలిపింది. కేవలం 800 డాలర్లు ఖరీదు చేసే రెండు డ్రోన్లను పంపి ఆ మందుగుండును పేల్చేశామని తెలిపింది.

బిహార్‌లో 3 లక్షల మంది ఓటర్లకు ఈసీ నోటీసులు

న్యూఢిల్లీ: బిహార్‌లో అనుమానాస్పద పౌరసత్వం కలిగిన సుమారు 3 లక్షల మంది ఓటర్లకు నోటీసులు జారీ చేసినట్లు ఈసీ శుక్రవారం తెలిపింది. ఆగస్టు ఒకటిన వెలువరించిన ఓటరు ముసాయిదా జాబితాలో పేర్లున్న 7.24 కోట్ల మందిలోనే వీరి పేర్లు కూడా ఉన్నాయంది. నోటీసులు పంపిన వారిలో బంగ్లాదేశ్‌, నేపాల్‌, మయన్మార్‌, అఫ్గానిస్తాన్‌లకు చెందిన వారున్నట్లు క్షేత్ర స్థాయి పరిశీలనలో వెల్లడైందని ఈసీ వివరించింది.

సాక్షి కరీంనగర్

శనివారం । 30 । ఆగస్టు । 2025



పవర్‌కట్ ప్రాంతాలు

కొత్తపల్లి: శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జయరాం హాస్పిటల్, రాజీవ్‌పార్కు, మార్క్‌ఫెడ్, ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు శ్రీనగర్‌కాలనీ, భవానీకాలనీ, సప్తగిరి కాలనీలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–2 ఏడీఈ తెలిపారు.



మిడ్‌మానేరులో 23 టీఎంసీలు

బోయినపల్లి: మిడ్‌మానేరులో శుక్రవారం నీటిమట్టం 23.767 టీఎంసీలకు చేరింది. ప్రాజెక్టులోకి 39,015 క్యూసెక్కులు వస్తుండగా, ఎల్‌ఎండీకి 40 వేల క్యూసెక్కులు వెళ్తున్నాయి.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 31.0/26.0

ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.



అశ్వవాహనుడు: పాతబజార్‌లో..



రాధా గణేశుడు: గాంధీ చౌరస్తాలో..



సప్త చిరంజీవుల నాయకుడు: పాతబజార్‌లో గోల్డెన్ యూత్ ఆధ్వర్యంలో..



ధ్యాన దేవుడు: విద్యానగర్‌లో గుహలో గణేశుడు



పైలెట్ విఘ్నేశ్వరుడు: రామగుండం బైపాస్‌లో..

విభిన్నరూప విఘ్నేశ్వర

నగరంలోని వాడవాడల్లో కొలువుదీరిన గణనాథులు మూడోరోజు శుక్రవారం ఘనమైన పూజలందుకున్నారు. పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన విభిన్న గణపతులు ప్రజలను ఆకట్టుకుంటుండగా.. ప్రత్యేకంగా వెళ్లి దర్శించుకుంటున్నారు. నగరంలోని రామగుండం బైపాస్‌లో ఐసో టీం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పైలెట్ గణేశుడు ప్రత్యేక ఆకర్షణగా నిలవగా.. పడవ చౌరస్తాలో ఫ్రెండ్స్‌యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడు ఆకట్టుకుంటున్నాడు. పాతబజార్ 1/బీలో అశ్వ వాహనంపై విన్నర్స్ యూత్ ఏర్పాటు చేసిన గణేశుడు విభిన్నంగా ఉండగా.. పాతబజార్‌లో గోల్డెన్ యూత్ 1/ఏ ఏర్పాటు చేసిన సప్త చిరంజీవుల విఘ్నేశ్వరుడు చూడముచ్చట గొల్పుతున్నాడు. గాంధీ చౌరస్తాలో గాంధీ చౌక్ ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసిన రాధా శ్రీకృష్ణ రూపంలోని వినాయకుడు ప్రత్యేక ఆకర్షణగా నిలవగా.. విద్యానగర్‌లోని వాణినగర్‌లో గుహలో గణనాథుడు ఘనమైన పూజలందుకుంటున్నాడు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

న్యూస్‌రీల్

కష్టపడి చదువుకోవాలి



మాట్లాడుతున్న జడ్జి కె.వెంకటేశ్

కరీంనగర్: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్ ఆధ్వర్యంలో నగరంలోని బాలసదన్, శిశుగృహాలను శుక్రవారం సందర్శించారు. చిన్నారులతో ముచ్చటిస్తూ కష్టపడి చదువుకుని ప్రథమ స్థానంలో ఉత్తీర్ణత సాధించాలని తెలిపారు. క్రీడాదినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు. శిశుగృహలోని ఆహార పదార్థాలు నిల్వ చేసే గదులను తనిఖీ చేశారు. పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు. ఎలాంటి న్యాయపరమైన సేవ అవసరమైనా సంప్రదించాలని ఆదేశించారు. సీనియర్ సివిల్ జడ్జితో పాటు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ తణుకు మహేశ్ పాల్గొన్నారు.

2న తుది ఓటరు జాబితా



అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడేతో వివిధ రాజకీయ పార్టీల నేతలు

కరీంనగర్ అర్బన్: గ్రామ పంచాయతీ తుది ఓటరు జాబితా సెప్టెంబర్ 2న ప్రకటించడంతో పాటు పోలింగ్ కేంద్రాల జాబితా ప్రచురించడం జరుగుతుందని అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే తెలిపారు. గ్రామ పంచాయతీ ఓటరు లిస్ట్, పోలింగ్ కేంద్రాల లిస్ట్‌పై శుక్రవారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల జాబితా అప్‌డేట్ చేయడం జరుగుతోందని అన్నారు. డ్రాఫ్ట్ ఓటర్ జాబితా ఈ నెల 28న విడుదల చేయడం జరిగిందని, అభ్యంతరాలు ఉంటే ఈ నెల 30లోపు తెలియజేయాలన్నారు. 31లోపు అభ్యంతరాలను పరిష్కరించి సెప్టెంబర్ 2న తుది జాబితా ప్రచురించడం జరుగుతుందని వివరించారు. డీపీవో వి.జగదీశ్వర్, వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రతిపాదనలు సిద్ధం చేయాలి



స్థల పరిశీలన చేస్తున్న ప్రఫుల్ దేశాయ్

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని మదీనా కాంప్లెక్స్ ప్రాంతంలో నూతన మరుగుదొడ్డి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఆదేశించారు. గతంలో ఉన్న ఓపెన్ టాయిలెట్ పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో, నూతన ప్రజా మరుగుదొడ్డి నిర్మాణం కోసం శుక్రవారం ఆయన స్థల పరిశీలన చేశారు.

ఉత్తమ ఉపాధ్యాయుల కోసం దరఖాస్తుల స్వీకరణ

కరీంనగర్: డాక్టర్ సర్వేపల్లి జయంతిని పురస్కరించుకుని సెప్టెంబర్ 5న జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డు ప్రదానం చేస్తామని డీఈవో చైతన్య జైనీ తెలిపారు. జిల్లా పరిషత్, ప్రభుత్వ, ఎయిడెడ్, కేజీబీవీ, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్, ప్రధానోపాధ్యాయుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. దరఖాస్తులను ఈనెల 31వ తేదీ సాయంత్రం 5గంటల్లోగా డీఈవో కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు.

కమీషన్ రావట్లే!

- జిల్లాలోని రేషన్ డీలర్లకు ఐదు నెలలుగా అందని కమీషన్
- భారంగా దుకాణాల నిర్వహణ
- సహాయకులకు వేతనం ఇవ్వలేని దుస్థితి
- సెప్టెంబర్ 5న రేషన్ బంద్‌కు నిర్ణయం



రేషన్ పంపిణీ చేస్తున్న డీలర్(ఫైల్)

జిల్లాలో మొత్తం
గ్రామ పంచాయతీలు: 313
నగరపాలక సంస్థ: 1
మున్సిపాలిటీలు: 3
మొత్తం రేషన్ డీలర్లు: 566
కార్డుదారులు: 2.90 లక్షలు
రావాల్సిన బకాయి: రూ.3.9కోట్లు

కరీంనగర్ అర్బన్: జిల్లాలోని రేషన్ డీలర్లు కమీషన్ కోసం ఎదురుచూస్తున్నారు. ఐదునెలలుగా కమీషన్ జాడ లేకపోవడంతో సెప్టెంబర్ 5న రేషన్ దుకాణాల బంద్ పాటిస్తున్నట్లు డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రొడ్డ శ్రీని వాస్ ప్రకటించారు. కలెక్టర్ పమేలా సత్పతికి వినతిపత్రం సైతం అందజేశారు. జిల్లాకు కమీషన్ బకాయి మొత్తంగా రూ.3.9కోట్లు ఉండగా, రేషన్ దుకాణాన్ని నిర్వహించడం తలకు మించిన భారమవుతోందని డీలర్లు వాపోతున్నారు. కరోనాకాలంలో ప్రాణాలను ఫణంగా పెట్టి బియ్యం పంపిణీ చేయగా, ఇటీవల ఒకేనెలలో మూడు నెలల బియ్యం అందించినా తమ శ్రమకు గుర్తింపు ఏదని ప్రశ్నిస్తున్నారు.

బకాయి రూ.3.9కోట్లు.. నిర్వహణ భారమే

జిల్లాలో 566రేషన్ దుకాణాలున్నాయి. వాటి ద్వారా 2.90లక్షల రేషన్ కార్డుదారులకు ప్రతినెలా బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఒక్కో క్వింటాకు రూ.70 చొప్పున డీలర్‌కు ప్రభుత్వం కమీషన్ ఇస్తోంది. మార్చి వరకు కమీషన్ ఎప్పటికప్పుడు జమ కాగా ఏప్రిల్ నుంచి రాకపోగా ఇబ్బందులు పడుతున్నారు. కార్డులోని ప్రతి వ్యక్తికి ఆరు కిలోల చొప్పున బియ్యం ఇవ్వగా జూన్‌లో మూడు నెలల బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేశారు. రేషన్ కమీషన్ అందకపోవడంతో దుకాణ నిర్వహణ ఖర్చు భరించలేక అవస్థలు పడుతున్నారు. సరుకులు అన్‌లోడ్ చేసేందుకు హమాలీకి క్వింటాల్‌కు రూ.8, లారీ డ్రైవర్‌కు రూ.200, విద్యుత్ బిల్లు సుమారు రూ.500, గది లేదా షట్టర్ కిరాయి రూ.2వేలు చెల్లించాల్సి వస్తోందని చెబుతున్నారు. ఈ– పోస్ మిషన్ రీచార్జికి రూ.200, సహాయకులకు రూ.2వేలకు పైగా ఇవ్వాల్సి ఉంటుందని వివరించారు. నెలకు రూ.5వేల నుంచి 6వేల వరకు ఖర్చు అవుతోందని, వంద క్వింటాళ్లు పంపిణీ చేస్తే వచ్చే కమీషన్ రూ.7వేలు కాగా.. ఖర్చులు పోనూ మిగిలేది రూ.వెయ్యి నుంచి రెండు వేలే అని వాపోతున్నారు. కొందరు ఇళ్లు గడవకపోవడంతో చేసిన అప్పులు తీర్చలేక చిరు వ్యాపారాలు వెతుక్కుంటున్నారు. ఇక గ్రామీణ ప్రాంతాల్లోనైతే వ్యవసాయం లేదా కూలీకి వెళ్తున్నారు.

డీలర్ల డిమాండ్లు ఇవే

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించినట్లు కనీస గౌరవ వేతనం రూ.5వేలు, కమీషన్ రూ.300కు పెంచాలి. రేషన్ దుకాణాలను మినీ సూపర్ మార్కెట్లుగా గుర్తించి నిత్యావసర సరుకులను అందుబాటులో ఉంచాలి. బియ్యం పంచే క్రమంలో దుమ్ము,ధూళితో అనారోగ్య సమస్యలు తలెత్తుతుండగా రేషన్ డీలర్ల కుటుంబాలకు హెల్త్ కార్డులు జారీ చేయాలి. బియ్యం దిగుమతి చార్జీలను ప్రభుత్వమే భరించడంతో పాటు గత 10ఏళ్లుగా పేరుకుపోయిన బకాయిలను చెల్లించాలి. గోదాం ప్రాంగణంలో శాశ్వత ప్రాతిపదికన వే బ్రిడ్జిల ఏర్పాటుతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో 800 కార్డులు, పట్టణ ప్రాంతాల్లో 1,200 కార్డులకు పైబడి ఉంటేనే బైఫర్కేషన్ చేయాలి. రెండేళ్లకోసారి చేపట్టకుండా ఆథరైజేషన్ రిన్యువల్స్‌ను శాశ్వతంగా కొనసాగించాలి. రేషన్ దుకాణాల అద్దెను ప్రభుత్వమే భరించడంతో పాటు తరుగు కింద 2శాతం బియ్యం కోటాను అదనంగా ఇవ్వాలి. డీలర్లలో ఉన్నత విద్యావంతులకు శాఖాపరమైన పదోన్నతులు కల్పించాలి.

కమీషన్ ఇచ్చి ఆదుకోండి



మూడు నెలల బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేశాం. 5నెలల కమీషన్ అందలేదు. డీలర్లకు గౌరవ వేతనంతో పాటు కమీషన్ పెంచుతామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఇప్పటివరకు పెంచలేదు. డీలర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఎంకు విజ్ఞప్తి చేశాం. ప్రస్తుతం రావాల్సిన కమీషన్‌ను విడుదల చేయడంతో పాటు డీలర్ల కమీషన్ పెంచాలి. – రొడ్డ శ్రీనివాస్, రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు

పడిగాపులు.. ఆందోళనలు



రామడుగు మండలం గోపాల్‌రావుపేటలో రైతునేస్తం కేంద్రం వద్ద రైతులు

గన్నేరువరం/శంకరపట్నం/రామడుగు: జిల్లాలో యూరియా కష్టాలు తప్పడం లేదు. రైతులు గోదాముల వద్ద పడిగాపులు కాస్తున్నారు. ఓపిక నశించి ఆందోళనకు దిగుతున్నారు. గన్నేరువరం మండలంలో యూరియా కోసం రైతులు రోడ్డెక్కారు. గన్నేరువరం మండలంతో పాటు తిమ్మాపూర్ మండలం, సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలానికి చెందిన రైతులు గుండ్లపల్లి స్టేజీ వద్ద ఉన్న డీసీఎంఎస్‌కు శుక్రవారం ఉదయం వచ్చారు. యూరియా లేకపోవడంతో సాయంత్రం వరకు ఎదురుచూశారు. అయినా రాకపోవడంతో విసుగుచెంది రాజీవ్ రహదారిపై ఆందోళనకు దిగారు. యూరియా కష్టాలను పట్టించుకోవడం లేదని ధర్నా చేశారు. ట్రాఫిక్ జామ్ కావడంతో స్థానిక పోలీసులతో పాటు సిద్దిపేట సీఐ రైతులను శాంతింపజేశారు. శంకరపట్నం మండలం కేశవపట్నంలోని ఓ ఫర్టిలైజర్ దుకాణానికి లోడ్ యూరియా రావడంతో శుక్రవారం మధ్యాహ్నం 100మంది రైతులు అక్కడికి చేరుకున్నారు. రైతులకు పంపిణీ చేయకపోవడంతో మూడు గంటలు పడిగాపులు కాశారు. సాయంత్రం ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున అందించారు. రామడుగు మండలం గోపాల్‌రావుపేట రైతునేస్తం ఎరువుల కేంద్రానికి 420 బస్తాలు రావడంతో రైతులు భారీ చేరుకున్నారు. ఒక్కో రైతుకు ఒక్కో బస్తా చొప్పున పంపిణీ చేశారు.



కేశవపట్నం ఫర్టిలైజర్ దుకాణం వద్ద రైతులు



గన్నేరువరం: గుండ్లపల్లిలో రైతుల ఆందోళన

పెద్దపల్లి- నిజామాబాద్ లైన్‌లో 'వందేభారత్'

- కామారెడ్డి ట్రాక్ మరమ్మతు నేపథ్యంలో మళ్లింపు



సాక్షిప్రతినిధి,కరీంనగర్: పెద్దపల్లి–నిజామాబాద్ లైన్‌లో వందేభారత్ ఎక్స్‌ప్రెస్ పరుగులు తీస్తోంది. రాత్రి 11 గంటలకు ఎగువన ఉదయం 4 గంటలకు దిగువన ఇదే మార్గంలో పెద్దపల్లి బైపాస్ మీదుగా నడుస్తోంది. ఇటీవలే ముంబయి నుంచి జాల్నా వరకు నడుస్తున్న 20706 వందే భారత్ ఎక్స్ ప్రెస్ రైలును నాందేడ్ వరకు పొడిగించారు. కానీ.. ఈ రైలు ప్రాథమిక నిర్వహణ చర్లపల్లిలో చేస్తున్నారు. ఇది నాందేడ్ నుంచి చర్లపల్లి వరకు వయా నిజామాబాద్– కామారెడ్డి మార్గంలో ఖాళీ రైలుతో దిగువ వైపు, మళ్లీ వచ్చేటప్పుడు కూడా చర్లపల్లి నుంచి నాందేడ్ వరకు ఖాళీ రైలుతో నడుస్తుంది. రెండు రోజుల క్రితం కామారెడ్డి రైల్వే స్టేషన్‌కు సమీపంలో పట్టాలు వరద నీటిలో కొట్టుకుపోవడంతో నిజామాబాద్ నుంచి సికింద్రాబాద్ వైపు వెళ్లే రైళ్ల రాకపోకలు స్తంభించాయి. ఫలితంగా ఈ మార్గంలో నడుస్తున్న పలు రైళ్లను నిజామాబాద్– పెద్దపల్లి బైపాస్–కాజీపేట మార్గంలో దారి మళ్లించి నడుపుతున్నారు. భవిష్యత్తులో ఈ మార్గం గుండా వందే భారత్, నమో భారత్ ర్యాపిడ్, అమృత్ భారత్ లాంటి రైళ్లు ప్రవేశ పెడితే ఈ ప్రాంత ప్రయాణికులకు మరింత సౌకర్యం కలిగే అవకాశం ఉంటుందని ప్రయాణికులు అభిప్రాయపడుతున్నారు.

చదవాలి.. క్రీడల్లో మెరవాలి

- కలెక్టర్ పమేలా సత్పతి



ధ్యాన్‌చంద్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి, సీపీ గౌస్ ఆలం, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డీవైఎస్‌వో శ్రీనివాస్, జనార్దన్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

కరీంనగర్‌స్పోర్ట్స్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. శుక్రవారం జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా కరీంనగర్ ప్రాంతీయ క్రీడాపాఠశాలలో హాకీ లెజెండ్ మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి సీపీ గౌస్‌ఆలంతో కలిసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. చదువు ఎంత అవసరమో క్రీడలు అంతే ఉపయోగమన్నారు. క్రీడా పాఠశాలలోని సదుపాయాలను సద్వినియోగం చేసుకొని, జాతీయ, అంతర్జాతీయస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. సీపీ గౌస్‌ఆలం మాట్లాడుతూ హాకీ లెజెండ్ మేజర్ ధ్యాన్‌చంద్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్ మాట్లాడుతూ కరీంనగర్ ప్రాంతీయ క్రీడా పాఠశాలకు ప్రత్యేకంగా నిధులు వెచ్చించి సదుపాయాలు కల్పించామన్నారు. వివిధ క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మెడల్స్ ప్రదానం చేశారు. డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు తుమ్మల రమేశ్‌రెడ్డి, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి లక్ష్మణ్‌రావు, ఎస్జీఎఫ్ కార్యదర్శి వేణుగోపాల్, క్రీడా పాఠశాల హెచ్ఎవ శ్రీనివాస్ పాల్గొన్నారు.

తల్లి చదువుకుంటే పిల్లలు ఉన్నత విద్యావంతులు అవుతారు

శంకరపట్నం: తల్లి చదువుకుంటే పిల్లలు ఉన్న విద్యావంతులవుతారని కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. శంకరపట్నం మండలం వంకాయగూడెం అంగన్‌వాడీకేంద్రంలో నిర్వహించిన శుక్రవారం సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చిన్నారులతో కాసేపు ముచ్చటించారు. మహిళలు ప్రతీ ఆరునెలలకోసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. చదువుకోని మహిళలను ఓపెన్ టెన్త్‌లో చేర్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో డెలివరీ అయిన అనూషను చీరతో సత్కరించారు. సీడీపీవో శ్రీమతి, డీఎంహెచ్‌వో వెంకటరమణ, తహసీల్దార్ సురేఖ, ఎంపీడీవో కృష్ణ ప్రసాద్, ఎంపీవో ప్రభాకర్ పాల్గొన్నారు.

పచ్చని ప్రకృతి ఎత్తైన భవనాలు

భూమిపై పచ్చని చీర పరిచినట్లు కనుచూపు మేర పంటపొలాలు కళకళలాడుతుండగా.. సమీపంలోని ఎత్తైన భవనాలు నగరాభివృద్ధికి నిలయంగా మారుతున్నాయి. వానాకాలం సాగు జోరందుకోగా.. ఎల్‌ఎండీ పరిసరాల్లోని పంట పొలాలు, సమీప దూరంలో ఎత్తైన భవనాలు పల్లెటూరు, పట్టణ వాతావరణాన్ని కలిపి తలపిస్తున్నాయి. ఈ దృశ్యం కరీంనగర్ సమీపంలోని లోయర్ మానేరు డ్యాం సమీపం లోనిది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్



ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటు చేయాలి



ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

కరీంనగర్: జిల్లాలో వంద పడకల ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గీట్ల ముకుందరెడ్డి, ఎడ్ల రమేశ్ మాట్లాడుతూ జిల్లాలో వేలాదిమంది ఈఎస్ఐ చందాదారులు ఉన్నప్పటికీ జిల్లాకేంద్రంలో ఈఎస్ఐ ఆస్పత్రి లేకపోవడంతో వైద్య సౌకర్యం పొందడం లేదన్నారు. దీంతో ప్రైవేటు ఆస్పత్రుల్లో వేల రూపాయలు బిల్లు చెల్లించాల్సి వస్తోందన్నారు. ఈఎస్ఐ చందాదారుకు సూపర్‌స్పెషాలిటీ వైద్యం అందించడానికి కార్పొరేట్ ఆసుపత్రులతో టైఅఫ్ చేశారన్నారు. కరీంనగర్‌లో ఒకటి కూడా ఎంపానల్డ్ హాస్పిటల్ లేకపోవడం బాధాకరమన్నారు. అనంతరం డీఆర్‌వో వి.వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయు జిల్లా కోశాధికారి జి రాజేశం, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, జనగాం రాజమల్లు, జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్, నాయకులు తిరుమలయ్య, కాంపెల్లి పోచయ్య, రాజమల్లయ్య, అంజయ్య, దేవేందర్, నరేశ్, రాజేందర్, సంపత్ పాల్గొన్నారు.

టీబీకి ఉచిత వైద్యం

కరీంనగర్‌రూరల్: క్షయవ్యాధికి ప్రభుత్వం ఉచితంగా వైద్యం అందిస్తోందని జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డి అన్నారు. చామనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం కరీంనగర్ మండల పరిషత్ కార్యాలయంలో టీబీపై పంచాయతీకార్యదర్శులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధిగ్రస్తులు తగిన జాగ్రత్తలు తీసకుంటే ఇతరులకు వ్యాధి సంక్రమించదన్నారు. వ్యాధి లక్షణాలున్నట్లయితే నిర్ధారణ పరీక్షలను చేయించుకోవాలని సూచించారు. టీబీ వ్యాధి నివారణలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఇంపాక్ట్ ఇండియా రాష్ట్ర కోఆర్డినేటర్ పురుషోత్తం మాట్లాడుతూ క్షయ వ్యాధితో పోరాడి గెలిచిన వ్యక్తులను ఎంపిక చేసి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీటీఎం కె.సురేందర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

వృద్ధురాలు మృతి

గోదావరిఖని: ఎన్టీపీసీ ఖాజీపల్లి గ్రామానికి చెందిన గుమ్మడి రాజమ్మ(72) మృతిచెందినట్లు గోదావరిఖని వన్‌టౌన్ ఎస్సై అనూష తెలిపారు. శుక్రవారం ఉదయం స్థానిక బస్టాండ్ సమీపంలో కిందపడి ఉండగా, 108 వాహనంలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు వివరించారు. తలకు బలమైన గాయంతో మృతి చెందినట్లుగా డాక్టర్లు నిర్ధారించారన్నారు. మృతురాలి కుమారుడు గుమ్మడి లింగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గురువారం రాత్రి ఇంట్లో నుంచి వెళ్లిన రాజమ్మ అనూహ్యంగా మృతి చెందినట్లు ఎస్సై వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



తలపగిలి తీవ్ర రక్తస్రావంతో మల్లేశం

బోయినపల్లి(చొప్పదండి): బోయినపల్లి నుంచి గంగాధర వెళ్లే డబుల్‌రోడ్డుపై తడగొండ కల్వర్టు పరిసరాల్లో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. ఇల్లంతకుంట మండలం గాలిపెల్లికి చెందిన మల్లేశం తీవ్రంగా గాయపడడంతో పరిస్థితి విషమంగా ఉంది. స్థానికులు తెలిపిన వివరాలు. బైక్‌పై గంగాధర మండలం కాసారం గ్రామానికి చెందిన ఒకరు, మరో బైక్‌పై ఇద్దరు గంగాధర వైపు వెళ్తున్నారు. కల్వర్టు పరిసరాల్లో వెనుక నుంచి ఓ వాహనం ఢీకొట్టడంతో మల్లేశం తలకు తీవ్ర గాయాలయ్యాయి. మరొకరు సైతం గాయపడ్డాడు. సంఘటన స్థలాన్ని పోలీసులు సందర్శించి మల్లేశంను ఆస్పత్రికి తరలించారు.

వివాహిత ఆత్మహత్య



పుష్పలత(ఫైల్)

కరీంనగర్‌రూరల్: బొమ్మకల్‌కు చెందిన ఓ వివాహిత అనారోగ్య సమస్యలతో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు కరీంనగర్‌రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. బొమ్మకల్‌లోని లక్ష్మీనగర్‌కు చెందిన గూడ మాధవరెడ్డి భార్య పుష్పలత (64) కొంతకాలంగా పార్కిసన్ వ్యాధితో బాధపడుతోంది. వ్యాధి తీవ్రతతో జీవితంపై విరక్తి చెందిన పుష్పలత ఇంట్లోని ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుందని వివరించారు. భర్త మాధవరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

సిరిసిల్లక్రైం: జిల్లా కేంద్రంలో శుక్రవారం బైక్ అదుపుతప్పడంతో ఓ యువకుడు గాయపడ్డాడు. సిరిసిల్లకు చెందిన రాజకుమార్ పాత బస్టాండ్ నుంచి కొత్తబస్టాండ్ వైపు వెళ్తున్నాడు. కోర్టు సమీపంలో బైక్ అదుపుతప్పి కిందపడడంతో తల, కాలుకు గాయాలయ్యాయి. స్పృహ తప్పి పడిపోయిన రాజకుమార్‌ను స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

జలకాలాట వద్దు!

- జలపాతాల ఉధృతితో జాగ్రత్తలే రక్ష
- ఎగువ నుంచి దిగువ మానేరు వరకు 60 కిలోమీటర్ల నది
- భారీగా ప్రవహిస్తున్న వరదకాలువ
- మిడ్‌మానేరు గేట్ల ద్వారా నీటి విడుదల



మిడ్‌మానేరు నీటి విడుదలతో మానేరు నది

బోయినపల్లి(చొప్పదండి): వరదలతో జిల్లాలో నదులు ఉప్పొంగుతున్నాయి. వరదకాల్వ నిండుగా ప్రవహిస్తుంది. ఇదే సమయంలో నదిని దాటే సాహసం చేస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. నీటి ప్రవాహం గురించి తెలియక చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారు. జిల్లాలో గోదావరి ఉప నది మానేరునది దాదాపు 60 కిలోమీటర్ల పరిధిలో ప్రవహిస్తోంది. ఈ నదిపై మిడ్‌మానేరు, ఎగువ మానేరు, లోయర్ మానేరు ప్రాజెక్టులు నిర్మించారు. ఎగువమానేరు మత్తడి పోస్తుండగా, మిడ్ మానేరు గేట్లు ఎత్తారు. దీంతో నదిప్రవాహం తీవ్రంగా ఉంది. ఎగువన వర్షాలు కుస్తుండడంతో ఏ క్షణాన నదుల ప్రవాహం పెరుగుతుందో తెలియడం లేదు. నిలకడగా నది ప్రవాహం ఉందనుకుని నది దాటే ప్రయత్నాలు చేస్తే వరద ప్రవాహం ఒక్కసారిగా పెరగడంతో నది దాటలేక ప్రాణాలు అరచేతిలో పెట్టుకున్న సంఘటనలు చూస్తున్నాము. ఎగువ మానేరు నది ప్రవాహం భారీగా పెరగడంతో వరదలో చిక్కుకున్న పలువురు హెలికాప్టర్ సాయంతో క్షేమంగా బయటపడ్డ సంఘటన గంభీరావుపేట మండలంలో జరిగిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో నదులు దాటే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

గేట్లు ఎత్తడంతో నదుల్లో నీరు

భారీ వర్షాలతో ఎస్సారెస్పీతోపాటు మానేరు, మూలవాగుల నుంచి మిడ్‌మానేరు ప్రాజెక్టులోకి భారీగా వరద వచ్చి చేరుతోంది. ఎస్సారెస్పీ నుంచి నీటి విడుదలతో వరద కాలువ నిండుకుండలా మారింది. మిడ్‌మానేరులో 23 టీఎంసీల మేర నీరు చేరింది. మిడ్‌మానేరు గేట్ల ద్వారా ఎల్‌ఎండీకి నీరు విడుదల చేస్తున్నారు. మిడ్‌మానేరు గేట్ల ద్వారా నీరు వదలడంతో మిడ్‌మానేరు నుంచి ఎల్‌ఎండీ వరకు 20 కిలోమీటర్ల మేర మానేరు నది భారీగా ప్రవహిస్తోంది. నేడో, రేపో ఎల్‌ఎండీ గేట్లు ఎత్తి దిగువకు నీరు విడుదల చేసే అవకాశం ఉంది. ఈ సమయంలో ఎల్‌ఎండీ నది ప్రాంతంలో సైతం వరద ప్రవాహం పెరుగుతుంది. ఈ సమయంలో వరదలో చిక్కి ఇబ్బందులు పడకూడదు.

వరద జాగ్రత్తలు ఇవీ..

- ప్రాజెక్టుల సందర్శించే సమయంలో వరదకు దగ్గరగా, దరుల వద్దకు పోవద్దు.
- ప్రాజెక్టుల వద్ద సెల్ఫీలు, ఫొటోలు తీసుకునే విషయంలో పరిసరాలు చూసుకోవాలి.
- గేట్ల ద్వారా నీరు విడుదల అవుతున్న సమయంలో దూరంగా ఉండాలి.
- వంతెనలపై నుంచి కింద పారుతున్న జలాలను రక్షణ గోడల వద్ద నుంచి చూడాలి. చిన్న రక్షణ గోడలు ఎక్కి చూస్తే నీటిలో పడే ప్రమాదం ఉంది.
- కాజ్‌వేలు, కల్వర్టుపై నుంచి వరద నీరు ఉధృతంగా వెళ్తున్న క్రమంలో వాహనాలతో వెళ్లే ప్రయత్నం చేయవద్దు.
- చెరువుల కట్టలపై, అలుగుల వద్ద వాహనాలు నడవడం, సర్కస్ ఫీట్లు చేయవద్దు.
- చెరువులు, వాగుల్లో ఈత కొట్టవద్దు.



భారీగా ప్రవహిస్తున్న వరద కాలువ

మానీటితో రైతుల వ్యవసాయం

జగిత్యాల, కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల్లో విస్తరించి ఉన్న వరదకాలువ ఆధారంగా రైతులు వేల ఎకరాల్లో వ్యవసాయం చేస్తున్నారు. వరదకాలువ, మానేరునది పరిసరాల్లో మోటార్లు అమర్చుకుని పైపులైన్ల ద్వారా పొలాలు పారిస్తూ పంటలు సాగు చేస్తున్నారు. వీరంతా వరద ప్రవాహం ఉన్న సమయంలో నీళ్లలోకి వెళ్లడం ప్రమాదకరమని అధికారులు చెబుతున్నారు. గంభీరావుపేట మండలం నర్మాల ప్రాంతంలో రైతులు వరద ప్రవాహం లేదనుకుని వెళ్లిన తర్వాత ఒక్కసారిగా వరద రావడంతో చిక్కుకుని అవస్థలు పడ్డారు.

బయటకు వెళ్లవద్దు



వర్షాలు కురుస్తున్న సమయంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దు. పశువులను, గొర్రెలు, మేకలు మేపడానికి వెళ్లవద్దు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు కంట్రోల్ రూమ్ సేవలు వినియోగించుకోవాలి. కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నంబర్ 18002331495కు సమాచారం ఇవ్వాలి.

– సందీప్‌కుమార్ ఝా, కలెక్టర్, రాజన్న సిరిసిల్ల

అందుబాటులో పోలీసులు



మానేరు పరివాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ప్రవహిస్తున్న వాగులు, చెరువుల వద్దకు వెళ్లొద్దు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దు. ప్రజలకు ఎలాంటి ప్రమాదం వాటిల్లకుండా పోలీస్ శాఖ తగిన ఏర్పాట్లు చేస్తోంది. ఎవరైన ఆపదలో ఉంటే పోలీసులకు సమాచారం అందించాలి. 100 నంబర్‌కు కాల్ చేయాలి.

– మహేశ్ బి గీతే, ఎస్పీ, రాజన్న సిరిసిల్ల

భార్యను హత్య చేసిన భర్తకు యావజ్జీవశిక్ష

జగిత్యాలజోన్: భార్యను హత్య చేసిన భర్తకు యావజ్జీవ కారాగార శిక్ష, రూ.2,500 జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి. రత్నపద్మావతి శుక్రవారం తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ జంగిలి మల్లికార్జున్ కథనం ప్రకారం.. రాయికల్ మండల కేంద్రానికి చెందిన అరిపెల్లి సత్తయ్య–లక్ష్మి భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కుమారులు కాగా, మొదటి కుమారుడు అరిపెల్లి కృష్ణ ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లాడు. రెండో కుమారుడు అరిపెల్లి వినోద్ హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. కుమారులిద్దరూ ఇక్కడ లేకపోవడంతో, వారి భార్యలు వారివారి పుట్టింట్లో ఉంటున్నారు. సత్తయ్య ఏ పని చేయకపోవడమే కాకుండా, ప్రతి చిన్న విషయానికి ఇంట్లో వాళ్లను తిడుతుండేవాడు. సత్తయ్య–లక్ష్మి మధ్య ఎప్పుడు గొడవలు జరిగేవి. దీంతో భార్యాభర్తలు ఒకే ఇంట్లో వేర్వేరుగా ఉన్నారు. కాగా లక్ష్మి తన వైపు కాకుండా, తన కుమారుల వైపు మాట్లాడుతుందని, భార్యపై ప్రతిసారి కోపడుతుండేవాడు. చంపేస్తానని భార్యను బెదిరించడంతో లక్ష్మి మరో చోట ఇల్లు అద్దెకు తీసుకుంది. అక్కడకు వెళ్లి కూడా సత్తయ్య నానా హంగామా సృష్టించేవాడు. ఈ నేపథ్యంలో, ఆగస్టు 8, 2020న చిన్న విషయానికి గొడవపడి, లక్ష్మిని పదునైన కత్తితో గొంతుకోయడంతో మృతిచెందింది. ఈ ఘటనపై మృతురాలి కొడుకు వినోద్ రాయికల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, అప్పటి ఎస్సై ఆరోగ్యం కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ కృష్ణకుమార్ కేసు దర్యాప్తు చేసి, కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ అధికారులు ఎం.కిరణ్‌కుమార్, కె.నరేశ్ బలమైన సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టడంతో, జడ్జి సాక్ష్యాధారాలను పరిశీలించి నిందితుడు సత్తయ్యకు యావజ్జీవశిక్ష, జరిమానా విధించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇండ్లు దగ్ధం

జగిత్యాలక్రైం: జగిత్యాల పట్టణంలోని మంచినీళ్ల బావి ప్రాంతానికి చెందిన భీమయ్య, ధర్మయ్యకు చెందిన రెండు ఇళ్లలో గురువారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. వెంటనే స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించగా వారు ఘటన స్థలానికి చేరుకుని మంటలు ఆర్పేశారు. ఇంట్లో ఉన్న నిత్యావసర వస్తువులు, సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. సుమారు రూ.5 లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు. మాజీమంత్రి జీవన్‌రెడ్డి శుక్రవారం బాధిత కుటుంబాలను పరామర్శించారు. నిత్యావసర సామగ్రి కోసం ఆర్థికసాయం అందించారు. రెవెన్యూ, విద్యుత్‌శాఖ అధికారులతో మాట్లాడి ప్రభుత్వం తరుపున ఆర్థిక సాయం అందేలా నివేదిక తయారుచేయాలన్నారు.

లోన్ మంజూరైందని రూ.1.50లక్షలు టోకరా

జమ్మికుంట: ముద్ర లోన్ మంజూరైందని, అందుకు డబ్బులు కట్టాలని వాట్సాప్ లింక్ ద్వారా రూ.1.50లక్షలు కాజేసిన సంఘటన జమ్మికుంటలో చోటుచేసుకుంది. టౌన్ సీఐ రామకృష్ణ వివరాల ప్రకారం.. అంకుషాపూర్ గ్రామానికి చెందిన కడిపికొండ శివరెడ్డి అనే వ్యక్తికి ముద్ర లోన్ మంజూరైందని వాట్సాప్ లింక్ వచ్చింది. లింక్ ఓపెన్ చేయగా.. సైబర్ నేరగాళ్లు బ్యాంక్ ఖాతాలోని రూ.1.50లక్షలు కాజేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

ఒకరి మృతికి కారణమైన వ్యక్తికి పది నెలల జైలు


మెట్‌పల్లి(కోరుట్ల): అజాగ్రత్తగా వాహనం నడిపి ఒకరి మృతికి కారణమైన దుంపటి లక్ష్మీరాజ్యంకు మెట్‌పల్లి జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ అరుణ్‌కుమార్ పది నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు సీఐ అశోక్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం..ఇబ్రహీంపట్నం మండలం తిమ్మాపూర్‌కు చెందిన రాజుల సాయన్న 2020 ఫిబ్రవరి 25న తన ఆటోలో మేడిపల్లికి వెళ్లి అక్కడ రోడ్డు పక్కన నిలిపాడు. అదే సమయంలో అటు వైపు కారులో లక్ష్మీరాజ్యం అతి వేగంగా వచ్చి వెనుక నుంచి ఆటోను ఢీ కొట్టాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ సాయన్న తర్వాత చికిత్స పొందుతూ మరణించాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన అప్పటి సీఐ ఎల్.శ్రీను, ఎస్సై అశోక్ పకడ్బందీ సాక్ష్యాధారాలతో కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. వాటిని మెజిస్ట్రేట్ పరిశీలించి నిందితుడికి జైలుశిక్ష విధించినట్లు సీఐ పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి అనుమతివ్వండి

మల్లాపూర్(కోరుట్ల): ఇందిరమ్మ ఇళ్లు మంజూరైందని, ఇంటి నిర్మాణానికి గ్రామపంచాయతీ అనుమతి ఇవ్వాలని బాధితులు వేడుకున్న ఘటన మల్లాపూర్ మండలం మొగిలిపేటలో శుక్రవారం జరిగింది. బాధితులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన ఓదెల గజానంద్–సరోజన దంపతుల ఇల్లు శిథిలావస్థకు చేరి కూలిపోవడంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసింది. ఆ ఇంటి నిర్మాణానికి గ్రామపంచాయతీ అనుమతి, ఫొటో క్యాప్చర్ కోసం పంచాయతీ కార్యదర్శిని సంప్రదించగా, ఇంటి నిర్మాణ స్థలంపై ఫిర్యాదు వచ్చిందని, ఆ వివాదం పరిష్కారమయ్యే వరకు అనుమతితో పాటు ఫొటో క్యాప్చర్ తీయలేనని సమాధానమివ్వడంతో బాధితులు ఆవేదన వ్యక్తంచేశారు. తమ సొంత స్థలంలో ఇల్లు కట్టుకునే భాగ్యం లేదా అంటూ బాధితులు నిరసన తెలిపారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి సౌజన్యను వివరణ కోరగా, ఓదెల సరోజన–గజానంద్ దంపతులు నిర్మించుకుంటున్న ఇంటి వెనుక వారితో దారి వివాదం ఉందని తెలిపారు. వివాదం పరిష్కరించుకొని అనుమతి కోసం రావాలని బాధితులకు సూచించామని పేర్కొన్నారు.



నిరసన తెలుపుతున్న సరోజన–గజానంద్



మిడ్‌మానేరు వద్ద సెల్ఫీ దిగుతున్న యువకులు



చేపలు పడుతున్న మత్స్యకారులు

మధ్యమానేరు పరవళ్లు

వరుసగా కురుస్తున్న వర్షాలతో మిడ్‌మానేరు ఏడు గేట్లు ఎత్తి ఎల్‌ఎండీలోకి నీటిని వదులుతున్నారు. జల ప్రవాహాన్ని చూసేందుకు వస్తున్న జనం సరదాగా సెల్ఫీలు దిగుతుండగా.. మత్స్యకారులు జీవనోపాధి కోసం అదే వరదలో చేపలు పడుతున్నారు. ఇదే వరదతో గంభీరావుపేట మండలంలో వరిపొలాలు కొట్టుకుపోయాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్న సిరిసిల్ల

కెనాల్‌లో దూకి వ్యక్తి ఆత్మహత్య

కోరుట్లరూరల్: మెట్‌పల్లి పట్టణంలోని రెడ్డి కాలనీకి చెందిన కొయ్యాడ అనిల్ (33) మృతదేహం మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ శివారు కెనాల్‌లో శుక్రవారం సాయంత్రం లభ్యమైనట్లు కోరుట్ల ఎస్సై చిరంజీవి తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. అనిల్ ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొంతకాలంగా ప్రాంకియాసిస్ వ్యాధితో బాధపడుతున్నాడు. పని చేయలేని పరిపస్థితుల్లో కుటుంబ పోషణకు అప్పులు చేశాడు. అప్పులు ఎలా తీర్చాలో తెలియక మానసిక క్షోభకు గురవుతున్నాడు. బుధవారం మధ్యాహ్నం ఇంటినుంచి వెళ్లిపోయాడు. శుక్రవారం సాయంత్రం పెద్దాపూర్ శివారు కెనాల్‌లో మృతదేహం లభ్యమైంది. కాగా, తన భర్త ప్రాంకియాసిస్ వ్యాధితో బాధపడుతూ కెనాల్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పార్వతీ బ్యారేజీకి తగ్గని వరద



బ్యారేజీ నుంచి దిగువకు వెళ్తున్న వరద

మంథనిరూరల్: పెద్దపల్లి జిల్లా మంథని మండలం సిరిపురం సమీపంలోని పార్వతీ బ్యారేజీకు వరద తాకిడి తగ్గలేదు. శుక్రవారం సైతం భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఎల్లంపల్లి ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో 8.28లక్షల క్యూసెక్కులు వస్తున్నాయి. పార్వతీ బ్యారేజీ 74 గేట్లు ఎత్తి ఎగువ నుంచి వచ్చే నీళ్లను దిగువకు వదులుతున్నారు. బ్యారేజీలో ప్రస్తుతం 125.780 మీటర్ల ఎత్తులో ప్రవాహం కొనసాగుతోంది. శుక్రవారం ఉదయం నుంచి ఇప్పటివరకు ఒకేస్థాయిలో వరద కొనసాగుతుండటంతో పరీవాహక ప్రాంతాల్లోని పంటలు నీటమునిగే ఉన్నాయి. వరద ఉధృతి తగ్గుముఖం పట్టకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా వరద ఉధృతి అలాగే కొనసాగుతుండటంతో అధికారులు పరీవాహక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

స్క్రాప్ తరలిస్తున్న వాహనాల పట్టివేత



సీఐఎస్‌ఎఫ్ అధికారులు పట్టుకున్న వాహనాలు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ టౌన్‌షిప్ నుంచి అక్రమంగా తరలిస్తున్న స్క్రాప్‌ను సీఐఎస్‌ఎఫ్ విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. రెండు ట్రాక్టర్ల ద్వారా గురువారం ముగ్గురు స్క్రాప్ తరలిస్తున్నారని సీఐఎస్‌ఎఫ్ విజిలెన్స్ అధికారులకు సమాచారం అందింది. వెంటనే రంగంలోకి దిగిన అధికారులు.. ప్లాంట్ నుంచి వచ్చిన ట్రాక్టర్, హైడ్రా వాహనాలను నిలిపి తనిఖీ చేయగా సుమారు 170 కేజీల స్క్రాప్ లభించింది. ఈమేరకు ట్రాక్టర్ డ్రైవర్ ఎ.సతీశ్, హైడ్రా డ్రైవర్ గుడ్డు కుమార్‌సింగ్, క్రేన్ ఆపరేటర్ కబీర్ అన్సారీని అదుపులోకి తీసుకున్నారు. రెండు వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల కోసం ఎన్టీపీసీ హెచ్‌ఆర్ అధికారులకు స్క్రాప్ అప్పగించారు.

కొదురుపాకలో రెండిళ్లలో చోరీ

- బంగారు, వెండి నగలు అపహరణ



బీరువాలో చిందర వందరగా వస్తువులు

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని కొదురుపాకలో గురువారం అర్ధరాత్రి రెండిళ్లలో జరిగిన చోరీలో బంగారు, వెండి నగలను దొంగలు ఎత్తుకెళ్లారు. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాలు. కొదురుపాకకు చెందిన నాగుల లక్ష్మీరాజం, ధ్యావనపల్లి సుధాకర్‌రావు ఇళ్లలో దొంగలు చొరబడ్డారు. నాగుల లక్ష్మీరాజం ఇంట్లో 30 తులాల వెండి పట్టీలు, ధ్యావనపల్లి సుధాకర్‌రావు ఇంట్లో తులం బంగారుగుండ్లు, అర తులం కమ్మల జతలు, 20 తులల వెండి పట్టీలు ఎత్తుకెళ్లారు. ఎస్సై రమకాంత్ సంఘటన స్థలానికి చేరుకొని, క్లూస్ టీంతో వివరాలు సేకరించారు.

కాళ్లకు ఇన్‌ఫెక్షన్.. వైద్యం కోసం నిరీక్షణ

- ఆపరేషన్‌కు రూ.14లక్షలు అవసరం
- చికిత్స చేయించలేక.. నిమ్స్ వరండాలో కుటుంబ సభ్యులు
- దాతల సాయం కోసం వేడుకోలు



నిమ్స్ వరండాలో ఉన్న పేషెంట్, కుటుంబ సభ్యులు

జూలపల్లి(పెద్దపల్లి): ఖరీదైన వైద్యం చేయించుకునే స్థోమతలేని ఓ పేద కుటుంబం ఆపన్నహస్తం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ వరండాలో తలదాచుకుంది. దాతల సాయం కోసం దీనంగా ఎదురు చూస్తోంది. పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం పెద్దాపూర్ గ్రామానికి చెందిన పులిపాక నర్సయ్య రెండు కాళ్లకు ఇటీవల ఇన్‌ఫెక్షన్ సోకింది. స్థానికంగా వైద్యం చేయించినా నయం కాలేదు. దీంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌కు వెళ్లారు. పరీక్షించిన వైద్యులు.. రెండుకాళ్లకు ఆపరేషన్ చేయాలని, ఇందుకోసం సుమారు రూ.14 లక్షల వరకు ఖర్చవుతుందని వెల్లడించారు. చేతిలో చిల్లిగవ్వలేని బాధిత కుటుంబం.. తొలుత పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావును కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. స్పందించిన ఎమ్మెల్యే.. సీఎం సహాయ నిధి నుంచి రూ.1.50లక్షలు ఇచ్చేందుకు ఉత్తర్వులు మంజూరు చేయించారు. మిగతా డబ్బుల కోసం బాధిత కుటుంబం దాతల కోసం వేయికళ్లతో ఎదురు చూస్తోంది. ప్రస్తుతం చికిత్స ఏమీ లేకపోవడంతో నిమ్స్ వరండాలోనే కాలం వెళ్లదీస్తోంది. సకాలంలో ఆపరేషన్ చేయకుంటే రెండుకాళ్లు తొలగించే అవకాశం ఉందని కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. దాతలు ముందుకు రావాలని వారు వేడుకుంటున్నారు.

బార్ అండ్ రెస్టారెంట్లలో తనిఖీలు

- నిల్వ పదార్థాలు గుర్తింపు



నిల్వ ఉన్న ఆహార పదార్థాలు

కరీంనగర్ అర్బన్: ఫుడ్ సేఫ్టీ ఎన్‌ఫోర్స్‌మెంట్ శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టింది. బస్టాండ్ పక్కన గల నటరాజ్ బార్, దర్బార్ బార్‌లో గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ పి.రోహిత్‌రెడ్డి, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ వి.అంకిత్‌రెడ్డి తనిఖీలను నిర్వహించారు. దర్బార్ బార్‌లో ముందు రోజు మిగిలిన మటన్, కార్న్, వెజ్ మంచూరియాను గుర్తించారు. హైజీన్ లోపాలు గుర్తించగా నోటీసులు జారీ చేశారు. అలాగే నటరాజ్ బార్‌లో పరిసరాల పరిస్థితి అధ్వానంగా ఉన్నట్లు గుర్తించామని అధికారులు వివరించారు. కిచెన్ దుర్వాసన రాగా, సిబ్బంది ఎటువంటి ఆహార భద్రత జాగ్రత్తలు పాటించకపోవడంతో నోటీస్ జారీ చేసినట్లు వివరించారు.





రాజన్నకు మొక్కులు

వేములవాడ : రాజన్నను శుక్రవారం 15 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. భక్తుల ద్వారా రూ.16లక్షల ఆదాయం సమకూరింది. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి రాజన్నను దర్శించుకున్నారు. ఆలయంలోని ఓపెన్‌స్లాబ్, కల్యాణకట్ట, మెయిన్ టెంపుల్ పరిసర ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఆలయ ఈఈ రాజేశ్, డీఈలు రఘునందన్, మైపాల్‌రెడ్డి, ఏఈవో శ్రావణ్‌కుమార్, పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ, వెల్ది సంతోష్, ఆలయ ఇన్‌స్పెక్టర్ నూగురి నరేందర్ ఉన్నారు.

స్పటిక లింగాలతో వినాయకుడు

విఘ్నాలు హరించే వినాయకుడి నవరాత్రి ఉత్సవాలు ఉత్సాహంగా నిర్వహించుకుంటున్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలో 36వ వార్డు వెంకంపేట రాంలాల్ మండప్ నిర్వాహకులు స్పటిక లింగాలతో వినాయకుడి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. మహారాష్ట్రలో కోల్‌కత కళాకారులతో రూ.2 లక్షలకు పైగా వెచ్చించి ఈ విగ్రహాన్ని తయారు చేయించారు. పర్యావరణానికి హాని కలుగకుండా పూర్తిగా బంకమట్టి, కర్రలు, గడ్డితో ఎలాంటి రసాయనాలు వాడకుండా ఈ విగ్రహాన్ని తయారు చేయించారు. 10,116 స్పటిక లింగాలతో వినాయకుడి విగ్రహాన్ని తయారు చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్నసిరిసిల్ల



స్పటిక లింగాల వినాయకుడు


సూర్యనగర్ (శుభం గార్డెన్)లో కుంకుమ పూజలు


కొత్తపల్లి అల్ఫోర్స్ ఇ టెక్నో స్కూల్‌లో 120 రకాల నైవేద్యాలు

కుంకుమ పూజలు.. నైవేద్యాలు



శివాజీనగర్‌లో కుంకుమ పూజ

కరీంనగర్ కల్చరల్/విద్యానగర్/కొత్తపల్లి: విఘ్నేశ్వర నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం కరీంనగర్‌లోని వివిధ కాలనీల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద ఘనంగా కుంకుమ పూజలు నిర్వహించారు. ఎరుపు రంగు వస్త్రధారణతో మహిళా భక్తులు అధిక సంఖ్యలో హాజరై కుంకుమ పూజలో పాలుపంచుకున్నారు. సూర్యనగర్(శుభం గార్డెన్)లో జరిగిన పూజలో అల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల కరస్పాండెంట్ వి.రవీందర్ రెడ్డి అన్నప్రసాదం అందించగా.. కాంగ్రెస్ నాయకుడు, అడ్వకేట్ బబ్లూవర్మ మహిళలకు పూజ చేసుకునేందుకు ప్లేట్లు అందించారు. వీరిని గణేశ్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు సన్మానించారు కిసాన్‌నగర్‌లో విజ్ఞాన రాజా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద, నవీన కుర్మవాడలోని శ్రీబాలభక్తాంజనేయస్వామి ఆలయం, రాంనగర్, శివాజీ నగర్‌లో లో ఏర్పాటు చేసిన వినాయకుడి వద్ద కుంకుమ పూజలు నిర్వహించారు. కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ టెక్నో స్కూల్‌లో ఏర్పాటు చేసిన మహాగణపతికి 120 రకాల నైవేద్యాలను డాక్టర్ వనజానరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సమర్పించారు.వావిలాపల్లిలోని అల్ఫోర్స్ విద్యా సంస్థల మెయిన్ క్యాంపస్‌లో జరిగిన కుంకుమ పూజలో ఆ విద్యా సంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు. భగత్‌నగర్‌లో చైతన్య యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుడిని మాజీ మేయర్ సునీల్‌రావు ప్రత్యేక పూజలు చేసి అన్నప్రసాదం వితరణలో పాల్గొన్నారు.


రాంనగర్‌లో మట్టి వినాయకుడికి పూజలు


కిసాన్‌నగర్‌లో..


నవీన కురమవాడలోని శ్రీబాలభక్తాంజనేయ స్వామి ఆలయంలో..


విఘ్నేశ్వరునికి పూజలు చేస్తున్న మాజీ మేయర్ సునీల్‌రావు

ఓటరు జాబితాలో తప్పులు

- వేర్వేరు వార్డుల్లో కుటుంబసభ్యుల పేర్లు
- నేడు అభ్యంతరాల స్వీకరణకు తుది గడువు

కరీంనగర్‌రూరల్: స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ నిర్వహణలో భాగంగా ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అధికారులు గురువారం విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితా తప్పుల తడకగా మారిందనే ఆరోపణలున్నాయి. కుటుంబమంతా ఒకే వార్డులోకి తీసుకవచ్చేందుకు అధికారులు చేపట్టిన కసరత్తు జాబితాలో కనిపించలేదు. పలు గ్రామాల్లోని కుటుంబసభ్యులు వేర్వేరు వార్డుల్లో ఉండటం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. కరీంనగర్ మండలంలోని 14 గ్రామపంచాయతీల పరిధిలో మొత్తం 22,053 మంది ఉండగా వీరిలో పురుషులు 10,870, మహిళలు 11,182, ఇతరులు 1 ఉన్నారు. పురుషుల కంటే మహిళలే ఎక్కువగా ఉన్నారు. ప్రస్తుతం గ్రామంలోని కుటుంబసభ్యులందరినీ ఒకే వార్డులోకి చేర్చి వార్డుల విభజన పూర్తి చేశారు. అయితే ఇరుకుల్లలో మాత్రం కుటుంబసభ్యులు వేర్వేరు వార్డుల్లో ఉన్నారు. ఇంటి నం.2–47లోని తరిగొప్పుల కనుకవ్వ, శ్రీనివాస్, రజిత, స్వప్నలు 4వ వార్డులో ఉండగా మిగిలిన కుటుంబసభ్యులు లక్ష్మి, సతీశ్, రమేశ్‌లు 5వ వార్డులో ఉండటం గమనార్హం. ఇరుకుల్లతోపాటు మొగ్దుంపూర్, చెర్లభూత్కూర్, జూబ్లీనగర్, చామనపల్లి తదితర గ్రామాల్లో సైతం కొన్ని కుటుంబాలకు చెందిన సభ్యుల పేర్లు వేర్వేరు వార్డుల్లోకి వచ్చినట్లు తెలుస్తోంది. అయితే ముసాయిదా ఓటరు జాబితాలోని అభ్యంతరాలపై ఫిర్యాదు చేసేందుకు శనివారం తుది గడువుగా ఉందని ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. ఆయా గ్రామాల్లో వచ్చిన అభ్యంతరాలను 31న పరిశీలించిన అనంతరం తుది ఓటరు జాబితా ప్రచురించడం జరుగుతుందని వివరించారు.


చామనపల్లిలో ఓటరు జాబితా విడుదల చేసిన ఎంపీడీవో సంజీవరావు తదితరులు

సామాజిక అవగాహన పెంపొందించుకోవాలి

కరీంనగర్: విద్యార్థులు సామాజిక అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలని రిటైర్డ్ టీచర్, సామాజిక వేత్త మాడిశెట్టి అరుణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం నగరంలోని శివానీ డిగ్రీ కళాశాలలో నాయకుడు అల్లెపు అభిలాష్ అధ్యక్షతన జరిగిన భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యూఎస్ఎఫ్ఐ) నగర మహాసభలో పాల్గొని మాట్లాడారు. కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా సమాజంలో జరుగుతున్న అఘాయిత్యాలు, అక్రమాలపై నేటి యువత స్పందించి పనిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు. విద్యార్థులు లేని ఉద్యమం ఏది కూడా విజయవంతం కాలేదని తెలిపారు. కాబట్టి విద్యార్థులు పెద్ద ఎత్తున ఉద్యమాలకు కదలాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ,కార్యదర్శులు రాహుల్, సంద గణేశ్ ,నాయకులు ఉమామహేశ్వర్, ప్రశాంత్, సంతోష్, విష్ణు, హేమంత్ ,గణేశ్, మయూరి, అక్షయ, వాణి, ప్రీతి, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అరుణ్‌కుమార్

భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి

కరీంనగర్: భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ పౌరుడిపై ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. సీపీఎం అఖిల భారత మాజీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి జయంతి సందర్భంగా శుక్రవారం నగరంలోని ముకుందలాల్ మిశ్రాభవన్‌లో జి.బీమాసాహెబ్ అధ్యక్షతన 'భారత రాజ్యాంగం–ఎదుర్కొంటున్న సవాళ్లు' అంశంపై నిర్వహించారు. ముందుగా సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వాసుదేవరెడ్డి మాట్లాడుతూ దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత భారత రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ రాజ్యాంగబద్ధ సంస్థలను ఒక్కొక్కటిగా నిర్వీర్యం చేస్తూ దేశాన్ని నియంతృత్వం వైపు మోదీ సర్కార్ తీసుకెళ్తుందని అన్నారు. ఈ సెమినార్‌లో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు వర్ణ వెంకట్‌రెడ్డి, గిట్ల ముకుంద రెడ్డి, గుడికందుల సత్యం, జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాస్, ఎడ్ల రమేశ్, వెలమారెడ్డి రాజిరెడ్డి, రాజేశం, శీలం అశోక్, నరేశ్ పటేల్, కొప్పుల శంకర్, కోనేటి నాగమణి, నాయకులు శ్రీకాంత్, శ్రీనివాస్, అరవింద్, మోహన్ నాయక్, శివరాజ్, శంకర్, రాములు, సతీశ్, సదానందం, గుండేటి వాసుదేవ్, రోజా, రమ, తిరుపతి, తిరుమలయ్య, రమేష్ యాదవ్, వినయ్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మిల్కూరి వాసుదేవరెడ్డి

2నుంచి ఎస్‌జీఎఫ్ క్రీడలు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్‌రూరల్ మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలను సెప్టెంబర్ 2వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ఎంఈవో కె.రవీందర్ తెలిపారు. శుక్రవారం ఎమ్మార్సీ భవన్‌లో పీడీలతో ఎస్‌జీఎఫ్ క్రీడల నిర్వహణపై నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలను సెప్టెంబర్ 2న బాలికలు, 3న బాలురు, 4న బాలబాలికలకు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తామన్నారు. మండలస్థాయి క్రీడలను కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహించి ప్రతిభ ఆధారంగా జిల్లా స్థాయి పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేస్తామని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఆయా తేదీల్లో ఉదయం 9గంటలకు క్రీడల నిర్వహణ కార్యదర్శి రమేశ్‌కు రిపోర్టు చేయాలని సూచించారు. సమావేశంలో పీడీలు రమేశ్, సౌజన్య, శ్రీనివాస్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంఈవో రవీందర్

రేపు శిక్షణా తరగతులు

విద్యానగర్(కరీంనగర్): జనవిజ్ఞాన వేదిక తెలంగాణ ఆధ్వర్యంలో ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాల ప్రజా సైన్స్ ఉద్యమ నాయకులు, కార్యకర్తలకు ఈనెల 31న శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు జన విజ్ఞాన వేదిక కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ఆర్.వెంకటేశ్వర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్‌లోని ఫిల్మ్‌భవన్ జరిగే శిక్షణ తరగతుల్లో ఉదయం 'శాస్త్రం, శాస్త్ర ప్రచారం, సవాళ్లు' అనే అంశంపై జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపక సభ్యుడు ప్రొఫెసర్ ఎ. రామచంద్రయ్య ప్రసంగిస్తారని, మధ్యాహ్నం 'ప్రజాసైన్స్ ఉద్యమం, తాత్వికత–అనుభవాలు' అనే అంశంపై జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజా ప్రసంగిస్తారని అన్నారు. జన విజ్ఞాన వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు చెలిమెల రాజేశ్వర్ పాల్గొని సందేశం ఇస్తారని పేర్కొన్నారు.

పోగొట్టుకున్న పర్సు అందజేత

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ మార్కెట్‌లో ఒక వ్యక్తి పోగొట్టుకున్న పర్సును తిరిగి అప్పగించి కరీంనగర్ ట్రాఫిక్ హోంగార్డు తమ నిజాయితీని చాటుకున్నాడు. మార్కెట్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహం సమీపంలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు ఎ.నర్సయ్యకు ఒక పర్సు దొరికింది. దానిని పరిశీలించగా, అందులో రూ.6500 నగదు, 8 వ్యక్తిగత బ్యాంక్ కార్డులు ఉన్నాయి. కార్డులపై ఉన్న వివరాల ఆధారంగా అది మానుకొండూరు మండలం, గంగిపల్లికి చెందిన వ్యక్తిదిగా గుర్తించారు. అనంతరం ట్రాఫిక్ ఎస్సై సురేశ్ సమక్షంలో ఆ పర్సును దాని యజమానికి సురక్షితంగా అందజేశారు. ఈ సందర్భంగా స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.


పర్సును అందజేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

డబుల్ బెడ్రూం ఇళ్లలోకి వరదనీరు

కరీంనగర్‌రూరల్: రెండు రోజులుగా కురిసిన వర్షాలకు కరీంనగర్ మండలం మొగ్దుంపూర్‌లోని డబుల్ బెడ్రూం ఇళ్ల సముదాయంలోకి వరదనీరు వచ్చాయి. సమీపంలోని కుంటలోకి భారీగా వరద నీళ్లు చేరడంతో కొందరి ఇళ్లలోకి నీళ్లు రావడంతో శుక్రవారం గ్రామ ప్రత్యేక అధికారి, ఏవో బి. సత్యం , పంచాయతీ కార్యదర్శి శ్రావణి, మాజీ సర్పంచ్ జక్కం నర్సయ్యలు పరిశీలించారు. వరదనీరు పోవడానికి ప్రత్యేకంగా పంచాయతీ సిబ్బందితో కాలువలు ఏర్పాటు చేశారు. ఇళ్ల సమీపంలో నీరు నిల్వ ఉండకుండా తగిన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులకు సూచించారు.


వరదనీటిని పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి

క్లుప్తంగా

ఆడిటోరియం పనుల పరిశీలన


ఏవోకు పనులను వివరిస్తున్న గుత్తేదారు

కరీంనగర్ అర్బన్: కలెక్టరేట్ ఆడిటోరియం మరమ్మతు పనులను కలెక్టరేట్ ఏవో గడ్డం సుధాకర్ శుక్రవారం పరిశీలించారు. వేదికతోపాటు మెట్లు, సీలింగ్ పనులు జరుగుతుండగా ఆకస్మికంగా తనిఖీ చేశారు. గడువులోగా నాణ్యతతో పనులు పూర్తి చేయాలని గుత్తేదారుకు సూచించారు.

సీపీఆర్‌పై శిక్షణ


సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

కరీంనగర్‌టౌన్: నగరంలోని కశ్మీర్‌గడ్డలో గల ఐఎంఏ హాల్‌లో శుక్రవారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సీపీఆర్‌పై శిక్షణ, అవగాహన కల్పించారు. ఐఎంఏ ద హార్ట్‌బీట్ అనే నినాదంతో ఆసుపత్రుల్లో పనిచేసే సిబ్బందికి శిక్షణ అందించారు. ఈ సందర్భంగా ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు ఎనమల్ల నరేశ్ మాట్లాడుతూ మన దేశంలో ప్రతీ లక్ష మందిలో 4 వేల మంది కార్డియాక్ అరెస్ట్‌కు గురవుతున్నారని తెలిపారు. సీపీఆర్‌పై అవగాహన లేకపోవడం వల్ల కళ్లముందే కార్డియాక్ అరెస్ట్ అయినా ఏమి చేయలేని పరిస్థితి ఎదురవుతుందని తెలిపారు. అందుకే ఏటా ఈ శిక్షణ నిర్వహిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో వైద్యులు నవీన్‌కుమార్, విజయ్‌కుమార్, ఎంఎల్ఎన్ రెడ్డి, రాంకిరణ్, వినయ్‌కుమార్, గంగాధర్, మహేశ్వర్‌రెడ్డి, రత్నాకర్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషా దినోత్సవం


నివాళి అర్పిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం ఆసిఫ్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం క్రీడా, తెలుగు భాషా దినోత్సవాలను నిర్వహించారు. ధ్యాన్‌చంద్, గిడుగు వెంకట రామమూర్తి చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళి అర్పించారు. తెలుగు ఉపాధ్యాయుడు హరికృష్ణ శర్మ భాషా క్రీడలు, అచ్చ తెలుగు కార్యక్రమాలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు కట్ట వెంటేశ్వర్లు, ఉపాధ్యాయులు వాసంతి, శివ కుమార్, రాజేంద్రప్రసాద్, ఏంజెలీన్, గంగాచారి, ప్రతిభా రాణి, నాగవేణి, సంతోష్, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్‌కు వేలం

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలోని మినరల్ వాటర్ ప్లాంట్ నిర్వహణకు శుక్రవారం గ్రామసభ ఏర్పాటు చేసి వేలం నిర్వహించారు.ఏడాదికి రూ.1.70లక్షలను మడ్డి మల్లేశం చెల్లించేందుకు ముందుకు రాగా వేలంలో పోటీ ఎవరూ లేకపోవడంతో గ్రామసభలో అంగీకరించారు. ఎంపీడీవో సంజీవరావు, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్‌రావు, కరీంనగర్ సింగిల్‌విండో చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి, నాయకులు నరేశ్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం


ధ్యాన్ చంద్ చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న నరేందర్ రెడ్డి


జాతీయ జూడో, బేస్‌బాల్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను సత్కరించిన అనంతరెడ్డి

కరీంనగర్‌స్పోర్ట్స్: భారత హాకీ క్రీడకు వన్నెతెచ్చిన హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం కరీంనగర్‌లో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్యాన్‌చందర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో..

అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి ధ్యాన్‌చంద్ చిత్రపటానికి నివాళి అర్పించారు. ధ్యాన్ చంద్ క్రీడారంగానికి ఎనలేని సేవ చేశారని, ప్రతిఒక్కరూ ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. విద్యార్థులకు వివిధ రకాల క్రీడలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. వ్యాయామ ఉపాధ్యాయులను సన్మానించారు. వివిధ పాఠశాలల, కళాశాలల, ప్రిన్సిపాల్‌లు, వ్యాయామ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మానేరు విద్యాసంస్థల్లో..

మానేరు విద్యాసంస్థల్లో ధ్యాన్‌చంద్ చిత్రపటానికి మానేరు విద్యాసంస్థల అధినేత, ఒలింపిక్ సంఘం ఉమ్మడి జిల్లా పాట్రాన్ కడారి అనంతరెడ్డి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయబోతున్న నూతన క్రీడా పాలసీలతో క్రీడాకారులు, విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని అన్నారు. జాతీయ స్థాయి జూడో, బేస్‌బాల్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను సన్మానించారు. విద్యాసంస్థల ప్రిన్సిపాల్ సరితారెడ్డి, పీఈటీలు సిలివేరి మహేందర్, తిరుపతి, జహేద, స్వామిలతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బిర్లా స్కూల్‌లో..

కరీంనగర్‌రూరల్: బొమ్మకల్‌లోని బిర్లా ఓపెన్‌మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో క్రీడలతో సందడిగా మారింది. పాఠశాల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బబితా విశ్వనాధన్ ముఖ్య అతిథులుగా హాజరై పోటీలు ప్రారంభించారు. క్రీడలు శారీరక ఆరోగ్యానికి దోహదపడుతాయని తెలిపారు. అనంతరం బాస్కెట్‌బాల్, ఆర్చరీ, లాన్ టెన్నిస్, అథ్లెటిక్స్, లాంగ్ జంప్, ఖోఖో, త్రోబాల్, కబడ్డీ తదితర క్రీడల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో..

నగునూరులోని సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ధ్యాన్‌చంద్, గిడుగు రామ్మూర్తి చిత్రపటాలకు ప్రిన్సిపాల్ మాలతి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. క్రీడాకారుడిగా ధ్యాన్‌చంద్ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. అనంతరం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. వైస్ ప్రిన్సిపాల్ పద్మజ, సూపరింటెండెంట్ సురేశ్, ఏసీవో వసుమతి, పీడీ పర్వీన్‌బేగం, అధ్యాపకులు వెంకటేశ్వర్లు, రాధిక, రేణుక తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా ఎస్పీఆర్ హైస్కూల్‌లో నిర్వహించిన క్రీడా దినోత్సవంలో చైర్మన్ విజయమోహన్‌రెడ్డి, కరస్పాండెంట్ యాకయ్య, డైరెక్టర్లు రాజేందర్, ప్రశాంత్, శ్యాంసుందర్, ఎండీ ఉపేందర్, ప్రధానోపాధ్యాయులు రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోరా జాన్సన్‌లో,,

కరీంనగర్: నగరంలోని కోర జాన్సన్ పాఠశాలలో విద్యార్థులు చైర్మన్ మహిపాల్ రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్, రాంరెడ్డి, సింహాచలం హరికృష్ణ, వంగల సంతోషరెడ్డిలకు ఘనంగా స్వాగతం పలికి క్రీడా దీపంను స్కూల్ కెప్టెన్, స్పోర్ట్స్ కెప్టెన్ చైర్మన్, డైరెక్టర్లకు అందించగా వారు దీపంని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పాఠశాల యాజమాన్యం పీఈటీ ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు.


బిర్లా స్కూల్‌లో క్రీడా పోటీలు


సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో..


కోరా జాన్సన్‌లో వెలిగిస్తున్న క్రీడా జ్యోతి

సమస్యలన్నిటికీ పరిష్కార వేదిక శుక్రవారం సభ

కరీంనగర్: మహిళా సమస్యలన్నింటికీ శుక్రవారం సభ ఒక పరిష్కార వేదికగా నిలుస్తుందని సీడీపీవో సబిత అన్నారు. కిసాన్‌నగర్ సెక్టార్ పరిధిలోని దుర్గమ్మగడ్డ అంగన్‌వాడీ కేంద్రంలో మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన శుక్రవారం సభలో పాల్గొని మాట్లాడారు. మహిళలు తమ సమస్యలు ఏవైనా శుక్రవారం సభలో విన్నవించుకోవచ్చని, ప్రతీ మహిళా గర్భిణీ, బాలింత శుక్రవారం సభకు తప్పక హాజరు కావాలని సూచించారు. సభలో పలు విషయాలు చర్చించుకోవడం ద్వారా మహిళల్లో మానసిక ఉత్తేజం కలుగుతుందని అన్నారు. మెడికల్ ఆఫీసర్ ఇమ్రాన్ ఖాన్ మాట్లాడుతూ ఆరోగ్య మహిళా కార్యక్రమంలో జిల్లాలో మహిళలందరికీ సుమారు 50 రకాల పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నామని, వీటిని ప్రతి మహిళా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెప్మా పీడీ స్వరూప రాణి, స్వప్న, పుష్పలత, రాజు, రేణుక, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీడీపీవో సబిత

నియామకం

రెడ్డి జాగృతి యూత్ జిల్లా అధ్యక్షుడిగా మధూకర్

కరీంనగర్‌రూరల్: రెడ్డి జాగృతి యూత్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా కరీంనగర్ మండలం మొగ్దుంపూర్‌కు చెందిన దామరపల్లి మధూకర్‌రెడ్డిని నియమిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు జగ్గారెడ్డి తెలిపారు. ఈమేరకు గురువారం రెడ్డి జాగృతి జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మధూకర్‌రెడ్డికి నియామక పత్రాన్ని అందజేశారు. రెడ్డి జాగృతి యువజన విభాగాన్ని జిల్లాలో బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని మధూకర్‌రెడ్డి తెలిపారు. తన నియామకానికి సహకరించిన రెడ్డి జాగృతి వ్యవస్థాపక అధ్యక్షుడు మాధవరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాఘవేంద్రరెడ్డి, పెద్దపల్లి జిల్లా రెడ్డి జాగృతి అధ్యక్షుడు సతీశ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.


మధుకు నియామక పత్రం అందజేస్తున్న జగ్గారెడ్డి

యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా జిల్లా కోఆర్డినేటర్‌గా కుమార్

కరీంనగర్ కార్పొరేషన్: యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా జిల్లా కోఆర్డినేటర్‌గా కడారి కుమార్, కో కోఆర్డినేటర్‌గా బొంగోని ప్రశాంత్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం జాతీయ ఇన్‌చార్జి మనుజైన్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే కరీంనగర్ అసెంబ్లీ కోఆర్డినేటర్లుగా విష్ణువర్ధన్, బూస సంపత్, కరీంనగర్ సిటీ కోఆర్డినేటర్ గా జాప సతీశ్‌రెడ్డి, మానకొండూర్ అసెంబ్లీ కో ఆర్డినేటర్‌గా కనుకం రాకేశ్, చొప్పదండి కోఆర్డినేటర్ గా నేరెళ్ల సతీశ్‌రెడ్డి, హుజురాబాద్ కోఆర్డినేటర్‌గా సంపంగి అరుణ్ నియమితులయ్యారు. అదేవిధంగా మండల కో ఆర్డినేటర్లు, కో కోఆర్డినేటర్‌లను నియమించారు.


కడారి కుమార్

బీసీ యువజన సంఘం సంయుక్త కార్యదర్శిగా శ్రీకాంత్

కరీంనగర్: బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఆదేశాల మేరకు బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జిల్లపల్లి అంజి సూచన మేరకు బీసీ యువజన సంఘం జిల్లా సంయుక్త కార్యదర్శిగా నరాల శ్రీకాంత్‌ను నియమిస్తూ బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింగోజు శ్రీనివాస్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ సంఘం బలోపేతానికి కృషి చేస్తానని, బీసీ హక్కుల సాధనకై పోరాడుతానని అన్నారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.


నరాల శ్రీకాంత్

యువకుల బైండోవర్

కరీంనగర్‌రూరల్: బొమ్మకల్‌లో అర్ధరాత్రి మద్యం తాగుతూ ట్రాక్టర్ యజమానిపై దాడికి పాల్పడిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి శుక్రవారం తహసీల్దార్ రాజేశ్ ఎదుట బైండోవర్ చేసినట్లు కరీంనగర్‌రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. రెండు రోజుల క్రితం నేరెల్ల శ్రీనివాస్ ట్రాక్టర్‌పై వెళ్తుండగా బొమ్మకల్‌కు చెందిన బొడిగె రాజశేఖర్, వెంకటేశ్, భగత్‌నగర్‌కు చెందిన సాయి మనీష్‌లు రాత్రివేళ దారిలో కూర్చుని మద్యం తాగుతున్నారు. పక్కకు జరగమని హారన్ కొట్టిన శ్రీనివాస్‌ను ముగ్గురు యువకులు ఇష్టం వచ్చినట్లు బూతులు తిడుతూ దాడి చేశారు. బాధితుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి తహసీల్దార్ ముందు బైండోవర్ చేసినట్లు సీఐ తెలిపారు.

బాలికను వేధించిన వ్యక్తిపై పోక్సో కేసు

కరీంనగర్‌క్రైం: ప్రేమపేరుతో బాలికను వేధించిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ రాంచందర్‌రావు తెలిపారు. అర్నకొండకు చెందిన టి.రంజిత్ నాలుగు నెలల క్రితం ఇన్‌స్టాగాంలో కరీంనగర్‌లో చదువుతున్న ఒక బాలికతో పరిచయం చేసుకున్నాడని అన్నారు. రెండు నెలల నుంచి బాలికను ప్రేమపేరుతో వేధింపులకు గురిచేస్తూ శుక్రవారం బాలికకు ఫోన్ చేసి కరీంనగర్‌లో కలవాలని తెలిపాడని అన్నారు. ఈ విషయం తెలుసుకున్న బాలిక తల్లి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అనాథ వృద్ధుడికి సర్జరీతో కాలు తొలగింపు

కరీంనగర్‌టౌన్: నగరంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో గల వీబీ ఫౌండేషన్ (వీరబ్రహ్మేంద్ర వృద్ధుల ఆశ్రమం)లో ఆశ్రయం పొందుతున్న వెదిరకు చెందిన నారాయణ (70) షుగర్ వ్యాధితో బాధపడుతూ ఇటీవల కాలుకు పుండు పడి మానకపోవడంతో ఆశ్రమ నిర్వాహకుడు వీరమాధవ్ స్థానిక లైఫ్‌లైన్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన ఆస్పత్రి వైద్యుడు ప్రదీప్‌కుమార్ కాలు సెప్టిక్ అయిందని, తొలగించాలని సూచించారు. అనాథ వృద్ధుడు కావడంతో డాక్టర్ ప్రదీప్ ఉచితంగా సర్జరీ చేసి కాలు తొలగించారు.


చికిత్స పొందుతున్న వృద్ధుడు నారాయణ

క్లుప్తంగా...

వచ్చే వారంలో విధుల్లోకి జీపీవోలు

సాక్షి, హైదరాబాద్: గ్రామ పాలనాధికారుల (జీపీవో) నియామక ప్రక్రియ కొలిక్కి వస్తోంది. ఈ పోస్టులకు ఎంపికైన పూర్వ వీఆర్వోలు, వీఆర్ఏలు వచ్చే వారం నుంచి విధుల్లోకి రానున్నట్టు రెవెన్యూ వర్గాలు చెప్తున్నాయి. ఇప్పటికే 6,500 మంది జీపీవోలను జిల్లాలకు కేటాయిస్తూ భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) కార్యాలయం నుంచి కలెక్టర్లకు ప్రతిపాదనలు వెళ్లాయి. అయితే, వారికి నియామక పత్రాలు ఇంకా ఇవ్వకపోవడంతో గ్రామాలకు కేటాయించలేదు. ఈ నియామక పత్రాలను సీఎం రేవంత్ చేతుల మీదుగా ఇప్పించాలని గతంలోనే రెవెన్యూశాఖ షెడ్యూల్ రూపొందించింది. కానీ, సమయం కుదరకపోవడంతో వాయిదా పడింది. ఈ నేపథ్యంలో మరోసారి సీఎం అనుమతి కోసం షెడ్యూల్ పంపామని, ఈ వారంలో అనుమతి వస్తుందని రెవెన్యూ వర్గాలంటున్నాయి. నియామకపత్రాలు అందజేశాక ఆయా జిల్లాల కలెక్టర్లు తమకు కేటాయించిన జీపీవోలను గ్రామాల వారీగా కేటాయిస్తారని చెబుతున్నాయి. అధికారికంగా నియమించిన వారిని కేటాయించినవి పోను మిగిలిన గ్రామాలకు ఇన్‌చార్జి జీపీవోలను నియమిస్తారని తెలుస్తోంది. ఇప్పటికే రెవెన్యూ శాఖలో కొనసాగుతున్న వీఆర్వోలు, వీఆర్ఏలకు జీపీవోలుగా అదనపు బాధ్యతలిస్తారని, పూర్తిస్థాయిలో జీపీవోలను రిక్రూట్ చేసుకున్న తర్వాత రెగ్యులర్‌గా బాధ్యతలు అప్పగిస్తారని సమాచారం.

ఐఏఎస్ శివశంకర్‌ను ఏపీకి కేటాయించిన కేంద్రం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర కేడర్‌లో జాయింట్ సెక్రటరీ కేడర్‌లో పనిచేస్తున్న ఐఏఎస్ అధికారి శివశంకర్ లోతేటిని తిరిగి ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు కేటాయిస్తూ డీఓపీటీ(డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్) నిర్ణయించింది. ఈమేరకు శుక్రవారం కేంద్రప్రభుత్వ కార్యదర్శి అవనీశ్ మిశ్రా ఉత్తర్వులు జారీచేశారు. తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా డీఓపీటీ ఈమేరకు నిర్ణయం తీసుకుంది. వెంటనే రాష్ట్ర కేడర్ నుంచి శివశంకర్ లోతేటిని రిలీవ్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది.

విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీగా విక్రమ్‌సింగ్‌కు పూర్తి అదనపు బాధ్యతలు

సాక్షి, హైదరాబాద్: విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం డైరెక్టర్ జనరల్‌గా 1998 బ్యాచ్ ఐపీఎస్ అధికారి విక్రమ్‌సింగ్ మాన్‌కు పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం హైదరాబాద్ సిటీ కమిషనరేట్‌లో శాంతిభద్రతల అడిషనల్ కమిషనర్‌గా పనిచేస్తున్న విక్రమ్‌సింగ్ మాన్‌కు ఈ మేరకు అదనపు బాధ్యతలు ఇస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం డీజీగా పనిచేస్తున్న 1994 బ్యాచ్ ఐపీఎస్ అధికారి కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి ఈనెల 31న పదవీ విరమణ పొందనున్నారు. ఈ మేరకు ఆయన్ను రిలీవ్ చేస్తున్నట్టు సీఎస్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నేషనల్ ఫెన్సింగ్ పోటీలకు బీసీ గురుకుల విద్యార్థులు

విద్యార్థులకు మంత్రి పొన్నం అభినందనలు


సురేఖ


రాణి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో మహాత్మాజ్యోతిబా పూలే బీసీ గురుకుల సొసైటీ విద్యార్థులు సత్తా చాటారు. నేషనల్ ఫెన్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాచుపల్లిలోని మమతా అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ గ్రౌండ్స్‌లో రాష్ట్రస్థాయి అండర్ 17 ఫెన్సింగ్ పోటీల్లో విద్యార్థిని సురేఖ వెండి పతకం, రాణి కాంస్య పతకం సాధించారు. ఫెన్సింగ్ పోటీల్లో పతకాలు సాధించడం అభినందనీయమని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో శిక్షణ

- రామానందతీర్థ గ్రామీణ సంస్థ చైర్మన్ కిశోర్‌రెడ్డి వెల్లడి

భూదాన్ పోచంపల్లి: యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం జలాల్‌పురంలోని స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో మేధా చారిటబుల్ ట్రస్ట్, దీన్‌దయాళ్ కౌసల్య యోజన పథకంతో తెలంగాణలోని నిరుద్యోగ యువతకు మూడున్నర నెలల కాలవ్యవధి గల డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ చైర్మన్ ఎన్.కిశోర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఇంటర్ విద్యార్హతతో అభ్యర్థులు 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయసు కలిగి ఉండాలని సూచించారు. చదువు మధ్యలో ఉన్నవారు మాత్రం అర్హులు కాదన్నారు. ఎంపికైన అభ్యర్థులకు శిక్షణా కాలంలో ఉచిత భోజనంతో కూడిన హాస్టల్ వసతి కల్పిస్తామని చెప్పారు. శిక్షణ పూర్తి చేసుకొన్న అభ్యర్థులకు తప్పనిసరిగా ఉద్యోగం కూడా ఇస్తామని, ఆసక్తి గల అభ్యర్థులు తమ విద్యార్హతల ఒరిజినల్, జిరాక్స్ సర్టిఫికెట్లు, ఆధార్, రేషన్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో సెప్టెంబర్ 8న సంస్థలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాలకు 9133908000, 9133908111 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

కనెక్ట్... యూకే..

స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంతో తెలుగు రాష్ట్రాలకు అవకాశాలు

- ఫార్మా, టెక్నాలజీ రంగాల్లో తెలంగాణ ఇప్పటికే ముందుంది
- ఆర్ అండ్ డీ, ఇన్నోవేషన్, ఏఐలో కొత్త పెట్టుబడులొస్తాయి
- డిఫెన్స్, ఏరోస్పేస్, విద్య, టెక్నాలజీ రంగాలపై యూకే ఫోకస్
- వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడిస్తేనే యూకే మార్కెట్లోకి..


..: గారెత్ విన్ ఓవెన్ :..
యూకే డిప్యూటీ హైకమిషనర్

(రమణమూర్తి మంథా)

భారత్‌పై అమెరికా అనూహ్యమైన సుంకాలు విధిస్తోంది. ఇప్పటికే కొన్ని అమల్లోకి వచ్చాయి. మరి ప్రత్యామ్నాయం? అమెరికాతో దౌత్యపరమైన చర్చలు కొనసాగిస్తూనే.. భారత్ కొత్త మార్కెట్లను అన్వేషిస్తోంది. ఈ నేపథ్యంలో ఇటీవల యూకేతో కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని (ఎఫ్‌టీఏ) ఒక మైలురాయిగా చెప్పాలి. ఎందుకంటే భారత్ నుంచి ఈ దేశానికి జరుగుతున్న ఎగుమతుల్లో 99 శాతం ఎఫ్‌టీఏ పరిధిలోకి రాబోతున్నాయి. బ్రిటన్ నుంచి వస్తున్న దిగుమతుల్లో 94 శాతాన్ని ఎఫ్‌టీఏలోకి తెస్తామని భారత్ హామీ ఇచ్చింది. మరి ఈ ఎఫ్‌టీఏతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు ఏమైనా లాభం ఉంటుందా? ఏయే రంగాలకు లాభం? యూకే నుంచి ఏ రంగాల్లోకి పెట్టుబడులొచ్చే అవకాశం ఉంది? వాటన్నిటిపై యూకే డిప్యూటీ హైకమిషనర్ గారెత్ విన్ ఓవెన్‌తో 'సాక్షి'చేసిన ఇంటర్వ్యూ ముఖ్యాంశాలివీ...

ఎఫ్‌టీఏతో తెలుగు రాష్ట్రాలకు లాభమేంటి?

యూకేతో విద్య, వ్యాపార, సాంస్కృతిక సంబంధాల్లో పెరుగుతున్న సానుకూలతను మూడేళ్లుగా చూస్తున్నా. ఈ దేశాల ప్రధానులు ఇటీవలే కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంతో ఈ పరిధి రక్షణ, టెక్నాలజీ, విద్య, వాతావరణ మార్పులన్నిటికీ విస్తరించనుంది. టెక్నాలజీ, ఫార్మా రంగంలో గట్టి పునాదులున్న హైదరాబాద్‌కు ఎఫ్‌టీఏతో చాలా లాభాలుంటాయి.

హైదరాబాద్ ఎప్పట్నుంచో ఐటీ, ఫార్మా రంగాల్లో అగ్రగామిగా ఉంది కదా. ఏపీలో కొన్నేళ్లుగా పోర్టులు అభివృద్ధి చేస్తున్నారు. లాజిస్టిక్స్, వ్యవసాయ రంగాల్లో అవకాశాలు పెరుగుతున్నాయి. మరి ఎఫ్‌టీఏతో కొత్తగా ఏం జరుగుతుంది?

నిజమే. రాష్ట్రాన్ని బట్టి అవకాశాలు మారుతాయి. తెలంగాణ విషయానికొస్తే ఎఫ్‌టీఏ వల్ల సర్టిఫికేషన్ ప్రాసెస్ సులువవుతుంది. టారిఫ్‌లు తగ్గుతాయి. ఇది ఫార్మా, టెక్నాలజీ రంగాలకు కీలకం. టెక్నాలజీ నిపుణుల రాకపోకలు తేలికవుతాయి. ఏపీ విషయానికొస్తే ఎగుమతులపై దృష్టి పెట్టాలి. ఈ మధ్యే నేను విశాఖలో సీఐఐ సదస్సుకు వెళ్లా. సీఫుడ్, టెక్స్‌టైల్స్, కాఫీ, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతుల్ని పెంచడంపై చర్చించాం. ఎఫ్‌టీఏతో టారిఫ్‌లు తగ్గుతాయి. సర్టిఫికేషన్ ప్రక్రియ తేలికవుతుంది. దీనివల్ల ఏపీ ఉత్పత్తులు యూకే మార్కెట్‌లోకి ప్రవేశించడం సులువవుతుంది. ఫుడ్ ప్రాసెసింగ్ కీలకంగా మారనుంది. వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడించాల్సి ఉంటుంది. ప్రాసెస్డ్ ఫుడ్ ఉత్పత్తుల్ని ఎగుమతి చేసే కంపెనీలకు ఎఫ్‌టీఏ బాసటగా నిలుస్తుంది. ఇది ఏపీ వ్యవసాయ ఎకానమీని మారుస్తుంది.

మరి ఫుడ్ ప్రాసెసింగ్‌లో కొత్త టెక్నాలజీలు కావాలి కదా? యూకే కంపెనీలు అందిస్తాయా?

కచ్చితంగా. యంత్రాలు, టెక్నాలజీపై పెట్టుబడులు పెట్టడం తప్పనిసరి. ఇక్కడి కంపెనీలు ఇప్పటికే ఈ మార్గాలను అన్వేషిస్తున్నాయి. అలాంటి పెట్టుబడుల్ని ప్రోత్సహించే వేదికను ఎఫ్‌టీఏ అందిస్తుంది. దీనివల్ల భారత కంపెనీలు యూకేతోపాటు ప్రపంచ దేశాలకు ఎగుమతి చేసే సామర్థ్యాన్ని పెంచుకుంటాయి.

నిపుణుల రాకపోకలకు నిబంధనలు సడలిస్తున్నారా?

అవును. స్వల్ప కాలానికి సంబంధించి ప్రత్యేకంగా కంపెనీల మధ్య రాకపోకలు తేలికవుతాయి. ఎందుకంటే ఇరుదేశాల్లోనూ సోషల్ సెక్యూరిటీ చెల్లించాలనే నిబంధనను ఉండదు. కంపెనీలకిది చాలా పెద్ద ఊరట. యూకే నిపుణుల్ని ఇక్కడికి రప్పించాలన్నా, ఇక్కడి వారిని అక్కడికి పంపాలన్నా ఆయా కంపెనీలకు ఖర్చు తగ్గుతుంది. కాబట్టి రాకపోకలు పెరుగుతాయి.

ఈ ఒప్పందం దీర్ఘకాలంలో తెలుగు రాష్ట్రాలపై ఎలాంటి ప్రభావాన్ని చూపించొచ్చు?

దీర్ఘకాలంలో ప్రత్యేకించి ఫార్మా, టెక్నాలజీ రంగాల్లో వాణిజ్య పరిమాణం పెరుగుతుంది. యూకే ఫార్మా మార్కెట్ ప్రస్తుతం 30 బిలియన్ డాలర్లు. కానీ అందులో భారత్ వాటా 3 శాతమే. దీన్ని పెంచే అవకాశం తెలంగాణకు ఎక్కువ. ఒప్పందం వల్ల ఆర్ అండ్ డీతోపాటు ఏఐ వంటి కొత్త రంగాల్లో భాగస్వామ్యాలు ఏర్పడతాయి. యూకే నైపుణ్యం, పెట్టుబడులతో ఇరుదేశాలూ కలిసి కొత్త ఔషధాలు తయారు చేయగలుగుతాయి. ఏపీకి సంబంధించినంత వరకూ ప్రాసెస్డ్ ఫుడ్ ఎగుమతులదే అగ్రస్థానమవుతుంది.

ఒప్పందం వల్ల ద్వైపాక్షిక వాణిజ్యం 25 శాతం పెరుగుతుందని యూకే అంచనా వేస్తోంది. వాటిలో తెలుగు రాష్ట్రాల వాటా ఎంత ఉండొచ్చు?

రాష్ట్రాలవారీగా చెప్పడం కష్టం. కానీ బాగా లబ్ధి పొందే రాష్ట్రాల్లో ఏపీ, తెలంగాణ ఉంటాయి. ఉదాహరణకు ప్రస్తుతం భారత్ నుంచి యూకేకు ఎగుమతవుతున్న సీఫుడ్‌లో ఏపీ వాటా 2.25 శాతమే. ఎఫ్‌టీఏ వల్ల సర్టిఫికేషన్ ప్రక్రియ తేలికవుతుంది కనుక ఏపీకి విస్తృత అవకాశాలుంటాయి. నిజానికి ఎఫ్‌టీఏ వల్ల సుంకాలు తగ్గటమే కాదు. సర్టిఫికేషన్ కూడా తేలికవుతుంది. త్వరగా పాడైపోయే సీఫుడ్ లాంటి వాటికిది ఆక్సిజన్. అందుకే డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డీజీఎఫ్‌టీ) కూడా చాలా ఆశాభావంతో ఉంది.

ఫుడ్ ప్రాసెసింగ్ మీదే ఎక్కువ ఫోకస్ చేస్తున్నట్లున్నారు?

ఇది కీలక రంగం. ఎందుకంటే భారత్ ప్రస్తుతం తన ఆహార దిగుబడిలో 10 శాతాన్నే ప్రాసెస్ చేస్తోంది. తగినన్ని పెట్టుబడులతో విలువను జోడిస్తే కాఫీ, సీఫుడ్‌తోపాటు పలు వ్యవసాయ ఉత్పత్తుల్ని ప్రాసెస్ చేయొచ్చు. యూకేతోపాటు ప్రపంచ దేశాలకు ఎగుమతి చేయొచ్చు. ఏపీ ఇప్పటికే యూఎస్, చైనాకు ఎగుమతి చేస్తోంది. సర్టిఫికేషన్ ప్రక్రియను సరళం చేయడం ద్వారా యూకే మార్కెట్‌ను వేగంగా అందుకోవచ్చు.

సంప్రదాయేతర ఇంధనాలు, ఏరోస్పేస్, హైదరాబాద్ స్టార్టప్‌లలోకి ఎక్కువ పెట్టుబడులొస్తాయా?

గ్లోబల్ కేపబులిటీ సెంటర్ల ఏర్పాటుతోపాటు ఏరోస్పేస్, ఇంజనీరింగ్ రంగాల్లో భాగస్వామ్యాలను ఇప్పటికే చాలా యూకే కంపెనీలు అన్వేషిస్తున్నాయి. ఎఫ్‌టీఏతో భాగస్వామ్యాలు, సహకారాలు పెరుగుతాయి. యూకే ఎక్స్‌పోర్ట్ ఫైనాన్స్ అనేది యూకే-ఇండియా ప్రాజెక్టులకు మద్దతిచ్చే ప్రధాన వనరుగా ఉంటుంది.

మరి యూకే నుంచి చౌక ఉత్పత్తులొచ్చి ముంచేయకుండా ఇక్కడి వ్యాపారాలను ప్రత్యేకించి ఎంఎస్ఎంఈలను దెబ్బతీయకుండా ఒప్పందంలో తగిన జాగ్రత్తలుంటాయా?

భారత్‌కే కాదు. యూకేకు కూడా ఎంఎస్ఎంఈ రంగమే వెన్నెముక. ఏ ఒప్పందంలోనైనా సున్నితమైన రంగాలు దెబ్బతినకుండా తగిన జాగ్రత్తలు తప్పనిసరిగా ఉంటాయి. డెయిరీ, చేనేత లాంటి రంగాలకు తగిన భద్రత ఉంటుంది. ఉదాహరణకు యూకే నుంచి డెయిరీ ఉత్పత్తులను తీసుకుంటే భారత్‌లో తయారు కాని అవి స్పెషాలిటీ చీజ్ (పన్నీర్) వంటి వాటికే అనుమతి ఉంటుంది. చేనేతకు యూకే నుంచి పోటీ ఉండదు. ఎందుకంటే యూకేలో చేనేత లేదు. పైపెచ్చు ఈ ఒప్పందం వల్ల భారత చేనేత రంగానికి యూకే ఫ్యాషన్ మార్కెట్లో అవకాశాలు పెరుగుతాయి.

మరి కార్మికులు, పర్యావరణం, ప్రజారోగ్యానికి సంబంధించి ప్రతికూలతలేమైనా ఉంటాయా?

ఈ ఒప్పందంలో అవినీతి నిరోధక, వినియోగదారుల రక్షణ, కార్మికుల హక్కులు, పర్యావరణం, లింగబేధంపై ప్రత్యేక చాప్టర్లున్నాయి. వాటన్నిటినీ చేర్చి భారత్ చేసుకున్న తొలి ఎఫ్‌టీఏ ఇది. కార్మికుల్ని, పర్యావరణాన్ని పణంగాపెట్టి వాణిజ్య విస్తరణ జరగదనడానికి ఇదే నిదర్శనం.

మరి ఈ ఒప్పందంతో రానున్న అవకాశాలపై చిన్నచిన్న వ్యాపారవేత్తలకు అవగాహన ఎలా?

ఇప్పటికే చాలా మందికి తెలుసు. భారత ఎగుమతిదారులకు బాసటగా డీజీఎఫ్‌టీతోపాటు సీఐఐ, ఎఫ్‌టీసీసీఐ, చాంబర్ ఆఫ్ కామర్స్ వంటి పారిశ్రామిక సమాఖ్యలు సదస్సులు నిర్వహిస్తున్నాయి. ఇరుదేశాల వ్యాపార బృందాలు కూడా అవకాశాలపై అవగాహన కల్పిస్తాయి. ఇది పూర్తిగా అమల్లోకి రావడానికి ఒక ఏడాది పడుతుంది. ఈలోగా ఎంఎస్ఎంఈలు, ఎగుమతిదారులు సిద్ధమవుతారు.

కాళేశ్వరం నివేదికపై మరోమారు హైకోర్టుకు!

మధ్యంతర అప్లికేషన్ దాఖలు చేసే యోచనలో బీఆర్ఎస్

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతిపై పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను రద్దు చేయాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించిన బీఆర్ఎస్ పార్టీ.. మరోమారు ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించాలని భావిస్తోంది. కమిషన్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోకుండా స్టే ఇవ్వాలని హైకోర్టును ఆశ్రయించిన ఆ పార్టీ.. మరోమారు మధ్యంతర అప్లికేషన్ (ఐఏ)ను దాఖలు చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. సోమవారం హైకోర్టుకు వెళ్లేందుకు బీఆర్ఎస్ సన్నాహాలు చేస్తోంది. శనివారం నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో శుక్రవారం ఎర్రవల్లి నివాసంలో పార్టీ అధినేత కేసీఆర్ కీలక నేతలతో సమావేశమయ్యారు. ఈ భేటీలో అసెంబ్లీ సమావేశాల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహంతోపాటు పీసీ ఘోష్ కమిషన్‌పై కోర్టుకు వెళ్లే అంశంపై కేసీఆర్ పలు సూచనలు చేసినట్లు తెలిసింది. హైకోర్టులో మధ్యంతర అప్లికేషన్ విచారణకు రాకమునుపే అసెంబ్లీలో ఘోష్ కమిషన్ నివేదికను పెట్టేందుకు రేవంత్ ప్రభుత్వం ఆదివారం కూడా అసెంబ్లీని నిర్వహించే ఆలోచనలో ఉన్నట్లు ఈ భేటీలో అభిప్రాయం వ్యక్తమైంది. ఒకవేళ అసెంబ్లీలో నివేదికను ప్రవేశ పెడితే వినిపించాల్సిన వాదనపై ఇప్పటికే హరీశ్‌రావు పూర్తిస్థాయిలో కసరత్తు చేసినట్లు సమాచారం. అయితే, అసెంబ్లీలో చర్చకు కేసీఆర్ హాజరు కాకపోవటమే మంచిదని పార్టీ నేతలు చెప్పినట్లు తెలిసింది. అసెంబ్లీలో చోటు చేసుకునే పరిణామాల ఆధారంగా కేసీఆర్ హాజరయ్యేదీ లేనిదీ తెలుస్తుందని బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి.

సుప్రీంకోర్టులో కేవియట్ పిటిషన్!

పీసీ ఘోష్ కమిషన్‌ను కొట్టేయడం లేదా స్టే కోసం బీఆర్ఎస్ సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించే అవకాశం ఉందన్న సమాచారంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుగానే కేవియట్ దాఖలు చేసినట్లు తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వ వాదనలు వినకుండా ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయవద్దని ఆ కేవియట్‌లో కోరినట్లు సమాచారం. బీఆర్ఎస్ పిటిషన్ దాఖలు చేస్తే... ప్రభుత్వం తరపున పూర్తిస్థాయిలో వాదనలు వినిపిస్తామని పేర్కొన్నట్లు తెలిసింది.

వారి సభ్యత్వంపై సందిగ్ధం

గవర్నర్ కోటాలో గతేడాది ఆగస్టు 16న ఎమ్మెల్సీలుగా ప్రమాణం చేసిన ప్రొ. కోదండరాం, ఆమేర్ అలీఖాన్‌లు శనివారం నుంచి మండలి సమావేశాలకు హాజరు అవుతారా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది. వీరిద్దరి సభ్యత్వాలను రద్దుచేస్తూ సుప్రీంకోర్టు ఈ నెల 13న మధ్యంతర ఉత్తర్వులిచ్చిన విషయం తెలిసిందే. సుప్రీం ఉత్తర్వులను పరిశీలించే బాధ్యతను ప్రభుత్వం న్యాయశాఖకు, అడ్వొకేట్ జనరల్‌కు అప్పగించింది. ఇప్పటివరకు ఈ 2 స్థానాలు ఖాళీ అయినట్లు మండలి చైర్మన్ ప్రకటించలేదు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులను అమలు చేస్తారా లేదా అన్నది చర్చనీయాంశంగా మారింది.

ఆర్థిక దుష్ప్రచారానికి పాల్పడుతున్న ప్రభుత్వం: కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థిక దుష్ప్రచారానికి పాల్పడుతోందని, రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా రూ.7,000 కోట్ల రుణ వడ్డీ చెల్లిస్తోందంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇతర మంత్రులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. దీనిపై శుక్రవారం ఆయన ఎక్స్ వేదికగా ప్రభుత్వాన్ని విమర్శించారు. కాగ్ నివేదిక ఈ వాదన తప్పని తేల్చిందని ఆయన స్పష్టం చేశారు. వాస్తవానికి, గత నాలుగు నెలల్లో సగటు నెలవారీ వడ్డీ చెల్లింపు కేవలం రూ.2,300 కోట్లు మాత్రమేనని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ఉద్దేశపూర్వకంగా రాష్ట్ర రుణ భారాన్ని ఎక్కువ చేసి చూపిస్తోందని, ప్రజలను తప్పుదారి పట్టించే ఈ దుష్ప్రచారాన్ని వెంటనే ఆపాలని ఆయన సూచించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో ప్రజలు అల్లాడుతుంటే సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం విలాసవంతమైన, లాభదాయకమైన ప్రాజెక్టులపై సమీక్షలు నిర్వహిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు.

▶ మొదటి పేజీ తరువాయి

కాళేశ్వరమే 'ఎజెండా'!

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, యూరియా కొరత, వరద నష్టం, ప్రభుత్వ పరంగా పునరావాసం, సహాయక చర్యలు, గురు కుల విద్యా సంస్థల్లో సమస్యలు వంటి అంశాలను ఎజెండాలో చేర్చాలని అధికార, విపక్షాలు పట్టుబట్టే అవకాశాలు ఉన్నాయి. వినాయక నిమజ్జనం నేపథ్యంలో సమావేశాలను త్వరగా ముగించే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. ప్రస్తుత సమావేశాల్లోనే శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రు నాయక్ ఎన్నిక ప్రక్రియను పూర్తి చేసే అవకాశముంది. ఈ మేరకు శనివారం స్పీకర్ నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు అసెంబ్లీ వర్గాలు తెలిపాయి.

కాళేశ్వరం అవినీతిపై ప్రజల్లోకి..

అసెంబ్లీ సమావేశాల్లో కాళేశ్వరం ప్రాజెక్టు నివేదికను బహిర్గతం చేసే విషయంలో ప్రభుత్వం వ్యూహాత్మకంగా ముందుకెళ్తోంది. ప్రాజెక్టు నిర్మాణంలో అవకతవకలు, పార్టీల విమర్శలు, ప్రతి విమర్శలు, కోర్టు కేసులు.. ఇలా అన్నింటికి ఈ సమావేశాల్లోనే జవాబు చెప్పేందుకు సిద్ధమవుతోంది. అందులో భాగంగా కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని బలంగా వాదిస్తూ అసెంబ్లీ రికార్డుల్లోకి ఎక్కించాలనేది అధికార పార్టీ వ్యూహంగా కనిపిస్తోంది. ఇలా నేరుగా ప్రజల్లోకి తీసుకెళ్లవచ్చని భావిస్తోంది. ప్రాజెక్టు నిర్మాణ ప్రణాళిక, నాణ్యత, నిర్వహణ విషయాల్లో నిర్లక్ష్యం కారణంగానే మేడిగడ్డ బరాజ్ కుంగిపోయిందని, ఈ ప్రాజెక్టు పరిధిలో నీటిని నిల్వచేయొద్దని ఎన్‌డీఎస్‌ఏ సూచించిన దున ఈ ప్రాజెక్టు ను ఎలా వినియోగించుకోవాలనే అంశంపై అన్ని పార్టీల అభిప్రాయాలను ప్రభుత్వం కోరనుంది. ఘోష్ నివేదికపై చర్యల కంటే దానిపై చర్చ జరగడమే ప్రధానమని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. కమిషన్ నివేదిక ఆధారంగా దర్యాప్తు కోసం సిట్ ఏర్పాటు చేయడం మాత్రమే తమ ఉద్దేశం కాదని, అవసరమైతే బీజేపీ కోరుతున్నట్టు సీబీఐ విచారణకు కూడా వెనుకాడేది లేదని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.

అసెంబ్లీలోనే ఎండగట్టే వ్యూహంతో..

పీసీ ఘోష్ కమిషన్‌పై చర్చ, సిట్ ఏర్పాటు పేరిట ఇరకాటంలోకి నెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేసే ప్రయత్నాలను అసెంబ్లీ వేదికగానే తిప్పికొట్టాలని బీఆర్ఎస్ భావిస్తోంది. అసెంబ్లీలో అనుసరించాల్సిన వ్యూహంపై పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, సీనియర్ నేతలు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి తదితరులకు బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ దిశా నిర్దేశం చేశారు. రాష్ట్రంలో వరదల మూలంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే అసెంబ్లీ సమావేశాలు నిర్వహించటాన్ని బీఆర్ఎస్ తప్పుపడుతోంది. ఘోష్ కమిషన్ నివేదికపై ఇప్పటికే హైకోర్టును ఆశ్రయించిన బీఆర్ఎస్.. సోమవారం మరో సారి ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. న్యాయస్థానంలో విచారణ జరగకమునుపే అసెంబ్లీలో నివేదికను అడ్డుపెట్టుకుని ప్రభుత్వం తమపై బురద చల్లే ప్రయత్నంలో ఉందని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. అసెంబ్లీ వేదికగా కాళేశ్వరం ప్రాజెక్టుపై పీపీటీ ఇచ్చేందుకు అవకాశమివ్వాలని పట్టుబడుతోంది. ప్రభుత్వంలో అవినీతి, గోదావరి బనకచర్ల లింకు ప్రాజెక్టు, నీటిపారుదల ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగింత వంటి అంశాలను లేవనెత్తి ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టాలని భావిస్తోంది. ఘోష్ కమిషన్ నివేదికపై జరిగే చర్చలో ప్రతిపక్ష నేత కేసీఆర్ పాల్గొంటారా లేదా అనే అంశంపై బీఆర్ఎస్ గోప్యత పాటిస్తోంది. ఎరువుల కొరత, వరద నష్టంపై ప్రభుత్వం స్పందన వంటి అంశాలపై చర్చ కోసం పట్టుబట్టే వ్యూహంపై బీఆర్ఎస్ కసరత్తు చేస్తోంది.

సీబీఐ విచారణకు బీజేపీ పట్టు

కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ దర్యాప్తు కోసం పట్టుబట్టాలని బీజేపీ శాసనసభా పక్షం నిర్ణయించింది. సీబీఐ విచారణ ద్వారానే నిజాలు నిగ్గు తేలుతాయని ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు సన్నద్ధమవుతోంది. కాళేశ్వరం అవకతవకలపై సీబీఐ విచారణ కోసం మొదటి నుంచీ డిమాండ్ చేస్తున్న బీజేపీ.. అసెంబ్లీలోనూ అదే వైఖరిని కొనసాగించాలని నిర్ణయించింది. ఎన్‌డీఎస్‌ఏ నివేదికపై కేంద్రంపై బీఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలను కూడా తిప్పికొట్టాలని భావిస్తోంది. సిట్ ఏర్పాటులో ప్రభుత్వం చేస్తున్న తాత్సారాన్ని కూడా నిలదీయాలని బీజేపీ నిర్ణయించింది. కాగా ఎంఐఎం, సీపీఐ పార్టీలు అధికారపక్షానికి మద్దతుగా నిలవనున్నట్లు సమాచారం.

ఒత్తిడి పెంచే వ్యూహం!

- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% కోటాపై సర్కారు దృష్టి
- అసెంబ్లీ ముందుకు పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లు?
- పార్టీల అభిప్రాయం తీసుకోవడం ద్వారా పైచేయి సాధించే వ్యూహం
- శాసనసభ ద్వారా బిల్లును గవర్నర్‌కు పంపే ప్రణాళిక
- అసెంబ్లీ ఆమోదించిన బిల్లు ఆధారంగా 42% రిజర్వేషన్లపై అధికారిక ఉత్తర్వులు?

సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఉన్న ఏ అవకాశాన్నీ వదులుకోకూడదని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. అందులో భాగంగా స్థానిక ఎన్నికల్లో మొత్తం రిజర్వేషన్లను 50 శాతానికి పరిమితం చేస్తూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిన చట్టానికి అసెంబ్లీలో సవరణను ప్రతిపాదించనుంది. 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివేస్తూ శనివారం నుంచి ప్రారంభం కానున్న వర్షాకాల సమావేశాల్లో బిల్లును ప్రవేశపెట్టాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టు సమాచారం. పంచాయతీరాజ్ చట్టం–2018లోని సెక్షన్ 285 (ఏ)కు సవరణ ప్రతిపాదిస్తూ పెట్టే ఈ బిల్లుపై చర్చించి అన్ని రాజకీయ పక్షాల అభిప్రాయాలను తీసుకోవడం ద్వారా అటు చట్టబద్ధంగా, ఇటు రాజకీయంగా పైచేయి సాధించాలనేది ప్రభుత్వ ఉద్దేశంగా కనిపిస్తోంది. వాస్తవానికి ఇదే అంశంపై రాష్ట్ర మంత్రివర్గం చేసిన ఆర్డినెన్సును గవర్నర్ ద్వారా రాష్ట్రపతి ఆమోదానికి పంపారు. ఆ ఆర్డినెన్సు రాష్ట్రపతికి వెళ్లి దాదాపు రెండు నెలలవుతున్నా ఇంకా అది పెండింగ్‌లోనే ఉంది. ఈ నేపథ్యంలో సాంకేతిక అంశాలు సానుకూలంగా ఉంటే ఆర్డినెన్సులో స్వల్ప మార్పుతో అసెంబ్లీలో బిల్లు పెట్టి మరోమారు గవర్నర్‌కు పంపడం ద్వారా ఒత్తిడి పెంచాలనే వ్యూహంతో ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోంది. ఈ మేరకు శనివారం జరిగే రాష్ట్ర మంత్రివర్గ భేటీలో అసెంబ్లీలో బిల్లు పెట్టడంపై తీర్మానం చేసే అవకాశం ఉంది.

కోర్టుల ముందుకు 'ఏకాభిప్రాయం'!

ఈ బిల్లుపై ప్రధాన రాజకీయ పక్షాలైన బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం, సీపీఐల అభిప్రాయాలు తీసుకోవడం ద్వారా రిజర్వేషన్ల పరిమితి విషయంలో రాజకీయ ఏకాభిప్రాయం ఉందనే వాదనను కోర్టుల ముందు ఉంచవచ్చనేది కూడా ప్రభుత్వ ఆలోచనగా కనిపిస్తోంది. మరోవైపు ఈ బిల్లు విషయంలో బీజేపీ వినిపించే అభిప్రాయాన్ని బట్టి ఆ పార్టీని ఇరుకున పెట్టాలని, తాము చేస్తున్న పోరాటాన్ని మరోమారు బీసీలకు వివరించేందుకు ఈ సమావేశాలను వేదికగా ఉపయోగించుకోవాలనే రాజకీయ ఎత్తుగడతో ప్రభుత్వం ముందుకెళుతోందని అంటున్నారు. ఈ బిల్లును అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదిస్తే, దీని ఆధారంగానే స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు కూడా విడుదల చేయనుందని సమాచారం.

నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఉభయ సభల సమావేశాలు సజావుగా జరిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు సహకరించాలని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆదేశించారు. సభ్యులు అడిగే సమాచారాన్ని సాధ్యమైనంత త్వరగా అందజేయాలన్నారు. శనివారం నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో సభల నిర్వహణ, వసతులు, భద్రతా ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులు, పోలీసు ఉన్నతాధికారులతో శుక్రవారం స్పీకర్ తన చాంబర్‌లో సమీక్ష నిర్వహించారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ ముదిరాజ్, అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ నరసింహాచార్యులు ఈ భేటీలో పాల్గొన్నారు. ఆయా శాఖలకు సంబంధించిన చర్చలు జరిగే సమయంలో సంబంధిత అధికారులు అందుబాటులో ఉంటూ మంత్రులు, సభ్యులకు తగిన సమాచారం అందజేయాలని స్పీకర్ ప్రసాద్ కుమార్ ఆదేశించారు. భారీ వర్షాలతో కొన్ని మార్గాల్లో రోడ్లు దెబ్బతిన్న నేపథ్యంలో సభ్యులు నిర్ణీత సమయానికి సభకు చేరుకునేలా ఏర్పాట్లు చేయాలన్నారు. సభ జరుగుతున్న సమయంలో ధర్నాలు, ఆందోళనలు జరగకుండా ముందస్తు సమాచారం సేకరించి అడ్డుకోవడం ద్వారా సమావేశాలు సజావుగా జరిగేలా చూడాలని స్పీకర్ సూచించారు. కాగా, శాసనమండలి సమావేశాలు విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన నోడల్, లైజనింగ్ ఆఫీసర్లను నియమించాలని మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సూచించారు.

బీఆర్ఎస్‌పై బురద చల్లేందుకే అసెంబ్లీ


- పీసీ ఘోష్ కమిషన్‌ను రేవంత్ అడ్డం పెట్టుకుంటున్నారు
- స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను కలిసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్‌పై బురద చల్లేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీని వేదికగా వాడుకుంటున్నారని శాసనసభలో ఆ పార్టీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ విమర్శించారు. అకాల వర్షాలు, వరదలతో తీవ్ర నష్టం వాటిల్లినా ప్రజలను ఆదుకోవడంలో రేవంత్ ప్రభుత్వం విఫలమైందన్నారు. దీనిని కప్పి పుచ్చుకునేందుకు కాళేశ్వరం ప్రాజెక్టుపై పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను అడ్డుపెట్టుకుంటున్నారని మండిపడ్డారు. పార్టీ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, బీఆర్ఎస్ఎల్పీ కార్యదర్శి ఎం.రమేశ్‌కుమార్‌రెడ్డితో కలసి వివేకానంద శుక్రవారం అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కలిశారు. శనివారం నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో కాళేశ్వరం ప్రాజెక్టుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చేందుకు బీఆర్ఎస్ పార్టీకి అవకాశం ఇవ్వాలని కోరారు. అనంతరం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. హెలికాప్టర్‌లో వరద ప్రాంతాల పరిశీలనను కూడా రేవంత్.. రాజకీయాలకు వాడుకుంటున్నాడని మండిపడ్డారు. వరద ప్రభావిత ప్రాంతాల పర్యటనలోనూ సీఎం రేవంత్.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ లక్ష్యంగా విమర్శలు చేస్తున్నారన్నారు.

సర్కార్ వైఫల్యాలను ఎండగడతాం

మీడియాతో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను అసెంబ్లీలో ఎండగట్టడంతోపాటు హామీలు అమలు చేయకపోవడంపై నిలదీయాలని నిర్ణయించినట్లు బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి వెల్లడించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం (ముస్లింలకు 10 శాతం ఇవ్వకుండా) రిజర్వేషన్లు కల్పించాలని సభలో పట్టుబడతామన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్.రాంచందర్‌రావు ఎన్నికయ్యాక శుక్రవారం బీజేపీ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన తొలిసారి జరిగిన బీజేఎల్పీ సమావేశం అనంతరం... మహేశ్వర్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. భారీ వర్షాలు, వరదలతో తీవ్ర నష్టం జరిగిన ప్రాంతాల్లో వెంటనే ప్రజలను ఆదుకోవాలని, ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని నిర్ణయించామని తెలిపారు. 'కాళేశ్వరంపై సీబీఐ విచారణకు సభలో డిమాండ్ చేస్తాం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావొస్తున్నా గత ప్రభుత్వ అవినీతిపై చర్యలు తీసుకోలేదు. ఎవరినీ అరెస్ట్ చేయలేదు'అని పేర్కొన్నారు.

బీఆర్ఎస్‌కు దీటుగా గళం వినిపించాలి: రాంచందర్‌రావు

శాసనసభ, మండలిలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు దీటుగా ప్రజాసమస్యలపై బీజేపీ గొంతు వినిపించాలని పార్టీ ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు రాంచందర్‌రావు బీజేఎల్పీ సమావేశంలో దిశానిర్దేశం చేశారు. ఈ భేటీలో పార్టీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, కాటిపల్లి వెంకట రమణారెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా, పైడి రాకేశ్ రెడ్డి, పాల్వాయి హరీశ్‌బాబు, కౌన్సిల్‌లో పక్షనేత ఏవీఎన్ రెడ్డి, ఎమ్మెల్సీలు మల్క కొమురయ్య, సి.అంజిరెడ్డి పాల్గొన్నారు.

నేడు జాతీయ చిన్న పరిశ్రమల దినోత్సవం



'అన్నీ తెలిసిన వారు ఉండరు.
అలాగే ఏమీ తెలియని వారూ ఉండరు' అనేది సామెత.
'నీకు తెలిసిందే నీ శక్తి' అనేది నీతికథ.
జిమ్మి రాజుకు అంతర్జాతీయ వ్యాపారాల గురించి తెలియదు
కానీ పచ్చళ్ల గురించి బాగా తెలుసు. 'గ్రాండ్‌మా' పేరుతో
పచ్చళ్ల కంపెనీ ప్రారంభించి గ్రాండ్ సక్సెస్ అయింది.
ఒకప్పుడు కేరళలోని త్రిసూర్‌కే పరిమితమైన ఆ కంపెనీ
ఇప్పుడు యూరోపియన్ దేశాల్లో కూడా సత్తా చాటుతోంది.
జిమ్మి రాజు మాత్రమే కాదు ఘనమైన వ్యాపార నేపథ్యం లేని
ఎంతోమంది సాధారణ మహిళలు చిన్న చిన్న అడుగులు
వేస్తూనే ఎంటర్‌ప్రెన్యూర్‌లుగా పెద్ద స్థాయికి చేరుకున్నారు.

జిమ్మి రాజు


పరిశ్రమిస్తున్న నారీ లోకం!

గ్రాండ్‌మా.. గ్రాండ్ సక్సెస్

'నేను వ్యాపారవేత్త కాగలనా?' తనకు తాను ప్రశ్న వేసుకుంది జిమ్మి రాజు.
'కచ్చితంగా!' తనలో నుంచే సమాధానం వచ్చింది.
'నాకు ఏం తెలుసు?' మరో ప్రశ్న.
'పెద్దగా ఏమీ తెలియనక్కర్లేదు. నడిచే దారిలో అన్నీ తెలుస్తాయి' ఆ ప్రశ్నకు జవాబు.
తనకు పచ్చళ్లు అంటే ఇష్టం. ఆసక్తి.
'యస్...పచ్చళ్లతోనే మొదలెడదాం' అనుకొని ప్రయాణం ప్రారంభించింది జిమ్మి రాజు. కేరళలోని మరడీలో 'గ్రాండ్‌మా' పేరుతో చిన్నపాటి వ్యాపారం ప్రారంభించింది. 'గ్రాండ్‌మా' గ్రాండ్ సక్సెస్‌కు కారణం నాణ్యతతో కూడిన నిమ్మకాయ పచ్చళ్లు. 'గ్రాండ్‌మా' ఇంట గెలిచింది. ఇప్పుడు రచ్చ గెలవాలి. వ్యాపారాన్ని విస్తరించాలంటే ముందు డబ్బు కావాలి.
'ఫెడరల్ బ్యాంక్' నుంచి లోన్ ద్వారా తన వ్యాపారాన్ని జాతీయ స్థాయికి, యూరోపియన్ దేశాల వరకు తీసుకువెళ్లింది జిమ్మి రాజు. 'గ్రాండ్‌మా' ఇప్పుడు ఎంతోమందికి ఉపాధిని ఇస్తోంది.

నష్టాల నుంచి లాభాలకు

పంజాబ్‌లోని మన్సాకు చెందిన కుల్వీందర్ కౌర్ కుటుంబం డెయిరీ ఫామ్‌ను నిర్వహించేది. ఈ డైరీ వల్ల లాభాల మాటేమిటోగానీ నష్టాలే నష్టాలు! 'ఇలా అయితే కుదరదు' అని గట్టిగా అనుకున్న కుల్వీందర్ 'ఇప్పుడు ఏం చేయాలి?' అని లోతుగా ఆలోచించింది. నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ 'మనీబాక్స్'ను సంప్రదించింది. ఈ కంపెనీ నుంచి అందిన రుణంతో డెయిరీని ఆధునిక సౌకర్యాలతో తీర్చిదిద్దింది. నష్టాల నుంచి బయటపడడానికి, లాభాల బాట పట్టి పెద్ద డెయిరీ ఫామ్ స్థాయికి చేరడానికి ఎంతో కాలం పట్టలేదు.


కుల్వీందర్ కౌర్


తల్లి వినయతో లక్ష్మి

అమ్మ నేర్పిన విద్య

లక్ష్మి పది సంవత్సరాల వయసులో ఉన్నప్పుడు తల్లి వినయ కేరళ, కొంకణి వంటకాలకు సంబంధించి చిన్నపాటి వ్యాపారాన్ని నిర్వహించేది. స్కూలు నుంచి రాగానే తల్లి చేసిన రకరకాల వంటకాలను రుచి చూసేది చిన్నారి లక్ష్మి. ప్యాకింగ్, డెలివరీకి సంబంధించిన పనుల్లో తల్లికి సహాయపడుతుండేది. ఏళ్ల తరువాత...
వినయ కోవిడ్ బారిన పడింది. అప్పుడు కూడా వైద్యులతో తన వ్యాపారం గురించి మాట్లాడేది.
తల్లి చనిపోయి తరవాత విషాదంలో కూరుకుపోయింది లక్ష్మి. ఆ సమయంలోనే తన భవిష్యత్‌ని మార్చే నిర్ణయం తీసుకుంది.
'అమ్మ ఆత్మకు శాంతి కలగాలంటే వ్యాపారం ఆగకూడదు' అనుకుంది.
అలా 'లక్ష్మి' ఫుడ్ స్టార్టప్ మొదలైంది. రకరకాల వంటకాలకు సంబంధించి తల్లి రాసిన నోట్స్ తనకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. మొదట్లో ప్రొడక్షన్, డిస్ట్రిబ్యూషన్‌లకు సంబంధించిన సమస్యలు ఎదురైనా ఆ తరువాత మాత్రం కంపెనీని పెద్ద ఎత్తున విస్తరించింది.
'అమ్మ మా వ్యాపారాన్ని జాతీయ స్థాయికి తీసుకువెళ్లాలని కలలు కనేది. ఆమె కలను నిజం చేసుకోవడానికి చాలా కష్టపడ్డాం. స్థానిక అమ్మకాలు, ఆన్‌లైన్ అమ్మకాలు, సోషల్ మీడియా మార్కెటింగ్‌తో అమ్మ కలను సాకారం చేశాం' అంటుంది కేరళలోని త్రిసూర్‌కు చెందిన లక్ష్మి.

మష్రూమ్ లేడీ ఆఫ్ హరియాణా

కోవిడ్ కల్లోల కాలంలో దొరికిన విరామంలో 'కొత్తగా ఏదైనా చేయాలి' అని ఆలోచించింది అసిస్టెంట్ ప్రొఫెసర్ సోనియ దాహియ. ఆ ఆలోచనలే ఫలితమే... పుట్టగొడుగుల పెంపకం. ఆమె నిర్ణయం చాలా మందిని షాక్‌కు గురి చేసింది. 'భద్రతను ఇచ్చే ప్రభుత్వ ఉద్యోగాన్ని వదిలి పుట్టగొడుగుల పెంపకం ఏమిటి!' అని ఆశ్చర్యపోయారు. అయినప్పటికీ తన నిర్ణయాన్ని మార్చుకోలేదు సోనియా. నలభై లక్షల రూపాయలతో 'డాక్టర్ దాహియ మష్రూమ్ ఫామ్' ప్రారంభించింది.
రోజు రోజుకూ వ్యాపారాన్ని విస్తరిస్తూపోయింది. ఊహించని లాభాల స్థాయికి తీసుకువచ్చింది.
అయితే మొదట్లో ఆమె ప్రయాణం సజావుగా ఏమీ జరగలేదు. తరచు విద్యుత్ కోతలుండేవి. ఆ ప్రభావం పుట్టగొడుగులపై పడేది. ఇదొక్కటే కాదు...ఎన్నో సమస్యలను, వాటి పరిష్కార మార్గాలను కనుక్కుంటూ వెళ్లిన సోనియ 'మష్రూమ్ లేడీ ఆఫ్ హరియాణా'గా పేరు తెచ్చుకుంది. పుట్టగొడుగుల పెంపకంలో సోనియాకు బయోటెక్నాలజీ నేపథ్యం ఎంతగానో ఉపయోగపడింది.


సోనియ దాహియ

ఆ బడిలో ఎన్నో విలువైన పాఠాలు



● ఎన్ని సవాళ్లు, సమస్యలు ఎదురైనా మన లక్ష్యాన్ని వదులుకోకూడదు. నేను చెప్పే గెలుపు మంత్రం...'అపజయం అనేది తాత్కాలికం' ● 'లింగ వివక్షత' కనిపించకుండా చేసే శక్తి మన విజయానికి ఉంటుంది ● ఎంటర్‌ప్రెన్యూర్ చేసే ప్రయాణం అనేది విరామమెరుగని నిరంతర ప్రయాణం ● మీరు ఒక పని ఎంచుకుంటే, మీ జీవితం మొత్తం ఆ పని మీదే ఆధారపడినంతగా కష్టపడాలి ● వ్యాపారవేత్తగా ప్రయాణం ప్రారంభించడం అంటే బడిలో విద్యార్థిగా చేరడమే. ఆ బడిలో ఎన్నో విలువైన పాఠాలు నేర్చుకుంటాం.

– కిరణ్ మజుందార్-షా, బయోకాన్ వ్యవస్థాపకురాలు



కావ్య దోభలే

ఒకప్పుడు నర్స్... ఇప్పుడు ఎంటర్‌ప్రెన్యూర్

ముంబైలో నర్స్‌గా పనిచేసిన కావ్య దోభలేకు ఆర్గానిక్ ఫామింగ్‌పై ఎంతో ఆసక్తి. ఆ ఆసక్తే ఆమెను ఎంటర్‌ప్రెన్యూర్‌గా మార్చింది. ప్రభుత్వ ఉద్యోగాన్ని వదిలి సేంద్రియ వ్యవసాయంలోకి వచ్చిన కావ్యకు ఎక్కడా ప్రోత్సాహం లభించలేదు. 'తెలివి తక్కువ నిర్ణయం తీసుకున్నావు' అన్నవాళ్లే ఎక్కువ. అయినా ఆమె వెనక్కి తగ్గలేదు.
ఒక చిన్న గ్రామంలో చిన్న షెడ్‌లో 6 వర్మీకంపోస్ట్ బెడ్‌లను నిర్మించింది. ఆరు నెలలకు 20 బెడ్‌లు నిర్మించింది. ప్రతి నెల 20 టన్నుల వర్మీ కాంపోస్ట్ తయారుచేసే స్థాయికి కంపెనీ ఎదిగింది. అనతి కాలంలోనే మహారాష్ట్ర వ్యాప్తంగా ఈ వర్మీ కంపోస్ట్‌కు ఆదరణ పెరిగింది. 'పట్టణంలో పెరిగిన నీలాంటి అమ్మాయికి ఈ వ్యాపారం సరికాదు' అన్నారు కొందరు రైతులు. వారి మాట సరికాదు అని నిరూపిస్తూ రూ.30 లక్షల ఆర్గానిక్ ఫామింగ్ బిజినెస్‌ను నిర్మించింది కావ్య.

● బ్యూటిప్

బొప్పాయి మొటిమలపై బాగా పనిచేస్తుంది. బొప్పాయి చిన్న ముక్క తీసుకుని దానిపై తొక్క తీసి మెత్తగా చేసుకుని ముఖానికి లేదా కేవలం మొటిమలు ఉన్న చోట అప్లై చేసుకోవాలి. పై పొర తీయకపోతే దాని నుంచి వచ్చే పాలు చర్మానికి చికాకు తెప్పిస్తాయి. ముఖానికి ప్యాక్ వేసిన 20 నిముషాల తర్వాత నీటితో కడిగేయాలి. ఇలా నాలుగు రోజులు చేస్తే యాక్నే తగ్గుతుంది.



● షీటైమ్స్



ఉమెన్ కమాండో టీమ్

కీలకమైన ఆపరేషన్‌ల కోసం సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) తొలిసారిగా ఉమెన్ కమాండో టీమ్‌ను ప్రారంభించింది. వంద మంది మహిళా సీఐఎస్ఎఫ్‌లకు ఫిట్‌నెస్, వెపన్స్ హ్యాండ్లింగ్, లైవ్-ఫైర్ డ్రిల్స్‌లాంటి ఆపరేషన్ స్కిల్స్, రన్నింగ్, అబ్‌స్టకిల్ కోర్సులు, రఫెలింగ్, సర్వైవల్ ఇన్ ఫారెస్ట్, 48 గంటల కాన్ఫిడెన్స్ బిల్డింగ్ ఎక్సర్‌సైజ్‌లు... మొదలైనవాటిలో శిక్షణ ఇస్తారు.
మధ్యప్రదేశ్‌లోని బర్వాహత రీజనల్ ట్రైనింగ్ సెంటర్(ఆర్‌టిసి)లో శిక్షణ మొదలైంది.
శిక్షణ పూర్తి చేసుకున్న తొలిబ్యాచ్ మహిళలు ఎయిర్‌పోర్ట్స్‌లాంటి సున్నిత ప్రాంతాలలో విధులు నిర్వహిస్తుంది.

● వెడ్డింగ్ స్పెషల్



బ్యాట్ బండెక్కి నేనొస్త పా... నేనొస్త పా...

ఈ వరుడు పల్లకీలో రాలేదు. పూలతో అలకరించిన కారులో రాలేదు. ఏకంగా... సూపర్ హీరో బ్యాట్‌మన్ వాహనం బ్యాట్ మొబైల్‌పై వచ్చాడు. థాయ్‌లాండ్‌లో షూట్ చేసిన ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఈ వీడియోలో వరుడు ఫెనిల్ బ్యాట్‌మొబైల్‌పై, వాహనానికి ఇరువైపులా కుటుంబ సభ్యులు, స్నేహితులు డ్యాన్స్ చేస్తూ కనిపిస్తారు.
వరుడి ఉత్సాహం మాట ఎలా ఉన్నా చాలామంది నెటిజనులు 'వృథా ఖర్చు' అని, 'ఇలా డబ్బు వృథా చేసే బదులు మంచి పనులకు ఉపయోగించవచ్చు కదా' అంటూ విమర్శలు కురిపించారు.
కొందరు మాత్రం...
'భారతీయ వరుడిని కూడా ఇలాంటి బ్యాట్‌మొబైల్‌పై చూడాలనుకుంటాం' అని స్పందించారు.

● ట్రెండ్

మైక్రో డ్రామా



మొబైల్ స్క్రీన్‌ల కోసం ప్రత్యేకంగా డిజైన్ చేసిన షార్ట్-ఫామ్ వీడియో సిరీస్ వెర్టికల్ డ్రామా లేదా మైక్రోడ్రామా. ఆసియా దేశాలలో 'వెర్టికల్ డ్రామా' ట్రెండ్ ఊపందుకుంటోంది. వెర్టికల్ స్క్రీన్స్ కోసం డిజైన్ చేసిన స్టోరీ టెల్లింగ్ ఫార్మాట్ ఇది. వెర్టికల్ డ్రామా అనేది సంప్రదాయ సినిమా, టీవీ ఫార్మాట్‌ల కోసం డిజైన్ చేసింది కాదు. స్మార్ట్‌ఫోన్‌ల కోసం డిజైన్ చేసిన షార్ట్-ఫామ్, మొబైల్-ఫస్ట్ నేరేటివ్ కంటెంట్. 'వెర్టికల్ డ్రామా' మైక్రో-ఎపిసోడ్‌లు 1 నుంచి 5 నిమిషాల నిడివి కలిగి ఉంటాయి. క్షణాల వ్యవధిలోనే ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉండాలి. వ్యూ టీవి, కుయైషూలాంటి ప్లాట్‌ఫామ్స్ వెర్టికల్ స్టోరీ టెల్లింగ్‌కు సంబంధించి అధిక పెట్టుబడులు పెడుతున్నాయి.
ప్రేక్షకులు వెర్టికల్ డ్రామాలను ఎందుకు ఇష్టపడుతున్నారు అనే విషయానికి వస్తే... కన్వీనియెన్స్ అనేది మొదటిది. కాఫీ కోసం ఎదురు చూస్తూనో, కాఫీ తాగడం పూర్తయ్యేలోపో వెర్టికల్ డ్రామాలను చూడవచ్చు. చాలా తక్కువ నిడివి ఉండడం వల్ల ఒకేసారి ఎన్నో వీడియోలు చూడవచ్చు. వెర్టికల్ డ్రామాలలోని క్యారెక్టర్లు రకరకాల భావోద్వేగాలతో ఉండడం వల్ల ప్రేక్షకులు వెంటనే కనెక్ట్ అవుతారు.
కొన్ని సర్వేల ప్రకారం ప్రేక్షకులు మొబైల్‌లో షార్ట్-ఫామ్ కంటెంట్‌ను చూడడానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. సౌత్ కొరియాలో 'ఏ-టీన్' అనే వెర్టికల్ డ్రామా నెల వ్యవధిలో 6 మిలియన్‌ల వ్యూస్ సొంతం చేసుకుంది. 'వెర్టికల్ డ్రామా' అనేది కేవలం సృజనాత్మకతకు సంబంధించినదే కాదు మంచి ఆదాయ వనరుగానూ మారింది.

వంటిల్లు

పోషకాల బ్రేక్‌ఫాస్ట్

ఒక రోజంతా శక్తిమంతంగా, ఉత్సాహంగా గడిచిందంటే వారిపై ఆ రోజు ఉదయాన్నే తీసుకునే అల్పాహారం ప్రభావం తప్పక ఉంటుంది. పిల్లల జ్ఞాపకశక్తికీ పోషకాలు గల ఆహారం ఎంతో మేలు చేస్తుంది. ఉదయాన్నే పిల్లలు, పెద్దలు తీసుకునే బలవర్ధకమైన, సులువుగా తయారు చేసుకునే వంటకాలు ఇవి..

హెల్తీ మిక్స్ పరాఠా



కావల్సిన పదార్థాలు
హెల్తీ మిక్స్ (రాగులు, జొన్న, సజ్జలు, కొర్రలు మొలకెత్తిన గింజలు, గుమ్మడి, అవిసెగింజలతో చేసిన పిండి) – కప్పు; నెయ్యి లేదా నూనె – టీ స్పూన్; ఉప్పు – తగినంత; గోరువెచ్చని నీళ్లు (తగినన్ని);

తయారీ విధానం
- ఒక గిన్నెలో, మిల్లెట్ మిక్స్, ఉప్పు వేయాలి.
- గోరువెచ్చని నీటిని క్రమంగా వేస్తూ, పిండిని మెత్తని ముద్దలా అయ్యేలా బాగా కలపాలి.
- చేతులకు నూనె లేదా నెయ్యి రాసుకొని, చిన్న చిన్న ముద్దలుగా తీసుకోవాలి. రెండు బటర్ పేపర్ షీట్ల మధ్య పిండి బాల్ ఉంచి, చపాతీ కర్రతో మెల్లగా, తేలికపాటి ఒత్తిడితో, రోల్ చేయాలి.
- పెనం వేడి చేసి, ప్రతి పరాఠాను సన్నని మంట మీద కొద్దిగా నెయ్యి/నూనెతో బంగారు గోధుమ రంగు వచ్చే వరకు రెండు వైపులా కాల్చాలి.
- చట్నీ లేదా పెరుగుతో వేడిగా వడ్డించాలి.

పోషకాలు: పరాటాకు కూరగాయలను ఉడికించి, వాడుకోవచ్చు. ఏమేం దినుసులు, కూరగాయలు వాడుతున్నామో దానిని బట్టి కార్బోహైడ్రేట్స్, ప్రొటీన్లు, క్యాల్షియం, ఐరన్ సమృద్ధిగా లభిస్తాయి.

హెల్తీ మిక్స్ హల్వా

కావల్సిన పదార్థాలు
హెల్త్ మిక్స్ – కప్పు (క్యారెట్ లేదా బీట్‌రూట్ లేదా గుమ్మడి తురుము లేదా గోధుమ నూక); నెయ్యి – 2 టేబుల్ స్పూన్లు; బెల్లం లేదా కొబ్బరి చక్కెర – 1/4 కప్పు; పాలు – కప్పు; బాదం, జీడిపప్పు, చియా సీడ్స్ – టేబుల్ స్పూన్;

తయారీ విధానం
● పాన్‌లో నెయ్యి వేడి చేసి, హెల్తీ మిక్స్ వేసి, బాగా వేయించాలి. ● పాలు పోసి, కలుపుతూ ఉండాలి.. ● మిశ్రమం చిక్కగా అయ్యాక, తురిమిన బెల్లం, కొబ్బరి చక్కెర 'కోకో షుగర్) వేసి బాగా కలపాలి.
● అన్నీ పూర్తిగా కలిసే వరకు మరో 2-3 నిమిషాలు ఉడికించాలి.
● తరిగిన డ్రై ఫ్రూట్స్ అలంకరించి, సర్వ్ చేయాలి.

పోషకాలు: పిల్లలకు, పెద్దలకు ఇష్టమైనదే కాదు... మంచి పోషకాలు కూడా ఉండే స్వీట్ ఇది. బెల్లం లేదా కొబ్బరి చక్కెర వాడటం వల్ల ఐరన్ సమృద్ధిగా లభిస్తుంది. బీట్‌రూట్, క్యారట్, గుమ్మడిలో పోషకాలు, యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు లభిస్తాయి. పాల మిశ్రమం కాబట్టి క్యాల్షియమూ అందుతుంది.



చిల్లా



కావల్సిన పదార్థాలు: పెసరపప్పు – కప్పు (తగినన్ని నీళ్లు పోసి, రెండు గంటలసేపు నానబెట్టాలి); నీళ్లు – అర కప్పు (తగినన్ని); ఉల్లిపాయ – చిన్నది (సన్నగా తరగాలి); పచ్చి మిర్చి – సన్నగా తరగాలి; కొత్తిమీర తరుగు – టేబుల్ స్పూన్; ఉప్పు – రుచికి తగినంత; నూనె – తగినంత.

తయారీ విధానం
- పెసరపప్పును వడకట్టి, నీళ్లు కలిపి, మెత్తగా రుబ్బుకోవాలి.
- పిండిని గిన్నెలోకి తీసుకొని (క్యారెట్ తురుము, పాలకూర తరుగు, నానబెట్టిన ఓట్స్ కూడా కలుపుకోవచ్చు) తరిగిన ఉల్లిపాయలు, పచ్చి మిర్చి తరుగు, కొత్తిమీర, ఉప్పు వేసి కలపాలి.
- పెనం వేడి చేసి, ఒక గరిటెతో పెనం పైన పిండి పోసి, దోసెలా వెడల్పు చేయాలి.
- మీడియం మంట మీద రెండు వైపులా గోధుమ రంగు వచ్చేవరకు ఉంచాలి.
- కొత్తిమీర, పుదీనా చట్నీతో వేడిగా సర్వ్ చేయాలి.

పోషకాలు
క్యాలరీలు తక్కువగా ప్రొటీన్లు, క్యాల్షియం, ఐరన్, జింక్ సమృద్ధిగా లభించే ఈ చిల్లా ఉదయం, సాయంత్రం స్నాక్‌గా తీసుకోవచ్చు. పిల్లలకు లంచ్ బాక్స్‌లోకీ బాగుంటుంది. దీనిని రోల్ చేసి, ఉడికించిన కూరగాయలతో స్టఫ్ చేసి కూడా అందివ్వవచ్చు.


శ్రీదేవి ఆశల
టమ్మీ ఫ్రెండ్లీ ఫుడ్ ఫౌండర్

బులియన్ (బంగారం 10 గ్రా.: వెండి కిలో) ఆగస్టు 29న ముగింపు రూ.లలో

హైదరాబాద్		విజయవాడ		విశాఖపట్నం		రాజమండ్రి		ప్రొద్దుటూరు		చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	1,04,210	బంగారం (24 క్యారెట్లు)	1,05,020	బంగారం (24 క్యారెట్లు)	1,03,310	బంగారం (24 క్యారెట్లు)	1,05,020	బంగారం (24 క్యారెట్లు)	1,03,250	బంగారం (24 క్యారెట్లు)	1,03,300
బంగారం (22 క్యారెట్లు)	97,760	బంగారం (22 క్యారెట్లు)	94,700	బంగారం (22 క్యారెట్లు)	94,700	బంగారం (22 క్యారెట్లు)	97,540	బంగారం (22 క్యారెట్లు)	94.990	బంగారం (22 క్యారెట్లు)	94,700
వెండి	1,21,000	వెండి	1,20,300	వెండి	1,29,900	వెండి	1,20,300	వెండి	1,19,600	వెండి	1,31,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

మ్యారేజ్ గ్రాడ్యుయేషన్.. విడిపోయి కలిసుండటం

సాంకేతికత నుంచి జీవనతత్వం దాకా ఎందులోనైనా ట్రెండ్‌ను క్రియేట్ చేయడంలో పేటెంట్ జపాన్‌దే! ఆ ధోరణి పెళ్లి బంధంలోనూ కనిపిస్తోంది. దాన్ని మ్యారేజ్ గ్రాడ్యుయేషన్ అంటున్నారు. అదే జపనీస్‌లో 'సోసుకోన్'. సోసుగ్యోయి అంటే గ్రాడ్యుయేషన్.. కేకోన్ అంటే పెళ్లి.. ఈ రెండు పదాల కలయికే సోసుకోన్.



మనసున మనసై బతుకున బతుకైన జీవన తోడు దొరకడం నిజంగానే భాగ్యం. ఆ భాగ్యం లేకపోతే సర్దుబాట్లతోనే సంసారం సాగుతుంది. ఆ సర్దుబాటూ కరవైతే విడాకులే! ఆ విడాకులూ ఊరికే మంజూరు కావు కదా.. ఆలుమగల గోల వినాలి.. సాక్ష్యాలు పరీక్షించాలి.. వాయిదాలు భరించాలి.. మానసిక క్షోభను అనుభవించాలి! ఇదంతా లేకుండా విడిపోయి కలిసి బతికే దారి ఉంటే బాగుండు అనిపిస్తుంది! అచ్చంగా అలాంటి పరిష్కార మార్గమే సోసుకోన్ ఆకా (ఏకేఏ ఆల్సో నోన్ యాజ్) మ్యారేజ్ గ్రాడ్యుయేషన్. కలహాల కాపురానికి చక్కటి సొల్యూషన్ అంటున్నాయి జపాన్ జంటలు.

ఆ సొల్యూషన్ ఏంటంటే..

పెళ్లిని పునర్నిర్వచిస్తున్న ఈ ట్రెండ్ స్పర్ధలున్న భార్యాభర్తలు ఏ గొడవలేకుండా, విడాకుల ఊసెత్తకుండా పరస్పర గౌరవంతో ఎవరికి వారే నచ్చినట్లు జీవించే వెసులుబాటును కల్పిస్తోంది.

ఆ జంట ఇష్టపడితే విడిపోయి కూడా ఎవరిమానాన వారు ఒకే చూరు కింద కలిసి ఉండొచ్చు. ఇంటి పనుల దగ్గర్నుంచి వంట దాకా సపరేట్‌గా చేసుకుంటూ హౌజ్‌మేట్స్‌లా గడపొచ్చు లేదంటే వేరువేరుగా వేరు వేరు ఇళ్లల్లో ఉండొచ్చు.. నచ్చినప్పుడు, సమయం కుదిరినప్పుడు కాఫీ, లంచ్, డిన్నర్, మూవీ డేట్స్‌కి కలుసుకుంటూ! ఫ్రెండ్స్‌లా ఫోన్‌లో మాట్లాడుకోవచ్చు.. కెరీర్ నుంచి ఆస్తుల వ్యవహారాల దాకా ఒకరికొకరు సాయం చేసుకోవచ్చు. డబ్బు, సమయం వృథాకాని.. మానసిక బాధలేని ఈ పద్ధతి జపాన్‌లోని చాలా జంటలకు నచ్చి.. కలహాలతో కాపురం డిస్టర్బ్ అవుతుందనే అంచనాకు రాగానే వెంటనే మ్యారేజ్ గ్రాడ్యుయేషన్‌ను అమలు చేస్తున్నారట.



ఎప్పుడు మొదలైందంటే..

జపానీస్ ప్రఖ్యాత రచయిత యుమికో సుగియామా 2000 సంవత్సరంలో పెళ్లయిన జంటల మీద ఒక సర్వే నిర్వహించింది. విడాకులకు వెళ్లకుండా వైవాహిక జీవితంలోని కలతలను ఎలా పరిష్కరించుకుంటారని అడిగింది. అందులో సగానికి పైగా జంటలు అలాంటి అవకాశమే వస్తే.. సొసుకోన్ మెథడ్‌ను ఎంచుకుంటామని చెప్పారు. ఒకే ఇంట్లో ఉంటూ తమకు నచ్చినట్టు బతుకుతామని కొందరు, వేరువేరుగా ఉంటూ వీకెండ్ డేట్స్‌లో మీట్ అవుతామని మరికొందరు, ఫ్రెండ్స్‌లా కలిసి ఉండటానికి ఇష్టపడతామని ఇంకొందరు చెప్పారట. అలా రెండువేల సంవత్సరంలో ఆ సర్వే ద్వారా మ్యారేజ్ గ్రాడ్యుయేషన్ ప్రచారంలోకి వచ్చి.. విడాకులకు ప్రత్యామ్నాయమైన ట్రెండ్‌గా స్థిరపడిపోయింది. హింస, వ్యథ లేని ఆ రిలేషన్‌షిప్‌ను నలభైల్లో ఉన్న జంటలు ఎక్కువగా ఇష్టపడతున్నాయని తర్వాత జరిగిన అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి.

మీకు తెలుసా?

నువ్వులతో నిగనిగలాడే కురులు



నువ్వులు, బెల్లం కలిపి చేసిన లడ్డు గానీ నువ్వుల జీడీలు గానీ ఉదయం ఒకటి, సాయంత్రం ఒకటి తింటూ ఉంటే వెంట్రుకలు పెరగడమేకాక శారీరక దృఢత్వం కలిగి యవ్వనంగా ఉండగలరు. దీనిలో కాల్షియం అత్యధికంగా ఉండటం వల్ల స్త్రీలతోపాటు పురుషులకు కూడా చాలా మంచిది. ఎముకలు బలం పుంజుకుంటాయి.

మేలైన ఆరోగ్యానికి మల్బరీ



మల్బరీ పండ్లు శాస్త్రీయంగా మోరస్ జాతికి చెందినవి, తీపి, పులుపు రుచులను కలిగి ఉంటాయి. వీటిని నేరుగా తినవచ్చు లేదా జ్యూస్, జామ్, వైన్ ఇతర ఆహార పదార్థాలలో కలిపి ఉపయోగించవచ్చు. మల్బరీ పండ్లను వాడటం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలున్నాయి.

- మల్బరీలో డైటరీ ఫైబర్ పుష్కలంగా ఉంటుంది, ఇది జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. మలబద్ధకం, ఉబ్బరం, కడుపులో మంటలను తగ్గించడంలో కూడా సహాయపడుతుంది.
- గుండె ఆరోగ్యాన్ని కాపాడుతుంది: మల్బరీలోని రెస్వెరాట్రాల్ అనే ముఖ్యమైన ఫ్లేవనాయిడ్ రక్త నాళాల పనితీరును మెరుగుపరుస్తుంది. ఇది నైట్రిక్ ఆక్సైడ్ ఉత్పత్తిని పెంచుతుంది, ఇది రక్త నాళాలను సడలించి రక్తం గడ్డకట్టే అవకాశాలను తగ్గిస్తుంది, తద్వారా స్ట్రోక్స్, గుండెపోటు వంటి సమస్యలను నివారిస్తుంది.
- మల్బరీలో పుష్కలంగా ఉండే విటమిన్ సి శరీరంలోని వ్యాధులకు వ్యతిరేకంగా మంచి రక్షణను అందిస్తుంది.
- మల్బరీలోని విటమిన్ కె, కాల్షియం, ఐరన్ వంటి ఖనిజాలు ఆరోగ్యకరమైన ఎముకలను నిర్వహించడానికి అవసరం.
- మల్బరీ జ్యూస్ తాగడం వల్ల కంటి చూపు మెరుగుపడుతుంది. ఇందులో విటమిన్ ఎ అధికంగా ఉంటుంది, ఇది కంటి చూపును బలపరుస్తుంది. కంప్యూటర్ ముందు గంటల తరబడి పనిచేసే వారికి కంటి ఒత్తిడిని తగ్గిస్తుంది.
- మల్బరీ జ్యూస్ శస్త్రచికిత్స తర్వాత రోగులకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది, ఇన్ఫెక్షన్లను నివారిస్తుంది.



- బాదంపప్పులు నానబెట్టి పైతోలు తీసి చితక్కొట్టి ఎండించి పొడి చేసి, దానికి సమంగా కండచక్కెర పొడి కలిపి వుంచుకొని రాత్రి నిద్రించే ముందు ఒక చెంచాపొడి ఒక గ్లాస్ వేడిపాలలో కలుపుకొని సేవిస్తుంటే బాదంలోని బలమైన శక్తి వెంట్రు కుదుళ్ళకు చేరి వెంట్రుకలను నల్లగా దృఢంగా నిగనిగ లాడేలా చేస్తుంది.. అంతేగాకుండా, మెదడుకు, కళ్ళకు కూడా మంచిది. ముఖ్యంగా విద్యార్థులకు జ్ఞాపకశక్తి పెరుగుతుంది.
- గోంగూరతో ఎలా పచ్చడి చేసుకుంటామో గుంటగలగరాకుతో కూడా అలాగే పచ్చడి చేసుకుని వారానికి ఒకటి లేదా రెండు సార్లు తింటూ ఉంటే ఆహార ఔషధ ప్రభావం వల్ల మంచి ఆరోగ్యం కలగడమే కాక నెరసిన వెంట్రుకలు క్రమంగా నల్లబడతాయి.

జెన్స్ లైఫ్




వృద్ధాప్యంలో ఇతరుల మీద ఆధారపడడం సహజం. అయితే అందరికీ ఈ అవకాశం ఉండకపోవచ్చు. ఒంటరి వృద్ధులు ఇతరుల మీద అంతగా ఆధారపడనవసరం లేకుండా 66 సంవత్సరాల మీనాక్షి మీనన్ టెక్ ప్లాట్‌ఫామ్‌ను ప్రారంభించింది.'జెన్స్ లైఫ్' పేరుతో ఏర్పాటు చేసిన ఈ ప్లాట్‌ఫామ్ లాబ్ టెస్ట్ సర్వీసులు, ట్రావెల్, టాక్స్ ఫైలింగ్, మెంటల్ హెల్త్, స్ట్రెస్ ఫ్రీ, సైబర్ సేఫ్టీ.. మొదలైన విషయాలలో వృద్ధులకు ఉపకరిస్తుంది.

అడ్వర్‌టైజింగ్, మార్కెటింగ్, మీడియా కన్సల్టింగ్‌లలో మీనాక్షికి నాలుగు దశాబ్దాల అనుభవం ఉంది. అయిదు స్టార్టప్‌లకు యజమాని.'పిల్లలను ఎలా పెంచాలి? అనే అంశంపై వందలాది పుస్తకాలు వచ్చాయి. అయితే వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను ఎలా చూసుకోవాలి అనే అంశంపై రాలేదు.

ఈ నేపథ్యంలోనే వృద్ధులైన తల్లిదండ్రులకు సహాయపడే యాప్ రూపొందించాలనుకున్నాను' అంటుంది మీనాక్షి మీనన్.

ఓ తాతా మనవరాలి కథ





ఆ అమ్మాయి వయస్సప్పుడు 13 ఏళ్లు. ప్రపంచమంటే ఎంతో ఇష్టం. గుస్తాద్ బోర్జర్జీ అహ్మదాబాద్‌లో నివసిస్తున్న ఓ వృద్ధుడు. టాటా ఇండస్ట్రీస్ ఒకప్పటి ఉద్యోగి. నా అనేవారు ఎవరూ లేని గుస్తాద్‌తో ఎందుకింత బంధం ఏర్పడిందో తెలీదు. ఇప్పుడు అమీషాకు గుస్తాద్ తాత. ఆమె అతని మనవరాలు. తల్లిదండ్రుల కన్నా మిన్నగా ప్రేమించి, లాలించిన గుస్తాద్ తాత ఇప్పుడు లేడు. కానీ ఆయన ప్రేమ మాత్రం అమీషా ఇంకా అనుభూతి చెందుతూనే ఉంది. అహ్మదాబాద్ కోర్టు నిర్ణయంతో ఇప్పుడా తాతా మనవరాలి కథ వెలుగులోకి వచ్చింది.


గుస్తాద్ టాటా ఇండస్ట్రీస్‌లో పనిచేశాడు. ఆయనకు సంతానం లేదు. భార్య కూడా మరణించింది. వృద్ధాప్యాన్ని భారంగా, ఒంటరిగా గడుపుతున్న కాలంలో ఆయన దగ్గర ఎంతోకాలంగా పనిచేస్తున్న వంటతని మనవరాలు అమీషా ఒక వెలుగురేఖలా ప్రసరించి అంతులేని కాంతులను వెంట తీసుకొచ్చింది. 'తాయి' అని పిలుస్తూ ప్రేమ, ఆప్యాయతలను పంచుతూ ఆయనకు దగ్గరైంది. క్రమంగా ఆయన రోజువారీ జీవితంలో విడదీయలేని భాగమయ్యింది. ఇద్దరూ గంటల తరబడి కబుర్లు చెప్పుకునేవారు. ఆటపాటలతో ఉల్లాసంగా గడిపేవారు. ఒకానొక సమయంలో ఆమెను దత్తత తీసుకోవాలని కూడా అనుకున్నాడు గుస్తాద్. కానీ అది ఆమెను తల్లిదండ్రులనుంచి దూరం చేస్తుందని, ఆమె గుర్తింపును మార్చేస్తుందని అనిపించి ఆ ఆలోచనను మానుకున్నాడు. కానీ అమీషా కోసం ఏదైనా చేయాలి. ఆమె తనకెంత ముఖ్యమో, ఆమె కోసం తానేం చేయగలడో ప్రేమపూర్వకంగా అందరికీ తెలియజేయాలనుకున్నాడు. ఆ ప్రకారమే తాను లేకున్నా తన ప్రేమ, అనురాగం ఆమెను జాగ్రత్తగా కాపాడాలని అమీషాతో బంగారు జ్ఞాపకాలకు నిలయమైన అహ్మదాబాద్, షాహిబాగ్‌లోని తన ఫ్లాట్‌ను ఆమె పేరున రాశాడు. ఆ సమయంలో అమీషా మైనర్ కాబట్టి తన మేనల్లుడికి ఇంటి బాధ్యతలు అప్పగించాడు. ఇప్పుడు అమీషా ఒక ప్రైవేటు కంపెనీలో హెచ్‌ఆర్ విభాగంలో పనిచేస్తోంది. తాత గుస్తాద్ చివరి కోరికను అధికారికంగా నెరవేర్చేందుకు కోర్టును ఆశ్రయించింది. ఎవరికైనా అభ్యంతరాలుంటే తెలియజేయాల్సిందిగా కోరింది. అయితే అదృష్టవశాత్తూ అలాంటివేమీ తలెత్తలేదు. గుస్తాద్ స్వంత సోదరుడు కూడా అమీషాకు ఆ ఇంటిని అప్పగించడానికి మనస్ఫూర్తిగా అంగీకరించారు. దీంతో ఈ నెల 2న కోర్టు అధికారికంగా ఫ్లాట్‌ను ఆమె పేర బదిలీ చేసింది. ఈ సందర్భంగా అమీషా గుస్తాద్‌తాతతో తన అనుబంధాన్ని మీడియాతో ఆనందంగా నెమరు వేసుకుంది.

సాక్షి సినిమా

బాలీవుడ్ బ్రిడ్జ్‌లో..



యూకేలో పదేళ్ల క్రితం తప్పిపోయిన తన కుమార్తె కోసం ఇంకా వెతుకుతున్నారట మాధవన్. కానీ ఇది రియల్ లైఫ్‌లో కాదు... రీల్ లైఫ్‌లో. మాధవన్, రాశీ ఖన్నా లీడ్ రోల్స్‌లో హిందీలో 'బ్రిడ్జ్' అనే సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రం రూపొందిందని సమాచారం. ఈ చిత్రంలో మాధవన్, రాశీ ఖన్నా భార్యాభర్తలుగా నటించారని తెలిసింది. నిధీ సింగ్ ధర్మ, నాగరాజ్ దివాకర్ ద్వయం ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. ఆల్రెడీ 'బ్రిడ్జ్' చిత్రీకరణ పూర్తయిందని, ఈ ఏడాది చివర్లో లేదా వచ్చే ఏడాది ప్రారంభంలో రిలీజ్ చేయాలనుకుంటున్నారని బాలీవుడ్ టాక్. యూకేలో పదేళ్ల క్రితం తప్పిపోయిన తమ కుమార్తె కోసం దంపతులు చేసే ప్రయత్నాలు? ఆ అమ్మాయి ఎలా తప్పిపోతుంది? అనే అంశాల నేపథ్యంలో ఈ సినిమా కథనం సాగుతుందని టాక్.



మాధవన్, రాశీ ఖన్నా

పుట్టినరోజునే నిశ్చితార్థం



సాయి ధన్సిక, విశాల్

హీరో విశాల్ తన పుట్టినరోజునే (ఆగస్టు 29) నిశ్చితార్థం చేసుకున్నారు. హీరోయిన్ సాయి ధన్సికతో ఆయన ఎంగేజ్‌మెంట్ జరిగింది. శుక్రవారం చెన్నైలో విశాల్, సాయి ధన్సిక తమ కుటుంబ సభ్యుల సమక్షంలో నిశ్చితార్థం చేసుకున్నారు. ఈ ఇద్దరూ ఇప్పటివరకు ఒక్క సినిమా కూడా కలిసి చేయలేదు. కానీ, వీరిద్దరూ ప్రేమలో ఉన్నారనే సంగతి తెలిసిందే. ఇటీవల ధన్సిక లీడ్ రోల్‌లో నటించిన 'యోగిడా' ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కు విశాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ వేదిక పైనే ధన్సిక తమ ప్రేమ విషయాన్ని వెల్లడించారు. ఇక తమ ఎంగేజ్‌మెంట్ ఫొటోలను సోషల్ మీడియా వేదికగా షేర్ చేసి, ''సాయి ధన్సికతో జరిగిన నా నిశ్చితార్థానికి సంబంధించిన శుభవార్తను మీ అందరితో పంచుకోవడం హ్యాపీగా ఉంది. మీ ఆశీర్వాదాలు, ప్రేమ మాపై ఎప్పటికీ ఉండాలని కోరుకుంటున్నాను'' అని పోస్ట్ చేశారు విశాల్. అయితే వివాహం ఎప్పుడు? అనే విషయాన్ని మాత్రం వెల్లడించలేదు.

ప్రేమకథలో వేలు పెడితే...



రోషన్ కనకాల

'ఒక చిన్న ప్రేమకథ చెప్తా..' అంటూ హీరో నాని వాయిస్ ఓవర్‌తో మొదలైంది 'మోగ్లీ' గ్లింప్స్. రోషన్ కనకాల, సాక్షి మడోల్కర్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'మోగ్లీ'. సందీప్ రాజ్ దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ ఏడాదే విడుదల కానుంది. ఈ సినిమా గ్లింప్స్‌ని హీరో రామ్‌చరణ్ లాంచ్ చేశారు. 'ఎందుకు పరిగెత్తించాడనేగా మీ అనుమానం. మరి తన బంగారు ప్రేమకథలో వేలు పెడితే కుట్టదా?' అనే డైలాగ్స్ గ్లింప్స్‌లో ఉన్నాయి. అనంతరం జరిగిన ఈవెంట్‌లో రోషన్ మాట్లాడుతూ– ''మీ అందరి కోసం ఒక అద్భుతమైన సినిమా చేశాం'' అన్నారు. ''రామ్‌చరణ్, నానీగార్లకు థ్యాంక్స్. కేఎల్ యూనివర్సిటీకి థ్యాంక్యూ. ఇక్కడ ఎంటర్టైన్మెంట్ ఓ సబ్జెక్టుగా ఉందని విన్నాను. యంగ్ టాలెంట్‌తో పని చేయాలనుకుంటున్నాను'' అని చెప్పారు టీజీ విశ్వప్రసాద్.

గ్రాండ్ పేరెంట్స్‌కి ఉచితం



సత్యరాజ్

సత్యరాజ్, వశిష్ఠ ఎన్. సింహా, 'సత్యం' రాజేశ్, ఉదయభాను, సాంచి రాయ్ కీలక పాత్రలు పోషించిన చిత్రం 'త్రిబాణధారి బార్బరిక్'. మోహన్ శ్రీవత్స దర్శకత్వం వహించారు. మారుతీ టీమ్ ప్రొడక్ట్ సమర్పణలో విజయపాల్ రెడ్డి అడిదల నిర్మించిన ఈ చిత్రం శుక్రవారం విడుదలైంది. ''మా సినిమాకి మొదటి ఆట నుంచే పాజిటివ్ టాక్ వచ్చింది. ఎక్కువగా మహిళా ప్రేక్షకులు, ఫ్యామిలీ ఆడియన్స్ కనెక్ట్ అవుతున్నారు. అందుకే ఓ ఆఫర్ ఇస్తున్నాం. సెప్టెంబర్ మొదటి వారంలో గ్రాండ్ పేరెంట్స్ డే (సెప్టెంబర్ 7). ఈ నేపథ్యంలో ఆగస్ట్ 30, ఆగస్ట్ 31న ప్రదర్శించే సాయంత్రం ఆటకు కుటుంబంతో కలిసి వచ్చే గ్రాండ్ పేరెంట్స్‌కి ఉచితంగా ప్రవేశం కల్పించనున్నాం'' అని చిత్రబృందం పేర్కొంది.

ప్రేక్షకులు రిలేట్ అయ్యే సినిమా ఇది

- ఆదిత్య హాసన్



సాయికృష్ణ, ఆదిత్య

''ప్రేక్షకులు రెండు రకాల కథల్లో లీనమవుతారని నా నమ్మకం. ఒకటి తాము చేయాలనుకున్నవి చూపించే కథలు. రెండు తాము చేసినవి చూపించే కథలు. మా 'లిటిల్ హార్ట్స్' చిత్రం రెండో రకం. ప్రేక్షకులు తమ జీవితంలో కూడా ఇలా జరిగిందే అని 'లిటిల్ హార్ట్స్' సినిమా చూస్తున్నంత సేపూ రిలేట్ అవుతారు'' అని అన్నారు దర్శక–నిర్మాత ఆదిత్య హాసన్. '90స్ మిడిల్ క్లాస్ బయోపిక్' ఫేమ్ మౌళి తనూజ్, శివానీ నాగరం లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'లిటిల్ హార్ట్స్'. ఈ చిత్రాన్ని ఈటీవీ విన్ ఒరిజినల్ ప్రొడక్షన్ పతాకంపై సాయి మార్తాండ్ దర్శకత్వంలో ఆదిత్య హాసన్, సాయికృష్ణ నిర్మించారు. సెప్టెంబరు 5న ఈ చిత్రం విడుదల కానున్న సందర్భంగా ఆదిత్య హాసన్ మాట్లాడుతూ– ''ఈ సినిమా కథ విన్నప్పుడు బాగా రిలేట్ అయ్యాను. ఈ చిత్రంలో సీరియస్ డ్రామా, ట్విస్ట్‌లు, సందేశాలేమీ లేవు. టీనేజ్‌లో ఉండే పరిణతి లేని ప్రేమకథను చూపిస్తున్నాం'' అని అన్నారు. ''సరిగ్గా చదువు రాని అమ్మాయి, అబ్బాయిల మధ్య జరిగే ఫన్నీ స్టోరీయే ఈ చిత్రం. వంశీ నందిపాటి, బన్నీ వాసు గార్లు ఈ సినిమాను దాదాపు 200 థియేటర్స్‌లో రిలీజ్ చేస్తున్నారు. సెప్టెంబర్ 3న ఇంటర్ విద్యార్థుల కోసం మూడు సెంటర్స్‌లో ఫ్రీ షోస్, 4న పెయిడ్ ప్రీమియర్స్ ప్లాన్ చేశాం'' అని చెప్పారు సాయికృష్ణ.

మయూఖం షురూ



కుశలవ్, తన్మయి

కుశలవ్, తన్మయి జంటగా 'మయూఖం' సినిమా ఆరంభం అయింది. వెంకట్ బులెమోని దర్శకత్వంలో సినెటేరియా మీడియా వర్క్స్ పై శ్రీలత వెంకట్ నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రారంభోత్సవం శుక్రవారం హైదరాబాద్‌లో జరిగింది. తొలి సన్నివేశానికి సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ కెమెరా స్విచ్చాన్ చేయగా, టీ సిరీస్ మ్యూజిక్ ప్రతినిధి ప్రియాంక మన్యాల్ క్లాప్ ఇవ్వగా, దర్శకుల సంఘం అధ్యక్షుడు వీర శంకర్ గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా వెంకట్ బులెమోని మాట్లాడుతూ– ''మా సినెటేరియా మీడియా వర్క్స్ దాదాపు 140 చిత్రాలకు ఇన్ ఫిల్మ్ బ్రాండింగ్ చేసింది. అందులో తాజాగా 'ది రాజా సాబ్' మూవీ ఉంది. మా సంస్థ నుంచి మైథలాజికల్ థ్రిల్లర్ నేపథ్యంలో 'మయూఖం' అనే పాన్ ఇండియా మూవీని రూపొందిస్తున్నాం. వంద శాతం ఇన్ ఫిల్మ్ బ్రాండింగ్‌తో వస్తున్న తొలి ఇండియన్ మూవీ ఇదే'' అన్నారు. ''మయూఖం'తో నా లైఫ్‌లో మరో దశలోకి ప్రవేశిస్తున్నాను'' అని కుశలవ్ అన్నారు. ''నన్ను నమ్మి చాన్స్ ఇచ్చిన డైరెక్టర్ వెంకట్‌గారికి థ్యాంక్స్'' అని తన్మయి చెప్పారు.

'దిల్' రాజు బేనర్ సినిమాలా...



వెంకటేశ్, వృతి, నారా రోహిత్, సంతోష్, రాకేశ్

''సుందరకాండ' చిత్రానికి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తున్నందుకు సంతోషంగా ఉంది. సత్య క్యారెక్టర్‌తో నాకు మంచి పేరు వచ్చింది. వెంకీ రాసిన డైలాగ్స్ గురించి ప్రత్యేకంగా చెబుతున్నారు. ఇంకా చూడని వాళ్ళు, థియేటర్స్‌కి వెళ్లి, మా సినిమా చూడండి'' అని నారా రోహిత్ అన్నారు. నారా రోహిత్ హీరోగా, వృతి వాఘాని, శ్రీదేవి విజయ్ కుమార్ హీరోయిన్లుగా నటించిన తాజా చిత్రం 'సుందరకాండ'. వెంకటేశ్ నిమ్మలపూడి దర్శకత్వంలో సంతోష్ చిన్నపొల్ల, గౌతమ్ రెడ్డి, రాకేశ్ మహంకాళి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 27న విడుదలైంది. ఈ సందర్భంగా శుక్రవారం నిర్వహించిన థ్యాంక్స్ మీట్‌లో వెంకటేశ్ నిమ్మలపూడి మాట్లాడుతూ– ''నా రైటింగ్‌కు మంచి ప్రశంసలు వస్తున్నందుకు సంతోషంగా ఉంది'' అన్నారు. ''దిల్' రాజుగారి బేనర్ నుంచి వచ్చినట్టు మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ తీశారని చెబుతుంటే ఆనందంగా ఉంది'' అని చెప్పారు నిర్మాత సంతోష్. ''ఈ సినిమా విషయంలో మేం ఎంత ఎగ్జయిట్ అయ్యామో, ఆడియన్స్ కూడా ఈ సినిమా చూసి అంతే ఎగ్జయిట్ కావడం సంతోషాన్నిస్తోంది'' అని పేర్కొన్నారు రాకేశ్.

ఓటీటీ ఇది చూడొచ్చు

ఇంటింటి భాగోతం

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో సార్, మేడమ్ ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.

ఈ భూమండలంలో అత్యంత ప్రమాదకర గొడవ ఏదైనా ఉందీ అంటే అది భార్యాభర్తల గొడవ. ఇది ప్రతి ఇంట్లో ఉండేదే కదా అనుకుంటారేమో... ఒక చిన్న ఇంట్లో మొదలై సమాజం మొత్తాన్ని గడగడలాడించే సత్తా ఈ గొడవకి ఉంది. ఇంకా చెప్పాలంటే చినుకు చినుకు గాలివాన అయినట్టు ఈ మొగుడు పెళ్ళాల గొడవ చిలికి చిలికి పెను తుఫానై కుటుంబాలకు కుటుంబాలే కనపడకుండా పోతాయి. ఇదే నేపథ్యంలో అల్లుకున్న కథే 'సార్, మేడమ్'. తమిళ సినిమా 'తలైవన్, తలైవి'కి ఇది డబ్బింగ్ వెర్షన్. విజయ్ సేతుపతి, నిత్యామీనన్ భార్యాభర్తల పాత్రల్లో చక్కగా గొడవ పడగా, ఆ గొడవను అందంగా... అర్థవంతంగా తీర్చిదిద్దే బాధ్యత దర్శకుడు పాండిరాజ్ తీసుకున్నారు. ఇది రొటీన్ సినిమా అయితే కానే కాదు.



నిజానికి దర్శకుడు ఈ సినిమా ముందు ఇది వాస్తవిక సంఘటనల ఆధారంగా అని చెప్పాల్సింది. ఎందుకంటే ఇలాంటి గొడవ ప్రతిరోజూ మన ఇళ్ళలోనో లేదా పొరుగిళ్ళలోనో కనబడేదే. అంతలా ఏంటా గొడవ అనేది చూద్దాం. ఆకాశ వీరన్ అనే వ్యక్తి రోడ్డు పక్కన ఓ పరోటా హోటల్ నడుపుతుంటాడు. చుట్టుపక్కల ఈ హోటల్‌కి మంచి పేరుంది. చదువే లేని ఆకాశ వీరన్‌కు డబుల్ డిగ్రీ ఉన్న రాణితో పెళ్ళవుతుంది. పెళ్ళైన తరువాత ఆకాశ వీరన్ తండ్రి రాణిని చదువుకున్న అమ్మాయి కదా అని గల్లాపెట్టె దగ్గర కూర్చోమంటాడు. ఇక అక్కడి నుండి గొడవ ప్రారంభమవుతుంది. సినిమా ఆద్యంతం ఈ గొడవతోనే సాగుతూ హీరో హీరోయిన్ విడాకుల దాకా వెళుతుంది. అసలీ కథంతా ప్రేక్షకుడికి తెలియడానికి దర్శకుడు ఓ గమ్మత్తైన ఘటన ఎంచుకుంటాడు. అదేంటంటే సినిమా ఆరంభంలోనే ఆకాశ వీరన్, రాణి విడిగా ఉన్నారని ప్రేక్షకులకు చెబుతూ రాణి తన బిడ్డకు తండ్రికి తెలియకుండా పుట్టెంటుకలు తీయించడానికి గుడికి వస్తుంది. తనకు తెలియకుండా తన బిడ్డకు వెంట్రుకలు ఎలా తీస్తారని ఆకాశ వీరన్ వీరంగం చేస్తాడు. బిడ్డకు సగం వెంట్రుకలు తీసిన తరువాత ఆపేయిస్తాడు. మరి... ఆ బిడ్డకు పూర్తిగా వెంట్రుకలు తీస్తారా లేదా? అలాగే విడాకులు తీసుకున్న ఆకాశ వీరన్, రాణి ఇంకెంత ఆగం చేస్తారు? అన్నది మాత్రం 'సార్, మేడమ్'లోనే చూడాలి. ప్రైమ్ వీడియో వేదికగా ఇటీవలే విడుదలైన ఈ సినిమా తెలుగులో ఉంది. పిల్లలు తప్ప ప్రతి ఒక్కరూ చూడాల్సిన సినిమా ఇది. వర్త్ టు వాచ్ ఫర్ ది వీకెండ్

– హరికృష్ణ ఇంటూరు

సాక్షి బిజినెస్
శనివారం
30-8-2025

స్టాక్ మార్కెట్లు

(తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	271	79,810
నిఫ్టీ ▽	74	24,427

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	21,430	▽	46
డోజోన్స్	45,504	▽	133
ఎఫ్‌టీఎస్ఈ 100	9,198	▽	19
డాక్స్	23,925	▽	115
షాంఘై	3,858	△	14
నికాయ్	42,718	▽	110


• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో


			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ధారుపలక	86.35	89.35
£	బ్రిటన్ పౌండ్	ధారుపలక	116.28	12062
€	యూరో	ధారుపలక	110.66	104.61
¥	జపాన్ యెన్ (100)	ధారుపలక	48.00	70.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	ధారుపలక	55.19	59.03
S$	సింగపూర్ డాలర్	ధారుపలక	66.29	70.00
SAR	సౌదీ రియాల్	ధారుపలక	22.63	24.13
UAE D	యూఏఈ దిర్హామ్	ధారుపలక	23.12	23.14
¥	చైనా యువాన్	ధారుపలక	11.49	13.31

పసిడి హైజంప్

- ఢిల్లీలో కొత్త గరిష్టం రూ.1,03,670
- 10 గ్రాములకు రూ.2,100 అప్



న్యూఢిల్లీ: పసిడి ధరలకు రూపాయి బలహీనత ఆజ్యం పోసింది. ఫలితంగా శుక్రవారం ఢిల్లీ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత బంగారం 10 గ్రాములకు రూ.2,100 పెరిగి నూతన జీవితకాల గరిష్ఠమైన రూ.1,03,670 (పన్నులతో కలిపి)కు చేరింది. ఈ నెల 8న నమోదైన రూ.1,03,420 99.9 శాతం స్వచ్ఛతకు పూర్వపు ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయిగా ఉంది. డాలర్‌తో రూపాయి బలహీనపడడంతో స్టాకిస్టులు కొనుగోళ్లకు మొగ్గు చూపించినట్టు ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ తెలిపింది. ''అంతర్జాతీయంగా సానుకూల ధోరణికి తోడు రూపాయి బలహీనతతో బంగారం ధరలు గణనీయంగా పెరిగాయి. అమెరికా విధించిన 50 శాతం టారిఫ్‌ల వల్ల జీడీపీపై ప్రభావం పడుతుందన్న ఆందోళనలు సైతం ధరల పెరుగుదలకు తోడయ్యాయి''అని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ కమోడిటీస్ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు. ఎంసీఎక్స్‌లోనూ అక్టోబర్ కాంట్రాక్టు గోల్డ్ ధర రూ.713 పెరిగి రూ.1,02,813కు చేరుకుంది. మరో వైపు వెండి కిలోకి రూ.1,000 నష్టపోయి రూ.1,19,000 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ఔన్స్‌కు 40 డాలర్ల మేర పెరిగి 3,515 డాలర్ల స్థాయిలో ట్రేడయ్యింది.



జీడీపీ జిగేల్!

జూన్ త్రైమాసికంలో అంచనాలను మించి 7.8 శాతం వృద్ధి
ఐదు త్రైమాసికాల గరిష్ట స్థాయి • వ్యవసాయం, సేవల రంగాల పటిష్ట పనితీరు

న్యూఢిల్లీ: దేశ ఆర్థిక వ్యవస్థ పనితీరు అంచనాలను మించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్ త్రైమాసికం (క్యూ1)లో స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) 7.8 శాతం వృద్ధి సాధించింది. ఇది 5 త్రైమాసికాల గరిష్ఠ స్థాయి కావడం గమనార్హం. 2024 జనవరి-మార్చి క్వార్టర్‌లో వృద్ధి రేటు 8.4 శాతం తర్వాత మళ్లీ గరిష్ఠ స్థాయి ఇదే. ఆర్‌బీఐ అంచనా అయిన 6.5 శాతం మించి వృద్ధి నమోదైంది. వ్యవసాయం, తయారీ రంగాలు బలంగా రాణించడం ఇందుకు దోహదం చేసింది. గత ఆర్థిక సంవత్సరం (2024-25) క్యూ1లో జీడీపీ 6.5% వృద్ధి చెందగా, ఈ ఏడాది మార్చి త్రైమాసికంలో 7.4% వృద్ధి నమోదైంది. జాతీయ గణాంక కార్యాలయం (ఎన్‌ఎస్‌వో) ఈ వివరాలను విడుదల చేసింది. '2025-26 క్యూ1లో స్థిరమైన ధరల ఆధారంగా అసలైన జీడీపీ (జీవీఏ) రూ.47.89 లక్షల కోట్లుగా ఉంటుందని అంచనా. 2024-25 క్యూ1లో ఇది రూ.44.42 లక్షల కోట్లుగా ఉంది. అంటే 7.8% వృద్ధికి సమానం' అని ఎన్‌ఎస్‌వో తెలిపింది.

ఆదుకున్న సాగు, సేవలు..

- ముఖ్యంగా వ్యవసాయ రంగం రాణించింది. 3.7 శాతం వృద్ధి చెందింది. గతేడాది ఇదే త్రైమాసికంలో ఈ రంగంలో వృద్ధి 1.5 శాతమే.
- తయారీ, నిర్మాణ రంగంలో వృద్ధి 7.7%కి పెరిగింది. గత క్యూ1లో ఇది 7.6%.
- సేవల రంగం 9.3 శాతం వృద్ధి చెందింది. గత ఆర్థిక సంవత్సరం క్యూ1లో ఇది 6.8 శాతంగా ఉంది. సేవల విభాగంలో వాణిజ్యం, హోటళ్లు, రవాణా, కమ్యూనికేషన్, ప్రసార సేవలకు సంబంధించి వృద్ధి రేటు గత ఆర్థిక సంవత్సరం క్యూ1లో నమోదైన 5.4 శాతం నుంచి 8.6 శాతానికి పెరిగింది. ఫైనాన్షియల్, రియల్ ఎస్టేట్, వృత్తి సేవలకు సంబంధించి వృద్ధి రేటు 6.6% నుంచి 9.5 శాతానికి పెరిగింది.
- ముఖ్యంగా మైనింగ్ రంగంలో పనితీరు బలహీనపడింది. ఈ రంగంలో వృద్ధి మైనస్ 3.1%గా ఉంది. గతేడాది ఇదే త్రైమాసికంలో మైనింగ్ రంగం 6.6 శాతం వృద్ధి చెందింది.
- ఎగుమతుల వృద్ధి సైతం 6.3 శాతానికి పరిమితమైంది. గతేడాది ఇదే క్వార్టర్‌లో 8.3 శాతం పెరగడం గమనార్హం.
- జూన్ త్రైమాసికంలో చైనా జీడీపీ వృద్ధి 5.2 శాతంగా ఉంది. దీంతో ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ స్థానాన్ని భారత్ నిలబెట్టుకుంది.

2025-26 జీడీపీ అంచనాల్లో మార్పు లేదు..

అమెరికా ప్రతీకార, పెనాల్టీ సుంకాలు విధించినప్పటికీ, క్యూ1లో బలమైన పనితీరు నమోదైన నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి రేటు 6.3-6.8 శాతం మధ్య ఉంటుందన్న మా అంచనాలను యథావిధిగా కొనసాగిస్తున్నాం.

– వి.అనంత నాగేశ్వరన్, కేంద్ర ప్రభుత్వ ముఖ్య ఆర్థిక సలహాదారు

రూపీ.. లోబీపీ

- తొలిసారి డాలర్ మారకంలో 88 కిందికి
- 51 పైసలు పతనమై 88.09 వద్ద ముగింపు
- ఇంట్రాడే, ముగింపులోనూ జీవితకాల కనిష్టం



రూపాయి విలువ తొలిసారి 88 స్థాయిని కోల్పోయింది. డాలర్ మారకంలో 51 పైసలు క్షీణించి జీవితకాల కనిష్ఠం 88.09 వద్ద స్థిరపడింది. భారత్ దిగుమతులపై అమెరికా 50% సుంకాల విధింపు, విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలు, నెలాఖరున డాలర్లకు డిమాండ్ పెరగడం తదితర అంశాలు రూపాయి కోతకు కారణమయ్యాయి. దలాల్ స్ట్రీట్‌లోని ప్రతికూల ధోరణి సైతం ఒత్తిడి పెంచాయి. ఉదయం ఫారెక్స్ మార్కెట్లో రూపాయి ట్రేడింగ్ 87.73 వద్ద మొదలైంది. ఒక దశలో ఏకంగా 61 పైసలు క్షీణించి 88.19 వద్ద ఇంట్రాడే రికార్డు కనిష్టాన్ని తాకింది. అమెరికా భారీ టారిఫ్ విధింపుతో భారత్ వాణిజ్య లోటు మరింత పెరగొచ్చనే ఆందోళనల నేపథ్యంలో రూపాయి ఇంకా క్షీణించవచ్చనేది కరెన్సీ మార్కెట్ నిపుణుల మాట!

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
80,000 కిందికి సెన్సెక్స్
భారత్-రష్యా క్రూడ్ బంధం!

జియో లిస్టింగ్ వచ్చే ఏడాదే..!

- 48వ ఏజీఎంలో ముకేశ్ అంబానీ వెల్లడి
- 50 కోట్లకు కస్టమర్లు: ఆకాశ్ అంబానీ
- జామ్‌నగర్ క్లౌడ్ రీజన్‌కు రెడీ: పిచాయ్
- రిలయన్స్‌తో జేవీ ఏర్పాటు: జుకెర్‌బర్గ్
- రిలయన్స్ రిటైల్ 20% వృద్ధి: ఈషా అంబానీ
- కొత్త ప్రాజెక్టులపై రూ. 75 వేల కోట్ల పెట్టుబడి: అనంత్

వచ్చే ఏడాది(2026) ద్వితీయార్ధంలోగా జియో ప్లాట్‌ఫామ్స్‌ను స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్ట్ చేయనున్నట్లు ఆర్ఐఎల్ చైర్మన్ ముకేశ్ అంబానీ కంపెనీ 48వ ఏజీఎంలో ప్రకటించారు. ఏఐ సంబంధిత భారీ మౌలిక సదుపాయాలతో రిలయన్స్ ఇంటెలిజెన్స్ పేరున కొత్త జేవీకి తెరతీయనున్నట్లు పేర్కొన్నారు. గ్లోబల్ టెక్ దిగ్గజాలు మెటా, గూగుల్‌తో భాగస్వామ్యానికి చేతులు కలిపినట్లు వెల్లడించారు. తద్వారా ప్రతి ఒక్కరికీ ఏఐ, ప్రతి చోటా ఏఐ విజన్‌ను ప్రకటించారు. రిలయన్స్‌తో కలసి జామ్‌నగర్ క్లౌడ్ రీజన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఏజీఎంలో వర్చువల్‌గా పాలుపంచుకున్న గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ వెల్లడించారు. మెటా వ్యవస్థాపకుడు, సీఈవో మార్క్ జుకెర్‌బర్గ్ సైతం రిలయన్స్‌తో భాగస్వామ్య సంస్థ(జేవీ)ను ఏర్పాటు చేయనున్నట్లు తెలియజేశారు. సంస్థ ఓపెన్ సోర్స్ లామా మోడళ్లను జేవీ వినియోగించుకోనున్నట్లు తెలియజేశారు. దేశీ సంస్థలకు ఈ జేవీ గేమ్ చేంజర్‌గా నిలవనున్నట్లు ముకేశ్ పేర్కొన్నారు. రూ. 855 కోట్ల ప్రాథమిక పెట్టుబడితో మెటాతో జేవీకి తెరతీయనున్నారు. జేవీలో ఆర్ఐఎల్‌కు 70 శాతం, మెటాకు 30 శాతం వాటా లభించనుంది.

జియో ప్లాట్‌ఫామ్స్

ఆర్ఐఎల్‌కు టెలికం, డిజిటల్ అనుబంధ సంస్థగా వ్యవహరిస్తున్న జియో ప్లాట్‌ఫామ్స్‌లో ఎంత మేర వాటా విక్రయించేదీ ముకేశ్ వెల్లడించలేదు. ప్రస్తుతం సంస్థలో ఆర్ఐఎల్‌కు 66.3 శాతం వాటా ఉంది. మెటా(ఫేస్‌బుక్) వాటా 10 శాతంకాగా.. గూగుల్ 7.7 శాతం వాటా కలిగి ఉంది. మిగిలిన 16 శాతం వాటా పీఈ దిగ్గజాల చేతిలో ఉంది. ఐపీవోలో 10 శాతం వాటా ఆఫర్ చేయవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కంపెనీ విలువను 136-154 బిలియన్ డాలర్లుగా అంచనా వేశారు. ఈ స్థాయిలో విలువ నమోదైతే ప్రపంచంలోనే ఆరో పెద్ద కంపెనీగా నిలిచే వీలుంది. ఆవిర్భవించిన దశాబ్ద కాలంలో దేశంలోనే అతిపెద్ద టెలికం కంపెనీగా అవతరించిన జియో వినియోగదారుల సంఖ్య 50 కోట్లను దాటినట్లు సంస్థ చీఫ్ ఆకాశ్ అంబానీ వెల్లడించారు.

- జియోఫ్రేమ్స్ పేరుతో జియో స్మార్ట్‌గ్లాస్‌లోకి ప్రవేశించింది. చేతులు వినియోగించకుండా కాల్స్, మ్యూజిక్, వీడియో రికార్డింగ్, ఏఐ వాయిస్ అసిస్టెంట్ తదితరాలను వివిధ భాషలతో నిర్వహించవచ్చు.
- వాల్ట్ డిస్నీ ఇండియా విలీనంతో ఏర్పాటైన జియో హాట్‌స్టార్ రెండో పెద్ద స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌గా నిలిచింది. 34% టీవీ మార్కెట్ వాటా దీని సొంతం.



రిలయన్స్ రిటైల్.. 40,000 కోట్లు

ఆసియాలోకెల్లా అతిపెద్ద ఏకీకృత ఫుడ్ పార్క్‌ల ఏర్పాటుకు రిలయన్స్ రిటైల్ రూ. 40,000 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది. వీటిలో ఏఐ ఆధారిత ఆటోమేషన్, రోబోటిక్స్, సస్టెయినబుల్ టెక్నాలజీలు వినియోగించనున్నట్లు సంస్థ ఈడీ ఈషా అంబానీ పేర్కొన్నారు. మూడేళ్లలో వార్షికంగా ఆదాయంలో 20 శాతం వృద్ధిని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. వచ్చే ఐదేళ్లలో ఎఫ్ఎంసీజీ బిజినెస్(ఆర్‌సీపీఎల్)ను 8 రెట్లు పెంచే ప్రణాళికల్లో ఉంది. తద్వారా ఆదాయాన్ని రూ. లక్ష కోట్లకు చేర్చాలని ఆశిస్తోంది.

ఓ2సీ... భారీ విస్తరణ

ఆయిల్ 2 కెమికల్స్ విభాగంలో కొత్త ప్రాజెక్టులపై రూ. 75,000 కోట్ల పెట్టుబడులు వెచ్చించనున్నట్లు ఆర్ఐఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీ వెల్లడించారు. ఏజీఎంలో తొలిసారి ప్రసంగించారు. 2035కల్లా నికర కర్బన రహిత లక్ష్యాన్ని సాధించేందుకు కట్టుబడి ఉన్నట్లు తెలియజేశారు. మొబిలిటీ విభాగంలో జియో-బీపీ ఇంధన రిటైల్ నెట్‌వర్క్‌ను విస్తరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈవీ చార్జింగ్, బ్యాటరీల స్వాపింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను వేగంగా పెంచుతున్నట్లు అనంత్ తెలియజేశారు.

- న్యూ ఎనర్జీ విభాగం రానున్న 5-7 ఏళ్లలో ఓ2సీ బిజినెస్‌ను అధిగమించనున్నట్లు ముకేశ్ అంబానీ పేర్కొన్నారు. 2028 కల్లా రెట్టింపు ఇబిటాను సాధించే లక్ష్యానికి కట్టుబడి ఉన్నట్లు తెలియజేశారు. 2026 కల్లా బ్యాటరీ గిగా ఫ్యాక్టరీ ఏర్పాటుకు ప్రణాళికలు వేసింది. 2032 కల్లా 3 మిలియన్ టన్నుల గ్రీన్ హైడ్రోజన్ సామర్థ్యంపై కంపెనీ కన్నేసింది.

సాక్షి స్పోర్ట్స్



ప్రపంచ చాంపియన్‌షిప్‌లో అత్యుత్తమ ప్రదర్శన ఇస్తా: నీరజ్ చోప్రా

జ్యూరిక్: డైమండ్ లీగ్ అథ్లెటిక్స్ మీట్ ఫైనల్స్‌లో 85.01 మీటర్లు జావెలిన్ విసిరి రెండో స్థానంలో నిలిచిన భారత స్టార్ నీరజ్ చోప్రా తన ప్రదర్శనపై కొంత అసంతృప్తిని ప్రదర్శించాడు. పూర్తిగా వైఫల్యం అనకపోయినా, తాను మరింత మెరుగ్గా ఆడాల్సిందని అతను వ్యాఖ్యానించాడు. 'జావెలిన్‌ను విసిరే సమయంలో నా రనప్ గానీ టైమింగ్ గానీ బాగా లేవు. సరైన లయను అందుకోలేకపోయాను. నా ప్రదర్శనతో కొన్ని సానుకూలతలు కనిపించినా మొత్తంగా చూస్తే మరింత మెరుగ్గా త్రో చేయాల్సింది. నాకు సంబంధించి ఇది కఠినమైన రోజుగా భావిస్తున్నా. ఇలాంటి స్థితిలోనూ చివరి ప్రయత్నంలో 85 మీటర్లు విసరగలిగాను కానీ నాకు మరింత ప్రాక్టీస్ అవసరం. వరల్డ్ చాంపియన్‌షిప్‌కు మరో మూడు వారాల సమయం ఉంది. ఆలోగా లోపాలు సరిదిద్దుకొని నా అత్యుత్తమ ప్రదర్శన ఇస్తా' అని నీరజ్ చెప్పాడు. టోక్యోలో జరిగే ఈ పోటీల్లో నీరజ్ డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగనున్నాడు.

సింధుకు చుక్కెదురు


క్వార్టర్ ఫైనల్లో ఓడిన భారత స్టార్ షట్లర్



పారిస్: ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ చరిత్రలో ఆరో పతకం సాధించాలని ఆశించిన భారత స్టార్ షట్లర్ పీవీ సింధుకు నిరాశ ఎదురైంది. ఈ మెగా ఈవెంట్‌లో సింధు పోరాటం క్వార్టర్ ఫైనల్లోనే ముగిసింది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 15వ ర్యాంకర్ సింధు 14-21, 21-13, 16-21తో ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్ పుత్రి కుసుమవర్ధిని (ఇండోనేసియా) చేతిలో ఓడిపోయింది. ఒకవేళ ఈ మ్యాచ్‌లో సింధు గెలిచి ఉంటే సెమీఫైనల్ చేరుకొని కనీసం కాంస్య పతకాన్ని ఖాయం చేసుకునేది. గతంలో సింధు ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఐదు పతకాలు (స్వర్ణం-2019, రెండు రజతాలు-2017, 2018, రెండు కాంస్యాలు-2013, 2014) సాధించింది. గతంలో కుసుమవర్ధినిపై రెండుసార్లు గెలుపొంది, రెండుసార్లు ఓడిపోయిన సింధుకు ఐదోసారి పరాజయమే ఎదురైంది. 64 నిమిషాలపాటు జరిగిన క్వార్టర్ ఫైనల్ పోరులో సింధు ఆటతీరులో నిలకడ కనిపించలేదు. తొలి గేమ్‌లో స్కోరు 6-6 వద్ద కుసుమవర్ధిని చెలరేగి వరుసగా నాలుగు పాయింట్లు నెగ్గి 10-6తో ఆధిక్యంలోకి వెళ్లింది. అదే జోరులో తొలి గేమ్‌ను సొంతం చేసుకుంది. రెండో గేమ్‌లో సింధు పుంజుకుంది. స్కోరు 4-3 వద్ద సింధు విజృంభించి వరుసగా ఆరు పాయింట్లు సాధించి 10-3తో ముందంజ వేసింది. ఆ తర్వాత మూడు పాయింట్లు కోల్పోయిన సింధు... 10-6 వద్ద మళ్లీ చెలరేగి వరుసగా ఆరు పాయింట్లు సాధించి 16-6తో పది పాయింట్ల ఆధిక్యంలోకి వెళ్లింది. అదే క్రమంలో రెండో గేమ్‌ను నెగ్గి మ్యాచ్‌లో నిలిచింది. నిర్ణాయక మూడో గేమ్‌లో సింధు ఒత్తిడికి లోనైంది. స్కోరు 5-4 వద్ద 59 షాట్‌ల ర్యాలీలో కుసుమవర్ధిని షటిల్‌ను నెట్‌కు కొట్టడంతో పాయింట్ నెగ్గిన సింధు 6-4తో ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే ఈ స్వల్ప ఆధిక్యాన్ని సింధు కాపాడుకోలేకపోయింది. స్కోరును 7-7 వద్ద సమం చేసిన కుసుమవర్ధిని... ఆ తర్వాత స్కోరు 12-11 వద్ద ఇండోనేసియా ప్లేయర్ వరుసగా మూడు పాయింట్లు నెగ్గి 15-11తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఒకదశలో సింధు తేరుకొని ఆధిక్యం అంతరాన్ని ఒక పాయింట్‌కు తగ్గించినా స్కోరు 17-16 వద్ద కుసుమవర్ధిని అద్భుత ఆటతీరుతో వరుసగా నాలుగు పాయింట్లు గెలిచి విజయాన్ని అందుకుంది. మరోవైపు మిక్స్‌డ్ డబుల్స్‌లోనూ తనీషా క్రాస్టో-ధ్రువ్ కపిల (భారత్) జోడీ నిష్క్రమించింది. క్వార్టర్ ఫైనల్లో తనీషా-ధ్రువ్ 15-21, 13-21తో ప్రపంచ నాలుగో ర్యాంక్ చెన్ టాంగ్ జియె-తో ఈ వె (మలేసియా) జంట చేతిలో ఓడిపోయింది.


హర్మన్‌ప్రీత్ 'హ్యాట్రిక్'

- ఆసియా కప్ హాకీ టోర్నీలో భారత్ శుభారంభం
- తొలి మ్యాచ్‌లో చైనాపై 4-3 గోల్స్‌తో విజయం



రాజ్‌గిర్ (బిహార్): అంచనాలకు తగ్గట్టు ఆడకపోయినా... ఆసియా కప్ పురుషుల హాకీ టోర్నమెంట్‌లో భారత జట్టుకు శుభారంభం లభించింది. శుక్రవారం మొదలైన ఈ టోర్నీలో భాగంగా జరిగిన పూల్ 'ఎ' లీగ్ మ్యాచ్‌లో టీమిండియా 4-3 గోల్స్ తేడాతో చైనా జట్టును ఓడించింది. భారత జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ (20వ, 33వ, 47వ నిమిషాల్లో) 'హ్యాట్రిక్' నమోదు చేసి జట్టు విజయంలో ముఖ్యపాత్ర పోషించాడు. మరో గోల్‌ను జుగ్‌రాజ్ సింగ్ (18వ నిమిషంలో) అందించాడు. చైనా తరఫున షిహావో డు (12వ నిమిషంలో), బెన్‌హాయ్ చెన్ (35వ నిమిషంలో), జీషెంగ్ గావో (41వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. ఈ మ్యాచ్‌లో నమోదైన మొత్తం ఏడు గోల్స్ పెనాల్టీ కార్నర్‌ల ద్వారానే రావడం విశేషం. హర్మన్‌ప్రీత్ సింగ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. హర్మన్‌ప్రీత్‌కు 200 డాలర్ల చెక్‌ను హాకీ ఇండియా అధ్యక్షుడు దిలీప్ టిర్కీ అందజేశారు. తమకంటే తక్కువ ర్యాంక్ ఉన్న చైనాపై భారత్ భారీ విజయం సాధిస్తుందని ఆశించినా... ప్రత్యర్థి జట్టు నుంచి ఊహించని ప్రతిఘటన ఎదురైంది. భారత జట్టు తమకు లభించిన 11 పెనాల్టీ కార్నర్‌లో కేవలం నాలుగింటిని మాత్రమే సద్వినియోగం చేసుకుంది. చైనా జట్టుకు ఆరు పెనాల్టీ కార్నర్‌లు రాగా, మూడింటిని లక్ష్యానికి చేర్చింది. తొలి రోజు జరిగిన ఇతర లీగ్ మ్యాచ్‌ల్లో మలేసియా 4-1తో బంగ్లాదేశ్ జట్టుపై... డిఫెండింగ్ చాంపియన్ దక్షిణ కొరియా 7-0తో చైనీస్ తైపీపై... జపాన్ 7-0తో కజకిస్తాన్‌పై విజయం సాధించాయి. నేడు జరిగే మ్యాచ్‌ల్లో చైనీస్ తైపీతో బంగ్లాదేశ్; మలేసియాతో దక్షిణ కొరియా తలపడతాయి. భారత జట్టు తమ తదుపరి మ్యాచ్‌ను ఆదివారం జపాన్ జట్టుతో ఆడుతుంది.

అల్‌కరాజ్ జోరు



న్యూయార్క్: యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ పురుషుల సింగిల్స్ విభాగంలో ప్రపంచ రెండో ర్యాంకర్ అల్‌కరాజ్ (స్పెయిన్) ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. శుక్రవారం జరిగిన మూడో రౌండ్ మ్యాచ్‌లో అల్‌కరాజ్ 6-2, 6-4, 6-0తో ప్రపంచ 34వ ర్యాంకర్ లూసియానో దర్దెరి (ఇటలీ)పై అలవోకగా గెలిచాడు. 1 గంట 44 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో అల్‌కరాజ్ తొమ్మిది ఏస్‌లు సంధించాడు. ప్రత్యర్థి సర్వీస్‌ను ఏడుసార్లు బ్రేక్ చేశాడు. టాప్ సీడ్ యానిక్ సినెర్ (ఇటలీ), మూడో సీడ్ జ్వెరెవ్ (జర్మనీ), పదో సీడ్ ముసెట్టి (ఇటలీ) మూడో రౌండ్‌లోకి అడుగు పెట్టగా... తొమ్మిదో సీడ్ ఖచనోవ్ (రష్యా) రెండో రౌండ్‌లోనే వెనుదిరిగాడు. మరోవైపు మహిళల సింగిల్స్‌లో రిబాకినా (కజకిస్తాన్) కూడా ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరింది. మూడో రౌండ్‌లో రిబాకినా 6-1, 6-2తో 2021 చాంపియన్ ఎమ్మా రాడుకాను (బ్రిటన్)పై గెలుపొందింది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

తజికిస్తాన్‌పై భారత్ విజయం

హిసోర్ (తజికిస్తాన్): సెంట్రల్ ఏషియా ఫుట్‌బాల్ అసోసియేషన్ (సీఏఎఫ్ఏ) నేషన్స్ కప్ టోర్నమెంట్‌లో భారత జట్టు శుభారంభం చేసింది. ఆతిథ్య తజికిస్తాన్ జట్టుతో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో భారత జట్టు 2-1తో నెగ్గింది. భారత్ తరఫున అన్వర్ అలీ (5వ నిమిషంలో), సందేశ్ జింగాన్ (13వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. తజికిస్తాన్ జట్టుకు సమియెవ్ (23వ నిమిషంలో) ఏకైక గోల్ అందించాడు. భారత గోల్‌కీపర్ గుర్‌ప్రీత్ సింగ్ అడ్డుగోడలా నిలబడి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. స్వదేశీ కోచ్ ఖాలిద్ జమీల్ ఆధ్వర్యంలో ఆడిన తొలి మ్యాచ్‌లోనే భారత్‌కు విజయం దక్కడం విశేషం. భారత్ తమ తదుపరి మ్యాచ్‌ను ఆదివారం ఇరాన్‌తో ఆడుతుంది.

టైటాన్స్ ఓటమితో మొదలు

తొలి పోరులో తలైవాస్ విజయం • వైజాగ్‌లో ప్రొ కబడ్డీ లీగ్ ఆరంభం



విశాఖ స్పోర్ట్స్: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) కొత్త సీజన్‌ను కూడా తెలుగు టైటాన్స్ పరాజయంతో ప్రారంభించింది. గత సీజన్‌లో ఏడో స్థానంలో నిలిచిన టీమ్ ఈసారి విశాఖపట్నం వేదికగా కూడా శుభారంభం చేయలేకపోయింది. శుక్రవారం ప్రారంభమైన పీకేఎల్ 12వ సీజన్ తొలి మ్యాచ్‌లో తమిళ్ తలైవాస్ 38-35 పాయింట్ల తేడాతో తెలుగు టైటాన్స్‌ను ఓడించింది. టైటాన్స్ తరఫున ఆల్‌రౌండర్ భరత్ 11 పాయింట్లు సాధించగా, కెప్టెన్ విజయ్ మలిక్ 6 పాయింట్లు నమోదు చేశాడు. తలైవాస్ జట్టులో రైడర్ అర్జున్ దేశ్వాల్ 12 పాయింట్లతో టాప్ స్కోరర్‌గా నిలవగా, కెప్టెన్ పవన్ సెహ్రావత్ చెలరేగి 9 పాయింట్లతో జట్టును విజయం దిశగా నడిపించాడు. తొలి అర్ధభాగం ముగిసేసరికి తలైవాస్ జట్టు 14-13తో ఆధిక్యంలో నిలవగా, రెండో అర్ధ భాగంలోనూ రెండు పాయింట్లు ముందంజలో నిలిచిన జట్టు చివరి వరకు దానిని నిలబెట్టుకుంది. మొదటి రోజే జరిగిన రెండో మ్యాచ్‌లో 'టైబ్రేక్' ద్వారా ఫలితం వచ్చింది. బెంగళూరు బుల్స్, పుణేరి పల్టన్ మధ్య జరిగిన ఈ పోరు నిర్ణీత సమయంలో 32-32తో సమంగా ముగిసింది. బుల్స్ తరఫున ఆకాశ్ షిండే 12, ఆశిష్ మలిక్ 8 పాయింట్లు సాధించగా... పల్టన్ ఆటగాళ్లలో ఆదిత్య షిండే 9, పంకజ్ మోహితే 6 పాయింట్లు నమోదు చేశారు. అయితే ఆ తర్వాత పుణేరీ 'టైబ్రేక్'లో విజయం సాధించింది. ఐదు రైడ్‌ల ఈ టైబ్రేక్‌ను పల్టన్ 6-4తో గెలుచుకుంది. నేడు జరిగే మ్యాచ్‌ల్లో యూపీ యోధాస్‌తో తెలుగు టైటాన్స్ (రాత్రి 8 గంటల నుంచి), గుజరాత్ జెయింట్స్‌తో యు ముంబా (రాత్రి 9 గంటల నుంచి) తలపడతాయి.



రూ.1.53 కోట్ల కరెన్సీతో అలంకరణ

వరంగల్ శివనగర్‌లోని వాసవి కాలనీలో వినాయక ట్రస్టు ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన మట్టి విఘ్నేశ్వరుడిని శుక్రవారం రాత్రి కోటీ యాభై మూడు లక్షల, నూట పదహారు రూపాయల కరెన్సీతో అలంకరించారు. సుమారు 200 మందికిపైగా ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రతినిధులు, కాలనీవాసులు ఈ కరెన్సీని అందజేశారు. ఈ కార్యక్రమంలో వినాయక ట్రస్టు భవనం అధ్యక్షుడు సాదుల దామోదర్, కార్యదర్శి మంచాల కృష్ణమూర్తి, కోశాధికారి రావికంటి అశోక్ పాల్గొన్నారు.

– ఖిలా వరంగల్

రోడ్లన్నీ గుంతలు.. వాహనాలు గంతులు

రోడ్డునపడ్డ చంద్రబాబు కూటమి ప్రభుత్వ బండారం

రహదారులు బాగు చేస్తామన్న హామీలన్నీ నీటి మూటలే



అధ్వానంగా ఉన్న ఏలూరు వంగాయగూడెం సెంటర్ నుంచి కేన్సర్ ఆసుపత్రికి వెళ్లే రహదారి

- చిన్నపాటి వర్షానికే ఛిద్రమైన రోడ్లు ఏపీలో ఊరూరా అదే దుస్థితి
- కొన్ని రోడ్లపై ద్విచక్ర వాహనాలు సైతం వెళ్లలేని పరిస్థితి
- 27,141 కిలోమీటర్ల మేర గ్రామీణ రోడ్లలో సగానికి సగం దెబ్బతిన్న వైనం

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఇన్వెస్ట్‌మెంట్ మోసంలో రూ. 3.3 కోట్లు స్వాహా

సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి సైబర్ నేరగాళ్ల టోకరా

సాక్షి, హైదరాబాద్: స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడుల పేరుతో ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగి నుంచి రూ.3.3 కోట్లు దోచుకున్నారు సైబర్ కేటుగాళ్లు. టెలిగ్రామ్‌లో ఫేక్ ట్రేడింగ్ లింకులు పంపి.. అత్యధిక లాభాలు ఆశజూపి మోసగించినట్టు బాధితుడు శుక్రవారం టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరోలో ఫిర్యాదు చేశారు. హైదరాబాద్ చందానగర్‌కు చెందిన ఆడబాల శ్రీనివాస్ హైటెక్ సిటీలోని ఓ ఐటీ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఈనెల 1న షేర్ మార్కెట్ ఇన్వెస్ట్‌మెంట్స్ పేరుతో ఉన్న 'వీఐపీ 263' టెలిగ్రామ్‌లో గుర్తు తెలియని వ్యక్తులు యాడ్ చేశారు. ఇందులో డార్లెన్ 988 యూజర్ పేరుతో ఉన్న మహిళతో శ్రీనివాస్‌ను కాంటాక్ట్ చేసింది. http://stock.durocapital. net పేరుతో వెబ్‌సైట్ లింకు పంపి, ఈ సైట్‌లో ఇన్వెస్ట్‌మెంట్ చేయాలని సూచించింది. దీంతో శ్రీనివాస్ మొదటి విడతగా రూ.50 వేలు ట్రాన్స్‌ఫర్ చేశాడు. ఇందుకు గాను శ్రీనివాస్ ట్రేడింగ్ అకౌంట్‌లో 6.62 శాతం ప్రాఫిట్ వచ్చినట్లు చూపారు. లాభాలు వస్తున్నాయన్న ఆశతో శ్రీనివాస్ పెట్టుబడి పెట్టడం మొదలు పెట్టాడు. ఈ క్రమంలో కమీషన్లు, వివిధ ట్యాక్స్‌ల పేరుతో ఈనెల 28 వరకు మొత్తం రూ.3,30,40,006 కోట్లు వసూలు చేశారు. విత్‌డ్రా చేసుకునే అవకాశం లేకపోవడంతో బాధితుడు మోసపోయానని గుర్తించి సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు ఫిర్యాదు చేశారు. డీఎస్పీ కేవీఎం ప్రసాద్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గణపతి పూజ కోసం పూజారి కిడ్నాప్

సిద్దిపేట జిల్లా కోహెడలో ఘటన



కోహెడలో మంటపం నుంచి పూజారిని బైక్‌పై బలవంతంగా తీసుకెళ్తున్న యువకులు.


కోహెడ (హుస్నాబాద్): గణపతి నవరాత్రులు వచ్చాయంటే పూజారులకు క్షణం తీరిక ఉండదు. పూజల కోసం ప్రజలు ముందుగానే పూజారులతో మాట్లాడుకుంటారు. ఒక్కో పూజారి నాలుగైదు మంటపాల వద్ద గణపతి పూజలు నిర్వహిస్తూ ఉంటారు. అయితే, తమ మంటపంలో పూజలు చేయటానికి పూజారి దొరక్కపోవటంతో కొందరు యువకులు ఓ పూజారిని ఎత్తుకెళ్లిన ఘటన సిద్దిపేట జిల్లా కోహెడలో చోటుచేసుకుంది. హుస్నాబాద్ మండల కేంద్రంలో పద్మశాలి సంఘం వద్ద ఏర్పాటు చేసిన వినాయక మంటపం వద్ద బుధవారం పూజ పూర్తయిన వెంటనే విశ్వబ్రాహ్మణ కాలనీ, పోచమ్మ కాలనీ, గ్రామ పంచాయతీ కాలనీ, ధర్మసాగర్‌పల్లి తదితర ప్రాంతాల యువకులు ఒకేసారి వచ్చి తమ పంటపం వద్ద పూజ చేయాలని పూజారి కనకయ్యను చుట్టుముట్టారు. పోటీ పెరగటంతో యువకుల మధ్య వాగ్వివాదం, తోపులాట జరిగింది. ఈ నేపథ్యంలో విశ్వబ్రాహ్మణ కాలనీకి చెందిన యువకులు పూజారిని బలవంతంగా బైక్‌పై ఎక్కించుకొని తీసుకెళ్లారు. ఈ ఘటన సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.



దేశంలో ప్రతి 10 ఓపెన్ జనరేటివ్ ఏఐ ఉద్యోగాలకు.. అర్హత కలిగిన ఇంజనీర్ ఒక్కరే అందుబాటులో ఉన్నారు. భారత్‌లాంటి వేగంగా విస్తరిస్తున్న డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో.. ఈ నిపుణుల కొరత ముందరి కాళ్లకు బంధంలాంటిదని నిపుణులు అంటున్నారు. దేశంలో ఏఐ విస్తరణలో ఆదిలో హంసపాదులా ఉన్న ఈ అడ్డంకి తొలగాలంటే భారీగా నిపుణులు తయారుకావాల్సి ఉంది. లేదంటే 2026 నాటికి ఏఐ రంగంలో డిమాండ్-సరఫరా మధ్య అంతరం మరింత పెరగనుంది.

పెద్ద ఎత్తున నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయకపోతే కంపెనీల పనితీరుపై ప్రభావం పడుతుందని స్టాఫింగ్ కంపెనీ 'టీమ్‌లీజ్ డిజిటల్' తన 'డిజిటల్ స్కిల్స్, సాలరీ ప్రైమర్ 2025–26' నివేదికలో పేర్కొంది. టెక్నాలజీ రంగంలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న 30,000 రోల్స్ ఆధారంగా ఈ నివేదికను రూపొందించింది. భారత ఏఐ విపణి ఈ ఏడాది చివరికల్లా రూ.2,54,246 కోట్లకు చేరుకోనుంది. ఏటా 45% వృద్ధి చెందుతోంది. క్లౌడ్ కంప్యూటింగ్‌లో కూడా రెండేళ్లలో 55–60% నిపుణుల కొరత ఎదుర్కోవలసి ఉంటుందని అంచనా.

పదిలో ఒకరే!



ఓపెన్ జెన్-ఏఐ నిపుణులకు భారీ కొరత

2026 నాటికి సరఫరా అంతరం 53%

దీంతో భారీగా పెరుగుతున్న వేతనాలు

సీనియర్ టెకీలకు ప్రీమియం జీతాలు!

జీసీసీల హవా

టెక్నాలజీ రంగంలో నియామకాలను గ్లోబల్ కేపబిలిటీ సెంటర్స్ (జీసీసీ) భారీగా నడిపిస్తున్నాయి. 2025లో ఏఐ, క్లౌడ్ విభాగంలో నూతన టెక్ ఉద్యోగాలలో జీసీసీల వాటా 22–25% ఉండే అవకాశం ఉంది. 2027 నాటికి అంచనా వేసిన 47 లక్షల కొత్త టెక్ ఉద్యోగాలలో.. 12 లక్షలకు పైగా జీసీసీలు నియమించుకోనున్నాయి. జెన్-ఏఐ, ఇంజనీరింగ్ ఆర్ అండ్ డీ రోల్స్ వీటిలో ప్రధానం. జీసీసీల నియామకాలు మెట్రోలను దాటి ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లోని ఇంజనీరింగ్ క్యాంపస్‌లకు కూడా విస్తరిస్తున్నాయి. 2024–25లో ఈ సెంటర్స్ 1.4 లక్షల మంది కొత్త గ్రాడ్యుయేట్లను నియమించుకున్నాయి.

ఆ రెండు రోల్స్‌లో..

భారత్‌లోని టాప్ – 20 జీసీసీల్లో 40% మంది మహిళలు ఉన్నారు. ఇది పరిశ్రమ సగటు కంటే 1.5 రెట్లు ఎక్కువ. జీసీసీల్లో మొత్తం 21.6 లక్షల మంది నిపుణులు ఉన్నారు. వీరి సంఖ్య 2030 నాటికి 30 లక్షలకు చేరొచ్చు.

డిమాండ్‌కు తగ్గట్టుగా సరఫరా లేకపోవడం.. సాంకేతిక రోల్స్‌లో వేగంగా వేతనాల పెరుగుదలకు కారణమవుతోంది. ఏటా 18% పెరుగుదలతో జెన్ ఏఐ ఇంజనీరింగ్, మెషీన్ లెర్నింగ్ ఆపరేషన్స్ రోల్స్‌లో ఉన్న సీనియర్ నిపుణులు ఏటా రూ.58–60 లక్షల జీతాలను అందుకుంటున్నారు.

వార్షిక వేతనం అంచనా

2024–25తో పోలిస్తే 2026–27 నాటికి సగటు వార్షిక వేతనం సైబర్ సెక్యూరిటీ రోల్స్‌కు రూ.28 లక్షల నుంచి రూ.33.5 లక్షలకు పెరగొచ్చు. డేటా ఇంజనీరింగ్ రోల్స్‌కు రూ.23 లక్షల నుంచి రూ.27 లక్షలకు పెరిగే అవకాశం ఉంది.

సీనియర్ సైబర్ సెక్యూరిటీ నిపుణులు	సీనియర్ డేటా ఇంజనీరింగ్ నిపుణులు	సీనియర్ క్లౌడ్ ఆర్కిటెక్ట్‌లు
రూ.55 లక్షలు	రూ.42 లక్షలు	రూ.45 లక్షలు

ఫ్రెషర్లకూ అవకాశాలు

భారత్‌లో ఐటీ ఉత్పత్తులు, సేవల రంగంలో నియామకాలు 2025–26లో 11% వృద్ధి చెందుతాయని అంచనా. లక్షన్నరకుపైగా ఫ్రెషర్లకు అవకాశాలు ఉండొచ్చు. ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్ జాబ్స్‌లో సీనియర్లకు జీతాలు 29% పెరిగి 2026–27 నాటికి రూ.42 లక్షలకు, క్లౌడ్ కంప్యూటింగ్ రోల్స్‌లో 20% పెరుగుతాయని అంచనా. జెన్-ఏఐ రోల్స్‌లో సీనియర్లకు రూ.28 లక్షల నుంచి రెండేళ్లలో రూ.33.5 లక్షలకు చేరనున్నాయి. డిజిటల్ వినియోగం పెరుగుతుండడం; తయారీ, రిటైల్, ఆరోగ్య సంరక్షణ వంటి రంగాలు.. ఏఐ, క్లౌడ్, సైబర్ సెక్యూరిటీ నిపుణుల కోసం భారీగా నియామకాలు చేపడుతుండటంతో కొత్త అవకాశాలు రానున్నాయి.

మెట్రోల్లో కాస్త ఎక్కువ


నగరాలను బట్టి వేతనాల్లో వ్యత్యాసాలున్నాయి. బెంగళూరు, ముంబై, హైదరాబాద్ వంటి మెట్రోలలో మధ్య స్థాయి ఏఐ నిపుణులు సంవత్సరానికి రూ.12–12.7 లక్షలు అందుకుంటున్నారు.

- పుణే, గురుగ్రామ్ వంటి ప్రథమ శ్రేణి నగరాల్లో రూ.10–12 లక్షలు పొందుతున్నారు.
- విభిన్న ప్రాంతాల నుంచి కార్యకలాపాలను సాగించాలని భావించే కంపెనీలకు చిన్న నగరాలు తక్కువ ఖర్చుతో కూడిన అవకాశాలను సృష్టిస్తున్నాయి.

దేశవ్యాప్తంగా ఏఐ నియామకాలలో జీసీసీల వాటా 30-35%గా ఉంది.	2027 నాటికి 47 లక్షల కొత్త టెక్ ఉద్యోగాలలో.. 12 లక్షలకు పైగా జీసీసీలు నియమించుకుంటాయని అంచనా.	జెన్-ఏఐ రోల్స్‌లో సీనియర్లకు రూ.28 లక్షల నుంచి రెండేళ్లలో రూ.33.5 లక్షలకు చేరనున్నాయి.	జీసీసీల నియామకాలు మెట్రోలను దాటి ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లోని ఇంజనీరింగ్ క్యాంపస్‌లకు కూడా విస్తరిస్తున్నాయి.	2024-25లో ఈ సెంటర్స్ 1.4 లక్షల మంది కొత్త గ్రాడ్యుయేట్లను నియమించుకున్నాయి.

'బంజారా'లకు ఎస్టీ హోదాపై సుప్రీంకోర్టు నోటీసులు

- ఈ అంశంపై సమాధానం ఇవ్వాలని కేంద్ర, రాష్ట్రాలకు ఆదేశం
- తదుపరి విచారణ సెప్టెంబర్ 9కి వాయిదా



సాక్షి, న్యూఢిల్లీ: బంజారా, లంబాడా, సుగాలీలకు ఎస్టీ హోదా కల్పించడంపై సుప్రీంకోర్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. ఈ అంశంపై తమకు సమాధానం ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొంది. తదుపరి విచారణకు వచ్చే సరికి పూర్తి సమాచారాన్ని తమ ముందు ఉండాలని ఆదేశించింది. ఈ మూడు వర్గాలకు ఎస్టీ జాబితాలో చోటు కల్పించడంపై శుక్రవారం జస్టిస్ జె.కె.మహేశ్వరి, జస్టిస్ విజయ్ బిష్ణోయ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాదులు దామా శేషాద్రి, రమేశ్ అల్లంకిలు వాదనలు వినిపించారు. లంబాడా, సుగాలీ, బంజారాలను ఎస్టీ జాబితాలో చేర్చడం ఆర్టికల్ 342కు వ్యతిరేకమని పేర్కొన్నారు. ఈ వర్గాలు విద్యా, ఆర్థిక రంగాల్లో ఎస్టీ జాబితాలోని ఇతర వర్గాలకంటే అభివృద్ధి చెందాయని బెంచ్ దృష్టికి తీసుకెళ్లారు. దీని వల్ల నిజమైన ఆదివాసీలకు అన్యాయం జరుగుతోందని అన్నారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకొన్న ధర్మాసనం.. దీనిపై సమాధానం ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను సెప్టెంబర్ 9కి వాయిదా వేసింది.

ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి..

కాగా, ఈ మూడు వర్గాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని కోరుతూ భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, మాజీ ఎంపీ సోయం బాపూరావు, మరికొందరు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది అల్లంకి రమేశ్ ఈ ఏడాది జూలై 24న సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. బంజారా, లంబాడా, సుగాలీలు గిరిజనులు కాదని, 1976 వరకు ఉమ్మడి ఏపీలోని తెలంగాణ జిల్లాల్లో వారిని ఎస్టీలుగా పరిగణించలేదని, ఇతర రాష్ట్రాల నుంచి వారు తెలంగాణకు వలస వచ్చి ఇక్కడి అసలైన గిరిజనుల హక్కులను కొల్లగొట్టారని పిటిషన్‌లో ఆరోపించారు. అంతకు ముందు వారు బీసీ జాబితాలో ఉన్నారని గుర్తు చేశారు. హైదరాబాద్ రాష్ట్రం భారత యూనియన్‌లో విలీనమైన సందర్భంలో ఆంధ్రా ప్రాంతం మద్రాసు రాష్ట్రంలో ఉందని, ఆ సమయంలో లంబాడా, సుగాలీలను ఏపీ ప్రాంతంలో ఎస్టీలుగా గుర్తించారని తెలిపారు. కానీ హైదరాబాద్ స్టేట్‌లో కాదని స్పష్టం చేశారు. తర్వాతి కాలంలో రాష్ట్ర ప్రభుత్వం ఆ మూడు వర్గాలను ఎస్టీ జాబితాలో చేర్చిందని వివరించారు. ఇప్పుడు మళ్లీ తెలంగాణ, ఏపీలు రెండు రాష్ట్రాలుగా విడిపోయినందున తెలంగాణలోని బంజారా, లంబాడా, సుగాలీలను తిరిగి బీసీ జాబితాలో చేర్చేలా ఆదేశాలు జారీ చేయాలని పిటిషన్‌లో అభ్యర్థించారు.

కోలుకుంటున్నా.. ధైర్యంగా ముందుకెళ్తున్నా..

'ఎక్స్'లో పోస్ట్ చేసిన సీనియర్ ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్



సాక్షి, హైదరాబాద్: 'నన్ను బాధించిన 'వెర్టిబ్రల్ ఆర్టరీ డిసెక్షన్' నుంచి కొన్నినెలలుగా నెమ్మదిగా కోలుకుంటున్నా... కష్టంగా అనిపించినా, ధైర్యాన్ని పెంచుకుంటూ ఒక్కోరోజును ముందుకు తీసుకెళ్తున్నా' అని సీనియర్ ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె శుక్రవారం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'మన జీవితంలో నిశ్శబ్దంగా గడిచే కాలాలు చాలాసార్లు మనతోనే గట్టిగా మాట్లాడతాయి' అని వేదాంత ధోరణిలో పెట్టిన ఈ పోస్టు చర్చనీయాంశమైంది. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే స్మితా సబర్వాల్ కొద్దిరోజులుగా వెర్టిబ్రల్ ఆర్టరీ డిసెక్షన్ అనే సమస్యతో బాధపడుతున్న విషయాన్ని ఆమె ఈ సందర్భంగా వెల్లడించారు. మెదడుకు రక్తాన్ని సరఫరా చేసే ముఖ్యమైన రక్తనాళాల్లో వెర్టిబ్రల్ ఆర్టరీ ఒకటని, రక్త సరఫరా ఆగిపోతే బ్రెయిన్ స్ట్రోక్ వచ్చే అవకాశం ఉంటుందని వైద్యనిపుణులు చెబుతున్నారు.

రోడ్డు ప్రమాదాల్లో 8వ స్థానంలో రాష్ట్రం

సాక్షి, న్యూఢిల్లీ: రోడ్డు ప్రమాదాల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు టాప్–10లో నిలిచాయి. దేశవ్యాప్తంగా జరిగిన ప్రమాదాల్లో ఈ రెండు రాష్ట్రాల్లో గణనీయ సంఖ్యలో మరణాలు సంభవించినట్లు 'రోడ్ యాక్సిడెంట్స్ ఇన్ ఇండియా–2023' నివేదికలో తేలింది. రోడ్డు ప్రమాదాల్లో ఆంధ్రప్రదేశ్ 7వ స్థానంలో ఉండగా, తెలంగాణ 8వ స్థానంలో నిలిచింది. ఇక మరణాల్లోనూ టాప్–10లో ఈ రెండు రాష్ట్రాలు ఉండటం గమనార్హం. 9వ స్థానంలో ఆంధ్రప్రదేశ్ ఉండగా, పదో స్థానంలో తెలంగాణ ఉన్నట్లు నివేదిక స్పష్టం చేసింది. దేశంలో రోడ్డు ప్రమాదాలకు సంబంధించి శుక్రవారం కేంద్ర రోడ్డు, రవాణా శాఖ 'రోడ్ యాక్సిడెంట్స్ ఇన్ ఇండియా– 2023' రిపోర్ట్‌ను విడుదల చేసింది. దేశంలో అత్యధిక ప్రమాదాలు జరిగిన రాష్ట్రాల జాబితాలో తమిళనాడు (67,213) మొదటి స్థానంలో ఉండగా, 55,327 ప్రమాదాలతో మధ్యప్రదేశ్, 48,091 ప్రమాదాలతో కేరళ తర్వాతి స్థానాల్లో నిలిచాయి. ఆంధ్రప్రదేశ్‌లో 2023లో 8,272 రోడ్డు ప్రమాదాలు జరిగినట్లు నివేదిక చెబుతోంది. ఇక ప్రమాదాల్లో తెలంగాణ 8వ స్థానంలో ఉండగా, ప్రమాద మరణాల్లో 10వ స్థానంలో నిలిచింది. ఈ యాక్సిడెంట్లలో 7,660 మంది ప్రాణాలు కోల్పోయినట్లు కేంద్రం వెల్లడించింది.

త్వరలో నూతన సాంకేతికతతో చేయూత పింఛన్లు



సాక్షి, హైదరాబాద్: ఆధునిక సాంకేతికతతో చేయూత పింఛన్ల పంపిణీని పూర్తిస్థాయిలో చేపట్టేందుకు రంగం సిద్ధమైంది. ఇప్పటి వరకు పింఛన్ దారుల ధ్రువీకరణకు 2–జీ ఆధారిత ఫింగర్ ప్రింట్ పరికరాలను వినియోగిస్తూ వస్తున్నారు. ఇప్పుడు వాటి స్థానంలో ఆధునిక సాంకేతికతతో కూడిన ఆధార్ ఆధారిత ముఖ గుర్తింపు సాఫ్ట్‌వేర్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ కొత్త విధానం ద్వారా సరైన వ్యక్తికి – సరైన పింఛన్ – సరైన సమయంలో' అందనుంది. ప్రస్తుతం 5–జీ ఆధారిత ఎల్1 ఫింగర్ ప్రింట్ పరికరాలు, కొత్త మొబైల్ ఫోన్లను పీఆర్‌శాఖ కొనుగోలు చేసింది. ప్రయోగాత్మకంగా కొన్ని జిల్లాల్లో ఈ పరికరాలను వినియోగించాక ఆశించిన ఫలితాలు రావడంతో రాష్ట్ర వ్యాప్తంగా దీనిని విస్తరించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా 6,300 బ్రాంచ్ పోస్టు మాస్టర్లకు స్మార్ట్ మొబైల్ ఫోన్లు, పరికరాలు పంపిణీ చేయనున్నారు. ఈ స్మార్ట్ మొబైల్ ఫోన్ల పరికరాల పంపిణీ కార్యక్రమాన్ని... శుక్రవారం ములుగు జిల్లాలోని పస్రా కేంద్రంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క లాంఛనంగా ప్రారంభించారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.

మనసుదోచే అందాలు

మహబూబాబాద్ జిల్లా బయ్యారం సమీపంలోని పాండవులగుట్ట పైభాగం నుంచి కిందికి చూస్తే పచ్చదనం పరుచుకున్నట్లు ప్రకృతి అందాలు కనువిందు చేస్తున్నాయి. పచ్చని పొలాల నడుమ అక్కడక్కడ చిన్నగా కనిపిస్తున్న గ్రామాలు.. చూపరుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి.

- బయ్యారం



మత్స్యశాఖనే ఫిష్ పాండ్‌లు అభివృద్ధి చేయాలి

సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాసిన ఎఫ్‌జీజీ



సాక్షి, హైదరాబాద్: టెండర్లు వేసి ప్రైవేటు వ్యక్తుల నుంచి చేప పిల్లలు కొనకుండా మత్స్యశాఖనే చేప పిల్లల పెంపకం కోసం ఫిష్‌పాండ్‌లు అభివృద్ధి చేయాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ (ఎఫ్‌జీజీ) కోరింది. దీంతో అవినీతి, అన్ని రకాల చేప పిల్లలను పెంచుకునే అవకాశం ఉంటుందని తెలిపింది. ఈ మేరకు శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డికి ఎఫ్‌జీజీ అధ్యక్షుడు పద్మనాభరెడ్డి లేఖ రాశారు. ఉచిత చేప పిల్లల పంపిణీ కోసం ప్రభుత్వం ప్రతి ఏడాది టెండర్లు వేయడం, కోట్ల రూపాయలను కాంట్రాక్టర్లకు ఇవ్వడం ఎందుకని ప్రశ్నించారు. కాంట్రాక్టర్లతో అనేక అవకతవకలు జరగడం, ఆలస్యంగా చేపలు వదలడం వలన ఎలాంటి లాభం ఉండదన్నారు. అలాగే చేపలు రోడ్ల పక్కన ఎలాంటి పరిశుభ్రత పాటించకుండా అమ్ముతున్నారని, పరిశుభ్రత పాటిస్తూ ఆరోగ్యకరమైన వాతావరణంలో చేపల మార్కెట్లు అభివృద్ధి చేయాలని లేఖలో విజ్ఞప్తిచేశారు.

డిజిటల్ మాధ్యమాల ప్రభావంపై కార్యక్రమాలు నిర్వహిద్దాం

టీశాట్ సీఈఓ వేణుగోపాల్‌రెడ్డితో చైల్డ్ రైట్స్ కమిషన్

సాక్షి, హైదరాబాద్: పిల్లలపై డిజిటల్ మాధ్యమాల ప్రభావం చాలా ఉందని, దీనిపై టీశాట్‌లో పిల్లలు, వారి తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని చైల్డ్ రైట్స్ కమిషన్ తెలిపింది. మహిళా అభివృద్ధి, శిశుసంక్షేమం, పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు శుక్రవారం టీశాట్ సీఈఓ బోదనపల్లి వేణుగోపాల్‌రెడ్డిని చైల్డ్ రైట్స్ కమిషన్ చైర్‌పర్సన్ కొత్తకోట సీతా దయాకర్‌రెడ్డి కలిశారు. భవిష్యత్‌లో పిల్లల కోసం కూడా ప్రత్యేకమైన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ముఖ్యంగా పిల్లల హక్కుల పరిరక్షణ, బాల్యవివాహాల గురించి అలాగే కమ్యూనిటీ క్యాంపెయిన్ చేస్తామని చెప్పారు. బాలల హక్కుల కోసం వారి రక్షణ కోసం, బాలలపై జరుగుతున్న అఘాయిత్యాలు, సామాజిక దురాచారాలు, డిజిటల్ మీడియా ప్రభావం, జేజే యాక్ట్, ఇతర చట్టాల అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో కమిషన్ సభ్యులు వచన్ కుమార్, వందన గౌడ్, చందన, అపర్ణ, సరిత, ప్రేమలత అగర్వాల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

నీటిపారుదల శాఖలో పూర్తయిన పదోన్నతుల ప్రక్రియ

38 ఏళ్ల తర్వాత డీపీసీ ద్వారా పదోన్నతులు ● అన్ని స్థాయిల్లో ప్రమోషన్లు

సాక్షి, హైదరాబాద్: మూడు దశాబ్దాల సుదీర్ఘ విరామం అనంతరం శాఖాపరమైన పదోన్నతుల కమిటీ (డీపీసీ) ద్వారా నీటిపారుదల శాఖలో పదోన్నతుల ప్రక్రియ అన్ని దశల్లో పూర్తయింది. గురువారం రాత్రి అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఏఈఈ) నుంచి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (డీఈఈ)లుగా 91 మందికి, తర్వాత డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల (డీఈఈ) నుంచి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు (ఈఈ)లుగా 91 మంది పదోన్నతికి శాఖాపరమైన పదోన్నతుల కమిటీ (డీపీసీ) ఆమోదం తెలిపింది. తాజా నిర్ణయంతో ప్రతీ దశలో పదోన్నతుల ప్రక్రియ పూర్తయింది. ఇప్పటికే చీఫ్ ఇంజనీర్ (సీఈ) నుంచి ఈఎన్సీ (ఇంజనీర్ ఇన్ చీఫ్)లుగా 10 మందికి పదోన్నతులు ఇవ్వగా.. కాళేశ్వరంతో పాటు వివిధ కేసుల్లో అభియోగాలు ఎదుర్కొంటున్న వారిని పక్కనపెట్టి పదవీ విరమణ చేసిన వారిని కూడా పక్కకు తొలగించాక.. ఒక్కరికి రెగ్యులర్ ఈఎన్సీగా పోస్టింగ్ ఇచ్చారు. చీఫ్ ఇంజనీర్ ఎంక్వయిరీస్‌గా పనిచేస్తున్న మహ్మద్ అంజద్ హుస్సేన్‌కు రెగ్యులర్ ఈఎన్సీ (జనరల్)గా పోస్టింగ్ ఇచ్చారు. అంతకు ముందు 10 మంది సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్ఈ) నుంచి చీఫ్ ఇంజనీర్ సీఈలుగా పదోన్నతి కల్పించగా.. ఇటీవలే ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) నుంచి ఎస్ఈగా 47 మందికి పదోన్నతులు కల్పించిన విషయం విదితమే. మూడు దశాబ్దాల కాలంలో డీపీసీయే జరగకపోవడం గమనార్హం. నిబంధనలు సవరించి డీపీసీ లేకుండానే తాత్కాలిక ప్రాతిపదికన పదోన్నతులు ఇచ్చారు. కాగా, పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉన్న ఎస్ఈ కె.ప్రసాద్‌కు సీఈ (ఎంక్వయిరీస్)గా, జనగామ ఎస్ఈ ఆర్. సుధీర్‌కు వరంగల్ సర్కిల్ సీఈగా పదోన్నతి కల్పిస్తూ నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.



ప్రతిబంధకాలు తొలగడంతో..

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక శాఖపై పూర్తిస్థాయిలో దృష్టిపెట్టింది. శాఖలో మూడు దశాబ్దాలుగా డీపీసీ లేకుండానే పదోన్నతుల ప్రక్రియ జరుగుతోందని ప్రభుత్వం గుర్తించింది. దీనికి సీనియారిటీ వివాదమే కారణమని తేలడంతో దీనిపై అడ్వొకేట్ జనరల్ (ఏజీ)తో కూడా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమావేశమయ్యారు. పదోన్నతులు అందకపోవడానికి న్యాయవివాదమే కారణమని గుర్తించారు. మంత్రి చొరవతో గత జనవరి 10వ తేదీన ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వెలువడింది. దాంతో వెనువెంటనే అన్ని స్థాయిల్లో పదోన్నతులు కల్పించడానికి వీలుగా సీఈ నుంచి ఈఎన్సీలుగా ప్రమోషన్లు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలో కాళేశ్వరం ప్రాజెక్టుపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నివేదిక ఇవ్వడం... ఆ నివేదిక ప్రకారం బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ కమిషన్ ప్రభుత్వానికి సిఫారసు చేయడంతో ఆ జాబితాలో ఉన్నవారందరిపై ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోకూడదో సంజాయిషీ ఇవ్వాలని షోకాజ్ నోటీసులు కూడా ఇచ్చారు. దాంతో షోకాజ్ నోటీసులు అందుకున్న వారినందరినీ పదోన్నతుల ప్రక్రియ నుంచి తప్పించి.. ప్రమోషన్లు ఇచ్చారు. దాంతో అన్ని స్థాయిల్లో పదోన్నతులు లభించడంతో.. భారీగా జరిగిన పదవీ విరమణలతో ఖాళీ అయిన పోస్టులన్నీ భర్తీ కానున్నాయి.



గణపతి.. ధనపతి

మంచిర్యాల అర్బన్: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని విశ్వనాథస్వామి ఆలయ కాలక్షేప మండపంలో ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుడిని కరెన్సీ నోట్లతో అలంకరించారు. శుక్రవారం రాత్రి రూ.25,11,116 కరెన్సీ నోట్లతో మండపాన్ని తీర్చిదిద్దారు. భక్తులు కరెన్సీ గణపతిని దర్శించుకునేందుకు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.

‘సిగాచి’పై ప్రభుత్వ అఫిడవిట్‌లోని అంశాలివే

సాక్షి, హైదరాబాద్: ‘రాష్ట్ర, కేంద్ర ఉపాధి ప్రయోజనాల చట్టాల ప్రకారం బాధితులందరికీ న్యాయమైన పరిహారం చెల్లిస్తాం. మృతుల కుటుంబాలకు రూ. కోటి చొప్పున సాయం అందిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. సిగాచి, కార్మిక శాఖ భాగస్వామ్యంతో ఈ పరిహారం అందిస్తారు. ఘటన జరిగిన వెంటనే ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేశాం. కమిటీ భద్రతా లోపాలు, నియంత్రణ చర్యలు లేకపోవడం, అత్యవసర పరిస్థితుల్లో సంసిద్ధత లేకపోవడమే ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా తేల్చింది. దీనిపై సమగ్ర నివేదిక రావాల్సి ఉంది. దుర్ఘటన సమాచారం అందగానే హైడ్రా నుంచి 265 మంది, ఎన్డీఆర్ఎఫ్ నుంచి 25 మంది, ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపకశాఖ నుంచి 350 మంది, 200 మంది జిల్లా పోలీసులు, టీజీఎస్పీ నుంచి 9 మంది సహాయక చర్యల్లో పాల్గొన్నారు. బాధితులను ఆస్పత్రులకు, మెడికల్ క్యాంపులకు తరలించారు. 43 మంది మరణ ధ్రువీకరణ పత్రాలను వారి కుటుంబ సభ్యులకు అందించాం. మరో 3 ధ్రువీకరణ పత్రాలు పెండింగ్‌లో ఉన్నాయి. ఆచూకీ తెలియని 8 మంది మరణ ధ్రువీకరణ పత్రాల కోసం కలెక్టర్ ప్రభుత్వానికి లేఖ రాశారు. ఘటన జరిగిన వెంటనే సీఎం ఆదేశాల మేరకు సంగారెడ్డి జిల్లా కలెక్టర్ తక్షణ సాయం కింద మృతుల కుటుంబాలకు రూ. లక్ష చొప్పున, గాయపడిన వారి కుటుంబాలకు రూ. 50 వేల చొప్పున పరిహారం అందించారు. ఘటనపై దర్యాప్తు జరిపేందుకు ఐదుగురు సభ్యులతో నిపుణుల కమిటీని ఏర్పాటు చేశాం. ఆ కమిటీ నివేదిక అందాల్సి ఉంది. కలెక్టర్, కార్మికశాఖ, విపత్తుల నిర్వహణ శాఖ, పోలీసులు, పరిశ్రమల శాఖల నుంచి నివేదికలు తెప్పించాం. వాటిని కూడా కోర్టు ముందు ఉంచుతున్నాం’ అని హైకోర్టుకు సమర్పించిన కౌంటర్‌లో సీఎస్ పేర్కొన్నారు.

పని ప్రదేశంలో సురక్షిత వాతావరణం ఉండాలి

తెలంగాణ జైళ్లశాఖ డీజీ సౌమ్యా మిశ్రా

సాక్షి, హైదరాబాద్: పని ప్రదేశంలో ఉద్యోగులకు సురక్షితమైన పని వాతావరణాన్ని యాజమాన్యం కల్పించాలని తెలంగాణ జైళ్లశాఖ డీజీ సౌమ్యా మిశ్రా అన్నారు. దీంతో ఉద్యోగుల గౌరవం, సమస్యలపై మాట్లాడే ధైర్యాన్ని పెంపొందించినట్లు అవుతుందని అభిప్రాయపడ్డారు. లింగ సున్నితత్వం, లైంగిక వేధింపుల నివారణ (పీఓఎస్‌హెచ్ యాక్ట్)పై శుక్రవారం ఎన్టీపీసీ దక్షిణ ప్రాంతీయ ప్రధాన కార్యాలయం (ఎస్ఆర్‌హెచ్‌క్యూ)లో నిర్వహించిన సెషన్‌కు సౌమ్యా మిశ్రా ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. వివిధ విభాగాల ఉద్యోగులతో సంభాషిస్తూ ఆమె పోష్ యాక్ట్ కీలక అంశాలు, ప్రాముఖ్యతను వివరించారు. ఎన్టీపీసీ తన ఉద్యోగులందరికీ సురక్షితమైన, గౌరవ ప్రదమైన పని వాతావరణాన్ని సృష్టించేందుకు కట్టుబడి ఉందని ఎన్టీపీసీ సదరన్ రీజియన్ హెడ్‌క్వార్టర్స్ సీజీఎం (హెచ్ఆర్) ఎస్ఎన్ పాణిగ్రాహి అన్నారు. కార్యక్రమాన్ని లీడింగ్ టీమ్స్‌కు చెందిన మాళవికా గోయల్ సమన్వయం చేశారు.

గజ్జెకట్టి.. నటరాజుకు నమస్కరించి..



భగవంతుని సృష్టిలో నృత్యం ఒక భాగం. పూజచేసి నాట్యదైవం నటరాజస్వామి ఆశీర్వాదం పొందడం భారత శాస్త్రీయ నృత్యకారుల సంప్రదాయం. గురువును గౌరవించి.. సన్మానించి.. ఆశీర్వాదం పొందడం, నృత్య ప్రదర్శనకు ముందు గజ్జెపూజ చేయడం ఆనవాయితీ అని పురోహితులు చెబుతున్నారు. నృత్యంలో కీలకపాత్ర పోషించే గజ్జెలను పూజించి, అడ్డంకులు లేకుండా విజయవంతంగా నృత్య నైపుణ్యం పొందాలని కోరుతూ పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని శివుని సన్నిధిలో కళాకారులు తల్లిదండ్రులతో కలిసి పూజలు చేశారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి







మహారాష్ట్రలో బి.సుదర్శన్‌రెడ్డి, ఎంపీ చామల ప్రచారం



సాక్షి, న్యూఢిల్లీ: ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిని గెలిపించాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆయన రాజ్యాంగం పట్ల నిబద్ధత కలిగిన వారని, ఉపరాష్ట్రపతి హోదాకు సరైన వ్యక్తి అంటూ కొనియాడారు. ఉప రాష్ట్రపతి ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎంపీ చామల శుక్రవారం అభ్యర్థి సుదర్శన్‌రెడ్డితో కలిసి మహారాష్ట్రలో పర్యటించారు. శివసేన అధ్యక్షుడు ఉద్ధవ్ థాక్రే, ఎన్సీపీ అధినేత శరద్ పవార్‌లతో భేటీ అయ్యి, ఉప రాష్ట్రపతి ఎన్నికలపై చర్చించారు. ఈ భేటీలో మహారాష్ట్ర కాంగ్రెస్ పీసీసీ చీఫ్ హర్షవర్ధన్, ముంబై కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ వర్ష గైక్వాడ్ పలువురు ఎంపీలతో చర్చలు జరిపారు. రాజ్యాంగ పరిరక్షణ, దేశ భవిష్యత్తు కోసమే ఇండియా కూటమి తనకు మద్దతుగా ఉందని అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు.

ప్రగతిభవన్‌లోకి ఎమ్మెల్యేలకే ఆంక్షలు ఉండేవి

- ఇప్పుడు ప్రజల వద్దకే ఎమ్మెల్యేలు వస్తున్నారు: మందుల సామేల్



సాక్షి, హైదరాబాద్: ప్రజాపాలనలో ప్రజాప్రతినిధులందరూ జవాబుదారీ తనంతో పనిచేస్తున్నారని తుంగతుర్తి కాంగ్రెస్ ఎమ్మెల్యే మందుల సామేల్ వ్యాఖ్యానించారు. గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు జాగిర్దారీ పాలన నడిచిందని, సీఎం నివాసం ఉండే ప్రగతి భవన్‌లోకి వెళ్లేందుకు ఎమ్మెల్యేలకు కూడా ఆంక్షలుండేవని చెప్పారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రజాప్రతినిధులే ప్రజల వద్దకువచ్చి వారి సమస్యలు వింటున్నారని అన్నారు. ‘అందుబాటులో ప్రజాప్రతినిధులు’ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గాంధీభవన్‌లో ఆయన పలు సమస్యలపై ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రగతిభవన్‌ను పూలే ప్రజాభవన్‌గా మార్చామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు రుణమాఫీ, రేషన్‌కార్డుల పంపిణీ, సన్నబియ్యం, ఎస్సీల వర్గీకరణ, బీసీల రిజర్వేషన్ల పెంపు తదితర ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో ముందుకెళ్తున్నామని శామేల్ చెప్పారు.

నోటీసులకు బీజేపీ జిల్లా నాయకుల వివరణ

సాక్షి, హైదరాబాద్: బీజేపీలో క్రమశిక్షణా రాహిత్యానికి పాల్పడుతున్న వారిపై హెచ్చరికలతో పాటు చర్యలకు రాష్ట్ర నాయకత్వం సిద్ధమైంది. ముఖ్యంగా జిల్లాస్థాయిల్లో రెండు మూడు గ్రూపులుగా నేతలు, కార్యకర్తలు విడిపోయి, ఒక గ్రూపుపై మరో గ్రూపు ఆధిపత్య ప్రదర్శనకు చేస్తున్న ప్రయత్నాలకు అడ్డుకట్ట వేయాలని భావిస్తోంది. ఇటీవల బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు వివిధ జిల్లాల పర్యటనల సందర్భంగా కొన్నిచోట్ల తోపులాటలు, ఒకరిపైఒకరు నినాదాలు చేసుకోవడం వంటివి చోటుచేసుకోవడంపై పార్టీ సీరియస్ అయ్యింది. ఖమ్మం, మహబూబ్‌నగర్, పెద్దపల్లి, వికారాబాద్ జిల్లాల నాయకులకు క్రమశిక్షణా కమిటీ ‘షోకాజ్ నోటీస్’లు జారీచేసింది. ఈ నేపథ్యంలో నోటీసులు అందుకున్న వారు శుక్రవారం రాష్ట్ర పార్టీ కార్యాలయానికి వచ్చి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీలను కలుసుకుని వివరణ ఇచ్చినట్టు పార్టీవర్గాల సమాచారం.

‘భూసేకరణ కోసం ఇంతటి దుర్మార్గం ఎందుకు?’



సాక్షి, హైదరాబాద్: కొడంగల్–నారాయణపేట ఎత్తిపోతల పథకం భూ సేకరణ కోసం రైతులు, పేదలపై ఎందుకింత పగ అని సీఎం రేవంత్‌రెడ్డిని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. అర్ధరాత్రి కానుకుర్తి గ్రామానికి పోలీసులను పంపి ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం దుర్మార్గమని శుక్రవారం ఎక్స్ వేదికగా ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల లగచర్లలో బంజారా ఆడబిడ్డలపై సాగించిన అఘాయిత్యాలనే నేడు కానుకుర్తి ప్రజలపై కొనసాగిస్తారా అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి నిరంకుశ చర్యలకు స్థానం లేదనే విషయం గుర్తించాలని హితవుపలికారు. ఇదివరకే కానుకుర్తి ప్రజలకు అండగా నిలిచామని, ఇకముందు కూడా వారి పక్షాన పోరాటంలో ముందే ఉంటామని కవిత స్పష్టం చేశారు.

‘వర్షాలతో నష్టపోయిన ప్రజలు, రైతులను ఆదుకోవాలి’



సాక్షి, హైదరాబాద్: భారీ వర్షాలతో నష్టపోయిన ప్రజలు, రైతులను ఆదుకోవాలని మెదక్ మాజీ ఎమ్మెల్యే పటోళ్ల శశిధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. చనిపోయిన వారికి రూ.25 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని, ఎకరానికి రూ. 25 వేల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ముఖ్యంగా మెదక్, కామారెడ్డి జిల్లాల్లో భారీ నష్టం జరిగిందని, ప్రతి గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని నష్టపరిహారం చెల్లించాలని విన్నవించారు.

ఉచిత నట్టల మందు ఇవ్వండి

- ప్రభుత్వానికి జీఎంపీఎస్ వినతి

సాక్షి, హైదరాబాద్: గొర్రెలు, మేకలకు రాష్ట్ర ప్రభుత్వమే ఉచిత నట్టల మందును పంపిణీ చేయాలని గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం (జీఎంపీఎస్) డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం జీఎంపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం పశుసంవర్ధశాఖ అదనపు డైరెక్టర్ మల్లేశ్వరిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం రవీందర్ విలేకరులతో మాట్లాడుతూ రెండేళ్లుగా గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులను ప్రభుత్వం ఇవ్వడం లేదని, రైతులు పశు వైద్యులను అడిగితే స్టాక్ రాలేదని చెప్తున్నారన్నారు. జీవాలకు కనీస వైద్యం అందకపోవడంతో వేలాది రూపాయలు వెచ్చించి ప్రైవేట్ మెడికల్ షాపుల్లో కొనుగోలు చేయాల్సి వస్తోందని, అక్కడ కూడా నాసిరకం మందులే అందుబాటులో ఉండటంతో నట్టల నివారణ జరగడం లేదని, ఫలితంగా జీవాల్లో ఉత్పత్తి సామర్థ్యం తగ్గిపోతోందని రవీందర్ వివరించారు. దీంతో గొర్లకాపరులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. నట్టల మందుకు అవసరమైన బడ్జెట్‌ను వెంటనే కేటాయించి నట్టల నివారణ, వ్యాక్సినేషన్ కార్యక్రమాలను అనుసంధానం చేయాలని కోరారు. తమ విజ్ఞప్తి పట్ల మల్లేశ్వరి సానుకూలంగా స్పందించారని, 15 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా జీవాలకు నట్టల మందు పంపిణీ చేసేలా చర్యలు చేపడుతామని హామీ ఇచ్చినట్టు రవీందర్ వెల్లడించారు.

క్లుప్తంగా...

రక్తహీనత నివారణలో ఏపీకి ప్రథమ స్థానం

సాక్షి, అమరావతి: రక్తహీనత (ఎనీమియా) నివారణ చర్యల్లో దేశంలో ఆంధ్రప్రదేశ్ తొలి స్థానంలో నిలిచింది. రక్తహీనత తగ్గించే సిరప్, మాత్రల పంపిణీకి సంబంధించిన పలు కేటగిరీల్లో కనబరిచిన పనితీరు ప్రాతిపదికన రాష్ట్రానికి తొలి ర్యాంకును కేంద్రం ప్రకటించింది. 2025–26 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్, మే, జూన్ (తొలి త్రైమాసికం)ల్లో రక్తహీనత నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత రాష్ట్రాలు తీసుకున్న చర్యలను కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ సమీక్షించింది. దీనిలో ఏపీ, హరియాణ, తెలంగాణ రాష్ట్రాలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ ర్యాంకులు లభించాయి. 6 కేటగిరీలకుగాను 5 కేటగిరిల్లో ఏపీ తొలిస్థానాన్ని దక్కించుకోవడానికి కృషి చేసిన అధికార, సిబ్బందిని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో అభినందించారు.

ఏపీ స్టేట్ సీడ్ సబ్ కమిటీ ఏర్పాటు

సాక్షి, అమరావతి: వ్యవసాయ ఉద్యాన పంటల కోసం 2024–26కి సంబంధించి స్టేట్ సీడ్ సబ్ కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. స్పెషల్ సీఎస్ చైర్మన్‌గా ఏర్పాటు చేసిన ఈ కమిటీకి సెంట్రల్ సీడ్ కమిటీ కార్యదర్శి, వ్యవసాయ విత్తన విభాగం జాయింట్ డైరెక్టర్లు కన్వీనర్లుగా వ్యవహరించనున్నారు. సభ్యులుగా ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్, వ్యవసాయ శాఖ సంచాలకులు, నేషనల్ సీడ్స్ కార్పొరేషన్ రీజనల్ మేనేజర్, వ్యవసాయశాఖ డీఎస్‌ఏ ల్యాబ్ అసిస్టెంట్ డైరెక్టర్, ఏపీ స్టేట్ సీడ్ సర్టిఫికేషన్ ఏజెన్సీ డైరెక్టర్, ఏపీ సీడ్స్ ఎండీలతో పాటు సీడ్ ప్రొడ్యూసర్స్ నుంచి పి.నారాయణరెడ్డి (ఎండీ, న్యూజెన్స్ ప్రైవేట్‌లిమిటెడ్), ఎ.శ్రీనివాసరావు (ఎండీ, కర్నూల్ సీడ్స్), సీడ్ ట్రేడర్స్ నుంచి కాపా శ్రీనివాసరావు (తులసి పెస్టిసైడ్స్ అండ్ ఫెర్టిలైజర్స్, నూజివీడు), సీడ్ ఫార్మర్స్ నుంచి పట్టా సింహాచలం (శ్రీకాకుళం), మానుకొండ శ్రీనివాసరావు (గుంటూరు)ను నియమించారు. సీజన్ వారీగా నాణ్యమైన విత్తనాలను రైతులకు అందుబాటులో ఉండేలా ఈ సబ్ కమిటీ పర్యవేక్షిస్తుంది.

ఐఐఆర్‌ఎఫ్ ర్యాంకింగ్‌లో ఉద్యాన వర్సిటీకి 29వ స్థానం

సాక్షి, అమరావతి: డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన వర్సిటీకి ఇండియన్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్(ఐఐఆర్‌ఎఫ్) ఏటా ఇచ్చే ర్యాంకింగ్‌లో 29వ స్థానం దక్కింది. జాతీయ స్థాయిలో 2,500కు పైగా పలు వర్సిటీలు, విద్యాసంస్థలకు వాటి పనితీరు ఆధారంగా ఈ సంస్థ ఏటా ర్యాంకింగ్ ఇస్తుంది. వర్సిటీలు, విద్యాసంస్థలు ప్రాథమిక పరిశోధన ద్వారా సాధిస్తున్న ఫలితాలు, ఉపాధి సామర్థ్యం, బోధన, అభ్యాసన వనరులు, పరిశోధన నాణ్యతలు, ఉద్యోగ నియామకాలు, విద్యార్థుల, గణాంక ప్రచురణలు, నివేదికలు తదితర అంశాల ప్రాతిపదికన ఈ ర్యాంకింగ్ ఇస్తుంది. ఐఐఆర్‌ఎఫ్ ర్యాంకింగ్‌పై వర్సిటీ రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు.

గిరిజన సంక్షేమ సీఈ పదవీ విరమణకు ప్రభుత్వం అనుమతి

సాక్షి, అమరావతి: లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక సంస్థ(ఏసీబీ)కి చిక్కి సస్పెండ్ అయిన గిరిజన సంక్షేమశాఖ చీఫ్ ఇంజనీర్ (సీఈ) ఎస్.శ్రీనివాసరావు ఈ నెల 31న పదవీ విరమణ చేయడానికి ప్రభుత్వం అనుమతించింది. ఈ మేరకు గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి ఎంఎం నాయక్ శుక్రవారం ఉత్తర్వులిచ్చారు. అతనిపై పెండింగ్‌లో ఉన్న క్రమశిక్షణ కేసులు, విచారణలను పక్షపాతం లేకుండా కొనసాగించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పంచాయతీరాజ్ శాఖ పరిధిలో పదోన్నతులు

సాక్షి, అమరావతి: పంచాయతీరాజ్ శాఖ పరిధిలో 53 మంది ఎంపీడీవోలకు డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్(డీఎల్‌డీవో)గా, మరో 158 మంది వివిధ స్థాయి అధికారులకు ఎంపీడీవోలుగా పదోన్నతులు కలిపిస్తూ పంచాయతీరాజ్ శాఖ శుక్రవారం ఆదేశాలిచ్చింది. 98 మంది డిప్యూటీ ఎంపీడీవోలు, జిల్లా పరిషత్‌ల పరిధిలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లుగా పనిచేసే 56 మంది, డీఎల్‌పీవో ఆఫీసుల్లో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లుగా పనిచేసే నలుగురు ఎంపీడీవోలుగా పదోన్నతులు పొందారు.

దళిత ఉద్యోగుల సస్పెన్షన్ రద్దు చేయాలి

సీఎంకు సీపీఎం లేఖ

సాక్షి, అమరావతి: తిరుమల తిరుపతి దేవస్థానంలో 30 ఏళ్లుగా పని చేస్తున్న ఎనిమిది మంది షెడ్యూల్డు కులాలకు చెందిన ఉద్యోగులను ఇటీవల సస్పెండ్ చేశారని, వారి సస్పెన్షన్‌ను రద్దు చేసి తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సీఎం చంద్రబాబుకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు శుక్రవారం లేఖ రాశారు. టీటీడీ ఒక ధార్మిక సంస్థ అని, దేవుని దృష్టిలో ప్రజలందరూ సమానమేనని, ఎనిమిది మందిని సస్పెండ్ చేసిన టీటీడీ బోర్డు చర్య రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా ఉందన్నారు. రెండు, మూడేళ్లలో పదవీ విరమణ చేయనున్న వారిని సస్పెండ్ చేయడం సరికాదన్నారు.

సంచార జాతుల్లో వెలుగులు నింపిన జగన్

రేపు విముక్త సంచార జాతుల స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం



ప్రత్యేకంగా ఎంబీసీ కార్పొరేషన్ ఏర్పాటుతో సంక్షేమ ఫలాలు

- రాష్ట్రంలో 52 సంచార జాతుల కోసం ప్రత్యేక శ్రద్ధ
- 32 అత్యంత సంచార కులాలకు ఎంబీసీ కార్పొరేషన్ ఏర్పాటు
- విద్య, వైద్యం, సంక్షేమం దూరమైన వారికి భరోసా
- కూటమి పాలనలో సంచార జాతుల బతుకు దుర్భరం
- ఇచ్చిన హామీలు కూడా అమలు చేయని బాబు సర్కార్

సాక్షి, అమరావతి: ఉదర పోషణకు ఊరూరా సంచారం.. రోడ్డు పక్కన, మురికి కాల్వల గట్టున జీవనం.. ఆధార్, ఓటరు గుర్తింపు కార్డులకు కూడా నోచుకోని దుర్భరం.. ఇది రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాక ముందు సంచార జాతుల జీవన చిత్రం. అటువంటి సంచార జాతుల జీవితాల్లో వెలుగులు నింపిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుంది. అయితే కూటమి పాలనలో ఇచ్చిన హామీలు కూడా అమలుకు నోచుకోని దారుణ పరిస్థితికి జారిపోయారు. ఈ నెల 31న విముక్త సంచార జాతుల స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని వారి జీవన చిత్రానికి సంబంధించిన కథనం ఇది.

దుర్భర జీవనం...

భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలను కళారూపాల ద్వారా పరిరక్షిస్తూ ధర్మప్రచారకులుగా ఊరూర తిరుగుతూ జీవనోపాధి పొందేవారిని సంచార జాతులుగా పరిగణించారు. కనీసం సొంత ఊరు, ఇల్లు, చిరునామా, కుల ధృవీకరణ, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు లేక దశాబ్దాల తరబడి ప్రభుత్వ పథకాలకు కూడా నోచుకోని దుర్భర బతుకులు వారివి. పూసలు, దండలు, వనమూలికలు అమ్ముతూ, తలవెంట్రుకలు వంటివి కొంటూ, గొడుగులు బాగుచేస్తూ, సవరాలు అమ్ముతూ, చిత్తుకాగితాలు ఏరుకుంటూ, చిన్న చిన్న సర్కస్‌లు చేస్తూ, ఖాళీ సమయంలో భిక్షాటన చేస్తూ బతుకులు వెళ్లదీసే పరిస్థితి వారిది.

సంచార జాతుల స్వాతంత్య్రం- 1952

బ్రిటిష్ ప్రభుత్వం క్రిమినల్ ట్రైబ్స్ యాక్ట్, 1871 ద్వారా దాదాపు 500 కులాల వారికి 'జన్మతః నేరస్తులు' అనే ముద్ర వేసింది. ఈ చట్టం వల్ల వారు ఎక్కడ కనిపించినా అరెస్ట్ చేసి జైలులో పెట్టేవారు. ఫలితంగా గౌరవంగా బ్రతకలేక, చాలా మంది రహస్యంగా సంచార జీవితం గడుపుతూ భిక్షాటనపై ఆధారపడ్డారు. స్వాతంత్య్రం వచ్చిన తర్వాత కూడా ఈ చట్టం రద్దు కాలేదు. నిరంతర పోరాటాల తరువాత 1952 ఆగస్టు 31న ఈ కులాలను విముక్త జాతులుగా ప్రకటించారు. అందుకే సంచార జాతులు ఆ రోజును తమ నిజమైన స్వాతంత్య్ర దినోత్సవంగా జరుపుకుంటున్నారు. అయితే, వారి జీవనస్థితి మెరుగుపడేందుకు చేసిన కమిటీలు, కమిషన్ల సిఫార్సులు పరిమిత స్థాయిలో మాత్రమే అమలయ్యాయి.

సంక్షేమ ఫలాలు అందించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

రాష్ట్రంలో 52 సంచార జాతులకు చెందిన సుమారు రెండు లక్షల మంది ఉన్నారు. వారికి కుల ధృవీకరణ పత్రాలు, చిరునామా (నెటివిటి సర్టిఫికెట్)లు, ఆధార్, రేషన్‌కార్డులు జారీకి వైఎస్ జగన్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. వారిలో అనేకమందికి ఇళ్ల స్థలాలు కేటాయించారు. సంచార జాతుల పిల్లలకు చదువులను చేరువ చేసేలా అమ్మ ఒడిని వర్తింపజేశారు. చేయూతతోపాటు నవరత్నాలతో అనేక సంక్షేమ పథకాల ద్వారా సంచార జాతులకు రూ.1,288.44కోట్లకుపైగా లబ్ధి చేకూర్చడం విశేషం. వారిలో 32 సంచార జాతుల కోసం ప్రత్యేకంగా అత్యంత వెనుకబడిన తరగతుల (ఎంబీసీ) కార్పొరేషన్ ఏర్పాటు చేశారు. గుర్తింపు లేని తోలుబొమ్మలాటల కులస్తులను గుర్తించి బీసీ–బీ సీరియల్ నంబర్ 25లో చేర్పించారు.

హామీలను నెరవేర్చని కూటమి సర్కార్

కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చని పరిస్థితి. ఎంబీసీలకు స్థానిక సంస్థల్లో ఐదు శాతం రిజర్వేషన్లు, దేవాలయాల పాలక మండలిలో సభ్యత్వం, మున్సిపల్ కార్పొరేషన్లలో ఎస్సీ, మైనార్టీల మాదిరిగానే కో–ఆప్షన్ మెంబర్‌గా ఎంబీసీలకు అవకాశం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సంచార జాతుల గుర్తింపు కార్డుల మంజూరు... ఇలా ఏ ఒక్క హామీనీ అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం దగా చేస్తోంది.

జగన్ పాలనలో గుర్తింపు



జగన్ పాలనలోనే సంచార జాతులకు గుర్తింపు దక్కింది. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర కావస్తున్నప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు. ఇప్పటికైనా నా ప్రభుత్వం ఈ దిశలో చర్యలు తీసుకోవాలి.

–పెండ్ర వీరన్న, ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్

గిరిజన మహిళల అరెస్ట్‌పై నివేదిక ఇవ్వండి

- కరేడులోని బాధిత గిరిజన కాలనీల్లో కమిషన్ పర్యటిస్తుంది
- అప్పటివరకు భూ సేకరణను వాయిదా వేయాలి
- జాతీయ ఎస్టీ కమిషన్ ఆదేశాలు
- ఎమ్మెల్యే ఒత్తిడితోనే పోలీసులు వేధిస్తున్నారని నివేదించిన బాధిత మహిళలు



ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్‌తో గిరిజన మహిళలు, వామపక్ష నాయకులు

ఉలవపాడు: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కరేడు పంచాయతీ రామకృష్ణాపురంలో గిరిజన మహిళలను అర్ధరాత్రి అరెస్ట్ చేయడంపై 15 రోజుల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలని పోలీసులను జాతీయ ఎస్టీ కమిషన్ ఆదేశించింది. బాధిత గిరిజన కాలనీల్లో కమిషన్ పర్యటిస్తుందని, అప్పటివరకు భూ సేకరణను వాయిదా వేయాలని ఆదేశించింది. అరెస్టయిన గిరిజన మహిళలు మానికల శిరీష, మానికల సుజాత, మల్లవరపు లలిత, పోలీసు శాఖ నుంచి కందుకూరు డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం శుక్రవారం హైదరాబాద్‌లో కమిషన్ ఎదుట హాజరయ్యారు. గిరిజన మహిళల తరపున ఆదివాసీ అధికార్ రాష్ట్రీయమంచ్ జాతీయ కార్యవర్గసభ్యుడు రమావత్ శ్రీరాం నాయక్, సీపీఎం ఉలవపాడు కార్యదర్శి జి.వి.బి.కుమార్ పాల్గొన్నారు. కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్ విచారణ జరిపారు. బాధిత మహిళలు వాంగ్మూలం ఇచ్చారు. ఈ విచారణ వివరాలను సీపీఎం ఉలవపాడు కార్యదర్శి జి.వి.బి.కుమార్ వెల్లడించారు. ఆయన తెలిపిన మేరకు.. బాధిత గిరిజన మహిళలు ఎస్టీ కమిషన్‌కు వాంగ్మూలం ఇచ్చారు. ఇండోసోల్ కంపెనీకి భూములు ఇవ్వొద్దని తీర్మానం చేసుకున్నామని చెప్పారు. భూములిచ్చేందుకు అనుకూలంగా ఉన్న శేషమ్మతో ఘర్షణ జరిగిందని, దీనిని సాకుగా చూపి తమను అర్ధరాత్రి అరెస్ట్ చేసి అధికారపార్టీ ఒత్తిడితో 307 కేసు పెట్టారని తెలిపారు. పోలీసు వేధింపులకు వ్యతిరేకంగా పోలీస్‌స్టేషన్ ఎదుట రైతులు బైఠాయిస్తే 326గా మార్చారని చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఒత్తిడితో తమను పోలీసులు వేధిస్తున్నారని తెలిపారు. గిరిజన రైతుల అంగీకారం, మార్కెట్ రేటు నిర్ణయించకుండా గిరిజనులను ఎందుకు వేధిస్తున్నారని డీఎస్పీని కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్ ప్రశ్నించారు. ఎస్పీని రావాలని ఆదేశించాం.. ఎందుకు రాలేదని అడిగారు. సోలార్ కంపెనీకి చేస్తున్న భూసేకరణ, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై 15 రోజుల్లో నివేదిక ఇవ్వాలని పోలీసుల్ని ఆదేశించారు. బాధిత గిరిజన కాలనీల్లో కమిషన్ స్వయంగా పర్యటిస్తుందని, అంతవరకు పోలీసులు చర్య తీసుకోవద్దని చెప్పారు. అంతవరకు భూ సేకరణను వాయిదా వేయాలని కమిషన్ సభ్యుడు ఆదేశించారు.

వేస్ట్ రీసైక్లింగ్ యూనిట్లకు భారీగా విద్యుత్ సబ్సిడీ

యూనిట్‌కు రూ.3 రాయితీ

- తొలి ఐదేళ్లు 100 శాతం విద్యుత్ డ్యూటీ మినహాయింపు
- నామమాత్రపు రుసుముతో 33 ఏళ్ల లీజుకు భూములు
- యూనిట్ ప్రారంభమైన మూడేళ్ల తర్వాత భూమి కొనుగోలు చేసే అవకాశం
- పెట్టుబడిపై 40 శాతం ఇన్వెస్ట్‌మెంట్ సబ్సిడీ
- పలు రాయితీలతో సర్క్యులర్ ఎకానమీ, వేస్ట్ రీసైక్లింగ్ 2025–30 పాలసీ



సాక్షి, అమరావతి: వ్యర్థాల నుంచి సంపద సృష్టించే పరిశ్రమలకు రాయితీలు కల్పిస్తూ ఏపీ సర్క్యులర్ ఎకానమీ, వేస్ట్ రీసైక్లింగ్ 2025–30 పాలసీని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. భారీ విద్యుత్ సబ్సిడీలతోపాటు పలు ప్రత్యేక రాయితీలను ప్రకటిస్తూ పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎస్.యువరాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పాలసీ కింద ఏర్పాటయ్యే తొలి 50 యూనిట్లకు యూనిట్‌కు రూ.3 సబ్సిడీని ఐదేళ్లపాటు ఇవ్వనున్నారు. ఆ తర్వాత ఏర్పాటు అయ్యే కంపెనీలకు యూనిట్ రూ.1.50 చొప్పున సబ్సిడీ కల్పిస్తారు.

దీంతో పాటు తొలి ఐదేళ్లు 100 శాతం విద్యుత్ డ్యూటీ మినహాయింపు ఇవ్వనున్నారు. అత్యంత కారుచౌకగా భూములను కేటాయించేలా పాలసీలో పలు ప్రతిపాదనలు చేశారు. ప్రారంభంలో 33 ఏళ్లపాటు భూములను లీజు విధానంలో కేటాయిస్తారు. ఆ తర్వాత పదేళ్లు చొప్పున గరిష్ఠంగా రెండు సార్లు లీజు పెంచుకోవడానికి అనుమతిస్తారు. లీజు ధరను యూనిట్ ఆదాయంలో ఐదు శాతంగా నిర్ణయించారు. యూనిట్ నెలకొల్పి మూడేళ్లు విజయవంతంగా నిర్వహిస్తే మొదటి 50 యూనిట్లకు ఎకరా రూ.30 లక్షలు చొప్పున, ఆ తర్వాత రూ.50 లక్షలు చొప్పున విక్రయిస్తారు. వీటితోపాటు పెట్టుబడిలో 40 శాతం ఇన్వెస్ట్‌మెంట్ సబ్సిడీ, రూ.40కే కిలో లీటరు నీరు, ఉద్యోగుల నైపుణ్య శిక్షణకు రూ.7 లక్షలు, ఎస్‌జీఎస్టీ, స్టాంప్ డ్యూటీల్లో వంద శాతం మినహాయింపు లాంటి పలు ఆర్థిక ప్రయోజనాలు కల్పించారు.

ఐదు క్లస్టర్లు..

రాష్ట్రంలోని పరిశ్రమలు, వ్యవసాయ సంబంధిత యూనిట్ల ఆధారంగా ఐదు సర్క్యులర్ క్లస్టర్లను ఏర్పాటు చేయనున్నట్లు పాలసీలో పేర్కొన్నారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో సిమెంట్, లైమ్‌స్టోన్, సోలార్ ప్యానల్స్, మైనింగ్ వ్యర్థాల క్లస్టర్, కర్నూలు, కడపలో ముడి ఇనుము, బెరైటీస్ వ్యర్థాలు, విశాఖ, విజయనగరంలో ఉక్కు, పెట్రోకెమికల్స్ రిఫైనరీ, ఫెర్టిలైజర్స్, ఫార్మా, షిప్ రిపేర్ ఆధారిత క్లస్టర్, కృష్ణా–గోదావరి జిల్లాల్లో ఫిషరీస్, వంటనూనెలు, గ్రానైట్, మైనింగ్, సిమెంట్, శ్రీసిటీ–తిరుపతి క్లస్టర్‌లో ఎలక్ట్రానిక్స్, ఆటో టైర్ ఫార్మా రీసైక్లింగ్ యూనిట్లను ఏర్పాటు చేయనున్నారు. వీటితోపాటు ఉమ్మడి రీ సైక్లింగ్, లాజిస్టిక్ హబ్స్, ట్రైనింగ్ లాంటి వసతులను ఏర్పాటు చేయనున్నట్లు పాలసీలో పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో..7వ స్థానంలో ఏపీ.. 8వ స్థానంలో తెలంగాణ

మరణాల్లో 9వ స్థానంలో ఏపీ, 10వ స్థానంలో తెలంగాణ

'రోడ్ యాక్సిడెంట్స్ ఇన్ ఇండియా-2023' నివేదికలో వెల్లడి



సాక్షి, న్యూఢిల్లీ: రోడ్డు ప్రమాదాల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు టాప్–10లో నిలిచాయి. దేశవ్యాప్తంగా జరిగిన ప్రమాదాల్లో ఈ రెండు రాష్ట్రాల్లో గణనీయ సంఖ్యలో మరణాలు సంభవించినట్లు 'రోడ్ యాక్సిడెంట్స్ ఇన్ ఇండియా–2023' నివేదికలో తేలింది. రోడ్డు ప్రమాదాల్లో ఆంధ్రప్రదేశ్ 7వ స్థానంలో ఉండగా, తెలంగాణ 8వ స్థానంలో నిలిచింది. ఇక మరణాల్లోనూ టాప్–10లో ఈ రెండు రాష్ట్రాలు ఉండటం గమనార్హం. 9వ స్థానంలో ఆంధ్రప్రదేశ్ ఉండగా, పదోస్థానంలో తెలంగాణ ఉన్నట్లు నివేదిక స్పష్టం చేసింది. దేశంలో రోడ్డు ప్రమాదాలకు సంబంధించి శుక్రవారం కేంద్ర రోడ్డు, రవాణా శాఖ 'రోడ్ యాక్సిడెంట్స్ ఇన్ ఇండియా– 2023' రిపోర్ట్‌ను విడుదల చేసింది. ఆ ఏడాది దేశవ్యాప్తంగా 36 రాష్ట్రాలు/యూటీల్లో 4,80,583 రోడ్డు ప్రమాదాలు జరగగా, 1,72,890 మంది మృత్యువాత పడినట్లు వెల్లడించింది. 2022తో పోల్చితే 2023లో రోడ్డు ప్రమాదాలు 4.2 శాతం పెరిగాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఇందులో 18–45 ఏళ్ల మధ్య వయసుగల యువకులే 66.4 శాతంగా ఉన్నట్లు పేర్కొంది. అయితే... దేశంలో అత్యధిక ప్రమాదాలు జరిగిన రాష్ట్రాల జాబితాలో తమిళనాడు (67,213) మొదటి స్థానంలో ఉండగా, 55,327 ప్రమాదాలతో మధ్యప్రదేశ్, 48,091 ప్రమాదాలతో కేరళ తర్వాతి స్థానాల్లో నిలిచాయి. ఆంధ్రప్రదేశ్‌లో 2023లో 8,272 రోడ్డు ప్రమాదాలు జరిగినట్లు నివేదిక చెబుతోంది. వీటిలో 6.21 రేటుతో 3,806 మంది మృత్యువాత పడ్డారు. ఇక ప్రమాదాల్లో తెలంగాణ 8వ స్థానంలో ఉండగా, ప్రమాద మరణాల్లో 10వ స్థానంలో నిలిచింది. ఈ యాక్సిడెంట్లలో 7,660 మంది ప్రాణాలు కోల్పోయినట్లు కేంద్రం వెల్లడించింది.

మానవ తప్పిదాలే కారణం..

దేశంలో ప్రతి ఏటా రోడ్డు ప్రమాదాలు పెరగడానికి మానవ తప్పిదాలే కారణమని వెల్లడించింది. ఇందులో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడం, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం, హెల్మెట్లు, సీట్ బెల్ట్‌లు వంటి భద్రతా పరికరాలు వాడకపోవడం వల్లే జరుగుతున్నాయని తెలిపింది. మరణాల్లో అత్యధికంగా ద్విచక్ర వాహనదారులు (45 శాతం) ఉన్నారని, ఆ తర్వాతి స్థానంలో పాదచారులు ఉన్నట్లు తెలిపింది.

ఐఏఎస్ అధికారి శివశంకర్‌ను ఏపీకి కేటాయించిన కేంద్ర ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర కేడర్‌లో జాయింట్ సెక్రటరీ కేడర్‌లో పనిచేస్తున్న ఐఏఎస్ అధికారి శివశంకర్ లోతేటిని తిరిగి ఆంధ్రప్రదేశ్‌కు కేటాయిస్తూ డీఓపీటీ(డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్) నిర్ణయించింది. ఈమేరకు శుక్రవారం కేంద్రప్రభుత్వ కార్యదర్శి అవనీశ్ మిశ్రా ఉత్తర్వులు జారీచేశారు. తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా డీఓపీటీ ఈమేరకు నిర్ణయం తీసుకుంది. వెంటనే తెలంగాణ రాష్ట్ర కేడర్ నుంచి శివశంకర్ లోతేటిని రిలీవ్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది.

జర్నలిస్టుల అక్రిడిటేషన్ల కాల పరిమితి పెంపు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల కాలపరిమితిని ఈ నెలాఖరుతో ముగుస్తున్న నేపథ్యంలో కార్డుల కాలపరిమితిని ప్రభుత్వం మరో 3 నెలలు పాటు పొడిగించింది. ఈ మేరకు సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు హిమాన్షు శుక్ల శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ఆగస్టు 31 వరకు అక్రిడిటేషన్ కార్డులకు కాలపరిమితి ఉంది. సెప్టెంబర్ 1 నుంచి నవంబర్ 30 వరకూ లేదా నూతన అక్రిడేషన్ కార్డులు జారీ చేసే ప్రక్రియ ఏది ముందు జరిగితే అప్పటివరకు పొడిగింపు ఉత్తర్వులు అమల్లో ఉంటాయని వెల్లడించారు.

జెడ్డా ఓడరేవుకు నావికాదళ నౌకలు.. తమల్, సూరత్



సౌదీ అరేబియా చేరుకున్న భారతీయ నౌకాదళ నౌకలు ఐఎన్ఎస్ తమల్, ఐఎన్ఎస్ సూరత్

సింధియా: భారతీయ నేవీ స్టెల్త్ ఫ్రిగేట్ ఐఎన్ఎస్ తమల్, గైడెడ్ మిస్సైల్ డెస్ట్రాయర్ ఐఎన్ఎస్ సూరత్ జెడ్డా పోర్ట్‌కు చేరాయి. ఈ సందర్శన ప్రధానంగా సౌదీ అరేబియాతో భారత రక్షణ సహకారం, స్నేహపూర్వక సంబంధాలను బలోపేతం చేయడానికి, అలాగే కొత్త రక్షణ మార్గాలను అన్వేషించడానికి ఉద్దేశించినదని ఇండియన్ నేవీ వర్గాలు తెలిపాయి. పర్యటనలో భాగంగా, ఇరు దేశాల మధ్య సంబంధాలను మరింత మెరుగుపరిచేందుకు క్రీడా పోటీలు, పరస్పర చర్చలు జరుగుతాయి. దీని ద్వారా రాయల్ సౌదీ అరేబియా నావికాదళాలు, బోర్డర్ గార్డుల అధికారులు అలాగే భారత నావికాదళం అధికారులు పరస్పర పరిజ్ఞానం పంచుకుంటూ స్నేహపూర్వక సంబంధాలను పెంపొందించుకోవడానికి కృషి చేస్తారు.

పిన్నెల్లి సోదరుల ముందస్తు బెయిల్ పిటిషన్ కొట్టివేత

సాక్షి, అమరావతి: టీడీపీ నేతలు జవిశెట్టి వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావుల హత్య కేసులో మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకటరామిరెడ్డిల ముందస్తు బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. నేర తీవ్రత, ఇతర ఆధారాలను పరిగణనలోకి తీసుకుంటే పిటిషనర్లకు ముందస్తు బెయిల్ మంజూరు చేస్తే దర్యాప్తునకు ఆటంకం కలుగుతుందని న్యాయమూర్తి జస్టిస్ వెణుతురుమల్లి గోపాలకృష్ణారావు శుక్రవారం తీర్పు వెలువరించారు. కాగా, టీడీపీలో ఆధిపత్య పోరులో భాగంగా పల్నాడు జిల్లా, వెల్దుర్తి మండలం, గుండ్లపాడుకు చెందిన టీడీపీ నేతలు జవిశెట్టి వెంకటేశ్వర్లు అలియాస్ ముద్దయ్య, జవిశెట్టి కోటేశ్వరరావు ఈ ఏడాది మే 24న హత్యకు గురైనట్లు పోలీసులు తేల్చారు. అయినప్పటికీ రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి కక్ష సాధింపు చర్యల్లో భాగంగా పిన్నెల్లి సోదరులను నిందితులుగా చేర్చారు. ఈ నేపథ్యంలో వారు ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రహిత రాష్ట్రం దిశగా ఏపీ!

సీఎస్ విజయానంద్ వెల్లడి

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌ను వచ్చే ఏడాది జూన్ 5వ తేదీ ప్రపంచ పర్యావరణ దినోత్సవం నాటికి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ శుక్రవారం పేర్కొన్నారు. ఇందులో భాగంగానే రాష్ట్ర పరిపాలనా కేంద్రమైన సచివాలయంలో ఈనెల 15వతేదీ నుండి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని ప్రభుత్వం పూర్తిగా నిషేధించిందని తెలిపారు. ఈ ప్రక్రియలో భాగంగా ప్లాస్టిక్ తాగునీటి బాటిళ్ళ స్థానే స్టెయిన్ లెస్ స్టీల్, గాజు సీసాలతో సురక్షిత తాగునీటిని అందించేందుకు ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను సచివాలయంలోని 3వ భవనంలో విజయానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ సచివాలయంలో ఉద్యోగులు అందరికీ ఉచితంగా స్టెయిన్ లెస్ స్టీల్ మంచినీటి బాటిళ్ళను పంపిణీ చేయడం జరిగిందన్నారు. బయటి నుండి వచ్చే సందర్శకులు కూడా సచివాలయంలోకి ప్లాస్టిక్ మంచినీటి బాటిళ్లు, ఇతర ప్లాస్టిక్ వస్తువులు తీసుకురాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వేలాది మంది విద్యార్థులు కేవలం ఫీజు రీయింబర్స్‌మెంట్‌పైనే ఆధారపడి చదువుతున్నారని, వారికి సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పీడీఎఫ్ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు వెంటనే నిధులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. ఈ విషయమై విద్యా శాఖా మంత్రి నారా లోకేశ్, విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్‌లకు లేఖ రాసినట్లు తెలిపారు.





గద్దల ఎగ్జిబిషన్

● పక్షిలోకం



పిల్లలూ... మన దగ్గర డాగ్ ఎగ్జిబిషన్ జరిగినట్టుగా కువైట్‌లో గద్దల ఎగ్జిబిషన్ జరుగుతుంటుంది. ప్రస్తుతం ఆగస్టు 28- 30 తేదీల్లో మూడు రోజుల పాటు అక్కడ గద్దల (ఫాల్కన్) ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నారు. ఎడారి దేశాల్లో గద్దల పెంపకం చాలా కామన్. ప్రతి ఇంట్లో వీటిని పెంచుతారు. వీటికి వేటాడటం నేర్పించడానికి 'ఫాల్కన్రీ' అంటారు. పూరం ఎడారుల్లో ఆహారం దొరకడం చాలా కష్టంగా ఉండేది. అందుకని ప్రయాణాల్లో గద్దలను వెంట పెట్టుకుని వెళ్లే వాళ్లు. ఆహారం లేనప్పుడు వాటిని వదిలితే అవి ఎగురుకుంటూ వెళ్లి పిట్టల్ని, కుందేళ్లని పట్టుకునేవి. గద్దలను 'ఆకాశానికి రాజు' అని పిలుస్తారు.అవి చాలా ఎత్తున ఎగురుతాయి. వాటి దృష్టి మనిషి దృష్టి కంటే పదింతలు స్పష్టంగా దీర్ఘంగా ఉంటుంది. కువైట్‌లో గద్దల హాస్పిటల్ ఉంది. అక్కడ నిత్యం గద్దలను తీసుకు వచ్చి వైద్యం చేయిస్తుంటారు. పిల్లలు భయపడకుండా వీటిని సాకుతారు. గద్దలను శక్తి ప్రతిరూపంగా భావిస్తారు.

● మీకు తెలుసా?

పిగ్గీ బ్యాంక్ ఎప్పుడు పుట్టింది?



పిల్లలూ... మీరంతా డబ్బులను భద్రంగా దాచుకునేందుకు పిగ్గీ బ్యాంక్‌ను ఉపయోగిస్తుంటారు కదూ. పెద్దలు అప్పుడప్పుడూ ఇచ్చిన డబ్బుల్ని ఇందులో దాచుకొని, అది నిండాక పగలగొట్టి వాడుకుంటారు కదూ. వరాహం ఆకారంలో ఉండే ఈ పిగ్గీ బ్యాంక్ వాడేందుకే కాదు, చూసేందుకూ చాలా ఆకర్షణీయంగా ఉంటుంది. అందుకే చాలామంది దీన్ని ఇంట్లో అలంకరణ వస్తువుగానూ పెట్టుకుంటారు.

ఇలా డబ్బు దాచుకునే సాధనాలను వాడే అలవాటు క్రీ.పూ 2వ శతాబ్దంలో మొదలైందని చరిత్రకారులు అంచనా వేస్తున్నారు. పురాతత్వ శాస్త్రవేత్తలు తవ్వకాలు జరిపినప్పుడు ఆ కాలంలో వారు డబ్బులు దాచే పెట్టెలు, హుండీలు బయటపడ్డాయి. వాటిని వివిధ రకాల లోహాలతో తయారు చేశారు. అయితే వరాహ ఆకారంలో ఇలాంటివి తయారు చేయడం మాత్రం క్రీ.శ. 12వ శతాబ్దంలో మొదలైందని అంటారు. వరాహ ఆకారంలో ఉన్న ఈ హుండీలు జావా ద్వీపంలో మొట్టమొదటిసారి దొరికినట్లు చెబుతున్నారు. ఇండోనేషియాలోని తూర్పు జావా ప్రావిన్స్‌లో పెద్ద సంఖ్యలో వరాహ ఆకారపు పిగ్గీ బ్యాంకులు కనుగొన్నారు.

ప్రస్తుతం మనం చూస్తున్న ఆకారంలోని పిగ్గీ బ్యాంకులు 13వ శతాబ్దంలో జర్మనీలో తయారయ్యాయని అంటున్నారు. అక్కడ పందులను అదృష్టానికి చిహ్నాలుగా గౌరవించేవారని, అందుకే పంది ఆకారంలో వాటిని తయారు చేసేవారని భావిస్తున్నారు. ఈ పిగ్గీ బ్యాంక్‌లు సిరామిక్ లేదా పింగాణీతో తయారు చేస్తారు. వివిధ సైజులు, ఆకారాలతో ఇవి లభ్యమవుతాయి. విదేశాల్లో పిల్లలకు పుట్టినరోజు బహుమతులుగా వీటిని ఇచ్చేందుకు చాలామంది ఆసక్తి చూపుతారు. పిల్లల్లో పొదుపు ఆలోచన పెంచేందుకు కొన్ని విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు ఈ పిగ్గీ బ్యాంకులను వారికి ఉచితంగా అందిస్తుంటాయి.



● చిత్రం చెప్పిన కథ



చదువుల దేవుడు

విఘ్నేశ్వరుడు చదువులకు కూడా దేవుడు. అందుకే వినాయక చవితి రోజు మనం స్కూలు పుస్తకాలు వినాయకుడి ముందు పెట్టి బాగా చదువురావాలని కోరుకుంటాం. ప్రస్తుతం దేశమంతా వినాయక ఉత్సవాలు జరుగుతున్నాయి. నిమజ్జనం కూడా కొనసాగుతోంది. ఇక్కడ చూడండి... చెన్నైలో వినూత్న వినాయకుడు నిమజ్జనానికి బయల్దేరి వెళుతున్నాడు. ఈ వినాయకుణి బంగారు రంగు వేసిన స్టీలు పళ్లేలతో తయారు చేశారు. అందుకే చూడగానే ఆకర్షిస్తున్నాడు. జైజై గణేశా.

● వండర్ కిడ్

11 ఏళ్ల రైతు... పండిస్తోంది చూడు...





11 ఏళ్ల పాప ఏం చేస్తుంది? స్కూల్‌కెళ్లి, ఇంటికొచ్చి, హోం వర్క్ చేసుకుని, తోటి పిల్లలతో ఆడుకుంటుంది. లేదంటే టీవీ ముందు కూర్చుని రకరకాల ప్రోగ్రామ్స్ చూస్తుంది. అయితే కేరళ రాష్ట్రం కన్నూర్‌కు చెందిన వైఘశ్రీ మాత్రం మొక్కలతో దోస్తీ కడుతోంది. రకరకాల కూరగాయలు పండిస్తూ అందరి చేతా శెభాష్ అనిపించుకుంటోంది.

అసలీ ఇష్టం ఎలా మొదలైంది? వైఘశ్రీ తండ్రి ఓ హోటల్ యజమాని. 2019లో ఆయనకు ఓ ప్రమాదం జరిగింది. ఆ నొప్పి నుంచి నుంచి కోలుకునే క్రమంలో మొక్కలను పెంచడం మేలు చేస్తుందని కొందరు ఆయనకు సలహా ఇచ్చారు. దీంతో ఆయన తన ఇంటి పెరట్లో మొక్కలు పెంచడం ప్రారంభించారు. ఆ సమయంలో వైఘశ్రీకి ఐదేళ్లు. తండ్రి చేసే శ్రద్ధగా గమనిస్తూ ఉండేది. సాయంత్రం స్కూల్ నుంచి వచ్చినప్పటి నుంచి రాత్రి పొద్దుపోయేవరకు తండ్రికి తోటపనిలో సాయం చేస్తూ గడిపేది. ఆ తర్వాత తండ్రి సాయం లేకుండా తనే అన్నీ స్వయంగా చేయడం ప్రారంభించింది. తన ఆసక్తిని గమనించి తండ్రి ఆమెను మరింత ప్రోత్సహించాడు.

మొక్కలు నాటడం, నీళ్లు పోయడంతోనే వైఘశ్రీ ఆగిపోలేదు. మొక్కల సంరక్షణ, విత్తన శుద్ధి, మేలు రకాలు పండించడం, సేంద్రియ ఎరువులు వంటి అంశాలు తెలుసుకునేందుకు అనేక యూట్యూబ్ వీడియోలను చూస్తుంది. ఆ నేలలో ఎలాంటి విత్తనాలు పనిచేస్తాయి, తెగుళ్లు రాకుండా ఉండాలంటే ఏం చేయాలనే అంశాలను నిపుణుల ద్వారా తెలుసుకుంటుంది. తమకున్న 8 సెంట్ల స్థలంలో ప్రస్తుతం వైఘశ్రీ అన్ని రకాల కూరగాయలనూ పండిస్తోంది. వాటిని ఎక్కడా అమ్మదు. ఇంట్లోకి వాడగా మిగిలినవి తోటివారికి, అవసరమైన వారికి ఉచితంగా ఇచ్చేస్తుంది. తన పాఠశాలలో నడిచే మధ్యాహ్న భోజనానికి సైతం కూరగాయలను అందిస్తుంది. వైఘశ్రీ కృషికి గుర్తింపు పంచాయతీ అధికారులు రెండుసార్లు 'కుట్టి కర్షక' (చిన్నారి రైతు) పురస్కారాన్ని ఇచ్చి సత్కరించారు.

● కథ

సౌందర్యరాశి

విదర్భ రాజ్యాన్ని పాలించే ఇంద్రసేనుడికి ఒక్కగానొక్క కొడుకు ఉదయతేజుడు. ఇంద్రసేనుడికి వృద్ధాప్యం మీదపడటంతో కొడుకుకి పెళ్లి చేసి, రాజ్యాన్ని అతనికి అప్పగించాలని భావించాడు. శాక్య దేశ రాకుమార్తె తన కుమారుడికి సరైన జోడీ అని భావించి, ఆమె చిత్రపటాన్ని తెప్పించి విషయాన్ని కొడుకుతో ప్రస్తావించాడు.

ఉదయతేజుడు ఆ చిత్రపటాన్ని చూడకుండా 'నేను ఎవరిని పడితే వారిని పెళ్లి చేసుకోను. ఈ లోకంలోకెల్లా అత్యంత సౌందర్యరాశిని మాత్రమే పెళ్లాడతాను' అన్నాడు. అది విపరీతమైన కోరిన అని ఇంద్రసేనుడు కొడుకుకు నచ్చజెప్పాలని ప్రయత్నించాడు. అయినా ఉదయతేజుడు వినలేదు. తాను దేశాటనం చేస్తానని, అత్యంత సౌందర్యరాశిని కనుగొన్నాకే తిరిగివస్తానని అన్నాడు. చేసేదిలేక ఇంద్రసేనుడు సరే అన్నాడు.

అలా కొన్ని వారాలపాటు రకరకాల దేశాలు తిరిగిన ఉదయతేజుడికి ఎక్కడా సౌందర్యరాశి కనిపించలేదు. ఓరోజు మధ్యాహ్నం ఆకలితో పూటకూళ్లమ్మ ఇంటికి వెళ్లి భోజనం చేశాడు. తానెవరో చెప్పకుండా ఆమెతో ఆమాట, ఈమాట మాట్లాడుతూ 'ఈ లోకంలో అత్యంత సౌందర్యరాశి ఎవరు' అని అడిగాడు. దానికామె సమాధానంగా 'ఎవరో ఏంటి..నా మనవరాలే' అంది. వెంటనే ఆమెను చూస్తానని పట్టుబట్టాడు ఉదయతేజుడు. పూటకూళ్లమ్మ తన మనవరాల్ని పిలిచింది. నిజంగా ఆమె చాలా అందంగా ఉంది.

ఆమెతో మాట్లాడుతూ 'ఈ లోకంలో అత్యంత సౌందర్యరాశి ఎవరు' అని అడిగాడు. దానికామె సమాధానంగా 'నా స్నేహితురాలు ఉత్పల ఉంది. తను అత్యంత సౌందర్యరాశి' అంది. ఆమె సాయంతో ఉదయతేజుడు వెళ్లి ఉత్పలను చూశాడు. కళ్లు చెదిరే ఆమె సౌందర్యానికి ఆశ్చర్యపోయి ఆమెను పరిచయం చేసుకున్నాడు. ఆమెతో మాట్లాడుతూ 'ఈ లోకంలో అత్యంత సౌందర్యరాశి ఎవరు' అని మళ్లీ అడిగాడు. దానికామె కాసేపు ఆలోచించి 'ఈ దేశ రాజనర్తకి గొప్ప సౌందర్యరాశి అని అంటూ ఉంటారు' అని చెప్పింది.

వెంటనే ఉదయతేజుడు రాజధానికి చేరుకున్నాడు. అక్కడ రాజనర్తకి ఇల్లు చేరుకున్నాడు. ఆ సమయంలో ఆమె నాట్యసాధన చేస్తోంది. గొప్ప సౌందర్యంతో నాట్యం చేస్తున్న ఆమెను చూస్తే దేవకన్యే అనిపించింది. సాధన పూర్తయ్యాక ఆమె దగ్గరికి వెళ్లి, ఆమె నాట్యాన్ని మెచ్చుకుంటూ 'ఈ లోకంలో అత్యంత సౌందర్యరాశి ఎవరు' అని మరోమారు అడిగాడు. దానికామె 'మా దేశ రాకుమారి అత్యంత సౌందర్యరాశి. అందంలోనే కాదు, గుణంలోనూ ఆమె గొప్పదే' అని చెప్పింది. ఆ రాజనర్తకి సాయంతో ఉదయతేజుడు రాకుమారి అంత:పురంలోకి చేరుకున్నాడు. అక్కడ రాకుమార్తె అందం చూశాక అతని కళ్లు చెదిరిపోయాయి. తనే లోకంలో అత్యంత సౌందర్యరాశి అనిపించింది.

రాజనర్తకితోపాటు ఆమెను సమీపించాడు. కాసేపు మాట్లాడిన తర్వాత 'ఈ లోకంలో అత్యంత సౌందర్యరాశి ఎవరు' అని మరోసారి ఆమెను ప్రశ్నించాడు. ఈసారి ఆమె కూడా మరొకరి పేరు చెబుతుందని, మళ్లీ ప్రయాణం కట్టాలని ఉదయతేజుడు భావించాడు. కానీ రాకుమార్తె నవ్వుతూ 'ఇతరులకు సాయం చేసే మంచి మనసును మించిన సౌందర్యం ఈ ప్రపంచంలో ఏదీ లేదు' అని చెప్పింది. ఆ సమాధానం ఉదయతేజుడిని ఆకట్టుకుంది. అందం, అణకువ, దయాగుణం కలిగిన ఈమే తనకు భార్య అని భావించి తన రాజ్యానికి తిరిగివెళ్లాడు.

తండ్రి ఇంద్రసేనుడి దగ్గరికి వెళ్లి జరిగిన విషయం చెప్పాడు. తాను ఆ రాకుమార్తెనే వివాహం చేసుకుంటానని వివరించాడు. అంతా విన్న ఇంద్రసేనుడు నవ్వుతూ 'నేను నీకు చూపించబోయిన చిత్రపటం కూడా ఆ రాకుమారిదే. తన పేరు చంద్రలేఖ. తనే నీకు సరైన జోడీ' అని చెప్పాడు. పెద్దల ఆశీర్వాదంతో ఉదయతేజుడు, చంద్రలేఖ ఒక్కటయ్యారు.



● మహనీయులు

బాల సాహిత్య బ్రహ్మ నాళం కృష్ణారావు




తెలుగు నేలపై ఎంతోమంది రచయితలు రచనలు చేసిన తమ ఘనతను చాటారు. పిల్లల కోసం రచనలు చేసి, వారి మనసుల్లో సుస్థిర స్థానం ఏర్పరచుకున్న రచయిత నాళం కృష్ణారావు. అందుకే ఆయన్ను 'బాల సాహిత్యబ్రహ్మ', 'మధుర కవి' అంటుంటారు. నాళం కృష్ణారావు 1881 జనవరి 18న తూర్పుగోదావరి జిల్లా మండపేట గ్రామంలో జన్మించారు. చిన్నతనం నుంచే ఆయనకు సాహిత్యాభిలాష ఉండేది. తన పదిహేడో ఏట రాజమండ్రిలో గౌతమీ గ్రంథాలయాన్ని స్థాపించారు. స్త్రీలు కూడా చదువుకోవాలని మహిళావిద్యను ప్రోత్సహించారు. సమాజంలో కులమతాల అడ్డుగోడలు ఉండకూడదని పోరాడేవారు. అనేక మంది వితంతువుల వివాహాలు జరిపించారు. దేశానికి స్వాతంత్ర్యం కావాలని కాంక్షించేవారు. ఆయన సతీమణి నాళం సుశీలమ్మ ఆయన బాటలో నడిచి స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని విదేశీ వస్త్రాలను దహనం చేశారు. మహాత్మాగాంధీ రాజమండ్రి వచ్చినప్పుడు ఈ దంపతులు ఆయనను కలిశారు.

1911-15 ప్రాంతాలలో నాళం కృష్ణారావు తొలి తెలుగు సచిత్ర మాసపత్రిక 'మానవ సేవ' నిర్వహించారు. పిల్లల కోసం 'గోరుముద్దలు', 'మీగడ తరగలు', 'వెన్నెబుడగలు', 'పాల తరగలు', 'తేనె చినుకలు' వంటి కవిత్వ రచనలు చేశారు. అలతి పదాలతో పిల్లలకు అర్థమయ్యేలా పద్యాలు రాశారు. ఆయన రాసిన 'గాంధీ విజయధ్వజ నాటకం'(1921), 'గాంధీ దశావతార లీలలు'(1932) గ్రంథాలను అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం నిషేధించింది. పదివేల సామెతలు, జాతీయ లోకోక్తులను ఆయన సేకరించారు. శ్రీకృష్ణరాయ ఆంధ్ర విజ్ఞాన సర్వస్వాన్ని సంకలనం చేశారు. కందుకూరి వీరేశలింగం పంతులు స్థాపించిన హితకారిణీ సమాజానికి, వీరేశలింగ పాఠశాలకు జీవితాంతం అధ్యక్షులుగా పని చేశారు. 1961 మార్చి 17న మరణించారు.


● మన పుస్తకాలు

అలరించే అలనాటి కథలు



పిల్లలకు కథలంటే చాలా ఇష్టం. విన్నకొద్దీ వింటూనే ఉంటారు. ముఖ్యంగా రాజులు, రాజ్యాలు, జంతువుల కథలంటే వారికి మరింత ఇష్టం. తాతయ్యలు, నానమ్మలు చెప్పిన అలాంటి అలవాటి కథలను సేకరించి, పున:కథనం చేశారు ప్రముఖ రచయిత వల్లూరు శివప్రసాద్. ఈ పుస్తకంలో మొత్తం 13 కథలున్నాయి. అవన్నీ చిన్నారుల్ని అలరిస్తాయి. బొమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి.

కొత్త గ్రహంపై భూమి గురుతుల కోసం ప్రయత్నం



అమెరికన్ బాలసాహిత్యకారిణి డోనా బార్బా హిగ్యురా 2021లో రాసిన నవల ఇది. ఒక తోకచుక్క గ్రహాన్ని ఢీకొన్న తర్వాత మానవజాతిని కొనసాగించడానికి పెట్రా పెనా అనే పాప తన కుటుంబంతో సహా వందల మందితో కలిసి కొత్త గ్రహంపై అడుగు పెడుతుంది. భూమి, భూమ్మీద మనుషుల జీవనం, చరిత్రను కొత్త గ్రహంపై సజీవంగా ఉంచడానికి పెట్రా చేసిన ప్రయత్నమే ఈ నవల కథాంశం. ఆద్యంతం ఆసక్తిగా చదివించే శైలి ఈ పుస్తకం సొంతం.

బిజినెస్ రీల్

కేంద్రానికి ఎల్‌ఐసీ డివిడెండ్ రూ.7,324 కోట్లు



న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వానికి రూ.7,324 కోట్లను డివిడెండ్ కింద ఎల్‌ఐసీ చెల్లించింది. గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈ మొత్తానికి చెక్కును కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఎల్‌ఐసీ సీఈవో, ఎండీ ఆర్.దొరైస్వామి అందజేసినట్టు ప్రకటించింది. ఆగస్ట్ 26న జరిగిన వార్షిక సమావేశంలో డివిడెండ్ పంపిణీకి వాటాదారులు ఆమోదం తెలిపినట్టు వెల్లడించింది. ఎల్‌ఐసీ నిర్వహణలోని ఆస్తుల విలువ 2025 మార్చి చివరి నాటికి రూ.56.23 లక్షల కోట్లకు చేరుకుందని.. జీవిత బీమా మార్కెట్‌లో అగ్రగామిగా కొనసాగుతున్నట్టు తెలిపింది.

గిఫ్ట్ సిటీలో ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీ శాఖ



న్యూఢిల్లీ: ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీ తాజాగా గుజరాత్‌లోని గిఫ్ట్ సిటీలో తమ తొలి అంతర్జాతీయ శాఖను ప్రారంభించింది. విదేశీ దీర్ఘకాలిక ఇన్వెస్టర్లు భారతీయ మార్కెట్లలో ఇన్వెస్ట్ చేసేందుకు ఇది తోడ్పడుతుందని సంస్థ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ నవీన్ అగర్వాల్ తెలిపారు. ఐఎఫ్‌ఎస్‌సీ కేంద్రంగా ఈక్విటీలు, ఫిక్స్‌డ్ ఇన్‌కం నుంచి ఆల్టర్నేటివ్, హైబ్రిడ్ సాధనాల వరకు వివిధ పథకాలను అందుబాటులోకి తేనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇందులో భాగంగా ప్రత్యేక స్కీమును ఆవిష్కరించారు. పట్టణీకరణ పెరుగుతుండటం, డిజిటల్ ఫస్ట్ ఎకానమీ, పాలసీలపరంగా సంస్కరణల దన్నుతో భారత్ అధిక వృద్ధికి సంబంధించి కొత్త దశలో ఉందని అగర్వాల్ చెప్పారు.

ఈసీఐఎల్‌కి స్కోప్ అవార్డు



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ రంగ దిగ్గజం ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఈసీఐఎల్) 2022–23 సంవత్సరానికి గాను ఇనిస్టిట్యూషనల్ ఎక్సలెన్స్ విభాగంలో ప్రతిష్టాత్మక స్కోప్ ఎమినెన్స్ అవార్డును దక్కించుకుంది. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా సంస్థ సీఎండీ అనేష్ కుమార్ శర్మ ఈ పురస్కారాన్ని అందుకున్నారు. కార్పొరేట్ గవర్నెన్స్, ఆర్థిక నిర్వహణ, సామాజిక బాధ్యతలు నిర్వర్తించడం తదితర అంశాల్లో విశేషమైన పనితీరు కనపర్చిన కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలకు ఈ అవార్డును ప్రదానం చేస్తారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

30-8-2025

విశాఖ	555–00
చిత్తూరు	578–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	550–00
విజయవాడ	560–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	515–00
వరంగల్	517–00
రిటైల్ ధర	5.75

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ITC	409.5	2.15
SHRIRAMFIN	581.9	1.79
BEL	369.4	1.53
LT	3,605.00	1.26
ASIANPAINT	2,520.00	1.25

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
M&M	3,200.00	-2.89
RELIANCE	1,356.00	-2.16
INFY	1,469.00	-2.07
APOLLOHOSP	7,611.00	-1.51
ADANIENT	2,247.90	-1.2

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	6,551
ఎన్ఎస్ఈ	90,937
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,40,345
ఎఫ్ఐఐ	- 8,313
డీఐఐ	+ 11,488

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	64.02	$ 64.06
బ్రెంట్	67.47	$ 67.98

భారత్-రష్యా క్రూడ్ బంధం!



- చౌక చమురు దిగుమతులతో లాభాల పంట
- ప్రైవేటు రిఫైనరీలకే అత్యధిక ప్రయోజనం
- రిలయన్స్ ఇండస్ట్రీస్, నయరా ఎనర్జీలకు వరం
- వినియోగదారులకు దక్కని ఫలం...
- ప్రభుత్వ చమురు రిటైలర్లపై పరోక్ష సబ్సిడీల ప్రభావం

భారత్ పాలిట వరంలా మారిన రష్యా చమురు అంతర్జాతీయంగా సెగలు పుట్టిస్తోంది. రష్యా చమురుతో ఉక్రెయిన్ యుద్ధానికి భారత్ పరోక్షంగా ఆజ్యం పోస్తోందంటూ అమెరికా అగ్గిమీద గుగ్గిలమవుతోంది. ఈ సాకుతో మరో 25 శాతం అదనపు సుంకాలను కూడా వడ్డించింది. మరి నిజంగా ఈ చౌక క్రూడ్‌తో భారతీయ వినియోగదారులు లాభపడుతున్నారా? అంటే సమాధానం కాదనే వస్తోంది. ప్రైవేటు రిఫైనరీ కంపెనీలకు మాత్రం లాభాల పంట పండుతోంది. ఇదే అమెరికా, భారత్ మధ్య ఇప్పుడు 'క్రూడ్' యుద్ధానికి దారితీస్తోంది!!

- సాక్షి, బిజినెస్ డెస్క్

రష్యా చౌక చమురు దిగుమతి లాభాల్లో అధిక వాటా దేశీయ ప్రైవేటు రంగ రీఫైనరీలు దక్కించుకుంటున్నాయి. ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో యూరప్‌తో సహా అనేక దేశాలు ఆంక్షలు, నిషేధం విధించడంతో రష్యా చమురుపై 'మాస్కో రాయితీ' ప్రకటించింది. ఈ క్రమంలో చమురు దిగుమతి బిల్లు తగ్గించుకునేందుకు భారత్ రష్యా నుంచి తక్కువ ధరకు చమురు కొనుగోలు చేస్తోంది. 2002 వరకు కేవలం 1 శాతంగా ఉన్న రష్యా చమురు దిగుమతులు 2025 ఆగస్టు చివరి నాటికి గణనీయంగా 37 శాతానికి చేరుకుంది. గత నాలుగేళ్లుగా భారత్ సగటున రోజుకు 1.5 మిలియన్ బ్యారెళ్ల రష్యా చమురు దిగుమతి చేసుకుంటోంది. ఇందులో 40 శాతానికి పైగా ప్రయివేటు రంగ రిఫైనరీలైన రిలయన్స్ ఇండస్ట్రీస్, నయరా ఎనర్జీల సొంతం కావడం విశేషం!

మిగులు లాభాలన్నీ ప్రయివేటు రిఫైనరీలకే....

రష్యా దిగుమతుల్లో అధిక వాటా పొందుతున్న ప్రయివేటు రిఫైనరీలు చమురు శుద్ధి చేసి ఉత్పత్తులను యూరప్, ఆసియా దేశాలకు భారీగా ఎగుమతి చేసి గణనీయంగా లాభాలు గడించాయి. రష్యా ఉక్రెయిన్ యుద్ధం మూడో ఏడాదిలో జీ7+ దేశాలు భారత్, టర్కీలోని ఆరు రిఫైనరీలు నుంచి 18 బిలియన్ డాలర్లు (21 బిలియన్ డాలర్ల) విలువైన చమురు ఉత్పత్తులు దిగుమతి చేసుకున్నాయని ఫిన్లాండ్‌కు చెందిన సీఆర్ఈఏ థింక్‌ట్యాంక్ నివేదిక తెలిపింది. ఇందులో దాదాపు 9 బిలియన్ యూరో ఉత్పత్తులు రష్యా ముడి చమురుతో శుద్ధి చేసినవేనని సీఆర్ఈఏ పేర్కొంది. ఈ ఆరు రిఫైనరీలలో రిలయన్స్ చెందిన జామ్‌నగర్ శుద్ధి కార్మాగారం అగ్రస్థానంలో నిలిచింది. ఇక్కడి నుంచి జీ7+ దేశాలకు ఎగుమతి అయిన 12 బిలియన్ యూరోల్లో 4 బిలియన్ యూరోలకు పైగా రష్యా చమురుతోనే ఉత్పత్తి చేసినవని సీఆర్ఈఏ వివరించింది. ఈ జాబితాలో ప్రభుత్వరంగ ఓఎన్‌జీసీ మంగళూరు రిఫైనరీ నాలుగో స్థానంలో, నయరా ఎనర్జీ వడినార్ రిఫైనరీ ఆరోస్థానంలో ఉన్నాయి. దీనికి తోడు 'భారత్‌లో వ్యాపార కంపెనీలు రష్యా ఆయిల్‌ను రీసెల్లింగ్ చేసుకుంటున్నాయి. తద్వారా.. 16 బిలియన్ డాలర్ల అదనపు లాభాలను (దాదాపు రూ.1.35 లక్షల కోట్లు) పొందాయి' అంటూ అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ చేసిన వ్యాఖ్యలు 'రష్యా చౌక చమురు దిగుమతి లాభాల్లో అధిక వాటా ప్రైవేటు కంపెనీలు దక్కించుకుంటున్నాయి' అనే వాదనలను మరింత బలపరిచాయి.

ఇంధన ఎగుమతులతో వేల కోట్ల ఆదాయం

భారత్‌కు ఇంధన ఎగుమతులతో వేల కోట్ల ఆదాయం సమకూరుతోందని కస్టమ్స్ గణాంకాలు చెబుతున్నాయి. 2023–24లో 84.1 బిలియన్ డాలర్లు, 2024–25లో 63.3 బిలియన్ల డాలర్లు పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతులు జరిగాయి. ఇదే ఆర్థిక సంవత్సరంలో 24 బిలియన్ డాలర్లు డీజిల్ ఎగుమతులు, 15 బిలియన్ డాలర్ల జెట్ ఫ్యూయల్ ఎగుమతులు జరిగాయి. రష్యా ఉరల్స్ క్రూడ్ నుంచి నాణ్యమైన డీజిల్, జెట్ ఫ్యూయెల్ వంటి రవాణా ఇంధనాలు ఎక్కువగా తయారవుతున్నాయి. 2024–25లో 15.5 బిలియన్ డాలర్ల గ్యాసోలిన్, ఇతర చమురు ఉత్పతుల ఎగుమతులు జరగడం గమనార్హం.

ఎగుమతుల్లో రిలయన్స్ టాప్

ఈ ఏడాది భారత ఇంధన దిగుమతుల్లో వాల్యూమ్ పరంగా రిలయన్స్, నయరా ఎనర్జీలు రెండింటి వాటా 81 శాతంగా ఉన్నాయి. ఎగుమతుల్లో అధిక భాగం డీజిల్, జెట్ ఫ్యూయెల్ ఉన్నాయి. రోజుకు 9.14 లక్షల బ్యారెళ్ల ఎగుమతితో 71 శాతం వాటా రిలయన్స్‌దే. రిలయన్స్ జామ్‌నగర్ రిఫైనరీ జూన్‌లో రోజుకు 7.46 లక్షల బ్యారెళ్ల రష్యా చమురు దిగుమతి చేసుకుంది. ఇక్కడి నుంచి తన మొత్తం ఉత్పత్తి సామర్థ్యం 1.36 మిలియర్ల బీపీడీలో 67 శాతం ఎగుమతి చేసింది. మిగిలిన ఇంధన ఎగుమతుల్లో రోజుకు 1.18 లక్షల బ్యారెళ్లతో నయరా ఎనర్జీ, ఓఎన్‌జీసీకి చెందిన మంగళూరు రిఫైనరీ రోజుకు 1.14 లక్షల బ్యారెళ్లతో తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నాయి.

మొత్తం దిగుమతుల్లో రష్యా చమురు వాటా (%)

కంపెనీ	2024	2025
రిలయన్స్	34	47
నయరా	71	71
హెచ్ఎంఈఎల్ భటిండా	68	71
ఇండియన్ ఆయిల్	24	20
బీపీసీఎల్	37	29
హెచ్‌పీసీఎల్	43	20
ఓఎన్‌జీసీ మంగళూరు	52	53
మొత్తం భారత దిగుమతులు	38	37

సోర్స్: చమురు మంత్రిత్వ శాఖ, కెప్లర్



పరోక్ష సబ్సిడీలతో పీఎస్‌యూల లాభాలకు గండి

ప్రభుత్వరంగ రిఫైనరీ రష్యా చౌక చమురు మిగులు లాభాలకు కేంద్ర ప్రభుత్వ 'స్థిర ఇంధన ధరల విధానం' చిల్లుపెడుతోంది. రష్యా ఆయిల్ ఇప్పటికీ బ్యారెల్ బ్రెంట్ క్రూడాయిల్ కంటే 2–3 డాలర్లు, యూఈఏ బ్యారెల్ క్రూడాయిల్ కంటే 5–6 డాలర్ల డిస్కౌంట్ ధరకే లభిస్తుంది. సాధారణంగా ఇది రీఫైనరీ సంస్థలకు దండిగా లాభాలను తెచ్చిపెడుతోంది. అయితే ప్రభుత్వ సంస్థలైన ఐఓసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్‌లు రష్యా చమురు కొనుగోలు మిగులు లాభాలను పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ తదితర పరోక్ష సబ్సిడీలకు వినియోగిస్తున్నాయి. గల్ఫ్, అమెరికా క్రూడాయిల్ ధరలతో పోలిస్తే, 2022 జనవరి నుండి 2025 జూన్ వరకు రష్యా డిస్కౌంట్ ధరలతో ముడి చమురు కొనుగోలు చేయడం ద్వారా భారత్ దాదాపు 15 బిలియన్ డాలర్లు ఆదా చేసిందని పరిశ్రమ గణాంకాలు చెబుతున్నాయి. ముఖ్యంగా 2023లో రష్యా రికార్డు స్థాయి డిస్కౌంట్‌తో భారత్ దాదాపు 7 బిలియన్ డాలర్ల వరకు ఆదా చేసింది. ఈ మొత్తంలో సింహభాగం రిలయన్స్, నయరా కంపెనీలకే దక్కింది.

హిటాచీ ఎనర్జీ రూ.300 కోట్ల పెట్టుబడులు

తయారీ సామర్థ్యాల విస్తరణ



న్యూఢిల్లీ: హిటాచీ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ రూ.300 కోట్ల తాజా పెట్టుబడుల ప్రణాళికను ప్రకటించింది. తద్వారా మైసూరులో ట్రాన్స్‌ఫార్మర్ ఇన్సులేషన్ మెటీరియల్ తయారీ సామర్థ్యాలను రెట్టింపు చేసుకోనున్నట్టు తెలిపింది. 2024 అక్టోబర్‌లో ప్రకటించినట్టు భారత్‌లో మొత్తం రూ.2,000 కోట్ల పెట్టుబడుల్లో ఇది భాగమని పేర్కొంది. తాజా పెట్టుబడులతో ట్రాన్స్‌ఫార్మర్ గ్రేడ్ ప్రెస్‌బోర్డుల సరఫరాను పెంచుకోనున్నట్టు తెలిపింది. భారత్‌లో పెరుగుతున్న గ్రిడ్, రెన్యువబుల్ ఎనర్జీ అవసరాలకు మద్దతుగా నిలవడం పట్ల గర్విస్తున్నామని హిటాచీ ఎనర్జీ ఇండియా ఎండీ, సీఈవో ఎన్ వేణు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు, వాటి విడిభాగాలకు సంబంధించి భారత్‌లో, అంతర్జాతీయంగానూ డిమాండ్-సరఫరా మధ్య ఎంతో అంతరం ఉన్నట్టు చెప్పారు. ఈ డిమాండ్ అవసరాలను తీర్చేందుకు వీలుగా విస్తరణ చేపట్టినట్టు తెలిపారు. 2027 సంవత్సరం మధ్య నాటికి ఈ ప్రాజెక్టు పూర్తవుతుందని, భారత్‌తోపాటు యూఏఈ, ఒమన్, కువైట్, సౌదీ అరేబియా, టర్కీ, ఇండోనేషియా, దక్షిణ కొరియా, దక్షిణాఫ్రికా మార్కెట్లకు సరఫరాను పెంచుకోవచ్చని చెప్పారు.

ప్యాసింజర్ వాహన విక్రయాలు 1-4% పెరగొచ్చు

రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనా



ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశీయ ప్యాసింజర్ వాహన విక్రయాలు 1–4 శాతం పెరగొచ్చని రేటింగ్ సంస్థ ఇక్రా అంచనా వేసింది. డీలర్ల వద్ద అధిక నిల్వలు, బేస్ ఎఫెక్ట్‌ల కారణంగా అవుట్‌లుక్ వృద్ధిని పరిమితం చేసినట్లు రేటింగ్ సంస్థ తెలిపింది. అయితే ఓఈఎం (ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ మ్యానుఫ్యాక్చర్లు)లు కొత్త మోడళ్ల ఆవిష్కరణ, జీఎస్‌టీ రేట్ల తగ్గింపు అవకాశాలు కొన్ని ప్రత్యేక విభాగాల్లో డిమాండ్‌కు తోడ్పడతాయని పేర్కొంది. ''పండుగ సీజన్‌కు ముందు ఓఈఎంలు ఇన్వెంటరీ నిల్వలను పెంచుకోవడంతో నెల వారీ ప్రాతిపదికన జూలై హోల్‌సేల్ అమ్మకాల్లో 8.9 శాతం వృద్ధి నమోదైంది. అయితే వార్షిక ప్రాతిపదికన ఫ్లాటుగా 3.4 లక్షల వాహనాలు అమ్ముడయ్యాయి. నెలవారీ ప్రాతిపదికన రిటైల్ అమ్మకాలు 10.4% వృద్ధి నమోదయ్యాయి. వార్షిక ప్రాతిపదికన స్వల్పంగా 0.8% క్షీణత నమోదైంది. ప్యాసింజర్ వాహన విక్రయాల్లో ఎస్‌యూవీలు 65–66% వాటా సాధించాయి. సమీప భవిష్యత్తులో యుటిలిటీ వాహనాలు పరిశ్రమ వృద్ధికి కీలక ప్రచోదకాలుగా మారాయి'' అని ఇక్రా వివరించింది.

జూలైలో హైరింగ్ డీలా

- నెలవారీగా 5.8 శాతం డౌన్
- ఇన్‌డీడ్ నివేదికలో వెల్లడి



ముంబై: సాధారణ ఉద్యోగ నియామకాలు (హైరింగ్) జూలైలో నెలవారీగా చూస్తే 5.8 శాతం నీరసించినట్లు ఉపాధి కల్పనా ప్లాట్‌ఫామ్ ఇన్‌డీడ్ పేర్కొంది. అయితే కరోనా మహమ్మారికు ముందు స్థాయితో పోలిస్తే 70 శాతం అధికంగా నమోదైనట్లు వెల్లడించింది. ఇన్‌డీడ్ నివేదిక ప్రకారం ఉపాధి కల్పన కొనసాగే వీలుంది. హైరింగ్ మందగించినప్పటికీ ఉపాధి కల్పనలో అత్యుత్తమ ప్రావీణ్యత ప్రధాన పాత్ర పోషించింది. వరుసగా రెండు నెలలు ఉద్యోగ కల్పన ఊపందుకున్న తదుపరి జూలైలో 5.8 శాతం క్షీణించింది. అయితే వార్షికంగా 2024 జూలైతో చూస్తే జాబ్ పోస్టింగ్స్ దాదాపు 15 శాతం వెనకడుగు వేశాయి. ఉపాధి కల్పనలో ఆరోగ్యపరిరక్షణ, లాజిస్టిక్స్ వృద్ధిలో ఉన్న వర్ధమాన రంగాలైనప్పటికీ.. టెక్నాలజీ యాంకర్ పాత్ర పోషిస్తోంది. గత మూడు నెలలుగా డేటా, అనలిటిక్స్ 15.4 శాతం అధికంగా ఉద్యోగాలకు తెరతీయగా.. లాజిస్టిక్స్ 14.3 శాతం, థెరపీ 13.7 శాతం, డెంటల్ 13.6 శాతం చొప్పున ఉపాధి కల్పనలో వృద్ధి చూపాయి. సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ వేగంగా పుంజుకోకపోయినా.. గత మూడు నెలలుగా 9.2 శాతం స్థాయిలో ఉద్యోగాలు కల్పిస్తోంది. అయితే మరోవైపు మెడికల్ ఇన్ఫర్మేషన్‌లో 12.3 శాతం, ఫార్మసీలో 10.7 శాతం, ఎడ్యుకేషన్‌లో 8 శాతం, ఫిజిషియన్స్‌లో 7.8 శాతం చొప్పున ఉద్యోగ కల్పనలో క్షీణత నమోదైంది.

మదర్‌సన్ చేతికి యుటాకా

81 శాతం వాటా కొనుగోలు



న్యూఢిల్లీ: ఆటో విడిభాగాల దేశీ దిగ్గజం సంవర్ధన మదర్‌సన్ ఇంటర్నేషనల్ తాజాగా జపనీస్ కంపెనీ యుటాకా గికెన్‌లో 81 శాతం వాటా కొనుగోలు చేసింది. ఇందుకు 18.4 కోట్ల డాలర్లు(సుమారు రూ. 1,610 కోట్లు) వెచ్చించనుంది. జపనీస్ కంపెనీలో ఆటో రంగ దిగ్గజం హోండా మోటార్ ప్రస్తుతం 69.66 శాతం వాటా కలిగి ఉంది. మిగిలిన వాటా పబ్లిక్ చేతిలో ఉంది. కాగా.. యుటాకా గికెన్‌లో 81 శాతం వోటింగ్ రైట్స్‌ను కొనుగోలు చేసేందుకు బోర్డు అనుమతించినట్లు సంవర్ధన మదర్‌సన్ వెల్లడించింది. అంతేకాకుండా అనుబంధ సంస్థల ద్వారా షినిచీలో 11 శాతం వాటా సైతం సొంతం చేసుకోనున్నట్లు తెలియజేసింది. ఈ లావాదేవీల తదుపరి యుటాకాలో హోండా 19 శాతం వాటాతో కొనసాగనున్నట్లు పేర్కొంది. అయితే షినిచీలో 11 శాతం వాటా విలువను వెల్లడించలేదు. యుటాకా ప్రధానంగా మెటల్ కంపొనెంట్స్, అసెంబ్లీస్ తయారు చేస్తోంది. వెరసి రోటార్లు, మోటార్ల అసెంబ్లీస్, డ్రైవ్, బ్రేక్ సిస్టమ్స్, థర్మల్ మేనేజిమెంట్ సిస్టమ్స్ తదితరాలు ఉత్పత్తి చేస్తోంది.

80,000 దిగువకు సెన్సెక్స్

- నిఫ్టీ నష్టం 74 పాయింట్లు
- మూడో రోజూ అమ్మకాలే
- కొనసాగిన ట్రంప్ టారిఫ్‌ల ప్రభావం



ముంబై: ట్రంప్ టారిఫ్‌ల ప్రభావంతో స్టాక్ మార్కెట్ మూడో రోజూ నష్టపోయింది. విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలు సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఫలితంగా శుక్రవారం సెన్సెక్స్ 271 పాయింట్లు నష్టపోయి 80వేల స్థాయి దిగువన 79,810 వద్ద నిలిచింది. నిఫ్టీ 74 పాయింట్లు కోల్పోయి 24,427 వద్ద ముగిసింది. అధిక వెయిటేజీ రిలయన్స్(-2.21%)ఇన్ఫోసిస్(-2%), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు(-0.68%) నష్టపోయి సూచీల పతనానికి ప్రధాన కారణమయ్యాయి. ఉదయం కాసేపు లాభాల్లో ట్రేడైన సూచీలు తిరిగి నష్టాల్లోకి జారుకున్నాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 339 పాయింట్లు క్షీణించి 79,742 వద్ద, నిఫ్టీ 96 పాయింట్లు కోల్పోయి 24,405 వద్ద ఇంట్రాడే కనిష్టాలు తాకాయి. అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడవుతున్నాయి.

- స్టాక్ సూచీలు రెండు శాతానికి పైగా పతనంతో 3 రోజుల్లో రూ.11.21 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద తుడిచిపెట్టుకుపోయింది. దీంతో బీఎస్ఈలోని కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.443.65 లక్షల కోట్ల (5.05 ట్రిలియన్ డాలర్లు)కు దిగివచ్చింది.
- బీఎస్ఈలో రంగాల వారీ ఇండెక్సుల్లో రియల్టీ 1.33%, ఇంధన, ఐటీ, చమురు 1%, సర్వీసెస్ సూచీలు అరశాతం నష్టపోయాయి. మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు 0.41%, 0.30 శాతం పతనమయ్యాయి. ఎఫ్ఎంసీజీ, ఇండస్ట్రియల్స్, క్యాపిటల్ గూడ్స్, కన్జూమర్ డ్యూరబుల్స్, విద్యుత్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది.
- వార్షిక సర్వ సభ్య సమావేశం నేపథ్యంలో రిలయన్స్ ఇండస్ట్రీస్‌లో లాభాల స్వీకరణ చోటుచేసుకుంది. బీఎస్ఈలో షేరు 2.21% నష్టపోయి రూ.1,357 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 2.69% క్షీణించి రూ.1,350 వద్ద కనిష్టాన్ని తాకింది. షేరు రెండుశాతానికి పైగా నష్టపోవడంతో కంపెనీకి రూ. 41,409 కోట్ల నష్టం వాటిల్లింది. మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.18.36 లక్షల కోట్లకు దిగివచ్చింది.

ఎగుమతులకు త్వరలో బూస్ట్!

- పరిశ్రమ పరిరక్షణకు కట్టుబడి ఉన్న ప్రభుత్వం
- కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయుష్ గోయల్




న్యూఢిల్లీ: ఎగుమతులకి, దేశీయంగా వినియోగానికి ఊతమిచ్చేందుకు ప్రభుత్వం త్వరలోనే పలు చర్యలు ప్రకటించనున్నట్లు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయుష్ గోయల్ తెలిపారు. ఇతర దేశాల ఏకపక్ష నిర్ణయాల వల్ల ప్రతికూల ప్రభావాలు పడకుండా పరిశ్రమను పరిరక్షించేందుకు కేంద్రం కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు. భారత ఎగుమతులపై అమెరికా 50 శాతం సుంకాలు విధించిన నేపథ్యంలో మంత్రి వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అధిక టారిఫ్‌ల వల్ల కార్మిక శక్తి ఎక్కువగా ఉండే రసాయనాలు, రొయ్యలు, తోలు, పాదరక్షల్లాంటి పరిశ్రమలపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందనే ఆందోళన నెలకొంది. వస్తు సేవల పన్నుల (జీఎస్‌టీ) సంస్కరణలతో దేశీయంగా తయారీ రంగానికి మరింత ఊతం లభిస్తుందని పరిశ్రమ వర్గాల సమావేశంలో పాల్గొన్న సందర్భంగా గోయల్ చెప్పారు. వచ్చే వారమే జీఎస్‌టీ కౌన్సిల్ భేటీ కానుండటంతో ఈ ప్రభావాలు త్వరలోనే కనిపిస్తాయని మంత్రి తెలిపారు. డిమాండ్ సత్వరం పెరిగేందుకు, దేశీయంగా తయారీకి బూస్టునిచ్చేందుకు తీసుకోవాల్సిన చర్యలను జీఎస్‌టీ మండలి సమావేశంలో పరిశీలించనున్నట్లు వివరించారు. 'ఎవరైనా సరే, సరైన వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవాలంటే మనం ఎల్లప్పుడూ సిద్ధంగానే ఉంటాం. కానీ, మనపై వివక్ష చూపేందుకు ప్రయత్నిస్తే మాత్రం.. ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవం గల 40 కోట్ల మంది భారతీయులు ఎట్టి పరిస్థితుల్లోనూ తలొగ్గరు.. బలహీనపడరు. అంతా కలిసికట్టుగా ముందుకు సాగుతాం. కొత్త మార్కెట్లను అందిపుచ్చుకుంటాం. గతేడాది కన్నా ఈసారి మన ఎగుమతులు మరింతగా పెరుగుతాయని ధీమాగా చెబుతున్నాను' అని మంత్రి తెలిపారు. దిగుమతుల ఆధారిత దేశమైన భారత్ గతంలో కోవిడ్-19 మహమ్మారి, అణ్వాయుధపరమైన ఆంక్షలులాంటి ఎన్నో సవాళ్లను అధిగమించిందని చెప్పారు.

ప్రత్యామ్నాయ మార్కెట్లపై దృష్టి..

ప్రత్యామ్నాయ మార్కెట్లలో అవకాశాలను అందిపుచ్చుకోవడంపై దృష్టి పెడుతున్నామని మంత్రి వివరించారు. భారీ సుంకాలతో అంతర్జాతీయంగా ఏర్పడిన అనిశ్చితులను అధిగమించడంలో ఎగుమతిదార్లకు అన్ని విధాలా ప్రభుత్వం అండగా నిలుస్తుందని గోయల్ చెప్పారు. ఆస్ట్రేలియాతో ఆర్థిక, సాంకేతిక రంగాల్లో భాగస్వామ్యాలను కుదుర్చుకునేందుకు అవకాశాలు ఉన్నాయని, భారతీయ వ్యాపార సంస్థలు, వర్కర్లు, నిపుణులు వీటిని అందిపుచ్చుకోవాలని సూచించారు.

ద్రవ్యలోటు రూ.4.68 లక్షల కోట్లు

బడ్జెట్ అంచనాల్లో 29.9 శాతానికి చేరిక



న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ ద్రవ్యలోటు (ఆదాయం-వ్యయాల మధ్య అంతరం) ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి జూలై చివరికి (నాలుగు నెలల్లో) రూ.4,68,416 కోట్లకు చేరింది. 2025–26 సంవత్సరానికి ద్రవ్యలోటు జీడీపీలో 4.4 శాతం (రూ.15.69 లక్షల కోట్లు)గా ఉంటుందన్నది ప్రభుత్వం అంచనా. మొదటి నాలుగు నెలల్లో ద్రవ్యలోటు పూర్తి ఆర్థిక సంవత్సరం అంచనాల్లో 29.9 శాతానికి చేరింది. ఈ వివరాలను కంప్ట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ (సీజీఏ) విడుదల చేసింది. గత ఆర్థిక సంవత్సరంలో మొదటి నాలుగు నెలల్లో ద్రవ్యలోటు పూర్తి ఆర్థిక సంవత్సరం అంచనాల్లో 17.2 శాతంగానే ఉండడం గమనించొచ్చు. జూలై చివరికి ప్రభుత్వానికి రూ.10.95 లక్షల కోట్ల ఆదాయం సమకూరింది. ఇందులో రూ.6.61 లక్షల కోట్లు పన్నుల రూపంలో రాగా, రూ.4.03 లక్షల కోట్లు పన్నేతర ఆదాయం, రూ.29,789 కోట్లు నాన్ డెట్ రూపంలో (రుణేతర మార్గాలు) వచ్చింది. మొత్తం వ్యయాలు రూ.15.63 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఇందులో రూ.12.16 లక్షల కోట్లు రెవెన్యూ వ్యయం కాగా, రూ.3.46 కోట్లు మూలధన రూపంలో ఖర్చయింది.

కామన్వెల్త్ గేమ్స్-2030 నిర్వహణకు భారత్ బిడ్

అహ్మదాబాద్: 2030లో కామన్వెల్త్ క్రీడలు నిర్వహణకు ఆసక్తి చూపిస్తున్న భారత్ తమ ప్రతిపాదనను మరింత ముందుకు తీసుకువెళ్లింది. ఈ పోటీల కోసం అధికారికంగా బిడ్‌ను దాఖలు చేసింది. భారత్‌లో అహ్మదాబాద్ వేదికగా తాము ఈ పోటీలు నిర్వహిస్తామని కూడా ఇందులో స్పష్టం చేసింది. దీనికి సంబంధించి కామన్వెల్త్ గేమ్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, గుజరాత్ ప్రభుత్వం సంయుక్తంగా తమ ప్రతిపాదనను లండన్‌లోని కామన్వెల్త్ స్పోర్ట్‌కు అందించాయి. ఈ బృందానికి గుజరాత్ క్రీడా శాఖ మంత్రి హర్ష్ సంఘ్వీ నాయకత్వం వహించారు. జాతీయ క్రీడా దినోత్సవం అయిన ఆగస్టు 29న భారత్ తమ బిడ్‌ను సమర్పించడం విశేషం. 2030లో కామన్వెల్త్ క్రీడలు 100 ఏళ్లు పూర్తి చేసుకోనున్న నేపథ్యంలో ఈ ప్రతిష్ఠాత్మక పోటీలకు అహ్మదాబాద్ సరైన వేదికగా భావిస్తున్నట్లు ఈ ప్రతిపాదనలో వెల్లడించారు. 'వసుధైక కుటుంబం' అనే నేపథ్యంలో తాము పోటీలను నిర్వహిస్తామని 'అతిథిదేవోభవ' అంటూ అందరికీ స్వాగతం పలుకుతామని ఈ బిడ్‌లో భారత్ తమ ఉద్దేశాన్ని ప్రదర్శించింది.

సాక్షి ప్లస్
శనివారం । 30-8-2025

4 బంతుల్లో వికెట్లు



5

భారత దేశవాళీ ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో 4 బంతుల్లో 4 వికెట్లు తీసిన ఐదో బౌలర్‌గా అఖీబ్ నబీ గుర్తింపు పొందాడు. గతంలో సదానంద్ మోహోల్ (1966లో), సైనీ (1988లో), ముధాసిర్ (2018లో), కుల్వంత్ ఖెజ్రోలియా (2024లో) ఈ ఘనత సాధించారు.

అఖీబ్ నబీ

జమ్మూ కశ్మీర్ పేస్ బౌలర్ అఖీబ్ నబీ ఘనత

దులీప్ ట్రోఫీ మ్యాచ్‌లో అద్భుత ప్రదర్శన ● ఈస్ట్‌జోన్ తొలి ఇన్నింగ్స్ 230 ఆలౌట్ ● నార్త్‌జోన్ తొలి ఇన్నింగ్స్ 405

బెంగళూరు: దేశవాళీ టోర్నీ దులీప్ ట్రోఫీలో నార్త్ జోన్ పేసర్ అఖీబ్ నబీ వరసగా నాలుగు బంతుల్లో నాలుగు వికెట్లు పడగొట్టాడు. ఈస్ట్‌జోన్‌తో జరుగుతున్న క్వార్టర్ ఫైనల్లో ఈ జమ్ముకశ్మీర్ పేసర్ మొత్తంగా ఐదు వికెట్లతో ఆకట్టుకున్నాడు. ఫలితంగా ఈస్ట్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 56.1 ఓవర్లలో 230 పరుగులకు ఆలౌటైంది. విరాట్ సింగ్ (102 బంతుల్లో 69; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) టాప్ స్కోరర్ కాగా... ఉత్కర్ష్ సింగ్ (49 బంతుల్లో 38; 8 ఫోర్లు), కెప్టెన్ రియాన్ పరాగ్ (47 బంతుల్లో 39; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), కుమార్ కుశాగ్ర (61 బంతుల్లో 29; 5 ఫోర్లు) తలా కొన్ని పరుగులు చేశారు. నార్త్‌జోన్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న టీమిండియా పేసర్ అర్ష్‌దీప్ సింగ్ 17 ఓవర్లు వేసి 51 పరుగులిచ్చి ఒక వికెట్ పడగొట్టాడు. గాయం నుంచి కోలుకొని తిరిగి వచ్చిన అర్ష్‌దీప్ సౌకర్యవంతంగా కనిపించాడు. హర్షిత్ రాణా 2 వికెట్లు తీశాడు. ఇన్నింగ్స్ 53వ ఓవర్‌లో నబీ 'హ్యాట్రిక్' నమోదు చేసుకున్నాడు. నాలుగో బంతికి విరాట్ సింగ్‌ను బౌల్డ్ చేసిన నబీ... ఐదో బంతికి మానిషి (0)ని వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. ఆరో బంతికి ముఖ్తార్ హుస్సేన్ (0)ను కూడా క్లీన్‌బౌల్డ్ చేసి 'హ్యాట్రిక్' పూర్తి చేసుకున్నాడు. తన తదుపరి ఓవర్ తొలి బంతికి సూరజ్ జైస్వాల్ (10)ను కూడా నబీ పెవిలియన్ పంపాడు. దీంతో వరుసగా నాలుగు బంతుల్లో నాలుగు వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. ఫలితంగా 222/5తో ఉన్న ఈస్ట్ జోన్ జట్టు 8 పరుగుల వ్యవధిలో మిగిలిన ఐదు వికెట్లు కోల్పోయి 230 పరుగులకు పరిమితమైంది. ఈ ఐదు వికెట్లు నబీ ఖాతాలోనే చేరాయి. 'అర్ష్‌దీప్, హర్షిత్ రాణాతో కలిసి బౌలింగ్ చేయడం ఎంతో ఉపకరించింది. వారిద్దరూ దేశానికి ప్రాతినిధ్యం వహించారు. వారితో బంతి పంచుకోవడం ఇదే తొలిసారి. ఇలాంటి అవకాశం కోసం చాన్నాళ్లుగా చూస్తున్నా. ఆ ఇద్దరి నుంచి ఎంతో నేర్చుకున్నా. దాన్నే ఆచరణలో పెట్టాను' అని నబీ అన్నాడు. మరోవైపు జమ్మూకశ్మీర్ పేసర్ చక్కటి బంతులు వేస్తున్నాడని అర్ష్‌దీప్ కితాబిచ్చాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 308/6తో రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన నార్త్ జోన్ చివరకు 93.2 ఓవర్లలో 405 పరుగులకు ఆలౌటైంది. వికెట్ కీపర్ కన్హయ్య వాధ్వాన్ (152 బంతుల్లో 76; 6 ఫోర్లు) హాఫ్‌సెంచరీ సాధించగా... అఖీబ్ నబీ (33 బంతుల్లో 44; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) విలువైన పరుగులు జతచేశాడు. ఇక రెండు బంతులే ఎదుర్కొనే అవకాశం దక్కించుకున్న అర్ష్‌దీప్ సింగ్ (12 నాటౌట్; 2 సిక్స్‌లు) ఆ రెండింటిని సిక్స్‌లుగా మలచడం విశేషం. ఈస్ట్ జోన్ బౌలర్లలో మానిషి 111 పరుగులిచ్చి 6 వికెట్లు పడగొట్టగా... మొహమ్మద్ షమీ ఒక వికెట్ తీశాడు. ముకేశ్ కుమార్‌కు వికెట్ దక్కలేదు. రెండో ఇన్నింగ్స్ ప్రారంభించడానికి ముందే నార్త్‌జోన్ జట్టు 183 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. నార్త్ జోన్ ఆలౌట్‌కాగానే రెండో రోజు ఆట ముగిసింది.

దానిశ్ డబుల్ సెంచరీ



సెంట్రల్ జోన్‌తో జరుగుతున్న మరో క్వార్టర్ ఫైనల్లో నార్త్ ఈస్ట్ జోన్ కష్టాల్లో పడింది. ప్రత్యర్థి భారీ స్కోరు వద్ద తొలి ఇన్నింగ్స్ డిక్లేర్ చేయగా... రెండో రోజు ఆట ముగిసే సమయానికి నార్త్ ఈస్ట్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 65 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 168 పరుగులు చేసింది. కర్ణజీత్ (77 బంతుల్లో 48; 8 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్ కాగా... ఆశిష్ థాపా (35), అంకుర్ మలిక్ (31 బ్యాటింగ్; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఫర్వాలేదనిపించారు. సెంట్రల్ జోన్ బౌలర్లలో ఆదిత్య ఠాకరే 3 వికెట్లు పడగొట్టగా... హర్ష్ దూబే రెండు వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 432/2తో శుక్రవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన సెంట్రల్ జోన్ 102 ఓవర్లలో 532/4 వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. రెండో రోజు మరో వంద పరుగులు జతచేసి ప్రత్యర్థిని బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. దానిశ్ మాలేవర్ (222 బంతుల్లో 203; 36 ఫోర్లు, 1 సిక్స్) డబుల్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. యశ్ రాథోడ్ (87 నాటౌట్; 11 ఫోర్లు) శుభమ్ శర్మ (34 నాటౌట్; 2 ఫోర్లు) రాణించారు. ప్రస్తుతం చేతిలో 3 వికెట్లు ఉన్న నార్త్ ఈస్ట జోన్... సెంట్రల్ జోన్ తొలి ఇన్నింగ్స్ స్కోరుకు ఇంకా 364 పరుగులు వెనుకబడి ఉంది.



దిల్‌బాగ్ సింగ్

భారత లిఫ్టర్లకు మరో ఏడు పతకాలు

● సాయిరాజ్ పరదేశీ రికార్డు స్వర్ణం
● కామన్వెల్త్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్

అహ్మదాబాద్: కామన్వెల్త్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో భారత లిఫ్టర్ల జోరు సాగుతోంది. పోటీల ఐదో రోజు మన లిఫ్టర్లు మరో ఏడు పతకాలు ఖాతాలో వేసుకున్నారు. సాయిరాజ్ పరదేశి రికార్డు బ్రేక్ చేస్తూ స్వర్ణం గెలుచుకున్నాడు. పురుషుల జూనియర్ విభాగంలో బరిలోకి దిగిన సాయిరాజ్ 88 కేజీల కేటగిరీలో మొత్తంగా 348 కేజీల (స్నాచ్‌లో 157 కేజీలు+క్లీన్ అండ్ జెర్క్‌లో 191 కేజీలు) బరువెత్తి అగ్రస్థానం దక్కించుకున్నాడు. ఈ క్రమంలో స్నాచ్‌లో కామన్వెల్త్ జూనియర్ రికార్డును (155 కేజీలు) సాయిరాజ్ అధిగమించాడు. 88 కేజీల సీనియర్ విభాగంలో స్వర్ణం నెగ్గిన కెనడా లిఫ్టర్ బ్రేడన్ కెనడీ (347 కేజీలు) కంటే... జూనియర్ స్థాయిలో బరిలోకి దిగిన సాయిరాజ్ ఒక కేజీ ఎక్కువ బరువెత్తడం విశేషం. ఈ విభాగంలో బరిలోకి దిగిన మరో భారత లిఫ్టర్ మూడుసార్లు కామన్వెల్త్ చాంపియన్ అజయ్ సింగ్ 315 కేజీల బరువెత్తి ఆరో స్థానంతో సరిపెట్టుకున్నాడు. 94 కేజీల విభాగంలో జాతీయ చాంపియన్ దిల్‌బాగ్ సింగ్ రజత పతకం గెలుచుకున్నాడు. శుక్రవారం పోటీల్లో దిల్‌బాగ్ సింగ్ మొత్తం 342 కేజీల (స్నాచ్‌లో 153 కేజీలు+క్లీన్ అండ్ జెర్క్‌లో 189 కేజీలు) బరువెత్తి రెండో స్థానంలో నిలిచాడు. మలేసియా లిఫ్టర్ మొహమ్మద్ ఫూజలి 343 కేజీలతో పసిడి గెలుచుకోగా... ఆస్ట్రేలియాకు చెందిన ఒలీవర్ సాక్స్‌టన్ (336 కేజీలు) కాంస్యం నెగ్గాడు. సీనియర్ మహిళల 86 కేజీల విభాగంలో వన్షిత వర్మ 222 కేజీల (95 కేజీలు+127 కేజీలు) బరువెత్తి కాంస్యం గెలుచుకుంది. 88 కేజీల యూత్ కేటగిరీలో షా హుసేన్ స్వర్ణం, హృదానంద దాస్ రజతం గెలుచుకున్నారు. 94 కేజీల జూనియర్, యూత్ విభాగాల్లో పర్వ్ చౌదరీ స్వర్ణాలు గెలిచాడు. 16 ఏళ్ల పర్వ్ మొత్తంగా 337 కేజీలు (149 కేజీలు+188 కేజీలు) బరువెత్తి అగ్రస్థానంలో నిలిచాడు.

భారత్ గురి భళా...

ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్‌లో 103 పతకాలతో అగ్రస్థానం

షిమ్‌కెంట్ (కజకిస్తాన్): గురి తప్పని లక్ష్యంతో అదరగొట్టిన భారత షూటర్లు ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్‌ను దిగ్విజయంగా ముగించారు. శుక్రవారం తెర పడిన ఈ మెగా ఈవెంట్‌లో సీనియర్, జూనియర్, యూత్ విభాగాల్లో కలిపి భారత షూటర్లు మొత్తం 103 పతకాలు నెగ్గి అగ్రస్థానంలో నిలిచారు. ఇందులో 52 స్వర్ణాలు, 26 రజతాలు, 25 కాంస్యాలు ఉండటం విశేషం. ఆఖరి రోజు నాన్ ఒలింపిక్ కేటగిరీ పురుషుల డబుల్ ట్రాప్ ఈవెంట్‌లో ప్రపంచ మాజీ చాంపియన్ అంకుర్ మిట్టల్ స్వర్ణ పతకం గెలిచాడు. 18 మంది షూటర్లు పోటీపడ్డ ఈ ఈవెంట్‌లో అంకుర్ 107 పాయింట్లు స్కోరు చేసి విజేతగా నిలిచాడు. అంకుర్, భానుప్రతాప్ సింగ్, హర్షవర్ధన్‌లతో కూడిన భారత జట్టు 264 పాయింట్లతో టీమ్ విభాగంలో కాంస్యం సాధించింది. మహిళల డబుల్ ట్రాప్ వ్యక్తిగత ఈవెంట్‌లో భారత్ క్లీన్‌స్వీప్ చేసింది. అనుష్క సింగ్ (93 పాయింట్లు), ప్రాణిల్ ఇంగ్లే (89), యెశాయ హఫీజ్ కాంట్రాక్టర్ (87) వరుసగా స్వర్ణ, రజత, కాంస్య పతకాలు గెలిచారు. అనుష్క, ప్రాణిల్, యెశాయ బృందం టీమ్ విభాగంలోనూ బంగారు పతకం సొంతం చేసుకుంది. పురుషుల 25 మీటర్ల సెంటర్ ఫైర్ పిస్టల్ ఈవెంట్‌లోనూ భారత షూటర్లు మెరిశారు. వ్యక్తిగత విభాగంలో రాజ్‌కన్వర్ సింగ్ సంధూ 583 పాయింట్లతో స్వర్ణ పతకం నెగ్గాడు. టీమ్ విభాగంలో రాజ్‌కన్వర్, గుర్‌ప్రీత్ సింగ్, అంకుర్ గోయల్‌లతో కూడిన భారత బృందం 1733 పాయింట్లతో బంగారు పతకాన్ని దక్కించుకుంది.



అంకుర్ మిట్టల్

సురభి బృందానికి రజతం

మహిళల 50 మీటర్ల రైఫిల్ ప్రోన్ వ్యక్తిగత విభాగంలో భారత షూటర్ మానిని కౌశిక్ (617.8 పాయింట్లు) కాంస్య పతకం గెలిచింది. తెలంగాణ షూటర్ రాపోలు సురభి భరద్వాజ్, మానిని, విదర్శలతో కూడిన భారత బృందం 1846 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచి రజత పతకాన్ని సొంతం చేసుకుంది.

మదుషంక 'హ్యాట్రిక్'

● చివరి ఓవర్లో శ్రీలంకను గెలిపించిన పేసర్
● తొలి వన్డేలో 7 పరుగులతో జింబాబ్వే ఓటమి



మదుషంక

హరారే: చివరి వరకు హోరాహోరీగా సాగిన పోరులో జింబాబ్వేపై శ్రీలంక విజయం సాధించింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా శుక్రవారం జరిగిన తొలి వన్డేలో శ్రీలంక 7 పరుగుల తేడాతో జింబాబ్వేను చిత్తు చేసింది. 299 పరుగుల లక్ష్యఛేదనలో 49 ఓవర్లు ముగిసేసరికి జింబాబ్వే 289/5తో నిలిచింది. జింబాబ్వే విజయానికి 6 బంతుల్లో 10 పరుగులు అవసరం కాగా... ఆఖరి ఓవర్ వేసిన 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దిల్షాన్ మదుషంక (4/62) శ్రీలంకను గెలిపించాడు. తొలి మూడు బంతులకు వరుసగా సికందర్ రజా (87 బంతుల్లో 92; 8 ఫోర్లు), బ్రాడ్ ఇవాన్స్ (0), రిచర్డ్ నరావా (0)ను అవుట్ చేసి 'హ్యాట్రిక్' ఖాతాలో వేసుకున్నాడు. మిగిలిన మూడు బంతుల్లో రెండు పరుగులు మాత్రమే చేయగలిగిన జింబాబ్వే 7 పరుగుల తేడాతో ఓడింది. అంతకుముందు శ్రీలంక నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్లకు 298 పరుగులు చేసింది. నిశాంక (92 బంతుల్లో 76; 12 ఫోర్లు), జనిత్ లియనాగె (47 బంతుల్లో 70 నాటౌట్; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు), కమిందు మెండిస్ (36 బంతుల్లో 57; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధశతకాలతో ఆకట్టుకున్నారు. అనంతరం లక్ష్యఛేదనలో జింబాబ్వే 50 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 291 పరుగులకు పరిమితమైంది. బెన్ కరన్ (90 బంతుల్లో 70; 8 ఫోర్లు), కెప్టెన్ సీన్ విలియమ్స్ (54 బంతుల్లో 57; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) హాఫ్ సెంచరీలతో సత్తా చాటారు. అయితే చివర్లో ఒత్తిడికి తట్టుకోలేకపోయిన జింబాబ్వే జట్టు పరాజయం పాలైంది. ఇరు జట్ల మధ్య ఆదివారం రెండో వన్డే జరగనుంది.

ఘనంగా క్రీడా దినోత్సవం

ధ్యాన్‌చంద్‌కు నివాళి అర్పించిన క్రీడాలోకం ● పలు కార్యక్రమాల నిర్వహణ

సాక్షి, హైదరాబాద్: జాతీయ క్రీడా దినోత్సవాన్ని శుక్రవారం దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. అటు కేంద్ర ప్రభుత్వంతో పాటు వేర్వేరు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా పలు కార్యక్రమాలు జరిపాయి. హాకీ దిగ్గజం ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని ఆయనకు అటు క్రీడాకారులు, ఇటు అధికారులు నివాళులు అర్పించారు. తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో క్రీడా దినోత్సవం వేడుకగా జరిగింది. గచ్చిబౌలి స్టేడియంలో ఉన్న ధ్యాన్‌చంద్ విగ్రహానికి రాష్ట్ర క్రీడా మంత్రి వాకిటి శ్రీహరి పూలమాల వేసి ఆయనను స్మరించుకున్నారు. భారత హాకీని చిరస్థాయిగా నిలబెట్టిన ధ్యాన్‌చంద్‌ను స్ఫూర్తిగా తీసుకొని యువ ఆటగాళ్లు ఒలింపిక్స్‌లో పతకాలు సాధించడమే లక్ష్యంగా పెట్టుకోవాలని శ్రీహరి సూచించారు. క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని గత తొమ్మిది రోజులుగా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ పలు కార్యక్రమాలు నిర్వహించింది. వీటికి ముగింపుగా శుక్రవారం ఆస్ట్రోటర్ఫ్ మైదానంలో ప్రత్యేక హాకీ మ్యాచ్ జరిగింది. క్రీడా దినోత్సవం సందర్భంగా తొలిసారి కోచ్‌ల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుంటూ ప్రత్యేక బీమా పథకం 'గురు వందనం'ను ప్రభుత్వం ప్రారంభించింది. అనంతరం ఇటీవల జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటిన క్రీడాకారులకు నగదు పురస్కారాలు అందజేశారు. మొత్తం 41 మంది క్రీడాకారులకు కలిపి ఒక కోటి 29 లక్షల ప్రోత్సాహక బహుమతులు ఇచ్చారు. వరల్డ్ ఆర్చరీ అండర్-21లో స్వర్ణం గెలిచిన తానిపర్తి చికిత, పవర్‌లిఫ్టర్లు శ్రుతి, శ్రీచందన, భారత క్రికెట్ ఫీల్డింగ్ కోచ్ టి.దిలీప్, జూనియర్ వరల్డ్ రోల్‌బాల్ పోటీల్లో గెలిచిన ఎం.శ్రీకాంత్‌లకు తలా రూ. 5 లక్షల చొప్పున... షూటర్ ఇషా సింగ్, స్కేటర్లు మాకన్ సౌరవ్ సింగ్, కావ్యశ్రీలకు తలా రూ.4 లక్షలు అందజేశారు. పారా తైక్వాండో క్రీడాకారుడు గౌతమ్ యాదవ్‌కు కూడా రూ. 5 లక్షలు అందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ క్రీడా సలహాదారు ఎ.జితేందర్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ సోనీబాలా దేవి తదితరులు పాల్గొన్నారు.



కెనడాలో ఇటీవల జరిగిన ప్రపంచ యూత్ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం సాధించిన తెలంగాణ అమ్మాయి చికితకు జ్ఞాపికను అందజేస్తున్న రాష్ట్ర క్రీడల మంత్రి వాకిటి శ్రీహరి

మోండో ట్రాక్ ఏర్పాటు...

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో క్రీడా దినోత్సవం రోజున పలు ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. నేషనల్ స్టేడియంలో ధ్యాన్‌చంద్ విగ్రహానికి పూలమాల వేసి క్రీడా శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ నివాళి అర్పించారు. ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన స్పోర్ట్స్ బిల్ వల్ల మన క్రీడారంగం దశ, దిశ మారిపోతాయని... భవిష్యత్తులో అత్యుత్తమ క్రీడా వేదికగా భారత్ నిలుస్తుందని మాండవీయ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని మన దేశంలోని క్రీడాకారులందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో కొత్తగా ఏర్పాటు చేసిన మోండో అథ్లెటిక్ ట్రాక్‌ను మంత్రి ప్రారంభించారు. అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలతో, అంతర్జాతీయ స్థాయిలో రూపొందించిన ఈ ట్రాక్‌లో సెప్టెంబర్ 26 నుంచి వరల్డ్ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ నిర్వహిస్తారు. ఈ సందర్భంగా మంత్రి, మాజీ అథ్లెట్ అంజూ బాబీజార్జ్‌తో పాటు పలువురు క్రీడాకారులు, క్రీడాధికారులు కలిసి సరదాగా మైదానంలో పలు ఆటలు ఆడి సంబరాలు చేసుకున్నారు. మరోవైపు రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పలువురు అథ్లెట్లతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముచ్చటించారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా దేశంలో ఆటగాళ్ల ఘనతలు గుర్తు చేస్తూ వారిపై ప్రత్యేక ప్రశంసలు కురిపించిన దిగ్గజాలు సచిన్ టెండూల్కర్, అభినవ్ బింద్రా... యువ క్రీడాకారులు ధ్యాన్‌చంద్ స్ఫూర్తితో అగ్రస్థాయికి చేరాలని ఆకాంక్షించారు.



ఒలింపియన్ అంజు జార్జ్‌తో కలిసి 'టగ్ ఆఫ్ వార్' ఆట ఆడుతున్న కేంద్ర క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవీయ



ఆలిండియా చెస్ టోర్నీ ప్రారంభం


సాక్షి, హైదరాబాద్: అవిభాజ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్పీకర్, దివంగత దుద్దిళ్ల శ్రీపాదరావు స్మారకార్థం నిర్వహిస్తున్న ఆలిండియా ఓపెన్ బిలో 1600 'ఫిడే' రేటింగ్ చెస్ టోర్నీ శుక్రవారం మొదలైంది. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో మూడు రోజులపాటు జరుగుతున్న ఈ టోర్నీని తెలంగాణ రాష్ట్ర క్రీడల మంత్రి వాకిటి శ్రీహరి ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ (శాట్స్) చైర్మన్ శివసేనా రెడ్డితో వాకిటి శ్రీహరి సరదాగా గేమ్ ఆడారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా చెస్ సంఘం అధ్యక్షుడు కేఎస్ ప్రసాద్, సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం డీఎస్‌డీఓ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. తొమ్మిది రౌండ్లపాటు జరగనున్న ఈ టోర్నీలో తొలి రోజు మూడు రౌండ్‌లు ముగిశాయి. వివిధ వయో విభాగాల్లో కలిపి మొత్తం 59 మంది క్రీడాకారులు తొలి మూడు గేముల్లో గెలిచి మూడు పాయింట్లతో ఆధిక్యంలో ఉన్నారు.

సాక్షి ప్లస్
శనివారం । 30-8-2025

ఉక్రెయిన్ నౌకపై రష్యా దాడి

- నావికాదళ సిబ్బంది ఒకరు మృతి, మరికొందరు గల్లంతు
- నావికా డ్రోన్ మొదటిసారి ప్రయోగించిన రష్యన్ దళాలు

మాస్కో: ఉక్రెయిన్ నిఘా నౌక సింఫెరోపోల్‌పై రష్యా దాడి చేసింది. డానుబే నదీ ముఖద్వారం వద్ద ఉన్న ఉక్రెయిన్ యుద్ధనౌకపై రష్యా నావికాదళ డ్రోన్‌ను ఉపయోగించింది. ఈ దాడిలో నావికదళ సిబ్బంది ఒకరు మరణించగా.. అనేక మంది గాయపడ్డారు. మరికొందరు గల్లంతయ్యారు. ఈ ఘటనను ఉక్రెయిన్ నేవీ ధ్రువీకరించింది. 'దాడి తర్వాత పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. సిబ్బందిలో చాలామంది సురక్షితంగా ఉన్నారు. తప్పిపోయిన నావికుల కోసం అన్వేషణ కొనసాగుతోంది' అని నేవీ ప్రతినిధి డిమిత్రో ప్లెటెన్‌చుక్ తెలిపారు. హై-స్పీడ్ అన్‌క్రూడ్ సర్ఫేస్ (యూఎస్‌వీ) వాహనాన్ని ఉపయోగించి ఈ దాడి నిర్వహించినట్టు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఉక్రేనియన్ యుద్ధనౌకపై దాడి చేయడానికి రష్యన్ దళాలు నావికా డ్రోన్‌ను ఉపయోగించడం ఇదే మొదటిసారి. దీనిని 130 మైళ్ల దూరంలో ఉన్న ఆక్రమిత క్రిమియా నుంచి లేదా పెద్ద రష్యన్ నేవీ నౌక నుంచి ప్రయోగించి ఉండవచ్చని భావిస్తున్నారు. రిమోట్‌గా పనిచేసే పడవ ద్వారా ఈ దాడి జరిగిందని సైనిక విశ్లేషకుడు డెనిస్ ఫెడుటినోవ్ తెలిపారు. ఉక్రెయిన్ గతంలో నల్ల సముద్రంలోని రష్యా నౌకాదళాన్ని లక్ష్యంగా చేసుకుంది. అనేక రష్యన్ యుద్ధనౌకలకు నష్టం వాటిల్లినట్లు వార్తలొచ్చాయి. అయితే.. ఉక్రేనియన్ నావికాదళ నష్టాలు చాలా అరుదు. పూర్తిస్థాయి దండయాత్ర ప్రారంభమైనప్పటి నుంచి, రష్యా ఇతర దేశాల ఓడలతో సహా నల్ల సముద్రంలోని పౌర నౌకలను కూడా లక్ష్యంగా చేసుకుంది. దానికి ప్రతీకారంగానే ఉక్రేనియన్ సైనిక నిఘా గురువారం అజోవ్ సముద్రంలో ఒక చిన్న క్షిపణిని మోసుకెళ్ళే రష్యన్ యుద్ధనౌకను ఢీకొట్టింది. ఈ దాడుల్లో ఒక రష్యన్ క్షిపణి నౌక దెబ్బతిన్నది. ఈ నేపథ్యంలో బ్రిటన్, ఫ్రాన్స్, స్లోవేనియా, డెన్మార్క్ మరియు గ్రీస్ మద్దతుతో ఉక్రెయిన్ అభ్యర్థన మేరకు యూఎన్ భద్రతా మండలి అత్యవసర సమావేశాన్ని నిర్వహిస్తోంది. సముద్రం, వైమానిక దాడుల్లో రష్యా డ్రోన్‌లను ఎక్కువగా ఉపయోగించడంపై ఈ సమావేశం దృష్టి సారిస్తుందని భావిస్తున్నారు.



ఇటలీలోని మౌంట్ ఎట్నా అగ్ని పర్వతం లావా విరజిమ్ముతూనే ఉంది. మండుతున్న లావా రెండు ప్రవాహాలుగా దిగువకు వస్తుండటాన్ని పైచిత్రంలో చూడొచ్చు

డ్రైవ్ చేస్తుండగా గుండెపోటు

- వెంటనే తోటి ఉద్యోగికి స్టీరింగ్ ఇచ్చిన డ్రైవర్
- ప్రాణాపాయంలోనూ మరువని విధి నిర్వహణ
- తప్పిన ఘోర బస్ ప్రమాదం
- ఆస్పత్రికి వెళ్లే సరికి ప్రాణాలు కోల్పోయిన డ్రైవర్

జోధ్‌పూర్: ఓ బస్సు డ్రైవర్ ప్రాణాపాయ స్థితిలోనూ విధి నిర్వహణకే ప్రాధాన్యమిచ్చారు. అకస్మాత్తుగా గుండెపోటుకు గురైన ఆయన ప్రమాదాన్ని శంకించి పక్కనున్న మరో డ్రైవర్ చేతికి స్టీరింగ్ అందించారు. ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన ఆయనకు మాత్రం..దురదృష్టవశాత్తూ ఆ సమయంలో సరైన వైద్యం దొరకలేదు. దీంతో, ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చింది. ఈ ఘటన రాజస్తాన్‌లో గురువారం చోటు చేసుకుంది. జోధ్‌పూర్-ఇండోర్ దూరప్రాంత బస్సు సర్వీసు డ్రైవర్‌గా సతీశ్ రావు డ్యూటీ ఎక్కారు. బస్సు కెల్వా రాజ్‌నగర్ సమీపంలోకి వచ్చే సరికి బస్సు నడుపుతున్న సతీశ్ రావుకు అస్వస్థతగా అనిపించింది. పరిస్థితి తీవ్రంగా మారిందని భావించిన ఆయన..పక్కనే ఉన్న మరో డ్రైవర్ చేతికి స్టీరింగ్ ఇచ్చారు. ఆ సమయంలో ఆయన ఆ నిర్ణయం తీసుకోలేకపోయినట్లయితే పెను ప్రమాదం సంభవించి ఉండేది. డ్రైవింగ్ బాధ్యతలు చేపట్టిన మరో ఉద్యోగి సతీశ్ రావుకు గోమతి చౌరాహాలో మందుల కోసం ప్రయత్నించారు. అయితే, ఆ సమయంలో మందుల దుకాణాలన్నీ మూసేసి ఉన్నాయి. గోమతి చౌరాహా దాటేసరికి సతీశ్ పరిస్థితి మరింత విషమంగా మారింది. దెసురి నల్ ఘాట్ వద్దకు వచ్చే సరికి తోటి డ్రైవర్ పైనే పడిపోయారు. దెసురి ఆస్పత్రికి బస్సుతోపాటు ఆయన్ను తీసుకువచ్చారు. అప్పటికే, ఆయన చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. తోటి డ్రైవర్‌పై సతీశ్ రావు పడిపోవడం చూసిన పక్కనున్న ప్రయాణీకురాలు కేకలు వేయడం, మిగతా వారు వచ్చి ఆయన్ను సరిగా కూచోబెట్టి పరిచర్యలు చేస్తుండటం సీసీటీవీ ఫుటేజీలో రికార్డయ్యాయి.

ఏనుగును ఎలుక ఢీకొడుతున్నట్టుగా ఉంది

భారత్‌పై అమెరికా చర్యల పట్ల అమెరికన్ ఆర్థికవేత్త వ్యాఖ్య

వాషింగ్టన్: రష్యా నుంచి ముడి చమురు కొనుగోలు చేసినందుకు భారత్‌ను శిక్షించాలనే ప్రయత్నంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాలు ఆ దేశానికే ఎసరు తెస్తున్నాయి. భారత్ పట్ల అమెరికా వైఖరిపై ట్రంప్ ప్రభుత్వం సొంత ఆర్థిక వేత్తలనుంచే విమర్శలను ఎదుర్కొంటోంది. భారత్‌పై అమెరికా సుంకాల చర్యలు ఏనుగును ఎలుక పిడికిలితో ఢీకొట్టినట్టుగా ఉందని అమెరికన్ ఆర్థికవేత్త రిచర్డ్ వోల్ఫ్ విమర్శించారు. ప్రపంచంలోనే అత్యంత కఠినమైన వ్యక్తిలా అమెరికా వ్యవహరిస్తోందని, కానీ తనను తానే దహించుకుంటోందని విచారం వ్యక్తం చేశారు. ట్రంప్ సుంకాలు బ్రిక్స్ కూటమిని పోషిస్తున్నాయని ఆయన హెచ్చరించారు. బ్రిక్స్‌ను విజయవంతమైన ఆర్థిక ప్రత్యామ్నాయంగా అమెరికా అభివృద్ధి చేస్తోందని గుర్తు చేశారు. కాగా, భారతీయ ఉత్పత్తులపై ట్రంప్ విధించిన 50 శాతం సుంకాలు బుధవారం నుంచి అమల్లోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో తాజా పరిణామాలపై రష్యా టుడేకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వోల్ఫ్ మాట్లాడారు.

బ్రిక్స్ దేశాలను బలోపేతం చేస్తోంది..

'భూమిపై అతిపెద్ద దేశం భారత్. సోవియట్ యూనియన్ కాలం నుంచే అమెరికాతో భారత్‌కు బలమైన సంబంధాలున్నాయి. ఈ విషయాన్ని ట్రంప్ మర్చిపోతున్నారు. భారత్‌కు అమెరికా మార్కెట్ గేట్లు మూసేస్తే.. ఆ దేశం తన ఎగుమతులను విక్రయించడానికి ఇతర దేశాలను వెదుక్కుంటుంది. చమురును అమ్ముకునేందుకు రష్యా ఇతరత్రా మార్కెట్లను సిద్ధం చేసుకున్నట్లే.. భారత్ కూడా ఇతరత్రా మార్కెట్లను తయారు చేసుకోగలదు. ప్రపంచ జీడీపీలో బ్రిక్స్ కూటమిలోని చైనా, భారత్, రష్యా, బ్రెజిల్, ఇండోనేషియా వంటి దేశాల వాటా 35 శాతం దాకా ఉంది. జీ7 దేశాల జీడీపీ వాటా 28 శాతమే. ఈ నేపథ్యంలో అమెరికా చర్యలు బ్రిక్స్ దేశాలను బలోపేతం చేస్తాయి. పశ్చిమ దేశాలకు ఆర్థిక ప్రత్యామ్నాయంగా మారుస్తాయి' అని వోల్ఫ్ వ్యాఖ్యానించారు.



రిచర్డ్ వోల్ఫ్

అమెరికా దిగుమతిదారులకూ ప్రమాదం..

'ప్రస్తుతం భారత్, చైనా, బ్రెజిల్ వంటి దేశాల్లో వస్తువులు, సేవలను చౌకగా పొందుతున్న కంపెనీలు అమెరికాకు తరలే అవకాశమే లేదు. అందుకు ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలు కూడా ఫలించవు. ఇప్పటికే అమెరికాలో కొత్త ఉద్యోగాలు లేవు. సుంకాల వల్ల అమెరికన్ ఎగుమతిదారులూ రిస్క్‌ను ఎదుర్కొంటున్నారు. వాళ్లు విదేశీ మార్కెట్లను కోల్పోయే అవకాశం ఉంది. ఇప్పటికే అమెరికాకు ట్రిలియన్ డాలర్ల అప్పులున్నాయి. విదేశీ అప్పులపై అమెరికా ఇంకా ఎంతకాలం నిలువగలదనేది పెద్ద ప్రశ్న. ఇదే పరిస్థితి కొనసాగితే అమెరికా అప్పులపై వడ్డీల భారం పెరిగిపోతుంది. తద్వారా అమెరికా బలహీనపడుతుంది' అని వోల్ఫ్ విశ్లేషించారు.

బ్రిక్స్ దేశాలకు బెదిరింపులు..

బ్రిక్స్ పది దేశాలతో కూడిన సమూహం. ఇందులో బ్రెజిల్, రష్యా, భారతదేశం, చైనా, దక్షిణాఫ్రికా, ఈజిప్ట్, ఇథియోపియా, ఇండోనేషియా, ఇరాన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ సభ్యదేశాలుగా ఉన్నాయి. ఈ కూటమి పాశ్చాత్య ఆర్థిక ఆధిపత్యాన్ని ఎదుర్కోవడమే లక్ష్యంగా పెట్టుకుంది. డాలర్ ఆధిపత్యాన్ని సవాలు చేయడానికి ప్రత్యామ్నాయాలను అన్వేషిస్తోంది. అయితే.. ట్రంప్ అనేక సందర్భాల్లో బ్రిక్స్‌ను వేగంగా అంతరించిపోతున్న ఒక చిన్న సమూహంగా తోసిపుచ్చారు. రెండోసారి అధికారంలోకి వచ్చాక ఫిబ్రవరిలో ఏకంగా బ్రిక్స్ చచ్చిపోయిందన్నారు. డాలర్‌ను కాదని ఉమ్మడి కరెన్సీని సృష్టించడానికి ప్రయత్నిస్తే.. సభ్య దేశాలపై 100 శాతం సుంకాలు విధిస్తామని బెదిరించారు.

పుతిన్ చర్చలకు రావాలి: ఈయూ చీఫ్

బ్రస్సెల్స్: ఉక్రెయిన్‌పై దాడులను రష్యా తక్షణమే నిలిపేయాలని, శాంతి చర్చలకు ముందుకు రావాలని యురోపియన్ యూనియన్ కమిషన్ చీఫ్ ఉర్సులా వాన్‌డెర్ లేయన్ కోరారు. ఉక్రెయిన్ రక్షణ, భద్రత, శాశ్వత స్థిరత్వానికి యూరప్ నుంచి మద్దతను ఆమె పునరుద్ఘాటించారు. కీవ్‌పై రష్యా వైమానిక దాడుల్లో 21 మంది మరణించడం పట్ల ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. పుతిన్ చర్చలకు రావాలి, సామాన్య పౌరులు, మౌలిక సదుపాయాలపై రష్యా నిరంతర దాడులను యూరప్ సహించబోదన్నారు. ఉక్రెయిన్‌కు విశ్వసనీయ భద్రతా హామీలతో పాటు న్యాయమైన, శాశ్వత శాంతి నెలకొల్పేందుకు తమ మద్దతు ఉంటుందని నొక్కి చెప్పారు. అందుకోసం ధైర్యవంతులైన ఉక్రేనియన్ సాయుధ దళాలను బలోపేతం చేయడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తామన్నారు. దాడిని అంతకుముందు ఎక్స్‌లోనూ ఆమె ఖండించారు. 'రష్యా కనికరంలేని బాంబు దాడుల్లో మరో రాత్రి పీడకలలా మిగిలింది. అమాయకుల ప్రాణాలను బలిగొంది. ఇది కీవ్‌లోని మా ప్రతినిధి బృందాన్ని కూడా తాకింది. మా ప్రతినిధి బృందం సిబ్బంది సురక్షితంగా ఉన్నారు. పౌర మౌలిక సదుపాయాలపై రష్యా తన విచక్షణారహిత దాడులను వెంటనే ఆపాలి. న్యాయమైన, శాశ్వత శాంతి కోసం చర్చలలో చేరాలి' అని ఆమె ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. ఈ దాడులను బ్రిటన్ సైతం ఖండించింది. శాంతి చర్చలకు ఎదురుదెబ్బగా అభివర్ణించింది.

తామరస్సేరి పాస్‌ను పునరుద్ధరించండి

నితిన్ గడ్కరీకి ప్రియాంకా గాంధీ లేఖ

న్యూఢిల్లీ: తామరస్సేరి పాస్‌ను తిరిగి తెరవడానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి వాయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ లేఖ రాశారు. వాయనాడ్ ప్రజలకు ఏకైక దారి ఆ ఘాట్ రోడ్డని, ఆలస్యం చేయకుండా ఆ రోడ్డును పునరుద్ధరించాలని ఆమె కోరారు. మంగళవారం సాయంత్రం లక్కిడి వ్యూ పాయింట్ సమీపంలో కొండ చరియలు విరిగిపడ్డాయి. రోడ్డుపై భారీ రాళ్లు, మట్టి పడిపోయాయి. కొండచరియలు విరిగిపడటం దాదాపు మూడు రోజులుగా రోడ్డుపై అంతరాయం కొనసాగుతోంది. నిరంతర వర్షాలు, కొండచరియలు విరిగిపడతాయన్న ఆందోళనతో అధికారులు ట్రాఫిక్‌ను నిషేధించారు. ఈ రహదారిలో వర్షం లేనప్పుడు మాత్రమే చిన్న వాహనాలను పాస్‌లోకి అనుమతించాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. తదుపరి నోటీసు వచ్చే వరకు భారీ వాహనాలు నిషేధించింది. దీంతో.. కోజికోడ్‌కు వెళ్లాలనుకునే వయనాడ్ ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆమె లేఖలో పేర్కొన్నారు. ఈ రోడ్డుపై బురదను నివారించడానికి, అవసరమైన చర్యలను అధ్యయనం చేసేందుకు వెంటనే నిపుణుల కమిటీని పంపాలని ఆమె కేంద్రాన్ని కోరారు.

అదనపు కట్నం కోసం యాసిడ్ తాగించారు

అమ్రోహా: అదనపు కట్నం కోసం కోడలును వేధించిన అత్తామామలు, చివరికి ఆమెతో యాసిడ్ తాగించారు. 17 రోజులపాటు ప్రాణాలతో పోరాడిన ఆమె.. చివరకు మృతి చెందారు. ఉత్తరప్రదేశ్‌లోని అమ్రోహాలో ఆగస్టు 11న జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అమ్రోహాకు చెందిన గుల్ ఫిజా ఏడాది కిందట ఖేడా గ్రామానికి చెందిన పర్వేజ్‌ను వివాహం చేసుకున్నారు. పెళ్లి అయినప్పటి నుంచే గుల్ ఫిజాను కట్నం కోసం అత్తమామలు, ఇతర కుటుంబ సభ్యులు వేధిస్తున్నారు. రానురాను వేధింపులు దారుణంగా మారాయి. ఎలాగైనా ఆమెను వదిలించుకోవాలనుకున్న అత్తింటి కుటుంబం.. ఆగస్టు 11న, గుల్ ఫిజాతో బలవంతంగా యాసిడ్ తాగించారు. ఇది తెలిసిన వెంటనే ఆమెను మొరాదాబాద్‌లోని ఆసుపత్రికి తరలించారు. అక్కడ 17 రోజులపాటు చికిత్స పొందిన గుల్ ఫిజా పరిస్థితి విషమించడంతో మరణించింది. తన బిడ్డను వరకట్నం కోసం వేధించి, చివరకు చంపేశారని బాధితురాలి తండ్రి ఫిర్యాదు చేశారు. దీంతో గుల్ ఫిజా భర్త పర్వేజ్, అతని కుటుంబ సభ్యులపై వరకట్న వేధింపులు, దాడి, ఇతర అభియోగాల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. గుల్ ఫిజా మరణించడంతో హత్య అభియోగాలు జోడించనున్నారు. పోస్ట్ మార్టం నివేదిక తర్వాత నిందితులపై హత్య అభియోగాలు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

గాజాలో మరణాలు 63 వేలు

గాజా సిటీ: ఇజ్రాయెల్, హమాస్ మధ్య గాజాలో 22 నెలలుగా జరుగుతున్న యుద్ధంలో మృతి చెందిన పాలస్తీనియన్ల సంఖ్య 63 వేలు దాటిందని శుక్రవారం గాజా ఆరోగ్య విభాగం తెలిపింది. మొత్తం 63,025 మంది చనిపోయారని క్షతగాత్రుల సంఖ్య లక్షల్లోనే ఉంటుందని తెలిపింది. గాజా నగరాన్ని ఆక్రమించుకునేందుకు ఇజ్రాయెల్ ఆర్మీ పాల్పడుతున్న విధ్వంసం కారణంగా జనం వలసలు, కరువు పరిస్థితులు మరింత తీవ్ర రూపం దాల్చాయని పరిశీలకులు అంటున్నారు. ఇలా ఉండగా, గాజా నగరాన్ని శుక్రవారం ఇజ్రాయెల్ ఆర్మీ యుద్ధ ప్రాంతంగా ప్రకటించింది.



అమెరికాలో నడి రోడ్డుపై గట్కా విన్యాసాలు.. సిక్కు వ్యక్తిని కాల్చి చంపిన పోలీసులు

లాస్‌ఏంజెలెస్: అమెరికాలో నడి రోడ్డుపై ప్రాచీన యుద్ధ విద్యను ప్రదర్శించిన ఓ సిక్కు వ్యక్తిని అమెరికా పోలీసులు కాల్చి చంపారు. జూలై 13వ తేదీన చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వీడియో ఫుటేజీని లాస్‌ఏంజెలెస్ పోలీసు విభాగం తాజాగా విడుదల చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. లాస్‌ఏంజెలెస్‌లోని క్రిప్టో డాట్ కామ్ అరెనా వద్ద గుర్‌ప్రీత్ సింగ్(35) వేటకత్తిని పట్టుకుని తిప్పుతుండగా హెచ్చరించామని, లక్ష్య పెట్టకపోగా తమపైకి దాడికి యత్నించాడని పోలీసులు అంటున్నారు. ఈ క్రమంలో జరిపిన కాల్పుల్లో అతడు చనిపోయాడని చెబుతున్నారు. పోలీసులు చెబుతున్న వేటకత్తి, పంజాబ్ ప్రాచీన యుద్ధ విద్యలో భాగమైన గట్కాలో వాడే రెండంచుల కత్తి. సిక్కు మత పరమైన, సాంస్కృతిక కార్యక్రమాలప్పుడు దీనిని ప్రదర్శిస్తుంటారు. అయితే, షార్టు, తలపాగాను ధరించిన ఓ వ్యక్తి రెండడుగుల పొడవైన కత్తితో బెదిరించాడంటూ ఓ వ్యక్తి ఫిర్యాదు చేయడంతో తమ సిబ్బంది రద్దీగా ఉండే ఆ ప్రాంతానికి వెళ్లారని పోలీసు విభాగం తెలిపింది. 'కత్తిని నేలపై పడేసి, లొంగిపోవాలని పదేపదే కోరగా, నిరాకరించిన అతడు కత్తితో నాలుకను కోసుకునేందుకు యత్నించాడు. సమీపంలోకి చేరుకుంటున్న పోలీసులపైకి బాటిల్ విసిరి, తన కారులో అక్కడి నుంచి తప్పించుకునేందుకు యత్నించాడు. పోలీసులు వెంబడించగా నిర్లక్ష్యంగా డ్రైవ్ చేస్తూ పలు వాహనాలను ఢీకొట్టాడు. వేగంతో వెళ్తానే కారులో నుంచి కత్తిని చూపుతూ బెదిరించాడు. కత్తిని విసిరేందుకు యత్నించగా కాల్పులు జరపాల్సి వచ్చింది. బుల్లెట్ గాయాలైన అతడు అనంతరం ఆస్పత్రిలో కన్నుమూశాడు' అని పోలీసులు వివరించారు.

ఓట్ చోరీపై బీజేపీ నేతల్లో భయం

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ

సివాన్: ఎన్నికల కమిషన్ సాయంతో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఓట్ చోరీకి పాల్పడి దొరికిపోవడంతో బీజేపీ నేతల్లో భయం మొదలైందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ఇది ఆరంభం మాత్రమేనని ఆయన పేర్కొన్నారు. ఇటువంటి మరికొన్ని అక్రమాలను ముందుముందు బయటపెడతామన్నారు. నరేంద్ర మోదీ ఏం చేసిన బిహార్‌లో ఓట్ చోరీ మాత్రం జరగనివ్వబోమని స్పష్టం చేశారు. బిహార్‌లోని సివాన్‌లో శుక్రవారం ఓటర్ అధికార్ యాత్ర సందర్భంగా ప్రజలనుద్దేశించి ఆయన మాట్లాడారు. 'మీ ఓట్లను దొంగిలించి బీజేపీ ఎన్నికల్లో గెలుస్తూ వస్తోంది. ఇకపై అలా జరగనివ్వం' అని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో చేపట్టిన ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌లో తొలగించిన 65 లక్షల ఓట్లు దళితులు, అత్యంత వెనుకబడిన వర్గాలు, వెనుకబడిన కులాలు, పేదలకు చెందినవేనని ఆయన విమర్శించారు.

ఆ సొమ్ము దేవతలది.. ప్రభుత్వానిది కాదు..!

ఆలయ నిధులను ప్రభుత్వం వాడటంపై మద్రాస్ హైకోర్టు వ్యాఖ్య

చెన్నై: ఆలయ నిధులను ఫంక్షన్ హాళ్ల నిర్మాణానికి మళ్లించాలంటూ తమిళనాడు ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను మద్రాస్ హైకోర్టు కొట్టివేసింది. ఆలయ నిధులను ప్రజల లేదా ప్రభుత్వ సొమ్ముగా భావించడానికి వీల్లేదని స్పష్టం చేసింది. జస్టిస్ ఎస్ఎం సుబ్రమణియమ్, జస్టిస్ జి అరుల్ మురుగన్‌ల మదురై డివిజన్ బెంచ్ ఈ మేరకు ఇటీవల తీర్పు వెలువరించింది. ఆలయాలకు విరాళాలుగా అందిన సొమ్ము, దానం చేసిన ఆస్తులు దేవతకే చెందుతాయి. దేవతకే వాటిపై న్యాయబద్ధమైన హక్కుంది. ఆలయాలు లాభదాయక సంస్థలు కావు. ఆలయాల సంపదను హిందూ రెలీజియస్ అండ్ చారిటబుల్ ఎండోమెంట్స్(హెచ్ఆర్ అండ్ సీఈ)చట్టం అనుమతించిన ప్రయోజనాలకు మాత్రమే వినియోగించాలి' అని ధర్మాసనం స్పష్టం చేసింది. హిందూ మత సంస్థలను పర్యవేక్షించే అధికారం ఈ చట్టం ద్వారా ప్రభుత్వానికి లభిస్తుంది. ఆలయ నిధులను భక్తులు లేదా దాతలు ఉద్దేశించిన మతపరమైన ప్రయోజనాల కోసం మాత్రమే ఉపయోగించేలా రాష్ట్రం చర్యలు తీసుకోవాలని చెబుతోంది. ఈ చట్టానికి ఇతర అర్థాలు చెబుతూ ఆలయ నిధులను దుర్వినియోగం చేయడానికి ప్రభుత్వం చేసే ఎలాంటి ప్రయత్నమైనా ఆమోదయోగ్యం కాదు. అది హిందువుల ప్రాథమిక హక్కును ఉల్లంఘించినట్లే అవుతుంది' అని ధర్మాసనం తీర్పులో పేర్కొంది. రూ.80 కోట్ల ఖర్చుతో రాష్ట్రంలోని 27 ఆలయాల్లో కల్యాణ మంటపాలు నిర్మిస్తామని ఇటీవల రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి శేకర్ బాబు అసెంబ్లీలో చేసిన ప్రకటనను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై హైకోర్టు పైవిధంగా తీర్పు వెలువరించింది. రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు చెల్లవని స్పష్టీకరించింది.

రెండుసార్లు భేటీ కానున్న మోదీ, జిన్‌పింగ్

బీజింగ్: చైనాలోని టియాంజిన్‌లో ఆదివారం షాంఘై సహకార సంస్థ(ఎస్‌సీవో) శిఖరాగ్రం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, అధ్యక్షుడు జిన్‌పింగ్ రెండు పర్యాయాలు భేటీ కానున్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మొదలుపెట్టిన టారిఫ్‌ల దాడి నేపథ్యంలో ఇద్దరు నేతలు ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకుంటారని భావిస్తున్నారు. జపాన్ పర్యటన ముగించుకుని ప్రధాని మోదీ శనివారం సాయంత్రం టియాంజిన్ చేరుకుంటారు. ఆదివారం మధ్యాహ్నం టియాంజిన్‌లో జిన్‌పింగ్‌తో సమావేశమవుతారు. అనంతరం ఎస్‌సీవో సందర్భంగా ఏర్పాటైన విందుకు ముందుగా రెండోసారి ఇద్దరు నేతలు చర్చలు జరిపే అవకాశముందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. సోమవారం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ద్వైపాక్షిక సంబంధాల బలోపేతమే లక్ష్యంగా భేటీ అవుతారు. అనంతరం ఆయన రోమ్‌కు పయనమవుతారు. ప్రధాని మోదీ చైనా పర్యటన ఏడేళ్ల తర్వాత ఇదే మొదటిది.

మద్దతు కోరుతూ ఎంపీలందరికీ లేఖలు

ఉపరాష్ట్రపతి అభ్యర్థి సుదర్శన్ రెడ్డి వెల్లడి

న్యూఢిల్లీ/ముంబై: తన అభ్యర్థిత్వాన్ని బలపర్చాలని కోరుతూ లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలందరికీ లేఖలు రాయనున్నట్లు ఉప రాష్ట్రపతి పదవికి పోటీ పడుతున్న బి.సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు. తనకు అవకాశమిస్తే రాజ్యాంగ పరిరక్షణకు పాటుపడుతానని చెప్పారు. భారత రాజ్యాంగంతో తన ప్రస్థానం ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్‌లో 1971లో సభ్యత్వం తీసుకున్నప్పటి నుంచి ప్రారంభమైందని తెలిపారు. 'నేను ఏ రాజకీయ పార్టీ సభ్యుడిని కాదు. ఏరాజకీయ పార్టీ లేదా సంస్థలో ఎన్నడూ సభ్యత్వం తీసుకోలేదు. భవిష్యత్తులోనూ తీసుకోను. ఈ ఒకే ఒక్క కారణంతోనే ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో నా అభ్యర్థిత్వాన్ని బలపర్చాలని అన్ని రాజకీయ పార్టీల నాయకులను కోరుతూ సవివరంగా లేఖ రాస్తా. ఆత్మప్రబోధానుసారం ఓటేయాలని కోరుతా' అని వివరించారు. అవకాశమిస్తే బీజేపీ అభ్యర్థిని కూడా కలుస్తానన్నారు. ఇద్దరు దక్షిణాది అభ్యర్థుల మధ్యే పోటీ జరుగుతోందన్న వాదనను ఆయన ఖండించారు. 'ఇది ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగే పోటీ మాత్రమే. మన జాతి ఒక్కటే. దేశం ఒక్కటే' అని ఆయన అన్నారు. ఉపరాష్ట్రపతి ఎన్నిక ప్రచారంలో భాగంగా అంతకుముందు సుదర్శన్ రెడ్డి, శివసేన(యూబీటీ)చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే, ఎన్సీపీ(ఎస్పీ) అధ్యక్షుడు శరద్ పవార్‌ను కలుసుకున్నారు. తమ పార్టీతోపాటు మహా వికాస్ అఘాడీలోని పార్టీలు కూడా సుదర్శన్ రెడ్డికే మద్దతిస్తామని ఠాక్రే చెప్పారు. యావత్ ప్రతిపక్షం సుదర్శన్ రెడ్డి వెనుకే ఉంటుందని శరద్ పవార్ స్పష్టం చేశారు. ఇలా ఉండగా, ఉప రాష్ట్రపతి పదవికి పోటీ పడుతున్న సుదర్శన్ రెడ్డికి మద్దతివ్వ వద్దంటూ నక్సల్ హింస బాధితులు ఎంపీలకు విజ్ఞప్తి చేశారు. మావోయిస్టులకు వ్యతిరేకంగా వస్తున్న ప్రజా ఉద్యమాన్ని ఆయన ఆపారని ఆరోపించారు. బస్తర్ శాంతి సమితి(బీఎస్ఎస్) బ్యానర్‌తో ఢిల్లీలో శుక్రవారం కొందరు మీడియాతో మాట్లాడారు. సల్వా జుడుం రద్దు కారణంగా తమ ఉద్యమం బలహీనపడటంతోపాటు ఎందరో జీవితాలు నాశనమయ్యాయన్నారు.

గుజరాత్ బిట్‌కాయిన్ దోపిడీ కేసు.. బీజేపీ మాజీ ఎమ్మెల్యే, మాజీ ఐపీఎస్ సహా 14 మందికి జీవిత ఖైదు

అహ్మదాబాద్ కోర్టు సంచలన తీర్పు

అహ్మదాబాద్: 2018 నాటి బిట్‌కాయిన్ దోపిడీ, బిల్డర్ కిడ్నాప్ కేసులో అహ్మదాబాద్ ప్రత్యేక కోర్టు శుక్రవారం సంచలన తీర్పు వెలువరించింది. బీజేపీ మాజీ ఎమ్మెల్యే నళిన్ కొటాడియా, మాజీ ఐపీఎస్ అధికారి జగదీశ్ పటేల్ సహా 14 మందికి జీవిత ఖైదు విధించింది. శైలేష్ భట్ అనే బిల్డర్‌ను అపహరించిన ఆరోపణలు ఎదుర్కొన్న వారిలో పలువురు గుజరాత్ పోలీసు అధికారులు సైతం ఉండటం గమనార్హం. వివరాలివీ...శైలేష్ భట్, అతడి సన్నిహితులు కలిసి సూరత్‌కు చెందిన ధావల్ మవానీ అనే వ్యక్తి నుంచి రూ.150 కోట్ల విలువైన బిట్ కాయిన్లను దొంగతనం చేసినట్లు నళిన్ కొటాడియా, అతడి బ్యాచ్‌కు సమాచారం అందింది. దీంతో, వారు భట్‌ను దోచుకునేందుకు పథకం వేశారు. ఈ కుట్రలో వారు పలువురు పోలీసు ఉన్నతాధికారులను సైతం కలుపుకున్నారు. ఇందుకు పథకం రచించిన సీబీఐ ఇన్‌స్పెక్టర్ సునీల్ నాయర్ రూ.5 కోట్లు ముట్టాయి. ఇతర పోలీసులతో కలిసి భట్ దగ్గరున్న అప్పట్లో రూ.12 కోట్ల విలువున్న బిట్‌కాయిన్లను దౌర్జన్యంగా లాక్కున్నారు. వీరు భట్ నుంచి 200 బిట్‌కాయిన్లను బలవంతంగా లాక్కోవడంతోపాటు, రూ.32 కోట్లు డిమాండ్ చేశారు. అనంతరం భట్ దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐడీ క్రైం బ్రాంచి రంగంలోకి దిగి సమగ్ర దర్యాప్తు చేపట్టింది. నిందితులుగా తేలడంతో అమ్రేలి ఎస్పీ జగదీశ్ పటేల్‌తోపాటు అనంత్ పటేల్ తదితర ఇతర పోలీసు అధికారులను అరెస్ట్ చేసింది. సాక్ష్యాలు, ఆధారాల ఆధారంగా విచారణలో 15 మంది నిందితులకుగాను ఏసీబీ స్పెషల్ కోర్టు 14 మందిని దోషులుగా తేల్చింది. జతిన్ పటేల్‌పై ఉన్న అన్ని ఆరోపణలను కొట్టివేస్తూ తీర్పు వెలువరించింది.

వలసదారుల పడవ మునిగి 50 మంది మృతి

నోవాక్‌చొట్(మారిటానియా): ఆఫ్రికా దేశం మారిటానియా తీరంలో ఘోర విషాదం చోటుచేసుకుంది. వలసదారుల పడవ మునిగి కనీసం 50 మంది జలసమాధి కాగా, మరో 100 మంది వరకు గల్లంతయ్యారు. గాంబియా నుంచి సుమారు 160 మంది వలసదారులతో వారం క్రితం బయలుదేరిన ఈ పడవ మంగళవారం ఉదయం ప్రమాదానికి గురైందని మారిటానియా కోస్ట్ గార్డ్ చీఫ్ మహ్మద్ అబ్దల్లా శుక్రవారం తెలిపారు. తమ ఎంహెయిజిరత్ తీరంలో దిగాలనే తొందరగా ఎక్కువ మంది ఒకే వైపునకు చేరుకోవడంతో ఘటన చోటుచేసుకుందని వివరించారు. తాము 17 మందిని కాపాడామన్నారు. 50 వరకు మృతదేహాలు ఒడ్డుకు కొట్టుకు వచ్చాయని, మిగతా వారు గల్లంతయ్యారని తెలిపారు. ప్రమాదానికి గురైన పడవలో సెనెగల్, గాంబియా తదితర దేశాల వారున్నట్లు పేర్కొన్నారు.

ఉత్తరాఖండ్‌లో మళ్లీ మేఘ విస్ఫోటం

ఐదుగురు మృతి, 11 మంది గల్లంతు

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్‌లోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం సంభవించిన క్లౌడ్ బరస్ట్ సంబంధిత ఘటనల్లో ఐదుగురు చనిపోగా, 11 మంది జాడ గల్లంతయింది. చమోలి, రుద్రప్రయాగ్, తెహ్రి, బాగేశ్వర్ జిల్లాలపై ఆకస్మిక వర్షాలు, వరదలతో కొండచరియలు విరిగిపడి ఇళ్లు ధ్వంసం కాగా, పలువురు బురద మట్టి, బండరాళ్ల కింద సజీవ సమాధి అయ్యారు. ఈ నెల 23వ తేదీన చమోలి జిల్లా థరాలిలో క్లౌడ్ బరస్ట్ బీభత్సం సృష్టించడం తెల్సిందే. అంతకు ముందు ఈ నెల 5న ఉత్తరకాశీ జిల్లా ధరాలీని సగానికి సగం వరదలు ఊడ్చిపారేశాయి. అప్పట్లో 9 మంది ఆర్మీ సిబ్బంది సహా 69 మంది కనిపించకుండాపోయారు. తాజా వరదల్లో బాగేశ్వర్ జిల్లా పౌసరి గ్రామంలో ఆరేడు ఇళ్లు నేలకూలి ఇద్దరు చనిపోగా ముగ్గురు గల్లంతైనట్లు అధికారులు తెలిపారు. చమోలి జిల్లా మొపాట గ్రామంలో ఇల్లు కూలి దంపతులు చనిపోయారు. పదుల సంఖ్యలో పశువులు కొట్టుకుపోయాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో రుద్రప్రయాగ్ జిల్లా బసుకేదార్‌లో ఇల్లు కూలి ఒకరు చనిపోయారు. మరో నలుగురు శిథిలాల కింద చిక్కుకున్నారు. రహదారి దెబ్బతినడంతో సహాయ బృందాలు అక్కడికి చేరుకోవడం సాధ్యం కావడం లేదని ఎస్పీ అక్షయ్ ప్రహ్లాద్ చెప్పారు. తెహ్రి జిల్లాలోని బుద్ధ కేదార్‌లో పలు ఆలయాలు కొండ చరియల కింద కూరుకుపోయాయి. బాలగంగ, ధర్మగంగ, భిలన్‌గంగ, అలకానంద, మందాకిని నదులు పొంగిప్రవహిస్తున్నాయి. కొండ చరియలు విరిగిపడిన కారణంగా బద్రీనాథ్ జాతీయ రహదారి మూతబడింది. కేదార్‌నాథ్ హైవే సైతం నాలుగు రోట్ల దెబ్బతినడంతో రాకపోకలు బందయ్యాయి. బాగేశ్వర్, చమోలి, డెహ్రాడూన్, రుద్రప్రయాగ్ జిల్లాల్లో వచ్చే 24 గంటలపాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే ప్రమాదముందని వాతావరణ విభాగం రెడ్ అలెర్ట్‌ను, చంపావత్, హరిద్వార్, పితోర్‌గఢ్, ఉధమ్‌సింగ్ నగర్, ఉత్తరకాశీ జిల్లాలకు ఆరంజ్ అలెర్ట్‌ను జారీ చేసింది.

గెర్రి మాండరింగ్ అంటే అర్థం?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ

పార్లమెంటరీ పద్ధతులు - పారిభాషిక పదజాలం

పార్లమెంట్ సమావేశాల్లో వివిధ చర్చలు, తీర్మానాలు, ఓటింగ్ మొదలైన ప్రక్రియలుంటాయి. పార్లమెంట్‌లో ఉపయోగించే ప్రతి పదానికి ప్రత్యేక అర్థం ఉంది. పార్లమెంటరీ ప్రక్రియను బ్రిటన్ రాజ్యాంగం నుంచి గ్రహించారు.

Session - సమావేశ కాలం: పార్లమెంటు సమావేశాలు ప్రారంభమైన మొదటి రోజు నుంచి చివరి రోజు వరకు ఉన్న మధ్య కాలాన్ని సమావేశాల కాలం అంటారు. సమావేశాలను అవసరాన్ని బట్టి ఎన్ని రోజులైనా నిర్వహించుకోవచ్చు. నిబంధన- 85 ప్రకారం ఆరు మాసాలకు ఒకసారి, సంవత్సరానికి రెండుసార్లు జరపాలి.

Agenda - ఎజెండా: పార్లమెంటులో చర్చించాల్సిన కార్యక్రమాల పట్టికను ఎజెండా అంటారు. ఎజెండాను సభ వ్యవహారాల కమిటీ నిర్ణయిస్తుంది. ఈ కమిటీలో 15 మంది సభ్యులు ఉంటారు. వీరిలో 10 మందిని లోక్‌సభ నుంచి, 5 గురిని రాజ్యసభ నుంచి తీసుకుంటారు. దీని అధ్యక్షుడిగా స్పీకర్ ఉంటారు.

Dissolution - సభ రద్దు: రాజకీయ అనిశ్చిత పరిస్థితి సమయంలో లోక్‌సభ పదవీ కాలం పూర్తి కాకముందు లేదా అయిన తర్వాత నిబంధన- 85 ప్రకారం రాష్ట్రపతి లోక్‌సభను రద్దు చేస్తారు.

Adjournment - సభ వాయిదా: సభా కార్యక్రమాలను నిర్వహించేందుకు తగిన పరిస్థితి లేనప్పుడు సభల అధ్యక్షులు సభలను వాయిదా వేస్తారు. తిరిగి ఎప్పుడు సమావేశం అవుతాయో వాయిదా వేసినప్పుడే ప్రకటిస్తారు. దాని ప్రకారం తిరిగి సభలు సమావేశం అవుతాయి.

Sine-die - నిరవధిక వాయిదా: సభ కార్యక్రమాలను నిర్వహించేందుకు తగిన పరిస్థితి లేనప్పుడు సభాధ్యక్షులు సభను వాయిదా వేస్తారు. తిరిగి ఎప్పుడు సమావేశం అవుతాయో తర్వాత ప్రకటిస్తారు. దాని ప్రకారం సభలు సమావేశం అవుతాయి.

Prorogue - దీర్ఘకాలిక వాయిదా: సభ సమావేశాలు ముగియడం లేదా పరిసమాప్తం కావడాన్ని దీర్ఘకాలిక వాయిదా అంటారు. రాష్ట్రపతి దీర్ఘకాలిక వాయిదా వేస్తారు. తిరిగి రాష్ట్రపతి పిలుపు ఇచ్చేంత వరకు సభలు వాయిదా పడతాయి. గరిష్ఠంగా ఆరు నెలలు వాయిదా పడొచ్చు.

Question Hour - ప్రశ్నోత్తరాల సమయం: సమావేశాల్లోని ప్రతిరోజూ మొదటి గంటనే ప్రశ్నోత్తరాల సమయంగా పేర్కొంటారు. ఈ సమయంలో సభాధ్యక్షుడి పూర్వానుమతితో సభ్యులు ప్రశ్నలు అడుగుతారు. వాటికి సంబంధిత మంత్రి సమాధానం ఇస్తారు. ప్రశ్నలు ప్రధానంగా రెండు రకాలు..

1. **నక్షత్రం గుర్తు ఉన్న ప్రశ్నలు:** అంటే ప్రాధాన్యత గల ప్రశ్నలు. వీటికి సమాధానాలను మౌఖికంగా ఇస్తారు. వీటి విషయంలో అనుబంధ ప్రశ్నలను అడగవచ్చు.
2. **నక్షత్రం గుర్తు లేని ప్రశ్నలు:** అంటే ప్రాధాన్యత లేని ప్రశ్నలు. వీటికి సమాధానాన్ని సంబంధిత మంత్రి లిఖిత పూర్వకంగా ఇస్తారు. వీటి విషయంలో అనుబంధ ప్రశ్నలను అడిగే అవకాశం లేదు.

Zero Hour - శూన్య కాలం: ప్రశ్నోత్తరాలు - భోజన సమయానికి మధ్య గల సమయమే.. శూన్య కాలం. ఈ టైమ్‌లో సభాధ్యక్షుడి ఆమోదం తీసుకొని అప్పటికప్పుడు వివిధ సమస్యలపై సభ్యులు ప్రశ్నలు అడుగుతారు. మంత్రులు సమాధానం ఇస్తారు. ఇది పార్లమెంట్ ప్రక్రియలో పేర్కొనలేదు. ఈ పదాన్ని మీడియా ప్రవేశపెట్టింది. 1962 నుంచి పాటిస్తున్నారు.

Calling attention motion - సావధాన తీర్మానం: ఏదైనా అత్యంత ముఖ్యమైన, ప్రజాసంబంధ అంశంపై సంబంధిత మంత్రి నుంచి అధికారికంగా సమాధానం రాబట్టేందుకు ఈ తీర్మానం ప్రవేశపెడతారు. దీన్ని ప్రవేశపెట్టేందుకు ఇద్దరు సభ్యుల మద్దతుతో సభాధ్యక్షుడికి నోటీస్ జారీ చేయాలి. అధ్యక్షుడు అంగీకరిస్తే సంబంధిత మంత్రి సమాధానం ఇస్తారు. దీన్ని 1954 నుంచి ఉపయోగిస్తున్నారు.

Half an Hour Discussion - అరగంట చర్చ: లోక్‌సభలో సోమ, బుధ, శుక్రవారాల్లో, రాజ్యసభలో ఏ రోజైనా లేదా ప్రతిరోజైనా చివరి అరగంటను కేటాయించుకోవచ్చు. ఈ సమయంలో ప్రశ్నోత్తరాలకు తగిన ప్రాధాన్యత లభించని అంశాలపై చర్చిస్తారు.

Short Duration Discussion - స్వల్ప కాలిక చర్చ: ప్రజా సంబంధమైన ముఖ్యాంశాల మీద సభ్యులు చర్చ లేవనెత్తవచ్చు. సభా కార్యక్రమాల చివర దీన్ని స్పీకర్ అనుమతిస్తారు. ఇందులో ఓటింగ్ ఉండదు.



No confidence Motion - అవిశ్వాస తీర్మానం: ప్రభుత్వం ప్రజా విశ్వాసం కోల్పోయిందని భావించినా లేదా ప్రజా సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించినా ఆ ప్రభుత్వాన్ని తొలగించేందుకు ఈ తీర్మానాన్ని ప్రతిపక్షాలు ప్రవేశపెడతాయి. దీన్ని ప్రవేశపెట్టేందుకు లోక్‌సభ సభ్యుల్లో 50 మంది మద్దతుతో స్పీకర్‌కు నోటీస్ జారీ చేయాలి. స్పీకర్ ఆమోదిస్తే తీర్మానం చర్చకు వస్తుంది. అనంతరం ఓటింగ్ జరుపుతారు. ఈ ఓటింగ్‌కు హాజరై ఓటువేసిన సభ్యులు సాధారణ మెజార్టీతో తీర్మానాన్ని ఆమోదిస్తే ప్రభుత్వం కూలిపోతుంది. మొట్టమొదట 1961లో నెహ్రూ ప్రభుత్వంపై జె.బి. కృపలానీ ఈ తీర్మానాన్ని ప్రతిపాదించారు. ఎక్కువ సార్లు (8) పి.వి. నరసింహారావు ప్రభుత్వంపై ప్రవేశపెట్టారు. ఈ తీర్మానం ద్వారా 1999లో అటల్ బిహారి వాజ్‌పేయి ప్రభుత్వం కూలిపోయింది.

Confidence Motion - విశ్వాస తీర్మానం: ప్రజా విశ్వాసం తమ ప్రభుత్వానికి ఉందని నిరూపించుకునేందుకు అధికార పక్షం తనపై తాను పెట్టుకునే తీర్మానం. ఇది లోక్‌సభలో సాధారణ మెజార్టీతో నెగ్గాలి. లేకుంటే ప్రభుత్వం కూలిపోతుంది. ఈ తీర్మానం ద్వారా వి.పి.సింగ్ (1990) ప్రభుత్వం పడిపోయింది.

Quorum - నిర్దిష్ట పూర్వక సంఖ్య: నిబంధన -100 ప్రకారం పార్లమెంట్ కోరం సభాధ్యక్షుడితో కలుపుకొని 1/10. కోరం అంటే పార్లమెంట్ సమావేశాలకు హాజరు కావాల్సిన సభ్యుల సంఖ్య. కోరం లేకుంటే సమావేశాలను వాయిదా వేయవచ్చు.

Adjournment motion - వాయిదా తీర్మానం: అత్యంత ముఖ్యమైన సమకాలీన సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చేందుకు ఈ తీర్మానాన్ని ప్రవేశపెడతారు. దీన్ని ప్రవేశపెట్టేందుకు లోక్‌సభ సభ్యుల్లో 50 మంది మద్దతుతో నోటీస్ జారీ చేయాలి. స్పీకర్ ఆమోదిస్తే తీర్మానం చర్చకు వస్తుంది.

Lame duck session: గత లోక్‌సభలో సభ్యులుగా ఉండి ప్రస్తుత లోక్‌సభకు పోటీచేసి ఓడిపోయిన వారితో ప్రస్తుత లోక్‌సభ సభ్యులు జరిపే చివరి సమావేశం. ఇది బ్రిటన్‌లో ఉంటుంది. మన దేశంలో లేదు.

Filibustering - ఫిలిబస్టరింగ్: పార్లమెంట్ కార్యక్రమాల్లో ఒక బిల్లు ఆమోదం పొందకుండా చేసేందుకు సభ్యులు ఉద్దేశపూర్వకంగా చేసే దీర్ఘకాలిక ఉపన్యాసం.
సభ సమయం ముగిసేందుకు ఇబ్బందులు సృష్టించడం.

Gerry mandering-గెర్రిమాండరింగ్: అధికార పార్టీ నియోజకవర్గాల సరిహద్దులను తమకు అనుకూలంగా మార్చుకోవడం. ఎన్నికల్లో విజయం సాధించేందుకు చేసే ప్రయత్నం.

Floor Crossing - ఫ్లోర్ క్రాసింగ్: ప్రతిపక్ష పార్టీ నుంచి అధికార పక్షంలోకి పార్టీ ఫిరాయిస్తే ఫ్లోర్ క్రాసింగ్‌గా పేర్కొంటారు.

Carpet Crossing - కార్పెట్ క్రాసింగ్: అధికార పక్షం నుంచి ప్రతిపక్షంలోకి పార్టీ ఫిరాయిస్తే కార్పెట్ క్రాసింగ్‌గా పేర్కొంటారు.

Crossing - క్రాసింగ్: ఒక ప్రతిపక్ష పార్టీ నుంచి మరో ప్రతిపక్ష పార్టీలోకి మారడం.

Carpetbagger - కార్పెట్ బెగ్గర్: ఒక స్థానికేతర అభ్యర్థి స్థానిక అభ్యర్థిపై ఎన్నికల్లో పోటీ చేసి ఎన్నిక కావాలనుకోవడమే కార్పెట్ బెగ్గింగ్.

గిలెటిన్: పార్లమెంట్ సమావేశాల ముగింపు దశలో వివిధ బిల్లులపై సమగ్రమైన చర్చ జరిపేందుకు తగిన సమయం లేని సందర్భంలో ఎలాంటి చర్చ లేకుండానే బిల్లులను ఆమోదించడాన్ని 'గిలెటిన్' అని పేర్కొంటారు.

హంగ్ పార్లమెంట్: లోక్‌సభకు జరిగిన సాధారణ ఎన్నికల్లో ఏ పార్టీ సంపూర్ణమైన మెజార్టీని సాధించనప్పుడు ఏర్పడే పరిస్థితిని 'హంగ్ పార్లమెంట్' లేదా 'త్రిశంకు సభ' అంటారు.

Horse Trading - హార్స్ ట్రేడింగ్: లోక్‌సభ లేదా విధాన సభ ఎన్నికల్లో ఏ పార్టీ పూర్తి మెజార్టీ సాధించనప్పుడు ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మెజార్టీని సాధించేందుకు సభ్యుల కొనుగోలు కోసం జరిపే బేరసారాలను 'హార్స్ ట్రేడింగ్' అంటారు. .

గత పరీక్షల్లో అడిగిన ప్రశ్నలు

1. జీరో అవర్ (Zero Hour) అంటే?
   1) ముందుగా నోటీస్ ఇవ్వకుండానే అత్యంత ముఖ్యమైన విషయాలు లేవనెత్తడం
   2) లోక్‌సభలో ద్రవ్య బిల్లును ప్రవేశపెట్ట డం
   3) ప్రతిపక్ష పార్టీల మనవిని పరిశీలించడం
   4) ఉదయం, మధ్యాహ్నం సెషన్‌లకు మధ్య భోజన విరామం
2. అవిశ్వాస తీర్మాన మనవిని స్పీకర్ అనుమతించాలంటే ఎంత మంది లోక్‌సభ సభ్యుల మద్దతు ఉండాలి?
   1) 35 2) 50
   3) 25 4) 20

సమాధానాలు: 1) 1; 2) 2;

మాదిరి ప్రశ్నలు

1. గ్యాలప్‌పోల్ అంటే ఏమిటి?
   1) ప్రతిపక్షాల అభిప్రాయాన్ని తీసుకోవడం
   2) సుప్రీంకోర్టు అభిప్రాయాన్ని కోరడం
   3) ప్రజాభిప్రాయాన్ని సేకరించడం
   4) ఎన్నికల ప్రచారం
2. గెర్రి మాండరింగ్ అంటే అర్థం?
   1) నియోజకవర్గ సరిహద్దులను మార్చడం
   2) ఓటర్లను ప్రభావితం చేయడం
   3) సైనిక పరిపాలన విధించడం
   4) ఏదీ కాదు
3. పార్లమెంటరీ ప్రక్రియలో పేర్కొనని పదం?
   1) ప్రశ్నల గంట (Question Hour)
   2) శూన్య కాలం (Zero Hour)
   3) దీర్ఘకాలిక వాయిదా (Prorogue)
   4) వాయిదా తీర్మానం (Adjournment Motion)
4. 'గిలెటిన్' తీర్మానం అంటే?
   1) బిల్లులను చర్చించి ఓటింగ్ జరపడం
   2) సమావేశ గడువు ముగిసేలోగా బిల్లులన్నింటినీ మూకుమ్మడిగా ఆమోదించడం
   3) 1, 2 4) ఏదీకాదు
5. మనదేశంలో మొదట ఏ లోక్‌సభ ద్వారా 'హంగ్ పార్లమెంట్' ఆవిర్భవించింది?
   1) 9వ లోక్‌సభ
   2) 10వ లోక్‌సభ
   3) 8వ లోక్‌సభ
   4) ఏదీకాదు
6. మన పార్లమెంట్‌లో ఉపయోగించని పదం ఏది?
   1) Lame - duck - session
   2) Point of order
   3) Censure motion
   4) Vote on Account
7. పార్లమెంటరీ కమిటీల్లో అతిపెద్ద కమిటీ?
   1) ప్రభుత్వ ఖాతాల సంఘం
   2) ప్రభుత్వ అంచనాల సంఘం
   3) ప్రభుత్వ ఉపక్రమాల సంఘం
   4) సభ వ్యవహారాల సంఘం
8. ఏ కమిటీకి కంప్ట్రోలర్ అండ్ అడిటర్ జనరల్ 'మిత్రునిగా, మార్గదర్శిగా, తాత్వికునిగా' వ్యవహరిస్తారు?
   1) జీతభత్యాల కమిటీ
   2) సభ హక్కుల కమిటీ
   3) ప్రభుత్వ ఖాతాల సంఘం
   4) గ్రంథాలయ కమిటీ
9. వీటిలో ఏ కమిటీకి స్పీకర్ అధ్యక్షుడిగా కొనసాగుతారు?
   1) ప్రభుత్వ ఉపక్రమాల కమిటీ
   2) ప్రభుత్వ ఖాతాల కమిటీ
   3) సభ వ్యవహారాల కమిటీ
   4) ప్రభుత్వ అంచనాల కమిటీ
10. ఒక బిల్లు స్వభావాన్ని బట్టి నిబంధన 110 ప్రకారం ఆ బిల్లు సాధారణ బిల్లు లేదా ఆర్థిక బిల్లు అని ఎవరు నిర్ణయిస్తారు?
    1) రాష్ట్రపతి
    2) కేంద్ర ఆర్థిక మంత్రి
    3) లోక్‌సభ స్పీకర్
    4) అటార్నీ జనరల్
11. జీరో అవర్ కాలపరిమితి ఎంత?
    1) ఒక గంట
    2) 45 నిమిషాలు
    3) అర్ధ గంట
    4) నిర్ణీత సమయం ఉండదు
12. నక్షత్రం గుర్తు గల ప్రశ్నలకు సమాధానాలను ఎలా ఇస్తారు?
    1) లిఖితపూర్వకంగా
    2) మౌఖికంగా
    3) 1, 2
    4) ఏదీకాదు
13. ఆర్థికేతర బిల్లును రాష్ట్రపతి ఆమోదానికి పంపినప్పుడు?
    1) ఆమోదించవచ్చు
    2) పునఃపరిశీలనకు పంపవచ్చు
    3) తన వద్దే ఉంచుకోవచ్చు
    4) పైవన్నీ
14. నిబంధన 120 ప్రకారం పార్లమెంట్ వ్యవహారాల్లో ఏ భాషను ఉపయోగించాలి?
    1) సభ్యుని మాతృభాష
    2) హిందీ
    3) ఇంగ్లిష్
    4) అన్నీ
15. ఆర్థిక కమిటీల్లో ఏ కమిటీ సంయుక్త పార్లమెంటరీ కమిటీ?
    1) ప్రభుత్వ ఖాతాల కమిటీ
    2) అంచనాల కమిటీ
    3) దత్త శాసనాల కమిటీ
    4) ఎస్సీ, ఎస్టీలపై కమిటీ
16. వీటిలో సరికానిది?
    1) బడ్జెట్ - ఆర్టికల్ -112
    2) ఉమ్మడి సమావేశం - 108
    3) తాత్కాలిక బడ్జెట్ - 116
    4) పార్లమెంట్ - 78

సమాధానాలు

1) 3; 2) 1; 3) 2; 4) 2;
5) 1; 6) 1. 7) 2; 8) 3;
9) 3; 10) 3; 11) 4; 12) 2;
13) 4; 14) 4; 15) 1; 16) 4;

పదజాలానికి అర్థంలో జరిగే మార్పును ఏమంటారు?

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

తెలుగు

అర్థ పరిణామం

భాషలోని వర్ణాలు, ధ్వనులు, వాక్య నిర్మాణం, వ్యాకరణ నిర్మాణం మారినట్లుగానే అర్థాలు కూడా మారడం సహజం. నన్నయ భారతంలో 'కంపు' అనే పదాన్ని వాసన అనే అర్థంలో వాడారు. నేటి భాషలో అది చెడు వాసన అనే అర్థంగా మారింది. ప్రతి పదానికీ చరిత్ర ఉంది. ఒక మాటకు ఒకే అర్థం కాకుండా అనేకార్థాలుంటాయి. కొత్త కొత్త భావాలు, ఆలోచనలు, అవసరాలు వచ్చినప్పుడు ఉన్న పదాలనే కొత్త సందర్భాల్లో వాడటం వల్ల కొత్త అర్థాలు ఏర్పడటం సహజం. పాతకాలంలో ఇల్లు అంటే పూరిల్లు అనే అర్థం ఉండేది. ఆధునిక కాలంలో ఇల్లు అంటే పెంకుటిల్లు, డాబా, మేడ, అపార్ట్‌మెంట్ అనే అర్థాల్లో రూఢమైంది.

అర్థ పరిణామానికి హేతువులు

అర్థ పరిణామానికి స్థూలంగా ప్రధానమైన ఐదు కారణాలను పేర్కొనవచ్చు. అవి..

- నాగరికతలో మార్పు రావడం
- చారిత్రక కారణాల వల్ల కొన్ని పదాలు ప్రసిద్ధిలోకి వచ్చి అర్థాంతరంలో ఉపయోగించడం వల్ల
- అలంకారిక ప్రయోగం
- పరిసరాల్లో మార్పు రావడం
- భావాభివ్యక్తిలో మార్పు
- ఇవేకాకుండా ప్రకరణార్థాలు, నానార్థాలు, శ్లేషార్థాలు, పలుకుబడులు, జాతీయాలు, వ్యాకరణార్థాలు, పర్యాయపదాల వల్ల అర్థాల్లో మార్పు వస్తుంది.

అర్థ పరిణామ భేదాలు

భాషావేత్తలు.. అర్థ వ్యాకోచం, అర్థ సంకోచం, అర్థ సౌమ్యత లేదా అర్థ గౌరవం, అర్థ గ్రామ్యత లేదా అర్థాపకర్ష, లక్ష్యార్థాలు, కేవల సంకేతార్థాలు, వస్తు పరిణామం, అలంకారిక ప్రయోగం, లోక నిరుక్తి వంటి బేధాలను పేర్కొన్నారు. వాటిని పరిశీలిద్దాం..

అర్థ వ్యాకోచం లేదా అర్థ విస్తృతి

ఒక పదం పాతకాలంలో పరిమితార్థంలో ఉండి, తర్వాత కాలంలో విశాలార్థంలో విస్తృతం కావడాన్ని అర్థ వ్యాకోచం లేదా అర్థ విస్తృతిగా పేర్కొనవచ్చు. ఆంగ్లంలో దీన్ని Extention of the meaning అంటారు. అర్థ వ్యాకోచానికి కొన్ని ఉదాహరణలు..

- **చెంబు:** రాగి లోహంతో చేసిన దాన్నే ప్రాచీన కాలంలో చెంబు అనేవారు. నేడు ఏ లోహంతో చేసినా చెంబు అంటున్నారు. ప్రత్యేకార్థం నుంచి విస్తృతార్థంలో ఇత్తడి చెంబు, ప్లాస్టిక్ చెంబు, వెండి చెంబు అని వ్యవహరిస్తున్నారు.
- **నూనె:** ప్రాచీన కాలంలో నువ్వుల నుంచి తీసినదాన్నే నూనెగా పరిమితార్థంలో వ్యవహరించేవారు. ప్రస్తుతం వేరుశెనగ, కొబ్బరి, సన్‌ఫ్లవర్ నుంచి తీసిన వాటిని కూడా నూనెగానే సామాన్య అర్థంలో వాడుతున్నారు.
- **అష్టకష్టాలు:** ప్రాచీన కాలంలో ఎనిమిది రకాలైన కష్టాలను పేర్కొన్నారు. అవి.. 1) దేశాంతర గమనం (విదేశాలకు వెళ్లడం) 2) భార్యా వియోగం 3) ఆపదల్లో బంధు దర్శనం 4) శత్రుస్నేహం 5) నీచ ఉచ్ఛిష్ట భోజనం 6) పరాన్న భోజన ప్రతీక్షణం 7) అప్రతిష్ఠ 8) దారిద్ర్యం. నేడు వీటినే అసంఖ్యాకమైన కష్టాలు అనే అర్థంలో వాడుతున్నారు.
- **అవధాని:** ప్రాచీన కాలంలో అవధానం చేసే వ్యక్తినే అవధాని అనేవారు. నేడు బ్రాహ్మణుల పేర్ల చివర అవధాని చేరుతోంది. ఇక్కడ అర్థ విస్తృతి జరిగింది.
- **కమ్మలు:** ప్రాచీన కాలంలో తాటి ఆకులతో చేసి చెవులకు ధరించే ఆభరణాలనే కమ్మలనేవారు. నేడు చెవులకు ధరించే బంగారం, వెండి, ప్లాస్టిక్ ఆభరణాలన్నింటినీ విస్తృతార్థంలో కమ్మలంటున్నారు.

అర్థ సంకోచం

ప్రాచీన కాలంలో విస్తృతార్థంలో ఉండి నేడు పరిమితార్థానికి వచ్చిన పదాలను అర్థ సంకోచం అంటారు. అర్థం కుంచించుకుపోవడమే అర్థ సంకోచం.

ఉదాహరణ:

- ప్రాచీన కాలంలో స్త్రీ, పురుషులిద్దరూ ధరించే వస్త్రాలను చీర, కోక అనేవారు. ఇప్పుడు కేవలం స్త్రీలు ధరించే వస్త్రాలు అనే అర్థంలో పరిమితమయ్యాయి.
- పూర్వం అవ్వ అనే పదాన్ని స్త్రీ అనే సామాన్య అర్థంలో వాడేవారు. ఇప్పుడు కేవలం వృద్ధ స్త్రీ అనే అర్థానికే పరిమితమైంది.
- పని, ప్రయత్నం అనే అర్థంలో ప్రాచీనకాలంలో ఉద్యోగం అనే పదం వాడేవారు. నేడు కేవలం ప్రభుత్వ, ప్రైవేటు, పారిశ్రామిక సంబంధమైన సంస్థల్లో చేసే ఉద్యోగం అనే అర్థంలో పరిమితమైంది.
- **శ్రాద్ధం:** దీనికి పూర్వం శ్రద్ధతో చేసే పని అనే అర్థం ఉండేది. ఇప్పుడు చనిపోయిన వారికి నిర్వహించే కర్మకాండగా రూఢమైంది.
- **అర్థ సంకోచం జరిగిన కొన్ని పదాలు:** వ్యవసాయం, మృగం, ఆరాధ్యుడు, సంభావన, నెయ్యి, సాహెబ్, జంగమ, కర్మ.

అర్థ సౌమ్యత లేదా అర్థ గౌరవం లేదా అర్థోత్కర్ష

పూర్వకాలంలో నిందార్థంలో వాడిన పదాలు కాలక్రమంలో విశిష్టార్థ బోధకాలై వాటికి అర్థ గౌరవం కలిగినప్పుడు వాటిని అర్థ సౌమ్యత లేదా అర్థోత్కర్ష అంటారు.

ఉదాహరణలు:

- **సభికులు:** ప్రాచీన కాలంలో జూదగాళ్లు అనే అర్థంలో వాడేవారు. నేడు సభలోని వారు అనే గౌరవార్థంలో వాడుతున్నారు.
- **వైతాళికులు:** పూర్వం రాజును నిద్రలేపే వారు అనే అర్థంలో వాడేవారు. ప్రస్తుతం సంస్కర్తలు, మూఢాచారాలపై అవగాహన కలిగించే వారు అనే గౌరవార్థంలో వాడుతున్నారు.
- **ముహూర్తం:** గతంలో నిమిష కాలం, అల్పకాలం అనే అర్థంలో వాడేవారు. ప్రస్తుతం పవిత్రమైన శుభకార్యాలు నిర్వహించే కాలం అనే అర్థంలో రూఢమైంది.
- **మర్యాద:** 'హద్దు' అనే అర్థంలో ఉండేది. నేడు గౌరవం అనే అర్థంలో వాడుతున్నారు.
- **అదృష్టం:** కనిపించనిది అనే అర్థం ఉండేది. నేడు సంపద, భాగ్యం అనే అర్థంలో ఉంది.
- **అంతస్తు:** మేడ పై భాగం అనే అర్థంలో పూర్వం వాడేవారు. ప్రస్తుతం పరువు, ప్రతిష్ఠ అనే అర్థ గౌరవాన్ని సంతరించుకుంది.
- ఆంగ్లంలో Knight అనే పదం Servant అనే అర్థంలో పాతకాలంలో ఉండేది. ప్రస్తుతం ప్రజ్ఞాశాలి అనే అర్థంలో వాడుతున్నారు.
- nice అనే పదం stupid అనే అర్థంలో ఉండేది. నేడు అందమైన అనే అర్థంలో వాడుతున్నారు.

అర్థ గ్రామ్యత లేదా అర్థాపకర్ష లేదా అర్థ న్యూనత

ప్రాచీనకాలంలో గౌరవార్థంలో ఉండి కాలక్రమంలో నిందార్థంలో ప్రయోగిస్తున్న పదాలను అర్థ గ్రామ్యత లేదా అర్థాపకర్ష అంటారు.

- **కంపు:** ఒకనాడు సువాసన అనే అర్థం ఉండేది. ప్రస్తుతం దుర్వాసన అనే అర్థంలో వాడుతున్నారు.
- **ఛాందసుడు:** పూర్వకాలంలో వేద పండితుడు అనే అర్థంలో వాడేవారు. ప్రస్తుతం అమాయకుడు, లోకజ్ఞానం లేనివాడు అనే నిందార్థంలో వాడుతున్నారు.
- **కర్మ:** పూర్వం పని అనే అర్థంలో వాడేవారు. ప్రస్తుతం పితృకర్మ అనే అర్థానికి పరిమితమైంది.
- **దేవదాసి:** ఒకప్పుడు దేవాలయాల్లో నృత్య గానాదులు నిర్వహించే స్త్రీ అనే అర్థం ఉండేది. ప్రస్తుతం వేశ్యకు పర్యాయపదంగా మారింది.
- **సాని:** పూర్వం రాణి, దొరసాని అనే గౌరవార్థంలో వాడేవారు. ప్రస్తుతం వేశ్య, వ్యభిచారిణి అనే అర్థంలో వాడుతున్నారు.

అర్థాపకర్ష జరిగిన కొన్ని పదాలు: కళావంతులు, కైంకర్యం, పూజ్యం, ఘటం మొదలైనవి.

లక్ష్యార్థ సిద్ధి

పదాలకు అసలు అర్థాలతోపాటు కొన్ని లక్ష్యార్థాలు ఏర్పడి రూఢికెక్కాయి. లక్ష్యార్థాలకు అనేక మూలాలుంటాయి. లక్ష్యార్థాలు ఏర్పడేందుకు 1) ఆధార ఆధేయ సంబంధం 2) కార్యకారణ సంబంధం 3) అశాంశి సంబంధం ఉంటుంది.

1. **ఆధార ఆధేయ సంబంధం:** ప్రాచీనార్థం, ముష్టి - పిడికిలి, నేడు భిక్ష, భిక్షం ఆధారమైంది.



పిడికిలి కాబట్టి భిక్ష అనే లక్ష్యార్థం ఏర్పడింది.

2. **కార్యకారణ సంబంధం:** పూర్వం దాహం అనే పదానికి దహించడం, తపించడం అనే అర్థాలు ఉన్నాయి. కార్యకారణ సంబంధం వల్ల దప్పిక, దాహం అనే లక్ష్యార్థాలు ఏర్పడ్డాయి.
3. **లక్ష్యలక్షణ సంబంధం:** ప్రాచీనార్థంలో సూది.. వస్త్రాలు కుట్టేందుకు ఉపకరించేది. ప్రస్తుతం డాక్టర్లు వాడే ఇంజక్షన్ అనే లక్ష్యార్థంలో సూది వాడుతున్నారు.

కేవలం సంకేతార్థాలు

ఒక పదానికి జన వ్యవహారంలో ఒక అర్థం ఉండగా, ఒక వృత్తి, విజ్ఞాన శాస్త్రపరంగా ఆ పదాన్ని ప్రత్యేక అర్థంలో వాడతారు. ఇలాంటి వాటిని సంకేతార్థాలు అంటారు.

1. **వాయువు:** సామాన్యార్థం గాలి (ప్రాచీన కాలం), నేడు పశువైద్యులు, పశువులకు వచ్చే వ్యాధిని గాలి అంటున్నారు. ఇది సంకేతార్థం.
2. **ద్రవ్యం:** ప్రాచీనార్థం.. ధనం, డబ్బు. నేడు ఆధునిక విజ్ఞాన శాస్త్రవేత్తలు, పదార్థం అనే సంకేతార్థంలో వాడుతున్నారు.
3. **ఇంధనం:** ఇంతకుముందు వంట చెరకు, చిదుకులు, పెట్రోలు వంటి అర్థాల్లో వాడేవారు. నేడు ఆధునిక విజ్ఞాన శాస్త్రం ప్రకారం ఉష్ణశక్తినిచ్చే చమురు, బొగ్గు వంటి వాటికి సంకేతార్థంగా వాడుతున్నారు.

వస్తు పరిణామం

ఒక పదం ప్రాచీన కాలంలో సూచించే వస్తు రూపం, నిర్మాణం మొదలైన వాటిలో కాలక్రమంలో వచ్చిన భేదాన్ని సూచించే విస్తృతిని వస్తు పరిణామం అంటారు.

1. లక్కపిడతలు అంటే పూర్వం పిల్లలు ఆడుకొనే లక్కతో చేసిన బొమ్మలు. ప్రస్తుతం లక్కబొమ్మలే కాకుండా కర్ర, లోహంతో చేసిన బొమ్మలను కూడా లక్కపిడతలు అంటున్నారు. ఇది వస్తు పరిణామం.
2. **ఆయుధం:** ప్రాచీన కాలంలో విల్లు, గద, కత్తి వంటివి ఆయుధాలు. నేడు తుపాకీ, రైఫిల్, ఫిరంగి, అణ్వస్త్రాలు వంటి వాటిని ఆయుధాలుగా పిలుస్తున్నారు. ఇది వస్తు పరిణామం.

అలంకారిక ప్రయోగం

అలంకారికమైన పోలికను చెప్పడం వల్ల జరిగే అర్థ పరిణామాన్ని అలంకారిక ప్రయోగం అంటారు.

ఉదా॥ ఆమె రంభ, వాడు మన్మథుడు

1. రంభ, మన్మథుడు వంటి ఉపమానాల ద్వారా వారు సౌందర్యవంతులనే అర్థం స్ఫురిస్తుంది.
2. ఎండ నిప్పులు చెరుగుతోంది - ఎండ తీవ్రతను సూచించేందుకు నిప్పు ఉపమానాన్ని జోడించినందున ఇది అలంకారిక ప్రయోగం.
3. చూపుల వెన్నెలలు: చూపుల చల్లదనాన్ని సూచించేందుకు వెన్నెల ఉపమానాన్ని ప్రయోగించినందున ఇది అలంకారిక ప్రయోగం.

- తీపి మాటలు, చేదు నిజం, పచ్చి అబద్ధం, వంటివి అలంకారిక ప్రయోగాలు.

లోక నిరుక్తి

కొందరు తమకు పరిచయమున్న పదాలను తమకు పరిచయం లేని పదాలస్థానంలో వాడతారు. కాలక్రమేణా అవి జన వ్యవహారంలో బహుళ ప్రాచుర్యం పొందుతాయి. అలాంటి పదాల మార్పును లోక నిరుక్తి అంటారు.

1. **నారద సింహాచలం:** జన వ్యవహారంలో నార్త్ సింహాచలం నారద సింహాచలంగా మారింది. నార్త్ సింహాచలం ఒక రైల్వే స్టేషన్ పేరు. అది తెలియనివారు నారద సింహాచలంగా పిలవడంతో అలాగే ప్రసిద్ధి చెందింది. అదేవిధంగా బోరస్ మిఠాయి, మొక్కజొన్న, చక్రకేళి, మధురవాడ వంటి పదాలు లోక నిరుక్తికి ప్రసిద్ధాలు.

గత పోటీ పరీక్షల్లో అడిగిన ప్రశ్నలు

1. కిందివాటిలో అర్థ సంకోచం జరిగిన పదాలు? (టెట్, జనవరి 2012)
   1) చందమామ, వస్తాదు, కోక
   2) ఛాందసుడు, కైంకర్యం, పత్రం
   3) సీసా, నూనె, ముష్టి
   4) ఆరాధ్యుడు, సీసా, పత్రం
2. దివంగతులగు, శివైక్యం చెందు మాటల్లో జరిగిన అర్థపరిణామం? (టెట్, జనవరి 2012)
   1) అర్థ సంకోచం 2) లోక నిరుక్తి
   3) లక్ష్యార్థ సిద్ధి 4) సభ్యోక్తి

సమాధానాలు: 1) 4 2) 4

మాదిరి ప్రశ్నలు

1. పదజాలానికి అర్థంలో జరిగే మార్పును ఏమంటారు?
   1) ధ్వని పరిణామం 2) శబ్ద పరిణామం
   3) అర్థ పరిణామం
   4) వ్యాకరణ పరిణామం
2. నన్నయ భారతంలో వాడిన కంపు పదంలో ప్రస్తుతం జరిగిన అర్థ పరిణామం?
   1) అర్థ న్యూనత 2) అర్థాపకర్ష
   3) అర్థ గ్రామ్యత 4) పైవన్నీ
3. తెలుగులో అర్థ పరిణామాన్ని గురించి మొట్టమొదట పరిశోధన చేసిన భాషావేత్త?
   1) ఆచార్య దొణప్ప
   2) ఆచార్య జి.ఎన్.రెడ్డి
   3) ఆచార్య యల్.చక్రధరరావు
   4) ఆచార్య చేకూరి రామారావు
4. కింది పదాల్లో అర్థ వ్యాకోచానికి ఉదాహరణలు?
   1) కంపు, సంభావన, మృగం
   2) ధర్మరాజు, కమ్మ, పత్రం
   3) చెంబు, నూనె, ధర్మరాజు
   4) ఛాందసుడు, సాని, కమ్మ
5. ప్రాచీనకాలంలో విస్తృతార్థంలో ఉండి ఇప్పుడు పరిమితార్థానికి పరిమితమైతే అది ఏ అర్థ పరిణామం?
   1) అర్థ వ్యాకోచం 2) అర్థ సంకోచం
   3) అర్థ గ్రామ్యత 4) లోక నిరుక్తి
6. ప్రాచీన కాలంలో గౌరవార్థంలో ఉండి ప్రస్తుతం నిందార్థానికి దిగజారితే దాన్ని ఏ అర్థ పరిణామం అంటారు?
   1) అర్థ సౌమ్యత 2) వస్తు పరిణామం
   3) అర్థోత్కర్ష 4) అర్థ సంకోచం
7. సాని, కైంకర్యం, కర్మ, దేవదాసి వంటి పదాల్లో జరిగిన అర్థ పరిణామం?
   1) అర్థ సంకోచం 2) అర్థ న్యూనత
   3) సభ్యోక్తి 4) మృదూక్తి
8. తుపాకీ, రైఫిల్, ఫిరంగి వంటి పదాల్లో జరిగిన అర్థ పరిణామం?
   1) లోక నిరుక్తి 2) అలంకార ప్రయోగం
   3) వస్తు పరిణామం 4) అర్థ సంకోచం
9. వాచ్యం చేయకూడని పదాల అర్థాన్ని నూతన పద బంధాలతో చెప్పడాన్ని ఏ అర్థ పరిణామం అంటారు?
   1) అర్థ గ్రామ్యత 2) సభ్యోక్తి
   3) మృదూక్తి 4) అర్థోత్కర్ష
10. సభికులు, అంతస్తు, అదృష్టం పదాల్లో జరిగిన అర్థ పరిణామం ఏది?
    1) అర్థ సంకోచం 2) అర్థ వ్యాకోచం
    3) అర్థోత్కర్ష 4) లోక నిరుక్తి
11. ముష్టి - ఇంజక్షన్, దాహం వంటి పదాల్లో జరిగిన అర్థ పరిణామాన్ని ఏమంటారు?
    1) వస్తు పరిణామం 2) లక్ష్యార్థ సిద్ధి
    3) లోక నిరుక్తి 4) అర్థ సంకోచం
12. చనిపోవు, కులాల పేర్లు, గర్భవతి వంటి పదాల్లో జరిగిన అర్థ పరిణామం ఏది?
    1) అర్థ గౌరవం 2) అర్థ గ్రామ్యత
    3) సభ్యోక్తి 4) మృదూక్తి
13. దీపం కొండెక్కింది, నల్లపూసలు పెరిగిపోయాయి వంటి పదాలు ఏ అర్థ పరిణామానికి ఉదాహరణలు?
    1) సభ్యోక్తి 2) మృదూక్తి
    3) అర్థ గౌరవత 4) అర్థ సంకోచం
14. మొక్కజొన్న, నారద సింహాచలం, చక్రకేళి, వంటి పదాలు ఏ అర్థ పరిణామానికి ఉదాహరణలు?
    1) సభ్యోక్తి 2) లక్ష్యార్థ సిద్ధి
    3) లోక నిరుక్తి
    4) అర్థ గౌరవం

సమాధానాలు

1) 3; 2) 4; 3) 2; 4) 3;
5) 2; 6) 3; 7) 2; 8) 3;
9) 2 10) 3; 11) 2; 12) 3;
13) 2; 14) 3..

గైర్ ముల్కీ ఉద్యమం ఎక్కడ ప్రారంభమైంది?

స్వతంత్ర భారతదేశంలో హైదరాబాద్ రాష్ట్రం

ఈ అంశానికి ఎంతో చారిత్రక నేపథ్యం ఉంది. టీఎస్‌పీఎస్సీ గ్రూప్స్ సిలబస్‌లో ఈ అంశాన్ని ప్రముఖంగా పొందుపర్చారు. కాబట్టి పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేవారు ఈ అంశాన్ని మూడు భాగాలుగా విభజించుకొని ప్రిపేరవ్వాలి. బూర్గుల రామకృష్ణారావు నాయకత్వంలో ఏర్పాటైన మంత్రి వర్గం గురించి ప్రధానంగా అధ్యయనం చేయాలి. 1952లో జరిగిన ముల్కీ ఆందోళనలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలి. వీటి గురించి తెలుసుకునే క్రమంలో మూడు విషయాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి. అవి..

1. స్థానిక ఉద్యోగాలు – ఒక డిమాండ్.
2. సిటీ కాలేజ్ సంఘటన – ప్రాధాన్యం
3. జస్టిస్ జగన్‌మోహన్ రెడ్డి కమిటీ నివేదికలోని ముఖ్యాంశాలు.

ఆంధ్రరాష్ట్ర ఏర్పాటు, ప్రత్యేక తెలంగాణ డిమాండ్, చర్చలు, రాష్ట్రాల పునర్‌వ్యవస్థీకరణ కమిషన్ (ఎస్సార్సీ) ఆవిర్భావం, కారణాలు, ఎస్సార్సీలోని ప్రధానాంశాలు, సిఫారసుల గురించి క్షుణ్నంగా తెలుసుకోవాలి. వీటితోపాటు చిన్న రాష్ట్రాలు, ఎస్సార్సీపై రాజ్యాంగ నిర్మాత బి.ఆర్. అంబేద్కర్ ఆలోచనలను కూడా అధ్యయనం చేయాలి.

బూర్గుల రామకృష్ణారావు మంత్రివర్గం

స్వతంత్ర భారతదేశానికి సార్వత్రిక ఎన్నికలు తొలిసారిగా 1952లో జరిగాయి. ప్రజాస్వామ్యబద్ధంగా జరిగిన ఈ ఎన్నికల్లో హైదరాబాద్ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించింది. బూర్గుల రామకృష్ణారావు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన మహబూబ్‌నగర్ జిల్లాలోని షాద్‌నగర్ నియోజక వర్గం నుంచి గెలుపొందారు. హైదరాబాద్ రాష్ట్ర రాజ్‌ప్రముఖ్ ఉస్మాన్ అలీ ఖాన్ 1952 మార్చి 6న కింగ్ కోఠిలోని తన నివాసంలో బూర్గులతో ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయించారు.

బూర్గుల రామకృష్ణారావు మంత్రివర్గం



1. బి.రామకృష్ణారావు – సీఎం
2. బిందు దిగంబర రావు – హోం శాఖ
3. గోపాలయ సుబ్బు క్రిష్ణ మెల్కోటె– ఆర్థిక శాఖ
4. మర్రి చెన్నారెడ్డి – వ్యవసాయ, పౌరసరఫరాల శాఖ
5. దేవిసింగ్ చౌహాన్ – గ్రామీణాభివృద్ధి శాఖ
6. సి. జగన్నాథరావు – న్యాయశాఖ
7. అన్నారావు ఘనముఖి–పంచాయతీరాజ్
8. ఫూల్‌చంద్ గాంధీ – ఆరోగ్య, విద్యాశాఖ
9. నవాబ్‌జంగ్ బహదూర్ – పబ్లిక్ వర్క్స్
10. శంకర్ డియో – సామాజిక సేవలు
11. వి.బి.రాజు – సమాచార, ప్రణాళిక, కార్మిక
12. కె.వి.రంగారెడ్డి – అటవీ, కస్టమ్స్, ఎక్సైజ్
13. కొరటికర్ వినాయక రావు – వాణిజ్యం, పరిశ్రమల శాఖ

హైదరాబాద్ రాష్ట్ర మంత్రివర్గ నిర్మాణ, పరిపాలనాపరమైన ముఖ్యాంశాలు

- బూర్గుల రామకృష్ణారావు హైదరాబాద్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలోనే వరంగల్‌లో గైర్ ముల్కీ(స్థానికేతరులు) ఉద్యమానికి అంకురార్పణ జరిగింది.
- హైదరాబాద్ రాష్ట్ర ప్రతిపక్ష నాయకుడు వి.డి. దేశ్‌ముఖ్ (మరాఠ్వాడ సుబా). ప్రతిపక్ష పార్టీ పేరు 'పీపుల్స్ డెమోక్రటిక్ ఫెడరేషన్'.
- బి. రామకృష్ణారావు కేబినెట్‌లో పనిచేసిన ఏకైక ఆంధ్ర నాయకుడు వి.బి.రాజు. ఆయన సికింద్రాబాద్ శాసనసభ స్థానానికి ఎన్నికయ్యారు.
- టి. హయగ్రీవాచారి అధ్యక్షతన వరంగల్‌లో మొదటి విశాలాంధ్ర మహాసభ 1950లో జరిగింది. హైదరాబాద్ రాజధానిగా విశాలాంధ్రను వెంటనే ఏర్పాటు చేయాలని ఈ మహాసభలో పట్టుబట్టారు.
- శ్రీశ్రీ అధ్యక్షతన 1954లో రెండో విశాలాంధ్ర మహాసభ హైదరాబాద్‌లో జరిగింది.
- 1956లో ఢిల్లీలో జరిగిన పెద్ద మనుషుల ఒప్పందంలో హైదరాబాద్ రాష్ట్ర ముఖ్యమంత్రి హోదాలో బి.రామకృష్ణారావు పాల్గొన్నారు. 1956 అక్టోబర్ 31 వరకు ఆయన ముఖ్యమంత్రిగా కొనసాగారు.
- పెద్ద మనుషుల ఒప్పందం తర్వాత 1956 నవంబర్ 1న ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది. బి.రామకృష్ణారావు కేరళ గవర్నర్‌గా నియమితులయ్యారు.

స్థానికులకు ఉద్యోగాలు - ముల్కీ ఉద్యమం (1952)

1948లో పోలీసు చర్య అనంతరం హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమైంది. తర్వాత దాదాపు నాలుగేళ్లపాటు హైదరాబాద్ సంస్థానాన్ని స్థానికేతరులే పరిపాలించారు. రెండేళ్లపాటు సైనికపాలన ఉండగా, మరో రెండేళ్లు అధికారులు హైదరాబాద్ రాష్ట్రాన్ని పాలించారు. ఇంగ్లిష్, తెలుగు స్పష్టంగా రావనే సాకుతో ఈ కాలంలో చాలామంది స్థానికులను ఉద్యోగాల నుంచి తొలగించారు. మద్రాసు నుంచి, బయటి ప్రాంతాల నుంచి చాలా మందిని రప్పించారు. తహశీల్దార్ల నుంచి కార్యదర్శుల వరకు అనేక ఉద్యోగాల్లో స్థానికేతరులనే నియమించారు. ఇలా ఒక సమాంతర వ్యవస్థను ఏర్పాటు చేసుకొని నాలుగేళ్లపాటు పరిపాలన సాగించారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన అధికారులు దొంగ ముల్కీ సర్టిఫికెట్‌లను జారీ చేసి బయటి వారిని ఉద్యోగాల్లో నియమించుకున్నారు. ఇక్కడి ప్రజల పట్ల గైర్ ముల్కీలు(స్థానికేతరులు) అహంభావాన్ని ప్రదర్శించి, అవమానపర్చేవారు. ఇక్కడి వారితో అవహేళనగా మాట్లాడేవారు. ఉన్నతస్థాయి అధికారుల వల్ల అనేక అవమానాలకు గురైన స్థానికుల్లో చైతన్యం పెరిగింది. 1951లో ముల్కీల నిర్వచనాన్ని కేంద్ర ప్రభుత్వం సవరించింది. ఈ సవరణ ప్రకారం వరసగా 15 ఏళ్లపాటు స్థానికంగా నివాసం ఉన్నవారంతా ముల్కీలవుతారు. దీనికి ఏవిధమైన ప్రమాణ పత్రం సమర్పించాల్సిన అవసరం లేదు. ఆ తర్వాత కేంద్రం మళ్లీ ముల్కీ అర్హతను 12 ఏళ్లకు కుదించింది. దీంతో స్థానికుల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి.

మొదటి సార్వత్రిక ఎన్నికల్లో తమ హక్కులను సాధించుకోవాలని తెలంగాణ ప్రజలు భావించారు. 1952లో అధికారంలోకి వచ్చిన బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వం సంయమనాన్ని పాటిస్తూ ముల్కీల సవరణల జోలికి పోలేదు. 1952 మార్చిలో బూర్గుల ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక.. ముల్కీ హక్కులను పునరుద్ధరించాలని, విద్యావంతులైన స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని ప్రజలు డిమాండ్ చేశారు. గైర్ ముల్కీ ఉద్యమం క్రమంగా విస్తృతమైంది. ప్రజల్లో చైతన్యం పెరగడంతో హక్కుల సాధన కోసం ఉద్యమించారు.

గైర్ ముల్కీ ఉద్యమంలో ప్రధానంగా వినిపించిన నినాదం 'మద్రాసీ గో బ్యాక్, ఇడ్లీ సాంబర్–గో బ్యాక్'. 1952 జూన్ 26న వరంగల్‌లో విద్యార్థుల నాయకత్వంలో గైర్ ముల్కీ ఉద్యమం ప్రారంభమైంది. అయిదు రోజులపాటు నిరంతరంగా కొనసాగింది. 1952 జూలై 31న విద్యార్థులంతా కలిసి ఒక తీర్మాన పత్రాన్ని ఆమోదించి, ఆందోళన విరమించారు.

తీర్మాన పత్రంలోని అంశాలు

'దొంగ ముల్కీ పత్రాలతో ఉద్యోగాల్లో ప్రవేశించిన స్థానికేతరులపై విచారణ జరపాలి. ప్రభుత్వం వారిని తొలగించి స్థానికుల నిరుద్యోగ సమస్య తీర్చాలి. ఇక మీదట సరైన రుజువు లేనిదే ముల్కీ సర్టిఫికెట్లు ఇవ్వరాదు' అని ఐక్య విద్యార్థి సంఘం కోరింది.

ఈ తీర్మానాన్ని వరంగల్ కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ కౌన్సిలర్ ఎ.బుచ్చయ్య ప్రవేశపెట్టారు. దానికి విద్యార్థులు అంగీకరించేలా కృషి చేశారు. ఆయన కృషి వల్లే హన్మకొండ ఉన్నత పాఠశాల విద్యార్థులు కూడా ఈ తీర్మానానికి అంగీకరించారు. ఈ విధంగా స్థానిక నిరుద్యోగ యువకులు చైతన్యవంతులై తమ హక్కుల సాధన కోసం ఉద్యమించారు. 1952 ఆగస్టు 7న ఖమ్మం ప్రాంతంలో కూడా గైర్ ముల్కీ ఉద్యమం తలెత్తింది. ఈ ఉద్యమాలన్నీ స్థానికులకు జరిగిన అన్యాయాలు, వారు ఎదుర్కొన్న అవమానాలకు వ్యతిరేకంగా జరిగినవే. నాటి తెలంగాణ సమాజంలో ఆవిర్భవించిన ఈ ఉద్యమాలన్నీ చైతన్య స్ఫూర్తితో వచ్చినవే. వీటి వెనుక ఎవరి ప్రోద్బలం లేదు. ప్రభుత్వ ఉద్యోగాల్లో ఇతర ప్రాంతాల వారికి, ఇతర రాష్ట్ర ఉద్యోగులకు అవకాశం ఇస్తున్నందుకు; ఇతర రాష్ట్ర విద్యార్థులకు ఇక్కడి పాఠశాలు, కళాశాల్లో ప్రవేశాలు కల్పిస్తున్నందుకు నిరసనగా స్థానిక విద్యార్థులు రెండు రోజులపాటు సమ్మె చేశారు. 1952 ఆగస్టు 8న వరంగల్ జిల్లా మానుకోట (మహబూబాబాద్)లో దాదాపు వెయ్యి మంది విద్యార్థులు పాఠశాలకు, కళాశాలలకు వెళ్లకుండా ప్రదర్శనలు చేస్తూ 'బే ముల్కీలు వాపసు పోవాలి' అని నినాదాలు చేశారు. విద్యార్థుల నాయకత్వంలో సంఘటితమై బలమైన ఉద్యమం రూపుదిద్దుకుంది. వరంగల్ విద్యార్థి సంఘం పిలుపు మేరకు ఈ ఉద్యమం పెద్ద ఎత్తున జరిగింది. దీంతో ముల్కీ నిబంధనలను సవరించి, కఠినతరం చేయడానికి ప్రభుత్వం మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేయాలనే ఆలోచనలో ఉందని 1952 ఆగస్టు 10న అన్ని పత్రికల్లో వార్త వచ్చింది.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
తెలంగాణ చరిత్ర

మాదిరి ప్రశ్నలు

1. హైదరాబాద్ రాష్ట్రంలో తొలిసారిగా ఎన్నికలు ఎప్పుడు జరిగాయి?
   ఎ) 1952 ఫిబ్రవరి బి) 1950 ఫిబ్రవరి
   సి) 1949 ఫిబ్రవరి డి) 1951 ఫిబ్రవరి
2. బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వానికి ముఖ్య సలహాదారుడు ఎవరు?
   ఎ) జె.ఎన్.చౌదరి బి) ఎం.కె.వెల్లోడి
   సి) నవాబ్‌జంగ్ బహదూర్
   డి) మీర్ అలీఖాన్
3. బూర్గుల రామకృష్ణారావు మంత్రివర్గంలో ఆంధ్రుడైన వి.బి. రాజు ఏ శాఖకు మంత్రిగా వ్యవహరించారు?
   ఎ) కార్మిక, ప్రణాళిక బి) విద్య, ఆరోగ్యం
   సి) సాంఘిక సంక్షేమం డి) పరిశ్రమలు
4. హైదరాబాద్ రాష్ట్ర ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలుపొందిన వారు?
   ఎ) బి. రామకృష్ణారావు
   బి) మెల్కోటే సి) రావి నారాయణరెడ్డి
   డి) మర్రి చెన్నారెడ్డి

సమాధానాలు

1) ఎ; 2) బి; 3) ఎ; 4) సి.

Mr. Rajan is working as a Programmer



Model questions

Directions: Read the questions carefully and answer them.

1. Four of the following five are alike in a certain way and so form a group. Which is the one that does not belong to the group?
   A) Sand B) Stone C) Cement
   D) Brick E) Wall
   Explanation: Sand, stone, Cement and Brick are the raw materials.
   Ans: E
2. If Yellow is called Green, Green is called Black, Black is called White, White is called Red, Red is called Blue, Blue is called Orange then what is the colour of milk?
   A) White B) Black
   C) Red D) Green
   E) None of these
   Explanation: The colour of milk is white, and white is called red.
   Ans: C
3. Pointing to a photograph Seema said "He is the only grandson of my mother's father-in-law, and my father has neither brother nor sister". How is the man in photograph related to Seema?
   A) Father B) Uncle
   C) Cousin D) Brother
   E) None of these
   Ans: D
4. If '+' means '×', '×' means '÷', '÷' means '–' and '–' means '+' what is the value of
   17 + 15 – 135 × 9 ÷ 70?
   A) 270 B) 240 C) 170
   D) 200 E) None of these
   Ans: D
5. If it is possible to make a meaningful word from the fourth, the sixth, the eighth and the eleventh letters of the word GOURMANDISE using each letter only once first letter of the word is your answer. If more than one such word can be formed your answer is X. If no such word can be formed your answer is Y.
   A) D B) R C) M D) X E) Y
   Explanation: READ, DEAR, DARE. **Ans:** D
6. Four of the following five are alike in a certain way and so form a group. Which is the one that does not belong to the group?
   A) Silver B) Gold C) Nickel
   D) CopperE) Brass
   Explanation: Brass is an alloy where as the remaining are elements. **Ans:** E
7. In a certain code EXTRA is written as % 5 # 73 and NOSE is written as 4@8%; how is STORE written in that code?
   A) 5#@7% B) 8#@7%
   C) 8#@%5 D) 8@75%
   E) None of these
   Ans: B
8. In a row of children facing North, Shamika is third to the right of Nikhil who is seventeenth from the right end of the row. Ravi is fifth to the left of Shamika and is twentieth from the left end. Total how many children are there in the row?
   A) 39 B) 38 C) 37
   D) Cannot be determined
   E) None of these
   Explanation: Shamika is 14th from the right end. Ravi is 19th from the right end.
   20 + 19 – 1 = 38 **Ans:** B
9. How many such pairs of letters are there in the word EXAMINATION each of which has as many letters between them in the word, as they have in the English alphabet?
   A) None B) One C) Two
   D) Three E) None of these
   Explanation: EI, NO **Ans:** C
10. In a certain code ACQUIRE is written as EIRUQAC, how is DENSITY written in that code?
    A) YTISNDE B) YITSNED
    C) YTISNED D) YITSNDE
    E) None of these
    Explanation: The letters in the word ACQUIRE
    A=1, C=2, Q=3, U=4, I=5, R=6, E=7 are rearranged as 7564312
    Ans: D

Directions (Q. No. 11-16): Study the following information carefully and answer the questions given below.

An organization wants to recruit System Analysts. The following conditions apply.

The candidate must:

i) be an engineering graduate in Computer/IT with at least 60% marks.
ii) have working experience in the field of Computer at least for 2 years after acquiring the requisite qualification.
iii) have completed minimum 25 years and maximum 30 years of age as on 1.12.2015.
iv) be willing to sign a bond for Rs. 50,000.
v) have secured minimum 55% marks in selection test.

However, if a candidate fulfills all other conditions except-

a) At i) above, but is an Electronics Engineer with 65% or more marks the case is to be referred to the General Manager (GM)-IT.

b) At iv) above, but has an experience of at least 5 years as a Software Manager, the case is to be referred to the VP.

In each question below, detailed information of candidate is given. You have to carefully study the information provided in each case and take one of the following courses of actions based on the information and the conditions given above. You are not to assume anything other than the information provided in each question. All these cases are given to you as on 01.12.2015. You have to indicate your decision by marking answers to each question as follows. Mark answer-

BANK EXAMS
REASONING

A) If the case is to be referred to VP.
B) If the case is to be referred to GM.
C) If the data provided is not sufficient to take a decision.
D) If the candidate is to be selected.
E) If the candidate is not to be selected.

11. Ms. Suneeta is an IT Engineer with 60% marks at graduation as well as in selection test. She is working as a Software Engineer for last 3 years after completing engineering degree and has completed 27 years of age. She is willing to sign the bond of Rs. 50,000.
12. Rakesh Rao is a Computer Engineer Graduate and thereafter is working as a Software Manager for past 6 years. He has secured 72% marks at graduation and 67% marks in selection test. His date of birth is 5th December 1986. He is not willing to sign the bond for Rs. 50,000.
13. Nishant is an Electronics Engineer passed out in June 2012 at the age of 22 years. Since then he is working as a Programmer in a software company. He has passed the selection test with 66% marks and is willing to sign the bond.
14. Abhijit is a Computer Engineer with 65% marks passed out in 2011 at the age of 22 years. Since then he is working as a Software Engineer, in a private firm. He is willing to sign the bond for the required amount. He has secured 63% marks in selection test.
15. Giridhar is working as a Software Engineer in a reputed company for past 4 years after completing Computer Engineering wi-th 68% marks. He has cleared the selection test with 75% marks & is willing to sign the bond. His DOB is December 17, 1988.
16. Mr. Rajan is working as a Programmer for the last 6 years in an engineering firm after passing engineering examination. He has passed Electronics Engineering with 76% marks. His date of birth is 16.05.88. He has cleared the selection test with 62% marks and is willing to sign the bond for Rs. 50,000.

Explanations:

11. Ms.Suneeta fulfils all the conditions. Hence she is to be selected. **Ans:** D
12. Rakesh Rao fulfils all the conditions except (iv) but he has been working as a software manager for the last 6 years so according to (b) his case is to be referred to V.P. **Ans:** A
13. Since the marks obtained by Nishant in graduation are not given. So the data provided is not sufficient to take a decision.
    Ans: C
14. Abhijit fulfils all the conditions. Hence he is to be selected.
    Ans: D
15. Giridhar fulfils all the conditions. Hence he is to be selected.
    Ans:D
16. Mr.Rajan does not fulfil the condition (i) But he passed the Electronics Engineering will more than 65%. Hence according to (a) his case is to be referred to G.M.
    Ans: B
17. **Directions:** Given a statement followed by two assumptions numbered I and II. You have to consider the statement and the following assumptions and decide which of the assumptions is implicit in the statement.
    Mark (A) if only assumption I is implicit
    Mark (B) if only assumption II is implicit
    Mark (C) if either I or II is implicit
    Mark (D) if neither I or II is implicit

Statement: Even with the increase in the number of sugar factories in India, we still continue to import sugar.

Assumptions:

I) The consumption of sugar per capita has increased in India.
II) Many of the factories are not in a position to produce sugar to their fullest capacity.

Explanation: As the statement says that despite increase in the number of sugar factories in India we are still continuing to import sugar, it must be either the consumption of sugar has increased or many of the factories are not producing sugar to the maximum capacity.
Ans: C

విద్య, ఉద్యోగ సమాచారం

తెలంగాణ ఎస్ఆర్‌టీఆర్ఐలో నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

తెలంగాణ ప్రభుత్వానికి చెందిన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు చెందిన స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ(ఎస్ఆర్‌టీఆర్ఐ) ద్వారా నిర్వహిస్తున్న దీన్ దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన పథకం ద్వారా అందిస్తున్న ఉద్యోగ ఆధారిత సాంకేతిక శిక్షణా కోర్సులలో ఆసక్తి ఉన్న గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతీ, యువకుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **కోర్సుల వివరాలు:** అకౌంట్స్ అసిస్టెంట్(ట్యాలీ), కంప్యూటర్ హార్డ్‌వేర్ అసిస్టెంట్, ఆటో మొబైల్ టూ వీలర్ సర్వీసింగ్, సోలార్ సిస్టమ్ ఇన్‌స్టాలేషన్ అండ్ సర్వీస్.
» **కోర్సు వ్యవధి:** మూడున్నర నెలలు.
» **అర్హత:** కోర్సును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ(బీకాం), ఇంటర్మీడియట్, పదో తరగతి, ఐటీఐలో ఉత్తీర్ణులై ఉండాలి. గ్రామీణ ప్రాంత అభ్యర్థులై ఉండాలి. చదువు మధ్యలో ఉన్నవారు అర్హులు కారు.
» **వయసు:** 18 నుంచి 30 ఏళ్లు ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ, జలాల్‌పూర్ గ్రామం, పోచంపల్లి మండలం, యాదాద్రి భువనగిరి జిల్లా, తెలంగాణ–508284 చిరునామాకు పంపించాలి.
» **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://www.srtri.com/

ఇండియా ఎగ్జిమ్ బ్యాంక్‌లో ఆఫీసర్ పోస్టులు

ఇండియా ఎగ్జిమ్ బ్యాంక్‌లో ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 08.
» **పోస్టుల వివరాలు:** ఆఫీసర్–కార్పొరేట్ కమ్యూనికేషన్స్ గ్రూప్–02, ఆఫీసర్–ఇన్విరాన్‌మెంటల్, సోషల్ అండ్ గవర్నెన్స్–02, ఆఫీసర్–ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ గ్రూప్–04.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 31.08.2025 నాటికి 35 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** సంవత్సరానికి రూ.14.32 లక్షలు.
» **ఎంపిక విధానం:** పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.600. మహిళా అభ్యర్థులకు రూ.100.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 01.09.2025.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 21.09.2025.
» **వెబ్‌సైట్:** https://www.eximbankindia.in/